
'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 361

SUNDAY Special

ఆదివారం 23-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఈడెన్‌లో మెరుపులతో మొదలు

ఐపీఎల్ తొలి పోరులో బెంగళూరు ఘన విజయం

7 వికెట్ల తేడాతో ఓడిన కోల్‌కతా

కోహ్లి, సాల్ట్ అర్ధ సెంచరీలు... రాణించిన కృనాల్ పాండ్యా

సందడిగా ఐపీఎల్ ప్రారంభోత్సవం

ప్రారంభ కార్యక్రమంలో షారుఖ్‌తో కలిసి కోహ్లి స్టెప్పులు


14 లో



శుక్లాకు జ్ఞానపీఠం

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రఖ్యాత హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా 59వ జ్ఞానపీఠ అవార్డుకు ఎంపికయ్యారు.

- వివరాలు 6లో▶



తాత్కాలిక హోదా రద్దు

క్యూబా, హైతీ, నికరాగ్వా, వెనెజులాకు చెందిన 5.32 లక్షల మందికి గల చట్టపరమైన రక్షణలను రద్దు చేయనున్నట్లు అమెరికా తెలిపింది.

- వివరాలు 6లో▶



గ్లేసియర్లు మటుమాయం

ఏటా రికార్డులు బద్దలు కొట్టే స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతల దెబ్బకు భూమ్మీద మంచు నిల్వలు కరిగి నీరైపోతున్నాయి.

- వివరాలు 6లో▶



విమాన సేవలు పునరుద్ధరణ

18 గంటలపాటు మూతబడిన లండన్‌లోని హీత్రూ విమానాశ్రయంలో విమానాల రాకపోకలు తిరిగి మొదలయ్యాయి.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

'ఎస్ఎల్‌బీసీ'పై రేపు సీఎం సమీక్ష



ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిన ఘటనలో గల్లంతైన కార్మికులను వెలికితీసేందుకు జరుగుతున్న సహాయక చర్యలు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడంతో వ్యూహం మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

- వివరాలు 15లో▶

ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు



నియోజకవర్గాల పునర్విభజనతోనే కాదు, మరే విషయంలోనూ ఏ ఒక్క రాష్ట్రానికి, ఏ ఒక్క ప్రాంతానికి మోదీ ప్రభుత్వం అన్యాయం జరగనివ్వదని హామీ ఇస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

- వివరాలు 3లో▶

ఈబీసీలకూ 'రాజీవ్ యువ వికాసం'



ఆర్థికంగా వెనుకబడిన వర్గాల నిరుద్యోగులకు కూడా రాజీవ్ యువ వికాసం పథకాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇందుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ఆది లేదా సోమవారాల్లో ప్రారంభం కానున్నట్లు సమాచారం.

- వివరాలు 16లో▶

ఆవు పాల ధర తగ్గింపు.. గేదె పాల ధర పెంపు!



రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ విజయ డెయిరీ రైతుల నుంచి సేకరిస్తున్న ఆవు పాల ధరను తగ్గించాలని యోచిస్తోంది. అదే సమయంలో గేదె పాల ధరను లీటర్‌కు రూ.4 వరకు పెంచడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది.

- వివరాలు 5లో▶



'శాటిలైట్ ఇంటర్నెట్' గేమ్ ఛేంజరే!

- డిజిటల్ అంతరాలు తగ్గుతాయంటున్న భారతీయులు
- ఈ సేవలు వెంటనే కావాలంటున్న 91% మంది
- ప్రభుత్వమే చౌకగా అందించాలన్న 39 శాతం మంది
- ప్రకృతి విపత్తుల సమయంలో సమస్యలు రావొచ్చని అనుమానం
- లోకల్ సర్కిల్స్ సర్వేలో వెల్లడి

16 లో

పాతికేళ్ల వరకు పునర్విభజన వద్దు

అప్పటిదాకా లోక్‌సభ స్థానాల సంఖ్య యథాతథంగా ఉండాలి

కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాల జేఏసీ డిమాండ్, ఏకగ్రీవ తీర్మానం

చెన్నైలో తొలి భేటీ.. ముగ్గురు సీఎంలు, 14 పార్టీల నేతలు హాజరు



తమిళనాడు సీఎం స్టాలిన్ నేతృత్వంలో జరిగిన జేఏసీ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రులు పినరయి విజయన్, రేవంత్‌రెడ్డి, భగవంత్ మాన్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, కేటీఆర్, టీఆర్ బాలు

- అందరి ఆమోదంతో, పారదర్శకంగా మాత్రమే పునర్విభజన
- ముందుగా అన్ని రాష్ట్రాలు, పార్టీలతో చర్చించి ఒప్పించాలి
- జనాభాను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాతిపదికగా తీసుకోరాదు
- దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా రాజ్యాంగ సవరణలు
- పునర్విభజనకు వ్యతిరేకంగా అసెంబ్లీల్లో తీర్మానాలు, కేంద్రానికి అందజేత
- ప్రధాని మోదీకి ఉమ్మడిగా విజ్ఞాపన పత్రాలివ్వనున్న ఎంపీలు
- హైదరాబాద్‌లో జేఏసీ రెండో భేటీ, భారీ బహిరంగ సభ

3 లో

ఐక్యంగా పోరాడుదాం.. బీజేపీని అడ్డుకుందాం



- జనాభా దామాషాతో చేపడితే దక్షిణాది రాష్ట్రాలు గళం కోల్పోతాయి: రేవంత్
- తర్వాతి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహిద్దామని ప్రతిపాదన

3 లో

దక్షిణాదిపై వివక్ష మరింత పెరిగింది



- దేశాన్ని నడిపిస్తున్న రాష్ట్రాలకు అన్యాయం: కేటీఆర్
- జనాభా దామాషాతో డీలిమిటేషన్‌తో నియంతృత్వంవైపు అడుగులు

3 లో

1971 జనాభా లెక్కలే.. ప్రాతిపదిక కావాలి



- పునర్విభజనపై ప్రధాని మోదీకి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ లేఖ
- అలాగైతేనే అన్ని రాష్ట్రాలకు లోక్‌సభలో సమాన ప్రాతినిధ్యం

12 లో

తెలంగాణ సంపదపై గుంట నక్కల్లా కన్నేశారు

బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు



- ఇక్కడ ఎన్డీయే కూటమి రావాలంటూ కొందరి రాతలు
- ఏపీలో కూటమి కట్టకుండా చంద్రబాబు అధికారంలోకి వచ్చేవారా?
- ఆగం చేసే కుట్రల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి
- రాబోయే రోజుల్లో మళ్లీ ఒంటరిగానే అధికారంలోకి వస్తామన్న కేసీఆర్
- ఎర్రవల్లిలో 'గోదావరి కన్నీటి గోస' పాదయాత్ర ముగింపు సమావేశం

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ సంపద మీద గుంట నక్కల మాదిరిగా అందరూ కన్నేశారు. ఇప్పుడు ఉన్న పాలకులు సరిగా పని చేస్తలేరట.. మంచిగా పాలన చేయాలంటే చంద్రబాబు రావాలట. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావాలని కొన్ని పత్రికలు కథనాలు రాస్తున్నాయి. కూటమి కట్టకుండా చంద్రబాబు అక్కడ (ఏపీలో) మళ్లీ అధికారంలోకి వచ్చేవాడా? అలాంటి వారిని ఏవో అద్భుత శక్తులు ఉన్నవారిగా మనకు చూపే కుట్రలు జరుగుతున్నాయి. తెలంగాణను ఆగం చేసేందుకు కొందరు ఎప్పుడూ రెడీగా ఉంటారు. వీరిపట్ల తెలంగాణ యువత అప్రమత్తంగా ఉండాలి. ఒక పొరపాటు జరిగినా జీవితకాలం దుఃఖం తప్పదు'అని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హెచ్చరించారు. 'గోదావరి కన్నీటి గోస'పేరిట బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నేతృత్వంలో రామగుండం నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు ఈ నెల 17న ప్రారంభమైన 180 కిలోమీటర్ల పాదయాత్ర శనివారం ముగిసింది. ఈ సందర్భంగా పాదయాత్రగా వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలతో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ సమావేశమై మాట్లాడారు. 'తెలంగాణ నుంచి బీజేపీ, కాంగ్రెస్ పార్టీల తరఫున ఎనిమిదేసి మంది ఎంపీలను గెలిపించినా ఏకాణా పని జరగడం లేదు. బీఆర్ఎస్ ప్రతినిధులను పార్లమెంటుకు పంపిస్తే కొట్లాడి మన హక్కులు సాధించుకునేవాళ్లం. ఈ దిశగా ఇప్పటికైనా తెలంగాణ సమాజం ఆలోచన చేయాలి'అని సూచించారు.

వ్యక్తిగతంగా ఎవరిపైనా కోపం లేదు

'తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ప్రతిఘటించలేని నాటి నాయకత్వం ఎంతో నష్టం చేసింది. ఆ ఆవేదనతోనే

మిగతా 3వ పేజీలో ▶


రూ. 2 లక్షలపైన రుణమాఫీ లేదు

ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 లక్షల్లోపు రుణాలు మాఫీ

- అసెంబ్లీలో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటన
- ప్రభుత్వం మాట తప్పిందంటూ సభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్
- రుణమాఫీపై కాంగ్రెస్ మోసం బట్టబయలు: హరీశ్‌రావు ధ్వజం

సాక్షి, హైదరాబాద్: 'రైతు రుణమాఫీపై ప్రభుత్వ నిర్ణయం రూ. 2 లక్షల వరకు ఉన్న రుణం మాఫీ. రూ. 2 లక్షలపైన మాఫీ లేదు. కుటుంబానికి రూ. 2 లక్షలలోపు రుణం ఉన్న వాటిని మాఫీ చేస్తామన్నాం. ఇలాంటి కుటుంబాలు 25 లక్షలు ఉన్నట్లు మాకు వివరాలు అందాయి. ఆయా కుటుంబాలకు రూ. 20,616 కోట్లు జమ చేశాం. రుణమాఫీ విషయంలో ప్రతిపక్షాలు గందరగోళపడి రైతులను గందరగోళం చేయొద్దు'అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పశుసంవర్థక శాఖ పద్దులపై శనివారం అసెంబ్లీలో చర్చ సందర్భంగా తుమ్మల ఈ వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పాడి కౌశిక్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు, ఆది శ్రీనివాస్

మిగతా 15వ పేజీలో ▶



నీళ్లు... అన్నదాత కన్నీళ్లు



మూడు బోర్లు ఫెయిల్ అయ్యాయి..

ఈ చిత్రంలోని రైతు పేరు గోగు హరిప్రసాద్. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామానికి చెందిన ఈయన ఆరు ఎకరాల్లో వరి సాగు చేశారు. అందుకోసం రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రసాద్‌కు మూడు బోర్లు ఉండగా, భూగర్భ జలాలు అడుగంటి రెండు ఎండిపోయాయి. పంటను కాపాడుకునేందుకు అప్పులు చేసి మరో మూడు బోర్లు వేయించారు. ఒక్కదాంట్లోనూ నీరు పడలేదు. లక్షన్నర రూపాయల వరకు ఖర్చయినా.. పంటకు చుక్క నీరు అందలేదు. కళ్లెదుటే పంట ఎండిపోతోందని వాపోతున్నారు.

అడుగంటిన జలం

లక్షలు ఖర్చు చేసి బోర్లు వేస్తున్నా అందని భూగర్భ జలాలు

- ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్ష ఎకరాల్లో ఎండిపోయిన వరి... మిగతా పంటనైనా కాపాడుకుందామని అన్నదాతల ప్రయత్నాలు
- అప్పులు చేసి రెండు, మూడు బోర్లు వేయిస్తున్నా చేకూరని ప్రయోజనం
- చివరికి పొలాలను పశువులకు వదిలేస్తున్న తీరు
- ముదురుతున్న వేసవి.. మరింతగా పడిపోతున్న జలాలు... తమను ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకుంటున్న రైతులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నీళ్లందక 'బోరు'మంటున్న పొలాలు.. చేతికందిన పంట కళ్ల ముందే ఎండిపోతుంటే రైతులు తల్లడిల్లిపోతున్నారు. అప్పులు చేసి, బోర్లు వేయించి అయినా పంటలను కాపాడుకుందామంటే.. నీళ్లు పడక కన్నీళ్లు పెడుతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ఇప్పటికే

మిగతా 12వ పేజీలో ▶

వెన్ను విరిచిన వర్షం

రాష్ట్రవ్యాప్తంగా గాలిదుమారం, వడగళ్ల వాన

- తీవ్రంగా దెబ్బతిన్న వరి, మక్క, మామిడి పంటలు
- జగిత్యాల జిల్లాలో 5,350 ఎకరాల్లో పంట నష్టం
- కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో .. వరి, మొక్కజొన్న, మిర్చి, కూరగాయ పంటలపై అధిక ప్రభావం
- పంట నష్టం అంచనా వేస్తున్న అధికారులు



కోనరావుపేటలో గాలివాన వడగళ్లకు పడిపోయిన మొక్కజొన్న

సాక్షి, హైదరాబాద్/రంగారెడ్డి జిల్లా/ మహబూబ్‌నగర్ వ్యవసాయం: ఒకపక్క బోర్లలో నీళ్లు అడుగంటి ఎండిపోతున్న పంటలు.. మరోపక్క మిగిలిన కొద్దిపాటి పంటలను ముంచెత్తిన అకాల వర్షం.. దిక్కుతోచని స్థితిలో రైతన్న కంటక'న్నీళ్లు'.. అకాల వర్షాలు అన్నదాతను తీవ్రంగా దెబ్బతీశాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శుక్ర, శనివారాల్లో కురిసిన అకాల వర్షంతో వరి, మొక్కజొన్న వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరంగల్, జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, నిజామాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వడగళ్ల వాన పంటలను దెబ్బతీసింది. వరంగల్ జిల్లా భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో భారీ వర్షానికి తోడు ఈదురు గాలుల కారణంగా వరి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. పొగాకు పంట కూడా దెబ్బతిన్నట్లు రైతులు చెపుతున్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి, రామడుగు, గంగాధర, బోయినపల్లి, కొడిమ్యాల, మల్యాల మండలాల్లో మిరప, మామిడి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. జగిత్యాల జిల్లాలోని జగిత్యాల రూరల్, ధర్మపురి మండలాల్లో వడగళ్ల వాన కారణంగా సుమారు 1500 ఎకరాల్లో మామిడి రాలిపోగా, మరో 1500 ఎకరాల మేర మొక్కజొన్న పంట నేలకొరిగినట్లు ప్రాథమిక అంచనా. నువ్వులు, పసుపు తడిచిపోయిందని రైతులు వాపోతున్నారు. మొత్తం 5,350 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అంచనా. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ, ఎల్లారెడ్డిపేట మండలాల్లో వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నీటిపాలైంది. పెద్దపల్లి జిల్లాలోని పలు మండలాల్లో వరి పంట నేలకొరిగింది. మామిడి కాయలు

మిగతా 12వ పేజీలో ▶

ఒక్క రోజే వెయ్యి గోల్డ్ కార్డులు



500 కోట్ల డాలర్లు ఆర్జించినట్లు అమెరికా వాణిజ్య మంత్రి ప్రకటన

- అమెరికాలో నివాసంతో పాటు అంతిమంగా పౌరసత్వానికి కూడా వీలు కల్పిస్తూ ఇటీవల ప్రవేశపెట్టిన గోల్డ్‌కార్డులకు డిమాండ్ బాగా పెరుగుతోందని వాణిజ్య మంత్రి హొవార్డ్ లుట్నిక్ ప్రకటించారు. ''ఒక్కరోజులోనే ఏకంగా వెయ్యి గోల్డ్‌కార్డులు అమ్మాం. మొత్తంగా 500 కోట్ల డాలర్లు సంపాదించాం' అంటూ సంబరపడిపోయారు. 10 లక్షల కార్డులమ్మి 5 లక్షల కోట్ల డాలర్లు సమీకరించడమే లక్ష్యమని ప్రకటించారు.

6 లో

బడిని బతికించిన బాపు!




తన కుమార్తె చదువు కోసం ప్రభుత్వ పాఠశాలను నిలబెట్టిన ఓ తండ్రి

- ఒకప్పుడు 35 మంది విద్యార్థులతో నడిచిన ఖమ్మం జిల్లా నారపునేనిపల్లి అప్పర్ ప్రైమరీ స్కూలులో ఈ విద్యా సంవత్సరంలో ఒక్క విద్యార్థినే మిగిలింది. బడిని మూసివేయాలని అధికారులు నిర్ణయించారు. అదే జరిగితే తన కుమార్తెను చదువు మానిపిస్తానని, అందుకు అధికారులే బాధ్యత వహించాలని ఆ విద్యార్థిని తండ్రి వాదనకు దిగాడు. దీంతో ఉపాధ్యాయులు వెనక్కి తగ్గారు. ఓ తండ్రి పట్టుదల ప్రభుత్వ పాఠశాలను నిలబెట్టింది.

16 లో

ఒక్క మందు.. ఒబేసిటీ, షుగర్ ఔట్!



ఏకకాలంలో రెండింటినీ నియంత్రించే 'మవుంజారో' ఇంజెక్షన్ మన దేశంలో అందుబాటులోకి

- ఊబకాయంతోపాటు మధుమేహాన్నీ ఏకకాలంలో నియంత్రించగల ఔషధం అందుబాటులోకి వచ్చింది. అమెరికాకు చెందిన ప్రముఖ ఔషధ తయారీ సంస్థ ఎలీ లిల్లీ.. 'మవుంజారో (టిర్జెపటైడ్)' పేరిట ఈ ఔషధాన్ని తాజాగా భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఇప్పటికే అమెరికా, యూరప్ దేశాల్లో గుర్తింపు పొందిన ఈ ఔషధం అనేక మంది బాధితులకు ఆశారేఖ కాగలదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

2 లో

భారత్‌లో ఏటేటా ఊబకాయుల శాతం పెరిగిపోతోంది. తద్వారా మధుమేహం బారినపడుతున్నవారూ ఎక్కువగానే ఉంటున్నారు. దేశంలో సుమారు 10 కోట్ల మంది వరకు మధుమేహ బాధితులు ఉన్నట్టు అంచనా. అదే సమయంలో జనాభాలో 6.5 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. వీరిలో సగం మందికిపైగా ఎలాంటి చికిత్స తీసుకోవడం లేదని పలు అధ్యయనాలు తేల్చాయి కూడా. సరైన ఔషధాలు అందుబాటులో లేకపోవడం, అవగాహన లేమి వంటివి కారణమవుతున్నాయి. ఇలాంటి నేపథ్యంలో మన దేశంలోకి 'మవుంజారో (టిర్జెపటైడ్)' పేరిట స్థూలకాయాన్ని, మధుమేహాన్ని నియంత్రించే ఔషధం అందుబాటులోకి వచ్చింది. అమెరికాకు చెందిన ప్రముఖ ఔషధ తయారీ సంస్థ ఎలీ లిల్లీ ఈ ఔషధాన్ని అభివృద్ధి చేసింది. ఇప్పటికే అమెరికా, యూరప్ దేశాల్లో గుర్తింపు పొందిన ఈ ఔషధాన్ని తాజాగా భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఊబకాయంతోపాటు మధుమేహాన్నీ ఏకకాలంలో నియంత్రించగల ఈ ఔషధం అనేక మంది బాధితులకు ఆశారేఖ కాగలదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

- సాక్షి స్పెషల్ డెస్క్

ఒక్క మందు..
ఊబకాయం, షుగర్ ఔట్!

ఏకకాలంలో రెండింటినీ నియంత్రించే 'మవుంజారో' ఇంజెక్షన్ మన దేశంలో అందుబాటులోకి..

అమెరికా ఫార్మా దిగ్గజం ఎలీ లిల్లీ అభివృద్ధి చేసిన ఔషధం


నెలకు సగటున అయ్యే ఖర్చు రూ.17,500

అమెరికాలో అమ్మే ధరలో ఐదో వంతుకే ఇక్కడ విడుదల

ఊబకాయం నియంత్రణ కోసం మరికొన్ని ఔషధాలు కూడా అందుబాటులో..

తప్పనిసరిగా వైద్యుల పర్యవేక్షణలోనే వాడాలంటున్న నిపుణులు

ఎన్ని ఔషధాలు వాడినా జీవనశైలి మార్పులతో మంచి ఫలితం ఉంటుందని స్పష్టీకరణ



నెలకు రూ.17,500 వరకు ఖర్చుతో..

'మవుంజారో' ఔషధాన్ని ఇంజెక్షన్ రూపంలో వారానికి ఒక మోతాదు తీసుకోవాల్సి ఉంటుంది. మన దేశంలో ఔషధాలు, కాస్మెటిక్స్ నియంత్రణ సంస్థ అయిన 'సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ)' ఆమోదంతో దీని ధరను 2.5 ఎంజీకి రూ.3,500గా, 5 ఎంజీ రూ.4,375 గా నిర్ణయించారు. అంటే ఒక నెలకు రూ.14,000 నుంచి రూ.17,500 వరకు ఖర్చయ్యే అవకాశం ఉంటుంది. వ్యక్తుల బరువు, ఆరోగ్య స్థితి, ఇతర అంశాల ఆధారంగా ఎంత మోతాదులో ఇవ్వాలన్నది వైద్యులు నిర్ణయిస్తారు. అందుకు అనుగుణంగా నెలవారీ ఖర్చులో హెచ్చుతగ్గులు ఉంటాయి. నిజానికి ఈ ఔషధాన్ని మనదేశంలో తక్కువ ధరకే తెచ్చారు. యూఎస్‌ఏలో దీనికి నెలకు 1,000 – 1,200 డాలర్లు ఖర్చవుతుంది. అంటే మన కరెన్సీలో రూ.86,000 నుంచి రూ.లక్ష అన్నమాట. భారత దేశ పరిస్థితులకు అనుగుణంగా బాధితులపై పెద్దగా భారం పడకుండా, విలువకు తగిన ప్రయోజనం చేకూరేలా ధరను నిర్ణయించామని ఎలీ లిల్లీ కంపెనీ చెబుతోంది.



మరికొన్ని మందులున్నా..

బరువు తగ్గించే కొన్ని రకాల మందులు ఇప్పటికే భారత మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. నోవో నార్డిక్స్ కంపెనీకి చెందిన 'రైబెల్సస్' ఔషధం మూడేళ్ల కింద అంటే.. 2022 జనవరి నుంచే ఇక్కడ వినియోగంలో ఉంది. ఇది ఇప్పటికే యాంటీ–ఒబేసిటీ మందుల మార్కెట్లో 65 శాతాన్ని చేజిక్కించుకుంది. డ్యూలాగ్లూటైడ్, ఆర్లిస్టాట్, లిరాగ్లూటైడ్ వంటి బ్రాండ్లు కూడా వినియోగంలో ఉన్నాయి. మరోవైపు ఇదే తరహాకు చెందిన 'సెమాగ్లూటైడ్' ఔషధం పేటెంట్ కాలవ్యవధి వచ్చే ఏడాది మార్చితో ముగియనుంది. అప్పుడు దాని జనరిక్ మందును తయారు చేసేందుకు ప్రముఖ భారతీయ ఔషధ కంపెనీలు సంసిద్ధంగా ఉన్నాయి. అది తక్కువ ధరలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

వందల కోట్ల మార్కెట్..

ఫార్మాట్రాక్ వంటి మార్కెట్ రీసెర్చ్ సంస్థల అంచనా ప్రకారం.. భారత్‌లో యాంటీ ఒబేసిటీ మందులకు డిమాండ్ వేగంగా పెరుగుతోంది. ఈ తరహా మందుల మార్కెట్ 2020లో రూ.137 కోట్లుగా ఉండగా.. 2024 నవంబర్ నాటికి రూ.535 కోట్లకు చేరింది. ఇది మరింతగా పెరుగుతోందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

ఎలా పని చేస్తుంది?

వారానికి ఒక ఇంజెక్షన్ రూపంలో తీసుకుంటే.. అటు బరువు తగ్గడంతోపాటు ఇటు మధుమేహాన్ని అదుపులో ఉంచే ఔషధాల్లో మొట్టమొదటిది 'మవుంజారో'. ఇది 'గ్లూకోజ్ డిపెండెంట్ ఇన్సులినోట్రాపిక్ పాలీపెప్టైడ్ (జీఐపీ)', 'గ్లూకగాన్ లైక్ పెప్టైడ్-1 (జీఎల్‌పీ-1)' హార్మోన్ రెసెప్టార్లను ప్రేరేపించడం ద్వారా బరువునూ, చక్కెర మోతాదులను నియంత్రిస్తుంది'' అని ఎలీ లిల్లీ కంపెనీ చెబుతోంది. ప్రస్తుతానికి ఈ మందు విషయంలో భారత్‌లో ఏ స్థానిక కంపెనీతో కూడా భాగస్వామ్యం కుదుర్చుకోలేదని తెలిపింది. క్లినికల్ ట్రయల్స్‌లో భాగంగా 72 వారాల పాటు.. ఎంపిక చేసిన వ్యక్తులకు తగిన ఆహారం, వ్యాయామాలతోపాటు ఈ 'మవుంజారో' ఔషధాన్ని ఇచ్చి పరిశీలించామని వెల్లడించింది. ఈ మందు 15 ఎంజీ మోతాదులో ఇచ్చినవారు 21.8 కిలోలు బరువు తగ్గారని.. 5 ఎంజీ మోతాదు ఇచ్చినవారు 15.4 కిలోల బరువు తగ్గారని తెలిపింది. ''భారతీయుల్లో స్థూలకాయం, టైప్–2 డయాబెటిస్‌తో బాధపడేవారి సంఖ్య చాలా ఎక్కువే. వారందరికీ ప్రయోజనం కలిగేలా భారతీయ ప్రభుత్వ వర్గాలతో, ఇక్కడి కంపెనీల సహకారంతో ఈ మందుపై అవగాహన కలిగించేందుకు మేం ప్రయత్నిస్తాం'' అని ఎలీ లిల్లీ ఇండియా ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ విన్సెలోవ్ టక్కర్ పేర్కొన్నారు.

టైప్-1 డయాబెటిస్ వారికి ఉపయోగపడదు



మవుంజారో వారానికి ఒకసారి ఇంజెక్షన్ రూపంలో తీసుకోవాల్సిన మందు. స్థూలకాయంతోపాటు టైప్–2 డయాబెటిస్ ఉన్నవారు వాడాల్సిన ఔషధం. బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 30 కంటే ఎక్కువగా ఉండి, డయాబెటిస్ ఉన్నవారికి ఉపయోగపడుతుంది. కిడ్నీ, గాల్ బ్లాడర్, సివియర్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సమస్యలు ఉన్నవారు వాడకపోవడమే మంచిది. టైప్–1 డయాబెటిస్‌కు పనిచేయదు. కొంతమంది సెలెక్టెడ్ పాపులేషన్‌కు మాత్రమే ఉపకరించే ఔషధం. వైద్యుల పర్యవేక్షణలో, వారి సూచనల మేరకు మాత్రమే దీనిని వాడాలి.

- డాక్టర్ శివరాజు, సీనియర్ ఫిజీషియన్

మంచిదే కానీ.. ఇదే మ్యాజిక్ డ్రగ్ కాదు..



భారత్‌లో మధుమేహం, స్థూలకాయం సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో మవుంజారో మందు ఆశాజనకంగా కనిపిస్తోంది. షుగర్‌ను తగ్గించడంలోనే కాదు బరువు నియంత్రించడంలో కూడా మంచి ఫలితాలను చూపుతోంది. అయితే ఇదొక్కటే 'మ్యాజిక్ పిల్' అని పరిగణించడం తప్పుడు భావన. దీర్ఘకాలికంగా ఈ మందు ఎలా పనిచేస్తుందో ఇంకా పూర్తి సమాచారం లేదు. దీనికి తోడు కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉండొచ్చు. అందుకే ఈ మందును ఎవరైనా వాడాలనుకుంటే.. వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే వినియోగించాలి. జీవనశైలిలో మార్పులు, ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం వంటివి కూడా ఈ మందుతోపాటు తప్పనిసరిగా కొనసాగాలి. అప్పుడే మంచి ఫలితాలు కనిపిస్తాయి.

- డాక్టర్ ఎం.ఎస్.ఎస్. ముఖర్జీ, సీనియర్ కార్డియాలజిస్ట్

డాక్టర్ల పర్యవేక్షణలోనే వాడాలి..



మవుంజారో మందును కేవలం డాక్టర్ల పర్యవేక్షణలోనే వాడాల్సి ఉంటుంది. బరువు తగ్గడానికి ఇవ్వాల్సిన మోతాదు, డయాబెటిస్ నియంత్రణకు ఇచ్చే మోతాదు వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి ఇది డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ప్రకారమే వాడాల్సిన మందు అన్నది గుర్తుంచుకోవాలి. బరువు తగ్గించే మందులతోపాటు డయాబెటిస్‌ను నియంత్రించే ఈ తరహా మందులు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఈ 'మవుంజారో' ఔషధం ప్రపంచవ్యాప్తంగా కాస్తంత గుర్తింపు పొందింది. స్థూలకాయం, అధిక బరువు కారణంగా మోకాళ్ల నొప్పులు, మోకాళ్ల అరుగుదలతోపాటు డయాబెటిస్, హైపర్‌టెన్షన్, స్లీప్ ఆప్నియా వంటి 200 రకాల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశముంది. ఇప్పటికే ఉన్న మందులకు తోడు మరో రెప్యూటెడ్ బ్రాండ్ కావడంతో ఎలీ లిల్లీ వాళ్ల ఔషధం మరో ప్రత్యామ్నాయం అవుతుంది.

- డాక్టర్ గురవారెడ్డి, సీనియర్ నీ రీప్లేస్‌మెంట్ సర్జన్

ఈ ఔషధం చాలావరకు సురక్షితమే.. కానీ..



- డాక్టర్ అమర్ వెన్నపూస, సీనియర్ బేరియాట్రిక్ సర్జన్

మవుంజారోను ఇప్పుడు అధికారికంగా భారత్‌లో ప్రవేశపెట్టారుగానీ ఇప్పటికే విదేశాల నుంచి తెప్పించుకుని వాడినవాళ్లు ఉన్నారు. ఇందులో బరువు తగ్గడమనేది జీఐపీ, జీఎల్‌పీ-1 హార్మోన్ల ఆధారంగా జరుగుతుంటుంది. బేరియాట్రిక్ సర్జరీలో దాదాపు 200కుపైగా బరువును నియంత్రించే హార్మోన్లలో మార్పులు వస్తాయి. అందులో ముఖ్యమైనవి జీఎల్‌పీ-1, జీఐపీ. సాధారణంగా ఇన్సులిన్ ఆధారితంగా చక్కెరను నియంత్రించినప్పుడు బరువు పెరగడం జరుగుతుంది. కానీ ఈ ఔషధంతో ఇటు చక్కెరను అదుపులో ఉంచడం, అటు బరువును తగ్గించడం ఈ రెండూ జరుగుతాయి. ఇది చాలావరకు సురక్షితమైనదే. కొందరిలో మాత్రం.. వికారం, వాంతులు, నీళ్ల విరేచనాలు, ఆకలి తగ్గడం, మలబద్ధకం, కడుపునొప్పి వంటి సమస్యలతోపాటు అరుదుగా కళ్లు మసకబారడం, కిడ్నీ సమస్యలు, గాల్ బ్లాడర్ సమస్యలు, పాంక్రియాటైటిస్, థైరాయిడ్ కేన్సర్, సివియర్ అలర్జిక్ రియాక్షన్ వంటివీ రావచ్చు. కాబట్టి డాక్టర్ల పర్యవేక్షణలో సరైన మోతాదులో వాడాలి. నిజానికి బరువు తగ్గదలచిన కొందరు తమ జీవనశైలి మార్పులతో, ఆహార నియంత్రణతో బరువు తగ్గుతారు. ప్రాణాంతకమైన మార్బిడ్ ఒబేసిటీ ఉన్నవారికి బేరియాట్రిక్ చికిత్స తప్పదు. కానీ కొందరిలో అటు మార్బిడ్ ఒబేసిటీ కాకుండా, ఇటు జీవనశైలి మార్పులతో బరువు తగ్గకుండా ఇబ్బందిపడుతుంటారు. అలాంటి వారికి ఈ ఔషధం మంచిదే. ఇక బేరియాట్రిక్ చికిత్స తర్వాత కూడా బరువు పెరుగుతున్నప్పుడు ఈ మెడిసిన్ వాడవచ్చు. బరువు తగ్గడం, చక్కెర నియంత్రణ రెండూ జరుగుతాయి కదా అంటూ ఎవరు పడితే వారు వాడటం సరికాదు. లైఫ్‌స్టైల్ మార్పులతో బరువు తగ్గడమనేది ఎప్పటికైనా మంచిది. జీవనశైలి మార్పులతో ఫలితాలు కనిపించనప్పుడు దీన్ని ఒక ఉత్ప్రేరకంగా (కిక్ స్టార్‌లా) వాడవచ్చు. తగ్గిన బరువును అలాగే కొనసాగించడానికి జీవనశైలి మార్పులను అనుసరించడమే ఆరోగ్యకరం.

హరీశ్ పాజిటివ్ లైన్‌లోకి వచ్చారు..

అభివృద్ధిని కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు: ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు కూడా పాజిటివ్ లైన్లోకి వచ్చారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. 'ఇప్పటివరకు నెగెటివ్ లైన్‌లో ఉండి నిరసనలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అందరికీ ముఖ్యమంత్రి అని గ్రహించి సమస్యల పరిష్కారానికి ఇప్పుడు హరీశ్‌రావు సీఎంను కలిశారు. అందుకు ధన్యవాదాలు'అన్నారు. శనివారం అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియా ప్రతినిధులతో 'చిట్‌చాట్'గా మాట్లాడుతూ.. తాము కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్ట్ అలైన్‌మెంట్‌ను కేబినెట్‌లో పెట్టాలని కోరామని తెలిపారు. 'మెట్రో విస్తరణ మీద కేంద్రానికి లేఖలు రాశాం.. పదేళ్ల గత ప్రభుత్వం మెట్రోను పట్టించుకోలేదు. కిషన్‌రెడ్డిని కేంద్ర మంత్రిగా మాత్రమే కాదు.. బీజేపీ అధ్యక్షుడిగా చూడాలి. ఇక్కడ బీజేపీని బలోపేతం చేసుకోవాలని.. సీఎం అవ్వాలని ఆయనకి ఉంటుంది. నిధులు ఇస్తే కాంగ్రెస్ క్రెడిట్ కొట్టేస్తుందని ఆయన భావిస్తున్నారు. అందుకే అభివృద్ధిని అడ్డుకుంటున్నారు'అని అన్నారు. కేటీఆర్ పాదయాత్రను స్వాగతిస్తున్నామని తెలిపారు.

ఉచితాలిచ్చి రైతులను యాచకులుగా మార్చకండి

బీజేపీ సభ్యుడు వెంకటరమణారెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'ఉచితాల పేరుతో రైతును యాచకుడిని చేయటం గొప్ప కాదు, మేం వ్యవసాయం చేస్తాం, మేం అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతాం'అని భావితరాలు సిద్ధమయ్యేలా వ్యవసాయ రంగాన్ని తయారు చేయాలని బీజేపీ సభ్యుడు వెంకట రమణారెడ్డి అన్నారు. 'రైతు రుణమాఫీ, పంట పెట్టుబడి సాయం చేయమని రైతులు ఎప్పుడూ రోడ్డెక్కలేదు. కనీస మద్దతు ధర కావాలనో, ఎరువులు సకాలంలో అందజేయాలనో రోడ్డెక్కుతారు. రైతుబంధు, రైతు భరోసా, రైతు బీమాల పేరు తో రాజకీయ నాయకులే వారిని యాచకులుగా మారుస్తున్నారు తప్ప వారికి వ్యవసాయంలో భరోసా ఇవ్వలేకపోతున్నాం. ఈ తీరు మారాలి'అని అన్నారు. ఆరు పద్దులపై చర్చ లో భాగంగా ఆయన శనివారం సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. వ్యవసాయం చేసే యువరైతులకు పిల్లనిచ్చే పరిస్థితి లేకుండా పోయిందని, దేశానికి అన్నం పెట్టే రైతు జీవితం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి ఉదయం 5 నుంచి 10 వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 10 వరకు ఇస్తే నిజంగా అవసరమైన వారికి ఉపయోగపడుతుందని, దీనివల్ల ఆర్టీసీపై భారం తగ్గుతుందని సూచించారు.

ప్రొటోకాల్‌పై అసెంబ్లీలో రగడ

- తన నియోజకవర్గంలో ప్రొటోకాల్ పాటించటంలేదన్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి
- ఎన్నికల్లో ఓడివారే ప్రారంభోత్సవాలు చేస్తున్నారని మండిపాటు
- అలా అయితే ఓడినవారినీ అసెంబ్లీలో కూర్చోబెట్టాలని వ్యంగ్యాస్త్రాలు
- మీరు అలాగే చేశారా అని నిలదీసిన డిప్యూటీ సీఎం భట్టి
- వాడీవేడిగా అసెంబ్లీ జీరోఅవర్.. 22 మందికి మాట్లాడే అవకాశమిచ్చిన స్పీకర్





సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీలో శనివారం జీరో అవర్ వాడీవేడిగా సాగింది. ప్రశ్నోత్తరాలు ముగిసిన అనంతరం సభ్యులు తమ నియోజకవర్గాల సమస్యలను ప్రస్తావించేందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జీరో అవర్ చేపట్టారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలకు చెందిన 22 మంది ఎమ్మెల్యేలకు మాట్లాడే అవకాశమిచ్చారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం పదేపదే అప్పుల గురించి ప్రస్తావించటంతో రాష్ట్రం చులకన అవుతోందని అన్నారు. స్పీకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదేశాలిచ్చినా తన నియోజకవర్గంలో ప్రొటోకాల్ అమలు కావడం లేదని తెలిపారు. 'ఒకాయన తాను మూడుసార్లు ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయానని చెప్పుకుంటూ కొబ్బరికాయలు కొట్టేస్తున్నాడు. వెంటనే ఆయన్ను పిచ్చాసుపత్రిలో చేర్పించాలి. లేదంటే ఎలాగూ అసెంబ్లీ హాల్‌లో 294 మంది కూర్చునేందుకు సీట్లు ఉన్నాయి కాబట్టి, ఎన్నికల్లో ఓడిపోయినవాళ్లను కూడా తీసుకొచ్చి కూర్చోబెట్టండి. సీఎంకు ఒక్కడికే కాదు.. మాకు కూడా రక్తం మరిగిపోతోంది. మేము కూడా ఊరికే ఇక్కడి వరకు రాలేదు' అని ఆవేశంగా మాట్లాడారు. ఈ సందర్భంలో జోక్యం చేసుకున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. జీరో అవర్‌లో నియోజకవర్గాల సమస్యలు మాత్రమే ప్రస్తావించాలని సూచించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెంటనే కలుగజేసుకుని ఓడిపోయిన వాళ్లను కూడా సభలో కూర్చోబెట్టాలని కోరటంతో భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు కూడా అలానే ఓడిపోయిన వాళ్లను తెచ్చి కూర్చోబెట్టారా? అని ప్రశ్నించారు. దీంతో ప్రతి విషయంలో రన్నింగ్ కామెంట్రీ ఏంటని పల్లాకు స్పీకర్ చురకలు వేశారు.

బీఆర్‌ఎస్ సభ్యులు విమర్శలకే సరి..

రాష్ట్రంలోని అన్ని సాగునీటి కాల్వల్లో సిల్టు తొలగించాలని పాలకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కోరారు. 'అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఏదైనా అడిగితే.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలే అడగాల్సి వస్తోంది. బీఆర్‌ఎస్ నుంచి విమర్శలు మాత్రమే వస్తున్నాయి. అసలు బీఆర్‌ఎస్ వాళ్లు అన్నీ చేసి ఉంటే ఇప్పుడు మేము అడిగే పరిస్థితి ఉండేదికాదు కదా? ప్రజాప్రభుత్వంలో ప్రజలకు మంచి జరిగితే ప్రతిపక్షాలకు కళ్లు కుడుతున్నాయి'అని విమర్శించారు. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలోని పెబ్బేరు సంత కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, వీలుంటే హైడ్రాను వనపర్తికి పంపాలని కోరారు. కాగా, జాబ్ కేలండర్‌కు అనుగుణంగా ఉద్యోగ నోటిఫికేషన్లు జారీచేసే అంశంపై చర్చను కోరుతూ సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించారు.

తొలిసారి మాట్లాడిన విజయుడు

అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు (బీఆర్‌ఎస్) అసెంబ్లీలో తొలిసారి మాట్లాడారు. జీరో అవర్‌లో ఆయనకు మాట్లాడే అవకాశం లభించింది. తన నియోజకవర్గంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని, రోడ్లు బాగు చేయాలని, జోగుళాంబ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. విజయుడిని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్ వెన్నుతట్టి ప్రోత్సహించడం కనిపించింది. జీరో అవర్‌లో సంజీవరెడ్డి (నారాయణ్‌ఖేడ్), జాఫర్‌హుస్సేన్ (యాకుత్‌పుర), గడ్డం వివేక్ (చెన్నూరు), కొత్త ప్రభాకర్‌రెడ్డి (దుబ్బాక), ధన్‌పాల్ సత్యనారాయణ (నిజామాబాద్ అర్బన్), మేఘారెడ్డి (వనపర్తి), సబితా ఇంద్రారెడ్డి (మహేశ్వరం), పాయం వెంకటేశ్వర్లు (పినపాక), మాజిద్‌హుస్సేన్ (నాంపల్లి), గండ్ర సత్యనారాయణ (భూపాలపల్లి), తెల్లం వెంకట్రావు (భద్రాచలం), సునీతా లక్ష్మారెడ్డి (నర్సాపూర్), మదన్‌మోహన్‌రావు (ఎల్లారెడ్డి), కాలె యాదయ్య (చేవెళ్ల), మేడిపల్లి సత్యం (చొప్పదండి), వెడ్మబొజ్జు (ఖానాపూర్), రాందాస్‌నాయక్ (వైరా), అనిరుధ్‌రెడ్డి (జడ్చర్ల), గడ్డం వినోద్ (బెల్లంపల్లి) తమ నియోజకవర్గాల్లోని సమస్యలను ప్రస్తావించారు.

మీ ప్రాథమ్యాలు యజ్ఞయాగాలే!

గత ప్రభుత్వాన్ని ఉద్దేశించి మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు

- బీఆర్‌ఎస్ సభ్యుల తీవ్ర అభ్యంతరం.. నిరసనగా సభ నుంచి నిష్క్రమణ
- తన కుటుంబం లెక్కలేనన్ని గుడులు కట్టించిందని మంత్రి వివరణ

సాక్షి, హైదరాబాద్: 'అప్పుడు మీ ప్రాథమ్యాలు కాళేశ్వరం సహా ఎత్తిపోతల పథకాలు, కొత్త సచివాలయం, పెద్ద భవనాలు, బ్రహ్మాండమైన కలెక్టర్ కార్యాలయాలు, పోలీసులకు ఏసీ వాహనాలు, చండీయాగాలు, ప్రగతి భవన్‌లో యజ్ఞాలు, యాగాలే.. ప్రజలకు మంచి రోడ్లు ఉండాలని మాత్రం కాదు. నాకు యాగాలు, యజ్ఞాలు లేవు. రోడ్లు, బ్రిడ్జీలు కట్టాలని ఉంది'అని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు అధికార, ప్రధాన ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వివాదం రాజేశాయి. రోడ్ల నిర్మాణంపై శనివారం ప్రశ్నోత్తరాల్లో బీఆర్‌ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి, హరీశ్‌రావు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చే క్రమంలో మంత్రి కోమటిరెడ్డి ఆ వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. యాగాలు చేశామని, సచివాలయం కట్టామని తమను అవమానించారని వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను యాగాలు చేస్తానని, తనకు దేవుడిపై భక్తి ఉందన్నారు. 'నేను వాటర్ నీళ్లు అనను... ఎక్కడంటే అక్కడ చేపల పులుసు తినను'అని కోమటిరెడ్డి తీరును ఉద్దేశించి ఎద్దేవా చేశారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా సభ నుంచి బీఆర్‌ఎస్ సభ్యులంతా నిష్క్రమించారు. దీనిపై శాసనసభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు స్పందిస్తూ యాగాలు చేయడం తప్పని కోమటిరెడ్డి ఎక్కడా చెప్పలేదన్నారు. గత ప్రభుత్వ ప్రాథమ్యాల గురించే మాట్లాడారని.. దీనికే వారు సభ నుంచి వెళ్లిపోవడం బాధాకరమన్నారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడుతూ తన కుటుంబం లెక్కలేనన్ని గుడులు కట్టించిందని వివరణ ఇచ్చారు. తన సమాధానాలకు దిమ్మ తిరిగే వారు వెళ్లిపోయారని విమర్శించారు.

రోడ్ల మరమ్మతులు, నిర్మాణంపై కోమటిరెడ్డి వర్సెస్ ప్రశాంత్‌రెడ్డి



అంతకుముందు రోడ్ల మరమ్మతులు, నిర్మాణంపై మంత్రి కోమటిరెడ్డి, బీఆర్‌ఎస్ సభ్యుడు ప్రశాంత్‌రెడ్డి మధ్య వాడీవేడి చర్చ జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్ల కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయడం లేదని.. ఫలితంగా తమ హయాంలో ప్రారంభమైన పనులు సైతం ఆగిపోయాయని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. గత 10 ఏళ్లలో తాము రోడ్ల నిర్మాణానికి రూ. 22 వేల కోట్లను ఖర్చు చేశామన్నారు. కోమటిరెడ్డి నియోజకవర్గ కేంద్రం నల్లగొండలో రూ. 200 కోట్లతో రోడ్లు వేశామన్నారు. అయితే ఈ వాదనను కోమటిరెడ్డి తోసిపుచ్చారు. బీఆర్‌ఎస్ పాలనలో రూ. 8,112 కోట్లతో 6,668 కి.మీ. రోడ్లకు మాత్రమే మరమ్మతులు చేశారని కోమటిరెడ్డి పేర్కొన్నారు. తన నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పాలనలో వేసిన రోడ్లు ఎక్కడున్నాయో చూపిస్తే ప్రశాంత్‌రెడ్డికి కొబ్బరికాయ కొట్టి సన్మానం చేస్తానని కోమటిరెడ్డి సవాల్ విసిరారు. తనపై కక్షతో నియోజకవర్గంలో రోడ్లకు నాడు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. 7 కి.మీ. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌ను బీఆర్‌ఎస్ పాలనలో కట్టలేకపోయారని కోమటిరెడ్డి ఆరోపించగా అది ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు అని ప్రశాంత్‌రెడ్డి వివరణ ఇచ్చారు.

బీఆర్‌ఎస్ హయాంలో గొర్రెలు, చేపల గోల్‌మాల్

మంత్రి సీతక్క విమర్శ




సాక్షి, హైదరాబాద్: గొర్రెలు, చేపలను కూడా గోల్‌మాల్ చేయడం బీఆర్‌ఎస్‌కే చెల్లుతుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క శనివారం అసెంబ్లీలో విమర్శించారు. గత పదేళ్లలో రాష్ట్రంలో ఎన్నో అరాచకాలు జరిగాయని.. వాటిని సరిచేస్తున్నామని చెప్పారు. ఈ నెలాఖరులోగా రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తొలివిడతను చెల్లిస్తామన్నారు. రైతుబంధు లబ్ధిదారులకు డబ్బు అందట్లేదని హరీశ్‌రావు ప్రస్తావించగా గత ప్రభుత్వంలో రాళ్లు, గుట్టలకు కూడా రైతుబంధు ఇచ్చారని.. తమ ప్రభుత్వం దుబారా ఖర్చు చేయదని సీతక్క అన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ సభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ చాలా మంది రైతులకు రుణమాఫీ, రైతుభరోసా, విత్తనాలు, ఎరువులు అందలేదని ఆరోపించారు. దీనిపై సీతక్క స్పందిస్తూ గ్రామాల్లోకి వెళ్లి ప్రజలను కలిస్తే పరిస్థితి అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. దీంతో కౌశిక్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ తాను 500 గజాల ఇంట్లో ఉంటున్నానని.. 5 ఎకరాల భవంతిలో కాదని చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ ఆదివాసీ మహిళనైన తనకు మంత్రి పదవి రావడం, గతంలో సీఎంగా ఉన్న వైఎస్సార్ నివాసం ఉన్న ఇంట్లో ఇప్పుడు తనకు నివాసం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఆ ఇంట్లో సౌకర్యాల కోసం పైసా కూడా ఖర్చు చేయలేదన్నారు. బీఆర్‌ఎస్ సభ్యులంతా తన నివాసానికి వచ్చి చూడొచ్చంటూ వారిని భోజనానికి ఆహ్వానించారు. అభ్యంతరకర వ్యాఖ్యలుంటే వెనక్కు తీసుకుంటున్నానని కౌశిక్‌రెడ్డి పేర్కొనడంతో వివాదం సద్దుమణిగింది.



మంత్రి కోమటిరెడ్డిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు

స్పీకర్‌కు అందజేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

- అవాస్తవాలతో సభను తప్పుదోవ పట్టించారని ఫిర్యాదు



స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు నోటీసును అందజేస్తున్న హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి. చిత్రంలో కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వివేకానంద, మర్రి రాజశేఖర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అవాస్తవాలతో సభను తప్పుదోవ పట్టించారని పేర్కొంటూ బీఆర్‌ఎస్ శాసనసభా పక్షం, సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చింది. ఈ మేరకు శనివారం స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను ఆయన చాంబర్‌లో కలిసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, కేపీ వివేకానంద, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఈ నోటీసు అందజేశారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి కోమటిరెడ్డి సభకు అవాస్తవాలతో కూడిన సమాధానం చెప్పారని నోటీసులో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సీఆర్‌ఎఫ్ నిధులు రాలేదని, ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఎస్క్రో ఖాతా తెరవలేదని అబద్ధాలు చెప్పారన్నారు. అలాగే నల్లగొండ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని అసత్యాలతో సభను తప్పుదోవ పట్టించారన్నారు. ఈ 3 అంశాలకు సంబంధించిన వివరాలను బీఆర్‌ఎస్ స్పీకర్‌కు ఇచ్చిన ఫిర్యాదుతో జత చేసింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే తప్పుడు సమాచారం ఇచ్చి, సభా గౌరవాన్ని తగ్గించారని ఆరోపించారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకుని సభా గౌరవం కాపాడాలని బీఆర్‌ఎస్ నేతలు స్పీకర్‌ను కోరారు.

బీఆర్‌ఎస్ నేతలకు మెంటలెక్కింది

- వారిని ఎర్రగడ్డ హాస్పిటల్‌కు పంపించాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'బీఆర్‌ఎస్ నేతలకు మెంటలెక్కింది. మైండ్ పనిచేయడం లేదు. వారిని ఎర్రగడ్డ హాస్పిటల్‌కు పంపించాలి'అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'పదేళ్లలో కేసీఆర్ చెప్పిన అబద్ధాలకు అసలు శిక్షలే సరిపోవు. కేసీఆర్ పదిలక్షల అబద్ధాలు ఆడారు. ఆయన మీద సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇవ్వాలి. దళితుడిని సీఎం చేయకపోతే తల తీసుకుంటా అన్నారు. కేసీఆర్‌ను తల తీసి ఇవ్వమని అడగాలి. లేదంటే రాజకీయాల నుంచి తప్పుకోమని చెప్పాలి'అని కోమటిరెడ్డి అన్నారు. శనివారం అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. సభలో హరీశ్‌రావు వేసిన ప్రశ్నే తప్పని, ఏడేళ్లపాటు నారపల్లి బ్రిడ్జి కట్టలేక పోయిన బీఆర్‌ఎస్ నేతలా తనపై విమర్శలు చేసేది అని మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్నా పవర్ లేని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. 'నల్లగొండలో రోడ్లు అభివృద్ధి చేశామన్న ప్రశాంత్‌రెడ్డి వ్యాఖ్యలు తప్పు. మా ప్రభుత్వంలో చేసిన పనులు బీఆర్‌ఎస్ వాళ్లు తమ ప్రభుత్వంలో చేసినట్టు చెప్పుకుంటున్నారు'అని కోమటిరెడ్డి అన్నారు. 'మామ చాటు అల్లుడు హరీశ్‌రావు. తండ్రి పేరు చెప్పి కేటీఆర్ వచ్చారు. మేము కష్టపడి వ్యవసాయ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చాము. నేను స్టూడెంట్ యూనియన్ లీడర్‌గా పని చేశాను. 1987లో నేను ఎన్‌ఎస్‌యూఐ లీడర్‌ను'అని పేర్కొన్నారు. 'బీఆర్‌ఎస్ వాళ్లు హౌలాగాళ్లు.. వాళ్లకు ధరణితో దోచుకుతినడం తప్ప ఏమీ తెల్వదు'అని మండిపడ్డారు.

పాతికేళ్ల దాకా పునర్విభజన వద్దు

అప్పటిదాకా లోక్‌సభ స్థానాల సంఖ్య యథాతథంగా ఉండాలి

కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాల జేఏసీ డిమాండ్, ఏకగ్రీవ తీర్మానం



సమావేశంలో స్టాలిన్, పినరయి విజయన్, రేవంత్‌రెడ్డి, భగవంత్‌మాన్, కేటీఆర్, డీకే శివకుమార్, సురేశ్‌రెడ్డి, వద్దిరాజు, వినోద్‌కుమార్, మహేశ్‌గౌడ్, మల్లు రవి తదితరులు

సాక్షి, చెన్నై: జనాభా ఆధారంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న ప్రతిపాదనను తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నేతృత్వంలోని ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) తీవ్రంగా వ్యతిరేకించింది. ''పునర్విభజన ప్రక్రియపై ప్రస్తుతమున్న నిషేధాన్ని మరో పాతికేళ్ల దాకా పొడిగించాలి. 1971 జనాభా లెక్కల ఆధారంగా ఖరారు చేసిన లోక్‌సభ స్థానాల ప్రస్తుత సంఖ్యనే అప్పటిదాకా కొనసాగించాలి''అని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పునర్విభజన ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, న్యాయబద్ధంగా, అందరి ఆమోదంతో మాత్రమే జరగాలని తేల్చిచెప్పింది. స్టాలిన్ నేతృత్వంలో జేఏసీ శనివారం చెన్నైలో తొలిసారిగా సమావేశమయ్యింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేరళ సీఎం పినరయి విజయన్, పంజాబ్ సీఎం భగవంత్‌మాన్, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.టి.రామారావు తదితరులు హాజరయ్యారు. మొత్తం 14 పార్టీల నాయకులు పాల్గొన్నారు. తమ డిమాండ్లపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రధాని నరేంద్ర మోదీకి ఎంపీల ద్వారా ఉమ్మడిగా విజ్ఞాపన పత్రం సమర్పించాలని నిర్ణయించారు. కేంద్రం చేపట్టే ఎలాంటి డీలిమిటేషన్ ప్రక్రియపై అయినా ముందుగా భాగస్వామ్య పక్షాలన్నింటితోనూ చర్చించాల్సిందేనని జేఏసీ సభ్యులు కుండబద్దలు కొట్టారు. ''అందరి భాగస్వామ్యంతో మాత్రమే డీలిమిటేషన్ జరగాలి. అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలతో కచ్చితంగా సంప్రదింపులు జరపాలి. అభిప్రాయాలు తెలుసుకోవాలి. లోక్‌సభ స్థానాల పునర్విభజన మన ప్రజాస్వామ్య వ్యవస్థ గౌరవ ప్రతిష్టలను పెంచేలా ఉండాలి''అని పేర్కొన్నారు. ఈ మేరకు రూపొందించిన తీర్మానాన్ని జేఏసీ ఏకగ్రీవంగా ఆమోదించింది.

''జనాభా నియంత్రణ చర్యలను సమర్థంగా అమలు చేసిన రాష్ట్రాలకు కేంద్రం మరిన్ని ప్రోత్సాహకాలు ఇవ్వాలని 42, 84, 87వ రాజ్యాంగ సవరణలు సూచిస్తున్నాయి. దేశవ్యాప్తంగా జనాభా విషయంలో స్థిరీకరణ సాధించాలన్న లక్ష్యం ఇంకా నెరవేరలేదు. అందుకే 1971 నాటి జనగణన ఆధారంగా నిర్ధారించిన లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యపై పరిమితిని మరో 25 ఏళ్లపాటు పొడిగించాలి. రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించకూడదు. జనాభా నియంత్రణ చర్యలతో జనాభాను గణనీయంగా తగ్గించిన రాష్ట్రాలను శిక్షించాలనుకోవడం సరైంది కాదు. ఈ విషయంలో రాష్ట్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా కేంద్ర ప్రభుత్వం తగిన రాజ్యాంగ సవరణలు చేయాలి'' అని తీర్మానంలో పేర్కొన్నారు. తమ డిమాండ్లను లెక్కచేయకుండా కేంద్రం డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభిస్తే కలిసికట్టుగా అడ్డుకోవడానికి ఎంపీలతో కూడిన కోర్ కమిటీ ద్వారా సమన్వయం చేసుకోవాలని, ఆ మేరకు వ్యూహాలు రూపొందించుకోవాలని నిర్ణయించారు. 'జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్'కు వ్యతిరేకంగా శాసనసభల్లో తీర్మానాలు ఆమోదించి కేంద్రానికి పంపించాలని నిర్ణయానికొచ్చారు. గతంలో జరిగిన డీలిమిటేషన్ ప్రక్రియల చరిత్ర, వాటి ఉద్దేశం, ప్రతిపాదిత పునర్విభజన వల్ల తలెత్తే విపరిణామాలపై తమ రాష్ట్రాల్లో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తమిళనాడులో అధికార డీఎంకే దీనిపై ఇప్పటికే సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభించింది.

దక్షిణాది రాష్ట్రాలకు గొడ్డలిపెట్టు: విజయన్

ప్రతిపాదిత పునర్విభజన దక్షిణాది రాష్ట్రాలకు గొడ్డలి పెట్టు వంటిదేనని విజయన్ తేల్చిచెప్పారు. జనాభా తగ్గించినందుకు ఇస్తున్న బహుమానం ఇదేనా అని మండిపడ్డారు. పునర్విభజనపై ముందుకెళ్లే ముందు కేంద్రం దక్షిణాది రాష్ట్రాలతో అర్థవంతమైన చర్చలు జరపాలన్నారు. ''ప్రస్తుత జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ చేపడితే లోక్‌సభ సీట్లు ఉత్తరాదిన పెరిగి దక్షిణాదిన తగ్గుతాయి. తద్వారా బీజేపీ లాభపడుతుంది. స్వీయ రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలన్నదే బీజేపీ ఆలోచన''అని మండిపడ్డారు. జేఏసీ సమావేశం అనంతరం విజయన్ 'ఎక్స్'లో పలు పోస్టులు చేశారు. దేశ సమాఖ్య వ్యవస్థపై సంఘ్ పరివార్ బహిరంగ యుద్ధం ప్రారంభించిందని ధ్వజమెత్తారు. సమాఖ్య వ్యవస్థ, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి కలిసికట్టుగా పోరాటం చేయాలని దక్షిణాది రాష్ట్రాలకు పిలుపునిచ్చారు.

సమాఖ్య ప్రజాస్వామ్యానికి ముప్పు: డీకే

కేవలం జనాభా ఆధారంగా పునర్విభజన చేస్తే దేశ సమాఖ్య ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పని డీకే శివకుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రంచేస్తున్న రాజకీయ దాడిగా అభివర్ణించారు. ''సమాఖ్య నిర్మాణం మన ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. అంబేడ్కర్‌తో పాటు రాజ్యాంగ రూపకర్తలు నిర్మించిన సమాఖ్య ప్రజాస్వామ్య పునాదులను కూల్చివేయొద్దు''అని కేంద్రానికి సూచించారు. ''ఆధిపత్యాన్ని అంగీకరించడమా? తిరుగుబాటు చేయడమా? ప్రగతిశీల రాష్ట్రాలకు ఇప్పుడు ఈ రెండే అవకాశాలున్నాయి. మేం తిరుగుబాటునే ఎంచుకున్నాం''అని ఉద్ఘాటించారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న దక్షిణాది రాష్ట్రాలపై కక్ష ఎందుకని ప్రశ్నించారు. జాతీయ వేదికపై దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కడానికి కేంద్రం కుట్రలు సాగిస్తోందని ఆరోపించారు. దక్షిణాదిపై హిందీ భాషను బలవంతంగా రుద్దే ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు.

అన్ని పార్టీలతో చర్చించాలి: నవీన్ పట్నాయక్

పార్లమెంట్‌లో, అసెంబ్లీల్లో ఎన్ని స్థానాలు ఉండాలో నిర్ణయించడానికి జనాభాను ప్రాతిపదికగా తీసుకోవద్దని బిజూ జనతాదళ్ (బీజేడీ) అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియపై అన్ని పార్టీలతో సమగ్రంగా చర్చించి, తుది నిర్ణయం తీసుకోవాలని కేంద్రానికి సూచించారు. జేఏసీ భేటీని ఉద్దేశించి ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. ఒడిశా ప్రజల ప్రయోజనాల కోసం తమ పార్టీ పోరాడుతుందని స్పష్టంచేశారు. డీమిలిటేషన్‌పై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. జనాభాను విజయవంతంగా నియంత్రించిన రాష్ట్రాల ప్రజాస్వామ్య ప్రాతినిధ్యాన్ని, ప్రజల హక్కులను కేంద్రం కాపాడాలన్నారు. దేశ అభివృద్ధి కోసం జనాభా నియంత్రణ అనేది అత్యంత కీలకమైన జాతీయ అజెండా అని నవీన్ వివరించారు. 2026 జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన చేపడితే తమ రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుందని పేర్కొన్నారు. బీజేడీ తరఫున మాజీ మంత్రి సంజయ్ దాస్, మాజీ ఎంపీ అమర్ పట్నాయక్ భేటీలో పాల్గొన్నారు.

మన ఆమోదం లేకుండానే చట్టాలు: స్టాలిన్

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై రాజకీయ, న్యాయపరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని స్టాలిన్ చెప్పారు. పునర్విభజన పూర్తిగా న్యాయబద్ధంగా, పారదర్శకంగా జరగాలన్నారు. ప్రజాస్వామ్య ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేసేలా చర్యలు చేపడితే ఎలాంటి అభ్యంతరం ఉండదన్నారు. కేవలం జనాభా ఆధారంగా పునర్విభజన చేస్తే పలు రాష్ట్రాలకు చాలా నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ''ఇప్పుడు గానీ, భవిష్యత్తులో గానీ జనాభాను ప్రాతిపదికగా తీసుకోవద్దు. సామాజిక కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ద్వారా జనాభాను నియంత్రించిన రాష్ట్రాలకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం తగ్గరాదు. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేస్తే పార్లమెంట్‌లో చట్టాల రూపకల్పనలో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుంది. మన ఆమోదం లేకుండానే చట్టాలు రూపొందితే మన ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుంది. సామాజిక న్యాయం దెబ్బతింటుంది''అని ఉద్ఘాటించారు. సొంత దేశంలోనే రాజకీయ అధికారం కోల్పోయిన పౌరులుగా మిగిలిపోతామని వ్యాఖ్యానించారు. ఈ జేఏసీ సమావేశం చరిత్రలో నిలిచిపోతుందని స్టాలిన్ అన్నారు. ఈ భేటీని 'జేఏసీ ఫర్ ఫెయిర్ డీలిమిటేషన్'గా పిలుద్దామని ప్రతిపాదించారు. జేఏసీ రెండో భేటీ హైదరాబాద్‌లో జరుగుతుందని చెప్పారు. తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. రెండో భేటీ సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహించాలని కూడా నేతలు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం.

ఐక్యంగా పోరాడుదాం.. బీజేపీని అడ్డుకుందాం

- జనాభా దామాషాతో చేపడితే దక్షిణాది రాష్ట్రాలు గళం కోల్పోతాయి: రేవంత్‌రెడ్డి
- తర్వాతి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహిద్దామని ప్రతిపాదన
- ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు భారీ సభను ఏర్పాటు చేస్తామని వెల్లడి



సాక్షి, చెన్నై: నియోజకవర్గాల పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడుదామని, అసమగ్ర పునర్విభజన ప్రక్రియ చేపట్టకుండా బీజేపీని అడ్డుకుందామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు నిచ్చారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా చెన్నైలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అంశంపై అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చిన తమిళనాడు సీఎం స్టాలిన్‌ను అభినందించారు. సమావేశంలో రేవంత్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''ప్రస్తుతం దేశం పెద్ద సవాల్ ఎదుర్కొంటోంది. జనాభాను నియంత్రించాలని 1971లో దేశం నిర్ణయించినప్పటి నుంచి దక్షిణాది రాష్ట్రాలు దాన్ని అమలు చేస్తే.. ఉత్తరాదిలోని పెద్ద రాష్ట్రాలు విఫలమయ్యాయి. దక్షిణాది రాష్ట్రాలన్నీ వేగంగా ఆర్థిక వృద్ధి సాధించాయి. జీడీపీ, తలసరి ఆదాయం, వేగంగా ఉద్యోగాల కల్పన, మెరుగైన మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో మంచి ప్రగతి సాధించాయి.

ఉత్తరాది రాష్ట్రాలకే ఎక్కువ నిధులు

దక్షిణాది రాష్ట్రాలు దేశ ఖజానాకు పెద్ద మొత్తంలో నిధులు ఇస్తూ కూడా తక్కువ మొత్తాన్ని తిరిగి పొందుతున్నాయి. తమిళనాడు పన్నుల రూపంలో కేంద్రానికి రూపాయి చెల్లిస్తే.. 29 పైసలే వెనక్కి వస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌కు రూపాయికి రెండు రూపాయల 73 పైసలు అందుతున్నాయి. బిహార్‌కు ఆరు రూపాయల ఆరు పైసలు, మధ్యప్రదేశ్‌కు రూపాయి 73 పైసలు వెనక్కి పొందుతున్నాయి. అదే కర్ణాటక కేవలం 14 పైసలు, తెలంగాణ 41 పైసలు, కేరళ 62 పైసలు మాత్రమే వెనక్కు పొందుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం కేటాయింపులు, పన్నుల వాటా చెల్లింపులు క్రమంగా తగ్గుతున్నాయి. చివరికి జాతీయ ఆరోగ్యమిషన్ కేటాయింపుల్లోనూ ఉత్తరాది రాష్ట్రాలకే 60- 65 శాతం నిధులు దక్కుతున్నాయి.

అలా పునర్విభజనను ఒప్పుకోం..

మనది ఒకే దేశం.. దానిని గౌరవిస్తాం.. కానీ జనాభా ప్రాతిపదికన పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనను అంగీకరించం. అది దక్షిణాది రాష్ట్రాల రాజకీయ అధికారాన్ని కుదిస్తుంది. మంచి ప్రగతి సాధిస్తున్న రాష్ట్రాలకు శిక్షగా మారుతుంది. బీజేపీ ప్రతిపాదిస్తున్న జనాభా దామాషా పద్ధతిలో పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ గళం కోల్పోతాయి. ఉత్తర ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు దేశంపై ఆధిపత్యం చెలాయిస్తాయి. ఈ అసమగ్రమైన పునర్విభజన ప్రక్రియ చేపట్టకుండా బీజేపీని అడ్డుకుందాం. దక్షిణాది ప్రజలు, పార్టీలు, నాయకులు ఏకం కావాలి.

వాజ్‌పేయి విధానాన్ని అనుసరించండి..

ఒక్క సీటుతో కేంద్ర ప్రభుత్వం పడిపోయిన చరిత్ర కూడా ఉంది. ఈ దృష్ట్యా ప్రొరేటా విధానం కూడా దక్షిణాది రాజకీయ ప్రయోజనాలకు భంగం కలిగిస్తుంది. 1976లో ఇందిరాగాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సీట్ల సంఖ్యను పెంచకుండా ఏ విధంగా పునర్విభజన ప్రక్రియ జరిపిందో.. ఆ విధానాన్నే ఇప్పుడు అనుసరించాలి. 2001లో వాజ్‌పేయి ప్రభుత్వం పునర్విభజన ప్రక్రియను అదే తరహాలో ప్రారంభించింది. ఇప్పుడు అదే విధానాన్ని పాటించేలా.. మరో 25 ఏళ్లపాటు లోక్‌సభ సీట్లలో, సంఖ్యలో ఎటువంటి మార్పు తీసుకురాకుండా పునర్విభజన ప్రక్రియ చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తెద్దాం. ఈ అంశంపై తర్వాతి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహిద్దాం. పోరాటాన్ని ఎలా ముందుకు తీసుకెళదామనే అంశంపై ఆ సమావేశంలో చర్చిద్దాం. ఈ పోరాటంలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తాం..''అని రేవంత్ చెప్పారు.

చెన్నై శ్రీకారం.. హైదరాబాద్ ఆకారం: రేవంత్ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: ఉత్తరాదిని గౌరవిస్తామని.. రాజకీయాల్లోనైనా, విద్యావ్యవస్థలోనైనా పెత్తనాన్ని మాత్రం సహించబోమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. సమాఖ్య స్ఫూర్తి ప్రకారం హక్కుల సాధనలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు 'ఎక్స్'వేదికగా పోస్టు చేశారు. ''ఈ పుణ్యభూమి అంబేడ్కర్ మహనీయుడు రాసిన రాజ్యాంగం వల్ల సమాఖ్య స్ఫూర్తిని, సామాజిక న్యాయాన్ని, సమాన హక్కులను పొందింది. కేవలం రాజకీయ ప్రయోజన కాంక్షతో పునర్విభజనను అస్త్రంగా ప్రయోగించి ఆ హక్కులను విచ్ఛిన్నం చేస్తామంటే మౌనంగా ఉండలేం. ఉత్తరాదిని గౌరవిస్తాం.. దక్షిణాది హక్కుల విషయంలో రాజీపడం. ఈ ధర్మ పోరాటానికి చెన్నై శ్రీకారం చుట్టింది. ఇక హైదరాబాద్ ఆకారం ఇస్తుంది''అని పేర్కొన్నారు.

దక్షిణాదిపై వివక్ష మరింత పెరిగింది

దేశాన్ని నడిపిస్తున్న రాష్ట్రాలకు అన్యాయం: కేటీఆర్

- జనాభా దామాషాతో డీలిమిటేషన్‌తో నియంతృత్వంవైపు అడుగులు
- దేశంలో ఓ ప్రాంతం మరో ప్రాంతంపై ఆధిపత్యం చలాయించేలా ఉండొద్దు
- అభివృద్ధి సాధించిన ప్రాంతాలను ప్రోత్సహించాలే తప్ప శిక్షించవద్దని వ్యాఖ్య



సాక్షి, చెన్నై: దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వ వివక్ష కొత్త కాదని.. ఈ మధ్యకాలంలో ఈ వివక్ష, అన్యాయం మరింత పెరిగాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు పేర్కొన్నారు. కేంద్రం ప్రారంభించిన బుల్లెట్ రైలు వంటి ప్రాజెక్టులన్నీ ఉత్తరాదికే పరిమితం కావడం ఇందుకు ఒక ఉదాహరణ అని చెప్పారు. ప్రస్తుతం బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం దీన్ని మరింత పెంచేలా డీలిమిటేషన్ అంశాన్ని ముందుకు తీసుకొచ్చిందని మండిపడ్డారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా చెన్నైలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివరాలు కేటీఆర్ మాటల్లోనే..

''కేసీఆర్ ఆధ్వర్యంలో 14 ఏళ్లపాటు తెలంగాణ ఉద్యమం నడిపాం. తమిళనాడు ప్రజల నుంచి అనేక అంశాలు స్ఫూర్తిగా తీసుకున్నాం. అస్తిత్వం కోసం, హక్కుల కోసం కొట్లాడటంలో తమిళనాడు స్ఫూర్తినిచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం చేపట్టబోతున్న నియోజకవర్గాల పునర్విభజనతో అనేక నష్టాలు ఎదురవుతాయి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ వివక్షాపూరిత విధానాలతో దక్షిణాదికి అనేక నష్టాలు జరుగుతున్నాయి. అందరం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నాం. కానీ దేశ అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్న రాష్ట్రాలకు నష్టం కలిగిస్తూ, దేశాన్ని వెనక్కి నెడుతున్న రాష్ట్రాలకు లాభం చేకూర్చే విధంగా ఈ డీలిమిటేషన్ విధానం ఉంది.

నియంతృత్వంవైపు దారి తీస్తుంది..

దేశంలో ఒక ప్రాంతం ఇంకో ప్రాంతంపై ఆధిపత్యం చలాయించే విధంగా ఉండరాదన్నది ప్రజాస్వామ్య స్ఫూర్తి. ఇది కేవలం ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల వ్యవహారం కాదు.. అభివృద్ధి చెందిన రాష్ట్రాలు, ప్రాంతాలకు నష్టం జరుగుతున్న అంశం. పరిపాలన, ఆర్థిక అభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఆదర్శంగా ఉన్నాయి. దేశ జీడీపీలో 36 శాతం భాగస్వామ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు శిక్షింపబడుతున్నాయి. డీలిమిటేషన్ అంశం కేవలం పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం తగ్గడానికే పరిమితం కాదు. ఆర్థికపరమైన నిధుల కేటాయింపులో కూడా తీవ్ర నష్టం జరగబోతోంది. నిధుల కేటాయింపులో కూడా అధికారం పూర్తిగా కేంద్రీకృతమై నియంతృత్వం వైపు పరిస్థితులు దారి తీసే అవకాశం ఉంది.

సమాఖ్య స్ఫూర్తికి విఘాతం..

కేవలం జనాభా ఆధారంగా పార్లమెంటు సీట్ల పెరుగుదల జరిగితే దేశ సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉంది. అందరం భారతీయులమే. కానీ మనందరికీ, ఆయా ప్రాంతాలకు ప్రత్యేక అస్తిత్వం ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దు. విభిన్న భాషలు, సాంస్కృతిక అస్తిత్వాలతో కూడిన ఒక సమాఖ్య దేశం మనది అన్నది గుర్తుంచుకోవాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తి చేసుకోబోయే 2047 నాటికి సూపర్ పవర్ కావాలంటే.. అభివృద్ధి సాధించిన రాష్ట్రాలకు ప్రోత్సాహం లభించాలి. అంతేతప్ప శిక్షించకూడదు. డీలిమిటేషన్ అనేది ఆర్థికాభివృద్ధి, అభివృద్ధి వంటి అంశాలపైనే జరగాలి. ఇంత నష్టం జరుగుతున్నా మాట్లాడకుంటే చరిత్ర క్షమించదు.'' అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు

- పునర్విభజనపై విధివిధానాలే ఖరారు కాలేదు
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్, డీఎంకే, లెఫ్ట్ సమావేశంపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజనతోనే కాదు, మరే విషయంలోనూ దేశంలోని ఏ ఒక్క రాష్ట్రానికి, ఏ ఒక్క ప్రాంతానికి మోదీ ప్రభుత్వం అన్యాయం జరగనివ్వదని హామీ ఇస్తున్నామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. చెన్నైలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీని వ్యతిరేకించే కాంగ్రెస్, బీఆర్‌ఎస్, డీఎంకే, కమ్యూనిస్టులు సమావేశం కావడం... 'ఆలు లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం'అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇంకా అసలు నియోజకవర్గాల పునర్విభజనకు అనుసరించాల్సిన విధి విధానాలు ఖరారు కాలేదని, నియమ నిబంధనలు రూపొందించనే లేదని శనివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. అయినప్పటికీ దక్షిణాదికి అన్యాయం జరుగుతుందంటూ ఈ పార్టీలు ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం.. వారి దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. పైకి నియోజకవర్గాల పునర్విభజన అని చెప్తున్నప్పటికీ, వాస్తవానికి వారి ఎజెండా బీజేపీపై విషం కక్కడమేననేది స్పష్టమవుతోందన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో గ్యారంటీల హామీల అమలు వైఫల్యాలతో కాంగ్రెస్, తమిళనాడులో అవినీతి కుటుంబ పాలనతో డీఎంకే తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాయని కిషన్‌రెడ్డి విమర్శించారు. అటు బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయి గత పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటూ గెలవలేకపోయింది, ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కనీసం పోటీ చేసే ధైర్యం కూడా చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించి, భావోద్వేగాలు రెచ్చగొట్టేందుకు ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన తీసుకువచ్చేందుకు కుట్రలు పన్నుతున్నాయన్నారు. 'ప్రజల మధ్య భావోద్వేగాన్ని రెచ్చగొట్టేందుకు జాతీయ విద్యావిధానంలో త్రిభాషా సూత్రాన్ని చూపి, హిందీని బలవంతాన రుద్దుతున్నారని స్టాలిన్ తప్పుడు కథనాన్ని తీసుకొచ్చారు.

చెన్నైలో దొంగలముఠా సమావేశం

- కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్ రూరల్: డీలిమిటేషన్ పేరుతో చెన్నైలో సీఎం స్టాలిన్ అధ్యక్షతన జరిగింది దొంగల ముఠా సమావేశమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. శనివారం కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, డీఎంకే సమావేశంలో పాల్గొన్న పార్టీల నాయకులు లిక్కర్ దందాలో దొరికిన వాళ్లేనని, స్టాలిన్ ప్రభుత్వం కూడా రూ.వెయ్యి కోట్ల లిక్కర్ స్కాంకు పాల్పడిందని అన్నారు. తెలంగాణలోనూ అవినీతి పాలన నడుస్తోందని, ఆరుగ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. డీలిమిటేషన్‌పై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోకముందే ఆయా పార్టీలన్నీ దక్షిణాదికి అన్యాయం చేస్తున్నారంటూ మోదీ ప్రభుత్వంపై బురదజల్లుతున్నాయని ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌తో దక్షిణాదిలో సీట్లు తగ్గే అవకాశం లేదని కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టంగా ప్రకటించినట్లు గుర్తు చేశారు. కాగా, తాను బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు చేపట్టబోతున్నానంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవంలేదని, అధ్యక్ష పదవి రేసులో తాను లేనని, జాతీయ నాయకత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు.

పిల్ల పుట్టకముందే కుళ్ళ కుట్టినట్టుంది విపక్షాల తీరు

- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: 'కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్‌పై ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. పిల్ల పుట్టకముందే కుళ్ళ (టోపీ) కుట్టినట్లు ఉంది ప్రతిపక్షాల తీరు. ఈ రాద్ధాంతం సరికాదు'అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఎద్దేవాచేశారు. జనాభా నియంత్రణ చేసిన దక్షిణాది రాష్ట్రాలను ప్రోత్సహించే విధంగా నిర్ణయాలుంటాయి తప్ప, నిరుత్సాహపరిచేలా ఉండవన్నారు. తమిళనాడులో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనపై జరిగిన అఖిలపక్ష సమావేశంపై ఈటల ఒక ప్రకటనలో స్పందించారు. 'కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒకే తాను ముక్కలు.. బీజేపీ ప్రజల గురించి ఆలోచిస్తే వారు సొంత ప్రయోజనాల కోసం ఆలోచిస్తారు. ఎలాంటి నిర్ణయం తీసుకోకముందే మాట్లాడటం మంచి పద్ధతి కాదు. కేంద్రం విధి విధానాలు ప్రకటించినప్పుడు మాట్లాడితే మంచిది. దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ దేశం కోణంలో ఆలోచించాలి తప్ప సంకుచిత ఆలోచన వద్దని సూచిస్తున్నా. సోషల్ మీడియాలో వచ్చే అబద్ధపు ప్రచారాలను నమ్మి మీటింగ్ పెట్టడం సరికాదు'అని ఈటల పేర్కొన్నారు.

నరసింహన్ దంపతులతో కేటీఆర్ మర్యాదపూర్వక భేటీ



మాజీ గవర్నర్ నరసింహన్ దంపతులను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నేత కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: డీఎంకే ఆధ్వర్యంలో చెన్నైలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల అఖిలపక్ష భేటీలో పాల్గొనేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు మాజీ గవర్నర్ నరసింహన్ దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ప్రతిమను వారికి అందజేశారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు ఉన్నారు. మరోవైపు జేఏసీ ఫర్ డీలిమిటేషన్ పేరిట శనివారం జరిగిన సదస్సుకు హాజరైన కేటీఆర్ బృందాన్ని తమిళనాడు సీఎం స్టాలిన్ సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. అనంతరం శనివారం సాయంత్రం చెన్నై నుంచి హైదరాబాద్‌కు కేటీఆర్ బృందం తిరుగు పయనమైంది. కాగా, పార్టీ రజతోత్సవాల నిర్వహణ, ఏప్రిల్ 27న వరంగల్‌లో బహిరంగ సభ సన్నాహాలపై పార్టీ యంత్రాంగానికి దిశానిర్దేశం చేసేందుకు కేటీఆర్ ఆదివారం కరీంనగర్ పర్యటనకు వెళ్లనున్నారు.

స్టేట్‌కమిటీ నిర్ణయిస్తే.. రబ్బర్‌స్టాంప్ అధ్యక్షుడే

- ఫ్రీహ్యాండ్ ఇస్తేనే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి: రాజాసింగ్

సాక్షి, హైదరాబాద్: సీనియర్ నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు 'ఫ్రీ హ్యాండ్'ఇస్తే తెలంగాణలో కచ్చితంగా బీజేపీ అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే టి.రాజాసింగ్ పేర్కొన్నారు. రాష్ట్ర పార్టీకి త్వరలోనే కొత్త అధ్యక్షుడు రాబోతున్నారని, ఆ వచ్చే కొత్త ప్రెసిడెంట్ బ్యాక్ డోర్ నుంచి ముఖ్యమంత్రితో రహస్య సమావేశాలు నిర్వహించొద్దని శనివారం ఓ ప్రకటనలో కోరారు. 'అధ్యక్షుడిగా ఎవరుండాలనేది ఎవరు ఫైనల్ చేస్తున్నారు. స్టేట్ కమిటీనా లేక సెంట్రల్ కమిటీనా? ఒకవేళ స్టేట్ కమిటీ అధ్యక్షుడిని డిసైడ్ చేస్తే ఆ అధ్యక్షుడు రబ్బర్ స్టాంప్‌గానే ఉంటాడు. అందువల్ల సెంట్రల్ కమిటీ అధ్యక్షుడిని డిసైడ్ చేస్తే మంచిది'అని సూచించారు. గతంలోని పరిస్థితిని మనమంతా చూశామని, ఎవరు అధ్యక్షుడైతే ఆయన తన గ్రూప్ తయారు చేసుకొని పార్టీకి నష్టం చేశారన్నారు. ఒకవేళ కొత్త అధ్యక్షుడు కూడా అదే గ్రూపిజం చేస్తే తెలంగాణలో పార్టీకి చాలా నష్టం జరుగుతుందని చెప్పారు. 'బీజేపీని హిందూత్వ పార్టీ అంటారు. ధర్మం గురించి పనిచేసే కార్యకర్తలను ప్రోత్సహించాలి. కొత్త అధ్యక్షుడికి ఇదే నా నివేదన'అని రాజాసింగ్ పేర్కొన్నారు. సీనియర్ నాయకులు, కార్యకర్తల మనసులోని మాటను తాను బయట పెడుతున్నానని ఆయన చెప్పారు.

తెలంగాణ సంపదపై గుంట నక్కల్లా కన్నేశారు

▶ మొదటి పేజీ తరువాయి



సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో కొప్పుల, వంటేరు తదితరులు

వాళ్లను ఉద్యమ కాలంలో దద్దమ్మలు, సన్నాసులు అని తెలంగాణ సమాజం తరఫున అన్నాను. అంతేతప్ప నాకు వ్యక్తిగతంగా ఎవరి మీద కోపం ఎందుకు ఉంటుంది? రామగుండం ఎమ్మెల్యేకు నీటి గోసపై మాట్లాడే అవకాశమున్నా మౌనంగా ఉంటే ఏమనాలి? బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టుతో అలుగు పారితే ఇప్పుడు చెరువులు, కుంటలు అడుగంటాయి. కొట్లాడి సాధించిన తెలంగాణను ఎంతో జాగ్రత్తగా నిలబెట్టినా ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు. అది వాళ్లిష్టం అయినా ఫలితాన్ని లోకం చూస్తోంది. తెలంగాణలో ఉమ్మడి రాష్ట్ర పాలకులు మొదటి నుంచీ నీటి సమస్యను ఆర్థిక సమస్యగా చూడడం ఒక అవలక్షణంగా మార్చుకున్నారు. గల్ఫ్ దేశాలతో పాటు చెన్నై వంటి నగరాల్లోనూ ఎంతో ఖర్చుతో సముద్రపు నీటిని మంచినీటిగా మార్చుకుంటున్నారు. తెలంగాణలోనూ ఖర్చుకు వెనుకాడకుండా తాగు, సాగునీరు అందించాల్సిందే'అని కేసీఆర్ స్పష్టం చేశారు.

పేదల ఇండ్లను కూల్చుతున్నారు

'పల్లెల నుంచి బతుకుదెరువు కోసం హైదరాబాద్ లాంటి పట్టణాలకు వచ్చిన పేదలకు మనం అండగా నిలిస్తే.. ప్రస్తుత ప్రభుత్వం వారి ఇండ్లను కూల్చివేస్తోంది. హైడ్రా కూల్చివేతలతో ఆవేదన చెందుతున్న ప్రజలు.. 'కేసీఆర్ అన్నా.. ఎక్కడున్నవు.. రావే'అని పిలుస్తున్నారు. కత్తి ఒకరికి ఇచ్చి యుద్ధం మరొకరిని చేయమంటే ఎలా? పదేళ్లు ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో మళ్లీ పాదయాత్రలు, ధర్నాలు, ఆందోళనలు మొదలయ్యాయి. తెలంగాణలో సమస్యలకు నాటి ప్రధాని నెహ్రూ మొదలుకొని సోనియాగాంధీ వరకు ప్రధాన శత్రువు కాంగ్రెస్ పార్టీయే. రాష్ట్రంలో మళ్లీ సాగు, తాగునీరు, విద్యుత్ కష్టాలు ఎందుకు వస్తున్నాయో ప్రజలు అర్థం చేసుకోవాలి. భవిష్యత్తు తరాలను బాగుచేసే దిశగా ఆలోచించాలి. తెలంగాణ కోసం ఎప్పటికైనా పోరాడేది బీఆర్‌ఎస్ పార్టీ మాత్రమే. బెల్లం ఉన్న దగ్గరకు ఈగలు వస్తాయి. అధికారం పోగానే కొందరు పార్టీకి దూరమవుతారు. రాబోయే రోజుల్లో అధికారం బీఆర్‌ఎస్ పార్టీదే. సింగిల్‌గా అధికారంలోకి వస్తాం. ఈ నేలపై ఎవరూ శాశ్వతం కాదు. ప్రతీ కార్యకర్త కేసీఆర్‌లా తయారై తెలంగాణ హక్కుల కోసం పోరాడాలి'అని కేసీఆర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, పుట్ట మధు, పార్టీ నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, నారాయణదాస్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

మీరు ఫామ్‌హౌస్‌లోనే ఉండండి: సీతక్క


సాక్షి, హైదరాబాద్: 'మీ కార్యకర్తలను ఊహాలోకంలోనే ఉంచండి. మీరు ఫామ్‌హౌస్‌లోనే ఉండండి'అని పీఆర్ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మళ్లీ తమదే అధికారం అంటూ ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై శనివారం అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఆమె స్పందించారు. 'మా పాలన మేం చేస్తాం. ప్రజలకు మంచి పాలన అందిస్తాం. మీరు ఎప్పటికీ అధికారంలోకి రారు. ఆ విషయం మీకు అర్థం కాదు'అని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేల అనర్హత కేసు.. స్పీకర్ ఆఫీసులో నోటీసులు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు సంబంధించిన కేసు ఈనెల 25న సుప్రీంకోర్టులో విచారణకు రానున్నది. ఈ నెల 25వ తేదీలోగా స్పీకర్ కార్యాలయం అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన సంబంధిత నోటీసులను స్పీకర్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల తరఫు న్యాయవాదులు అందజేశారు.

బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చేవరకు పోరాటం

రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ నేతలు



రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నేతలు

పంజగుట్ట (హైదరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం బీసీలను మరోసారి మోసం చేసేందుకు చూస్తోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం రాష్ట్రాలకే ఉందని రాజ్యాంగంలోనే ఉన్నప్పటికీ ఢిల్లీకి బిల్లు పంపానంటూ బీసీలను మభ్యపెట్టేందుకు చూస్తోందని విమర్శించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ బిల్లు స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో వెంటనే రిజర్వేషన్ల అమలు కోసం ఉద్యమ కార్యాచరణ అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. బీసీ జనసభ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ కులగణన ఆధారంగా రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం ఉన్నప్పటికీ రేవంత్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద పోరాటం చేసి ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. రచయిత జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ ప్రస్తుతం రాజకీయాలు మొత్తం బీసీల మీదనే తిరుగుతున్నాయని, బీసీలను తమవైపు తిప్పుకునేందుకు అన్ని పార్టీలు కృషి చేస్తున్నాయన్నారు. రాజారామ్ యాదవ్ మాట్లాడుతూ రిజర్వేషన్లు అమలు చేసే బాధ్యత నుంచి తప్పించుకునేందుకే సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పాట పాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు.



ఆయన లోకములో ఉండెను, లోక మాయన మూలముగా
కలిగెను గాని లోకమాయనను తెలిసికొనలేదు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.నవమి రా.12.50 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.12.02 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ఉ.9.07 నుండి 10.44 వరకు, **దుర్ముహూర్తం:** ప.4.31 నుండి 5.18 వరకు, **అమృత ఘడియలు:** రా.7.01 నుండి 8.40 వరకు.

సూర్యోదయం : 6.06
సూర్యాస్తమయం : 6.07
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

అమిత్ షా (హోం మినిస్టర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

"నన్ను దీవించండి మోదీజీ" అన్నాను తలను కాస్త వంచి, చేతులు జోడించి.

మోదీజీ నన్ను వెంటనే దీవించలేదు.

"ముఖంలో ఏమిటా అలసట, నుదుటిపై ఏమిటా చెమట?" అని అడిగారు!

"బస్తర్ నుంచి వస్తున్నాను మోదీజీ. నన్ను దీవించండి" అన్నాను.

"తొందరేమొచ్చింది అమిత్ జీ? చేతులు, ముఖం కడుక్కుని, బట్టలు మార్చుకున్నాకే రావలసింది కదా" అన్నారు.


ఇంకా వగరుస్తూనే ఉన్నాన్నేను.

"ఈసారి 30 మోదీజీ. జనవరిలో 48, ఫిబ్రవరిలో 40. మొత్తం కలిపి ఈ 80 రోజుల్లో 120. బస్తర్ నుంచి ఇంటికి వెళ్లకుండా నేరుగా మీ దగ్గరకే వచ్చేశాను. నన్ను దీవించండి మోదీజీ" అన్నాను.

మోదీజీ నన్ను దీవించలేదు!

"30+48+40 = 118 కదా అమిత్ జీ. 120 ఏమిటి? రౌండ్ ఫిగర్ కోసం రెండు కలిపారా?" అన్నారు.

"లేదు మోదీజీ. రౌండ్ ఫిగర్ కోసం కలపలేదు. ఏమంత పెద్ద ఫిగర్ కాదు కదా అని కలపలేదు. 30కి 48కి మధ్యలోనో, 48కి 40కి మధ్యలోనో ఆ 2 ఎక్కడో ఉండి ఉంటుంది. చూసి చెబుతాను" అన్నాను.



"చూసి చెప్పటం కాదు అమిత్ జీ. చూశాకే చెప్పాలి. లేకుంటే 'గ్రోక్'కి, మనకు తేడా ఉండదు. గ్రోక్ బుర్ర పెట్టి చెప్పదు. బుర్రలో పెట్టిన దాన్ని బట్టి చెబుతుంది" అన్నారు మోదీజీ.

ఆయన 'గ్రోక్'ని అంటున్నారా, నన్ను అంటున్నారా అర్థం కాలేదు. బహుశా ఇద్దర్నీ కలిపి కావచ్చు.

"నిజమే మోదీజీ. గ్రోక్ బుర్ర పెట్టి చెప్పదు. బుర్రలో ఏది పెడితే అది చెబుతుంది" అన్నాను.

అందుకు ఆయనేమీ సంతోషించలేదు.

"బుర్రలో ఏం పెట్టారన్నది కాదు అమిత్‌జీ. బుర్రలో ఎవరు పెట్టారన్నది పాయింట్" అన్నారు.

ఆయన ఆవేదనలో అర్థం ఉంది. మోదీజీ గురించి గ్రోక్ ఒక్క మంచి విషయం కూడా చెప్పటం లేదు. ఆయన్ని మతవాది అంటోంది. ఆయనవన్నీ మత వ్యూహాలు అంటోంది.

"గ్రోక్‌లో ఒకటి గమనించారా అమిత్‌జీ?" అని అడిగారు మోదీజీ.

"గమనించాను మోదీజీ! మీ గురించి ఏం చెబితే విమ్మల్ని ద్వేషించేవారు సంతోష పడతారో అది మాత్రమే చెప్పి గ్రోక్ వారిని సంతోష పెడుతోంది. అలాగే, మీ గురించి ఏం అడిగితే తమను సంతోషపెట్టే సమాధానాలను గ్రోక్ చెబుతుందో ఆ ప్రశ్నల్నే గ్రోక్‌ను వాళ్లు అడుగుతున్నారు" అన్నాను.

"మీరు కొట్టి చూశారా గ్రోక్‌లో నా గురించి?" అని హఠాత్తుగా అడిగారు మోదీజీ.

"చూశాను మోదీజీ. మీ గురించి గొప్పగా చెప్పింది. 'స్ట్రాంగ్ లీడర్‌షిప్, విజన్ ఫర్ డెవలప్‌మెంట్, కమిట్‌మెంట్ టు నేషనలిజం' అని చాలా చాలా చెప్పింది" అన్నాను.

"అదేలా అమిత్ జీ? గ్రోక్‌కి ఇచ్చిన ఫీడ్ ఒకటే అయినప్పుడు వాళ్లకు ఒకలా, మీకు మరొకలా గ్రోక్ నా గురించి చెప్పటం ఏమిటి?" అని అడిగారు మోదీజీ.

"నమ్మించటం కోసం ఫీడ్‌లో రెండూ ఉంచుతారు మోదీజీ. 'గ్రోక్' ఎలాన్ మస్క్‌ది కదా! అయినా సరే, అమెరికాలో అత్యంత దుష్టుడైన మానవుడు ఎవరో గ్రోక్‌ని అడిగి చూడండి. ఎలాన్ మస్క్ అని చెబుతుంది. అదెలా ఉంటుందంటే... బస్తర్‌లో రెండో వైపు కూడా ఒకటో రెండో ఉంటాయి కదా, అలాగ" అన్నాను.

బస్తర్ అనగానే మోదీజీ మళ్లీ మూడ్ ఆఫ్‌లోకి వెళ్లిపోయారు. "బుర్రల్ని పాడుచేసేవారు బస్తర్ లోపల మాత్రమే ఉంటారని నేను అనుకోను అమిత్ భాయ్" అన్నారు.

ఎంతో లోన్లీగా ఫీల్ అయితే తప్ప మోదీజీ అలా నన్ను అమిత్ 'భాయ్' అనరు.

"చేస్తాను మోదీజీ, అదంతా సెట్ చేస్తాను. నన్ను దీవించండి" అన్నాను తలను కాస్త వంచి, చేతులు జోడిస్తూ.

రంగంలోకి అంగడి చదువు!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



పేదరికం కారణంగా కొంతమంది ఏపీ విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయలేకపోయారన్న వార్తలు వస్తున్నాయి. మన పాలక వ్యవస్థ సిగ్గుతో తలదించుకోవలసిన పరిణామం ఇది. ఉన్న ఊళ్లో ఉపాధి లేక పొట్టకూటికోసం వెనుకబడిన ప్రాంతాల ప్రజలు వలసబాట పడుతున్నారు. చదువుకుంటున్న వారి పిల్లలు కూడా గత్యంతరం లేక తల్లిదండ్రులను అనుసరించవలసి వస్తున్నది. వారిలో పదో తరగతి చదివిన పిల్లలు కూడా ఉన్నారు. వలస కారణంగా వారు కీలకమైన పదో క్లాసు పరీక్షలకు దూరమయ్యారు. వారి భవిష్యత్తు గురించి వ్యవస్థ పట్టించుకోనట్టయితే డ్రాపవుట్లుగా మిగిలే అవకాశం ఉన్నది. వారి భావి జీవితం వలసకూలి టైటిల్‌తో ముడిపడే ప్రమాదం ఉన్నది.

''ఒక్క మలినాశ్రు బిందువొరిగినంత వరకు... ఈ సిగ్గులేని ముఖాన్ని చూపించలేను'' అంటాడు కవి బాలగంగాధర తిలక్. నిజంగా ప్రజల ఆలనాపాలనా చూడవలసిన ఏపీ సర్కార్‌కు మాత్రం అటువంటి సెంటిమెంట్లేవీ లేవు. ఇప్పుడు ఒక్క కన్నీటి బొట్టు రాలడం కాదు. మూర్తీభవించిన కన్నీరు దారిపొడుగునా ప్రవహిస్తున్నది. ''జగన్ సర్కార్ అమలు చేసిన 'అమ్మ ఒడి' పథకాన్ని కొనసాగించి ఉన్నట్లయితే మా పిల్లలు తప్పకుండా పదో తరగతి పరీక్ష రాసేవారు''ని పిల్లల తల్లిదండ్రులు చెబుతున్నారు. నాణ్యమైన సార్వత్రిక విద్యను అమలు చేయడం కోసం జగన్ మోహన్ రెడ్డి ఎంతగా మేధామథనం జరిపి పథకాన్ని రూపొందించి ఉంటారో ఈ విషాద పరిణామాన్ని చూస్తే అర్థమవుతున్నది.

మన దేశంలో విద్యాహక్కు చట్టం అమలులో ఉన్నది. అటువంటి చట్టాన్ని అమలు చేయాలని భారత రాజ్యాంగం కూడా ఆదేశించింది. దురదృష్టవశాత్తు ఇది మొక్కుబడి తతంగంగా మారిందన్న సంగతి అందరికీ తెలిసిందే. బడికి వచ్చే పిల్లలకు అరకొర చదువు చెప్పడం ప్రభుత్వ స్కూళ్ల కర్తవ్యంగా మారిపోయింది. ఉద్దేశపూర్వకంగా తలెత్తిన ఈ ధోరణి ఫలితంగా తామరతంపరగా ప్రైవేట్ విద్యాసంస్థలు పట్టుకొచ్చాయి. స్తోమత ఉన్నవాళ్లంతా ప్రైవేట్ స్కూళ్లలో మెరుగైన విద్యను కొనుగోలు చేయడం, పేద పిల్లలు సర్కారు బడి చదువులతో పోటీలో నిలవలేకపోవడం... గత మూడు దశాబ్దాలుగా బాగా ఎక్కువైంది. ఈ ధోరణి పట్ల పలువురు ప్రగతిశీల సామాజిక వేత్తలు, మేధావులు అసహనాన్నీ, ఆందోళననూ వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

ఐక్యరాజ్య సమితి సైతం తన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో (ఎస్‌డీజీలు) పిల్లలందరికీ నాణ్యమైన విద్య ఉచితంగా సమానంగా అందుబాటులో ఉండాలని నాలుగో లక్ష్యంగా నిర్దేశించింది. మన్నికైన జీవన ప్రమాణాలతో మానవజాతి దీర్ఘకాలం పాటు ఈ భూగోళంపై మనుగడ సాగించాలంటే ఈ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడం అవసరమేనని మేధాప్రపంచం అభిప్రాయపడుతున్న సంగతి తెలిసిందే. కానీ పాలకుల్లో చిత్తశుద్ధి లేకపోవడం ఈ లక్ష్యాలకు ఆటంకంగా మారింది. ఉదార ప్రజాస్వామిక వ్యవస్థలు క్రమంగా 'ప్లుటానమీ' (సంపన్నులు శాసించే వ్యవస్థలు)లుగా పరివర్తనం చెందుతున్నాయని పలువురు పొలిటికల్ ఎకనామిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన దశాబ్ది కాలానికి ఈ పదప్రయోగం వ్యాప్తిలోకి వచ్చింది.

సంస్కరణలు ప్రారంభమైన తొలి దశాబ్దిలో క్రియాశీలకంగా ఉన్న రాజకీయ నాయకుల్లో చంద్రబాబు కూడా ఒకరు. ప్రజలకు ఏదీ ఉచితంగా ఇవ్వరాదనే వాదాన్ని ఆయన బలంగా వినిపించేవారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ డిమాండ్‌ను ఆయన ఎంత తీవ్రంగా వ్యతిరేకించేవారో చాలామందికి గుర్తుండే ఉంటుంది. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో అమలుచేసిన తర్వాత ఈ అంశానికి సర్వత్రా ఆమోదం లభించింది. అలాగే ప్రభుత్వ సేవలన్నింటికీ ప్రజలు యూజర్ ఛార్జీలు చెల్లించాలనే నియమం పెట్టింది కూడా చంద్రబాబే! మితిమీరిన ప్రైవేటీకరణ సూపర్ రిచ్ వర్గాన్ని సృష్టించడం, తిరిగి ఆ వర్గం మొత్తం ఆర్థిక – రాజకీయ వ్యవస్థలను ప్రభావితం చేయడం ప్లుటానమీకి దారి తీస్తున్నది.

ఇటువంటి వ్యవస్థల్లో సహజ వనరుల దగ్గర్నుంచి సర్వే సర్వత్రా ప్రైవేటీకరణే తారకమంత్రంగా పనిచేస్తుంది. విద్యారంగం ఇందుకు మినహాయింపేమీ కాదు. విభజిత రాష్ట్రానికి మొదటిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా 'విద్య ప్రభుత్వ బాధ్యత కాద'ని చంద్రబాబు వ్యాఖ్యానించిన సంగతిని గుర్తు చేసుకోవడం అవసరం. ఈ నేపథ్యాన్ని అర్థం చేసుకుంటేనే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ రంగంలో నిర్మించిన 17 మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టాలని ఎందుకనుకుంటున్నారో అర్థమవుతుంది. అమరావతి కోసం అరవై వేల కోట్ల రూపాయల అప్పును ఆగమేఘాల మీద పుట్టించగలిగిన వ్యక్తి, తాను పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్న 'తల్లికి వందనం' ఎందుకు అమలుచేయలేకపోయాడో అర్థమవుతుంది. ఈ పూర్వరంగం అర్థం కానట్లయితే ఆర్థిక వెసులుబాటు లేకనే అమలు చేయలేకపోయారనే మోసపు ప్రచారానికి తలూపవలసి వస్తుంది.

విద్యారంగంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. పూర్తి ప్రజాస్వామికీకరణ చర్యలను చేపట్టింది. ప్రజల ఆకాంక్షల మేరకు ఇంగ్లిష్ మీడియం బోధనను ప్రారంభించింది. భాషా – సంస్కృతుల ముసుగులో పెత్తందారులు ఎన్ని ఒత్తిళ్లు తెచ్చినా చలించలేదు. సీబీఎస్‌ఈ సిలబస్‌ను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చింది. నగరాల్లో సూపర్ రిచ్ పిల్లలకు మాత్రమే పరిమితమైన అంతర్జాతీయ స్థాయి ఐబీ సిలబస్‌ను పిల్లలందరికీ ఉచితంగా ఈ సంవత్సరం నుంచి అమలుచేయడానికి అన్ని ఏర్పాట్లూ చేసింది. అంతర్జాతీయ స్థాయిలో మన పిల్లలు పోటీపడాలన్న తపనతో చేపట్టిన కార్యక్రమాలివి. డిజిటల్ యుగంలో తన రాష్ట్ర విద్యార్థులు ప్రపంచ స్థాయిలో వెలుగొందాలని పాఠశాలల్లో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేయించారు. ఎనిమిదో క్లాసు నుంచి విద్యార్థుల చేతికి ట్యాబ్‌లను ఉచితంగా అందజేశారు.

పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని ముఖ్యమంత్రి స్వయంగా పూనుకొని తయారు చేయించిన మెనూతో మధ్యాహ్న భోజన పథకాన్ని విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులపై పైసా భారం పడకుండా పుస్తకాలు, బ్యాగ్, బెల్ట్, యూనిఫామ్‌లను పాఠశాలల ప్రారంభానికి ముందే సిద్ధం చేసి ఉంచేవారు. మూడు నుంచి ఐదో తరగతి వరకు చదివే విద్యార్థులకు అన్ని సబ్జెక్టులూ ఏకోపాధ్యాయుడే బోధించే పద్ధతికి స్వస్తిచెప్పి వారికి సబ్జెక్టు వారీగా బోధించే టీచర్లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఆ మూడు తరగతులను కిలోమీటర్ పరిధి లోపల ఉండే అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్లలో విలీనం చేశారు. ఫలితంగా ఆ విద్యార్థులకు సబ్జెక్టు టీచర్ల సదుపాయం ఏర్పడింది. ఆ వయసు పిల్లల్లో గ్రాహ్యశక్తి బలంగా ఉంటుందన్న అధ్యయనాలను అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఐదేళ్ల తన పదవీ కాలంలో రెండేళ్లు కోవిడ్ కోతకు గురైనప్పటికీ పాఠశాల విద్యారంగంలో పెను మార్పులకు జగన్ తెరతీశారు.

పేద – ధనిక తేడాల్లేని, లింగవివక్ష అసలే లేని ఒక నవయుగ విద్యాసౌధ నిర్మాణం కోసం ఇన్ని ఇటుకల్ని పేర్చిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి తప్ప ఈ దేశంలో మరొకరు లేరు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా విద్యావ్యవస్థ పునర్నిర్మాణానికి ఇంత వేగంగా అడుగులు వేసిన వ్యక్తి కూడా మరొకరు కానరారు. కేరళ రాష్ట్ర విద్యారంగం మొదటి నుంచీ కూడా మిగతా దేశంతో పోల్చితే ఆరోగ్యంగానే ఉన్నది. ఆర్థిక సంస్కరణల తర్వాత కూడా అది తన ప్రతిష్ఠను కాపాడుకోగలిగింది.

చదువుల తల్లి సరస్వతిని అమ్ముకోవడం తరతరాలుగా మన సంస్కృతిలో తప్పుగానే భావిస్తున్నారు. ఇందుకు ఆంధ్ర మహాభారత కర్త బమ్మెర పోతనామాత్యులే ఉదాహరణ. ''బాల రసాలసాల నవపల్లవ కోమల కావ్యకన్యకన్ / కూళలకిచ్చి యప్పడుపు కూడు భుజించుట కంటె సత్కవుల్ / హాలికులైననేమి? గహనాంతర సీమల కందమూల / కౌద్దాలికులైననేమి నిజ దార సుతోదర పోషణార్థమై'' అన్నారు. తాను రాసిన కావ్యాన్ని సరస్వతిగా భావించి, దాన్ని రాజులకు అంకితమివ్వడానికి ఆయన నిరాకరించారు. అలా వచ్చిన సొమ్ము పడుపువృత్తితో వచ్చిన సొమ్ముగా ఆయన అసహ్యించుకున్నారు. ఆ సంప్రదాయానికి విరుద్ధంగా ఇప్పుడు చదువుల తల్లిని అంగట్లో నిలబెట్టి అమ్ముకుంటున్నారు. దానికి మనం ఎన్నుకున్న ఏలికలు వత్తాసుగా నిలబడుతున్నారు.


> సంస్కరణలు ప్రారంభమైన తొలి దశాబ్దిలో క్రియాశీలకంగా ఉన్న రాజకీయ నాయకుల్లో చంద్రబాబు కూడా ఒకరు. ప్రజలకు ఏదీ ఉచితంగా ఇవ్వరాదనే వాదాన్ని ఆయన బలంగా వినిపించేవారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ డిమాండ్‌ను ఆయన ఎంత తీవ్రంగా వ్యతిరేకించేవారో చాలామందికి గుర్తుండే ఉంటుంది. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో అమలుచేసిన తర్వాత ఈ అంశానికి సర్వత్రా ఆమోదం లభించింది. అలాగే ప్రభుత్వ సేవలన్నింటికీ ప్రజలు యూజర్ ఛార్జీలు చెల్లించాలనే నియమం పెట్టింది కూడా చంద్రబాబే! మితిమీరిన ప్రైవేటీకరణ సూపర్ రిచ్ వర్గాన్ని సృష్టించడం, తిరిగి ఆ వర్గం మొత్తం ఆర్థిక – రాజకీయ వ్యవస్థలను ప్రభావితం చేయడం ప్లుటానమీకి దారి తీస్తున్నది.
>
> ఇటువంటి వ్యవస్థల్లో సహజ వనరుల దగ్గర్నుంచి సర్వే సర్వత్రా ప్రైవేటీకరణే తారకమంత్రంగా పనిచేస్తుంది. విద్యారంగం ఇందుకు మినహాయింపేమీ కాదు. విభజిత రాష్ట్రానికి మొదటిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా 'విద్య ప్రభుత్వ బాధ్యత కాద'ని చంద్రబాబు వ్యాఖ్యానించిన సంగతిని గుర్తు చేసుకోవడం అవసరం. ఈ నేపథ్యాన్ని అర్థం చేసుకుంటేనే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ రంగంలో నిర్మించిన 17 మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టాలని ఎందుకనుకుంటున్నారో అర్థమవుతుంది.

చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరమే ఆరు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లను విడిచిపెట్టి ప్రైవేట్ స్కూళ్లలో చేరారు. ఆయన అధికారంలోకి వస్తే ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లీషు మీడియం రద్దవుతుందన్న భయం ఒక కారణం. ఎంతమంది పిల్లలున్నా అందరికీ 'తల్లికి వందనం' కింద డబ్బులొస్తాయనే నమ్మకం కూడా ఇంకో కారణం కావచ్చు. అట్లా మారిన విద్యార్థులు ఇప్పుడు ఫీజులు కట్టలేక అల్లాడుతున్నారు. ఇంగ్లీషు మీడియాన్ని రద్దు చేస్తారనే ప్రచారం, సీబీఎస్‌ఈ సిలబస్‌ను ఎత్తేయడం దేన్ని సూచిస్తున్నాయి? ఎనిమిదో తరగతి నుంచి విద్యార్థులకు ఇచ్చే ట్యాబ్‌లను నిలిపివేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లలో కొత్త కంటెంట్ లోడ్ చేయలేదు. 'నాడు–నేడు' కార్యక్రమం కింద దాదాపు ఇరవై వేల స్కూళ్లలో సౌకర్యాలను ప్రైవేట్ స్కూళ్ల కంటే మిన్నగా జగన్ ప్రభుత్వం మెరుగుపరిచింది. మిగిలిన స్కూళ్లలో ఆ కార్యక్రమాన్ని నిలిపివేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యత చాలాచోట్ల నాసిరకంగా మారింది. మూడు నుంచి ఐదో తరగతి చదివే విద్యార్థులకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్‌ను ఎత్తేస్తారట! ఇవన్నీ చూస్తుంటే ప్రభుత్వ స్కూళ్లపై ప్రజలకు ఏర్పడ్డ నమ్మకాన్ని చంపేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు కనిపిస్తున్నది. మరోపక్క పెద్ద ఎత్తున ప్రైవేట్ స్కూళ్లకు, జూనియర్ కాలేజీలకు అనుమతులిస్తున్నారన్న ప్రచారం సాగుతున్నది. ప్రభుత్వ స్కూళ్ల సంఖ్యను పెద్ద ఎత్తున తగ్గించబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతున్నది. మెడికల్ కాలేజీల సంగతి తెలిసిందే! మరోసారి ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో ప్రైవేట్ జేగంట మోగుతున్నది. అంగడి చదువులు మళ్లీ రంగప్రవేశం చేస్తున్నాయి. విద్యా విప్లవానికి గ్రహణం పట్టింది. ఈ ప్రభుత్వం మారితేనే గ్రహణం విడిచేది!

vardhelli1959@gmail.com

న్యాయవ్యవస్థలో అవినీతికి అడ్డుకట్ట ఎలా?

అభిప్రాయం



డా॥ మంగారి రాజేందర్

హోళీ ముందురోజు హోళీ కా దహన్ ఉంటుంది. హోళికా అన్న రాక్షసిని చంపడాన్ని భారత ప్రజలు పండుగగా జరుపుకొంటారు. విష్ణు భక్తుడైన ప్రహ్లాదుని చంపే ప్రయత్నం చేసిన రాక్షసి హోళికా. చెడు మీద మంచి గెలుపునకు ప్రతీకాత్మకంగా హోళీ దహనాన్ని చూస్తారు.

చెడు పెరిగి పోతున్నప్పుడు ప్రకృతి తన చర్యలని చేపడుతుందని అంటూ ఉంటారు. కొన్నిసార్లు ఇది నిజమేనని అనిపిస్తుంది. నిప్పు కూడా ప్రకృతిలో భాగమే. అది ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి మీద తన ప్రతాపాన్ని ఈ నెల 14వ తేదీన చూపించింది. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటిలో చెలరేగిన మంటల వల్ల ఆయన ఇంట్లో భారీ నగదు ఉన్నట్టుగా పోలీసు, అగ్నిమాపక అధికారులు కనుగొన్నారు. ఆ మంటలు దేశంలోని న్యాయ వ్యవస్థని మండించాయి.

మంటలు చెలరేగినప్పుడు జస్టిస్ వర్మ ఇంట్లో లేరు. ఆయన కుటుంబ సభ్యులు అగ్నిమాపక దళానికి సమాచారం అందించారు. మంటలు ఆర్పుతున్నప్పుడు ఒక గదిలో లెక్కల్లో చూపని భారీ మొత్తంలో నగదుని అధికారులు కనుగొన్నారు. స్థానిక పోలీసులు ఈ విషయాన్ని సీనియర్ అధికారులకి తెలియజేశారు. ఫలితంగా విషయం సుప్రీంకోర్టు దాకా చేరింది. ఈ అంశాన్ని చర్చించడానికి భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా అత్యవసరంగా కొలీజియం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జస్టిస్ వర్మను తిరిగి అలహాబాద్‌కు బదిలీ చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఐదుగురు న్యాయమూర్తుల కొలీజియంలోని సభ్యులు ఈ నేరానికి అంతర్గత విచారణ అవసరమని అభిప్రాయపడినారని వార్తలు. కేవలం బదిలీతో ఆయనను వదిలేస్తే న్యాయ వ్యవస్థపై ఉన్న నమ్మకం పూర్తిగా పోతుందని కొంతమంది న్యాయమూర్తులు భావించినారు.


న్యాయమూర్తి యశ్వంత్ వర్మ నివాసం నుంచి భారీగా నగదు స్వాధీనం చేసుకున్న తరువాత సుప్రీంకోర్టు శుక్రవారం అంతర్గత విచారణను ప్రారంభించింది. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ నుంచి కూడా సుప్రీంకోర్టు నివేదికను కోరింది. శుక్రవారం ఉదయం జరిగిన న్యాయమూర్తుల ఫుల్ కోర్టు సమావేశంలో శిక్షాత్మక బదిలీ సరిపోదని, న్యాయమూర్తిపై కొంత నిర్దిష్ట చర్య తీసుకోవాలని అభిప్రాయపడినట్టుగా చెబుతున్నారు. అంతర్గత విచారణకి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అంగీకరిస్తూ బదిలీని మొదటి అడుగుగా భావించినారు. బదిలీ ప్రక్రియ తక్షణమే అమల్లోకి రాదు. దీనికి ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంటుంది.

జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలపై విచారణ కోసం తాజాగా ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన త్రిసభ్య కమిటీని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఏర్పాటు చేశారు.

జస్టిస్ వర్మ 1969 జనవరి 6న అలహాబాద్‌లో జన్మించినారు. 2014 అక్టోబర్ 13న అలహాబాద్ హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులైనారు. 2016 ఫిబ్రవరి 1న శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆ తరువాత 2021 అక్టోబర్ 11న ఢిల్లీ హైకోర్టుకి బదిలీ అయ్యారు. న్యాయవాద వృత్తిలో ఉన్నప్పుడు జస్టిస్ వర్మ రాజ్యాంగ, కార్మిక పారిశ్రామిక చట్టాలలో ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేశారు. అలహాబాద్ హైకోర్టుకి న్యాయవాదిగా 2006 నుంచి న్యాయమూర్తి అయ్యే వరకు పని చేశారు.

హైకోర్టు న్యాయమూర్తిని ఎలా తొలగిస్తారు?

న్యాయమూర్తులపై అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలను పరిష్కరించడానికి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను నిర్దేశించింది. ఈ మార్గదర్శకాల ప్రకారం, న్యాయమూర్తులపై ఫిర్యాదు అందిన తరువాత ప్రధాన న్యాయమూర్తి ఆ సంబంధిత న్యాయమూర్తి నుంచి వివరణ అడుగుతారు. ఆ వివరణకు ప్రధాన న్యాయమూర్తి సంతృప్తి చెందనప్పుడు, లేదా ఆ విషయంపట్ల మరింత దర్యాప్తు అవసరమని భావించినప్పుడు అంతర్గత కమిటీని ఏర్పాటు చేస్తారు.



ఆ కమిటీ తన నివేదికను సమర్పించిన తరువాత సంబంధిత న్యాయమూర్తి చేసిన దుష్ప్రవర్తన తీవ్రమైనదని, అతన్ని తొలగించాల్సిన అవసరం ఉందని ప్రధాన న్యాయమూర్తి భావిస్తే రాజీనామా చేయమని ఆ న్యాయమూర్తిని అడుగుతారు. ఆ న్యాయమూర్తి అందుకు నిరాకరిస్తే రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(4) ప్రకారం పార్లమెంట్ ద్వారా ఆయన తొలగింపునకు చర్యలు ప్రారంభించాలని ప్రధాన న్యాయమూర్తి ప్రభుత్వానికి లేఖ రాస్తారు.

జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసం నుండి లెక్కల్లో చూపని నగదును స్వాధీనం చేసుకున్న తరువాత సుప్రీంకోర్టు కొలీజియమ్ ఆయన్ని అలహాబాద్‌కి బదిలీ చేయాలని సిఫారస్ చేయాలని వార్తలు వచ్చాయి. ఈ సిఫారస్‌పై అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'అలహాబాద్ హైకోర్టు చెత్తబుట్ట కాదు. అతణ్ణి ఇక్కడికి పంపించడానికి వీల్లేదు. అవినీతిపరులను మేం అంగీకరించం. అవసరమైతే కోర్టు పనిని మానివేస్తాం' అని అలహాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ అన్నారు. జస్టిస్ వర్మ ఇంటి నుండి 15 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు బార్ అసోసియేషన్ తన ప్రెస్ నోట్‌లో పేర్కొంది.

కర్ణాటక కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేష్ శుక్రవారం ఉదయం రాజ్యసభలో జస్టిస్ వర్మ అంశాన్ని లేవనెత్తారు. ఈ షాకింగ్ కేసుతో దేశం మేల్కొందని ఆయన అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జైరాం రమేష్... ప్రయాగరాజ్‌లో విశ్వహిందూ పరిషత్ కార్యక్రమంలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి శేఖర్ యాదవ్ చేసిన వ్యాఖ్యలకి వ్యతిరేకంగా గత డిసెంబర్‌లో 50 మంది పార్లమెంట్ సభ్యులు ఛైర్మన్‌కి పంపిన అభిశంసన నోటీసుని గుర్తు చేశారు. న్యాయమూర్తుల నియామకంలో న్యాయపరమైన జవాబుదారీతనం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వంతో చర్చించాలని ఛైర్మన్‌ని కోరారు.

సుప్రీంకోర్టు ఏం చేయాలి?

సుప్రీంకోర్టు కోరిన తరువాత కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్న న్యాయమూర్తి రాజీనామా చేయనపుడు, ఇతర హైకోర్టులు బార్ అసోసియేషన్లు అతని బదిలీని అంగీకరించనప్పుడు సుప్రీంకోర్టు ఏం చేయాలి? ఇదీ ప్రశ్న.



జస్టిస్ యశ్వంత్ వర్మ

అభిశంసన అనేది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతుంది. అందుకని ఆ న్యాయమూర్తికి ఎలాంటి పని అప్పగించకుండా చర్యలు తీసుకోవాలి. ఆ అవమాన భారంతో ఆ న్యాయమూర్తి రాజీనామా చేసే అవకాశం ఉంది.

ఇది ఇలా ఉంటే సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తులపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించే అధికారం తమకు ఉందని లోక్‌పాల్ అభిప్రాయపడింది. ఇది చాలా కలవరపెట్టే విషయమని సుప్రీంకోర్టు అభిప్రాయపడి ఆ ఉత్తర్వులని స్టే చేసింది. అది సుప్రీంకోర్టు ముందుకు త్వరలో రానున్నది. సుప్రీంకోర్టు ఏం చేస్తుందో చూడాలి.

న్యాయ వ్యవస్థలో అవినీతిని ఎవరూ సహించరు. ఇది చాలా తీవ్రమైన విషయం. న్యాయ వ్యవస్థలోనే కాకుండా సమాజంలో అవినీతి అనేది ఒక పెద్ద సమస్యగా మిగిలిపోయింది. ఈ విషయంపై సుప్రీంకోర్టు తన దృష్టిని సారించాల్సిన సమయం ఆసన్నమైంది.

వ్యాసకర్త తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ మాజీ డైరెక్టర్, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు

ఉరికొయ్యను ముద్దాడిన ఉత్తేజం



భగత్‌సింగ్

''ఇంక్విలాబ్ జిందాబాద్' అని నినదిస్తూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చేసిన తిరుగుబాటు ఆనాడు యావద్దేశాన్ని వారి వైపు తలతిప్పి చూసేలా చేసింది. భారతమాత విముక్తి కోసం ఆ యువకులు ముగ్గురూ ఉరికొయ్యల్ని ముద్దాడారు. జలియన్ వాలాబాగ్ ఉదంతం జరిగినప్పుడు భగత్‌సింగ్ వయస్సు సరిగ్గా పన్నెండేళ్లు. భారతీయుల నెత్తురుతో తడిసిన ఆ నేలను చూసి చలించిపోయాడు. చిన్న వయసులోనే దేశం పట్ల, ప్రజల పట్ల మక్కువ పెంచుకున్నాడు. గాంధీ ఇచ్చిన సహాయ నిరాకరణ పిలుపును అందుకుని ప్రత్యక్ష పోరాటంలో పాల్గొన్నాడు. ఒక బ్రిటిష్ పోలీస్ అధికారిని కాల్చి చంపిన కేసులో భగత్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు ఉరి శిక్ష పడింది.

విశ్వమానవ సౌభ్రాతృత్వం కోసం, మనుషులంతా ఒక్కటే అనే భావన కోసం నిలబడినవాడు భగత్‌సింగ్. వాస్తవానికి భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరి తీయాల్సింది మార్చి 24న (1931). కానీ ఒక రోజు ముందే, అది కూడా సంప్రదాయానికి భిన్నంగా సూర్యాస్తమయం తర్వాత లాహోర్ సెంట్రల్ జైలులో ఉరి తీశారు. వారి మృతదేహాలు ప్రజల కంటపడకుండా బ్రిటిష్ ప్రభుత్వం జాగ్రత్త పడింది. బతికున్న భగత్‌సింగ్ కంటే చనిపోయిన భగత్‌సింగ్ మరింత ప్రమాదకారి అని వారు భావించటమే అందుకు కారణం. ''నా విప్లవ భావాలు ఈ సుందరమైన మాతృభూమి అంతటా వ్యాపించి యువతకు మత్తెక్కిచ్చి స్వాతంత్ర్యం కోసం, సమానత్వం కోసం, స్వేచ్ఛ కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదులను తరిమి కొడతాయి'' అంటూ బ్రిటిష్ పాలకులను హెచ్చరించినవాడు భగత్‌సింగ్.

అంతరాలు లేని సమాజం సోషలిజమే అని నమ్మి, దాని ఆచరణకు శ్రీకారం చుట్టిన మేధావి, మొదటితరం మార్క్సిస్టు భగత్ సింగ్. తండ్రి కిషన్ సింగ్ తనను ఉరిశిక్ష నుంచి తప్పించటం కోసం స్పెషల్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ పెట్టుకున్నట్లు తెలుసుకున్న భగత్ సింగ్ తన తండ్రికి లేఖ రాస్తూ... ''నా జీవితం కన్నా దేశమే గొప్పది. ప్రతి యువకుడూ తన జన్మభూమి రుణం తీర్చుకోవటానికి... అవసరమైతే తన ప్రాణాలను సైతం అర్పించుకోవాలని నేను నమ్ముతాను'' అని తండ్రినే ఊరడించాడు. ''విప్లవ పోరాటంతో కూడిన ఈ కొద్దిపాటి జీవితం ఒక్కటే నాకు గొప్ప బహుమానం'' అని చాటిన భగత్ సింగ్‌ను ఈ తరం స్ఫూర్తిగా తీసుకోవాలి.

– జి. రామన్న, డీవైఎఫ్ఐ ఏపీ కార్యదర్శి
(నేడు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి)

పుట్టెడు దుఃఖంలో పరీక్ష రాసి..


రోదిస్తున్న పౌర్ణమి

శంకరపట్నం: తల్లి మరణించిన విషయాన్ని దిగమింగుకుని పదో తరగతి పరీక్ష రాసిందో విద్యార్థిని. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన చీర్లంచ శ్రీధర్–ప్రియాంక దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు పౌర్ణమి రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని మహాత్మా జ్యోతిరావుఫూలే హాస్టల్‌లో ఉంటూ.. ప్రస్తుతం టెన్త్ పరీక్షలు రాస్తోంది. పౌర్ణమి తల్లి ప్రియాంక అనారోగ్య సమస్యల కారణంగా కొన్ని నెలలుగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో శనివారం వేకువజామున మృతి చెందింది. తల్లి మరణం విషయం తెలిసిన పౌర్ణమి పుట్టెడు దుఃఖంలోనే హిందీ పరీక్షను రాసి, మధ్యాహ్నం కొత్తగట్టులోని ఇంటికి చేరుకుంది. తల్లి మృతదేహంపై పడి రోదించింది.

ఏపూరులో బర్డ్‌ఫ్లూ కలకలం

చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూరు గ్రామపంచాయతీ పరిధిలోని రెండు లక్షలకు పైగా ఉండే ఓ కోళ్ల ఫారంలోని గుడ్లు ఉత్పత్తి చేసే కొన్ని కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకిన విషయం శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఇక్కడ నాలుగు రోజుల నుంచి కోళ్లు మృతి చెందుతుండగా పశువైద్యశాఖ అధికారులు వైద్య పరీక్షలు చేశారు. మృతి చెందిన కోళ్ల శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించి పరీక్షించటంతో బర్డ్‌ఫ్లూ వ్యాధితోనే మృతి చెందినట్లు నిర్ధారణైంది. మిగిలిన కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకక ముందే భూమిలో సున్నం వేసి పూడ్చి వేయాలని సూచించినా.. చేయకపోవడంతో శనివారం జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ రమేశ్ కోళ్ల ఫారాలను పరిశీలించి పూర్తిస్థాయిలో కోళ్లను పూడ్చివేయించారు. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్ల ఫారాల ప్రాంతం నుంచి చుట్టూ మూడు కిలోమీటర్ల వరకు వ్యాధి ప్రభావిత జోన్‌గా ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

ఆవు పాల ధర తగ్గింపు.. గేదె పాల ధర పెంపు!

సేకరణ ధరలు సవరించే యోచనలో విజయ డెయిరీ

- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం
- రూ.250 కోట్ల నష్టాల ఊబిలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థ
- విజయ సేకరించే పాలలో 85 శాతం ఆవు పాలే
- ప్రైవేటుకంటే లీటర్‌కు దాదాపు రూ.10 అధికంగా చెల్లిస్తున్న సంస్థ
- అధిక ధరవల్లే నష్టమంటున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ విజయ డెయిరీ రైతుల నుంచి సేకరిస్తున్న ఆవు పాల ధరను తగ్గించాలని యోచిస్తోంది. అదే సమయంలో గేదె పాల ధరను లీటర్‌కు రూ.4 వరకు పెంచడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. గేదె పాల ధరను రూ.3 వరకు పెంచుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటివరకు అమలులోకి రాలేదు.

అప్పుల భారం పైపైకి

విజయ డెయిరీ సంస్థకు దాదాపు రూ.1,000 కోట్ల టర్నోవర్ ఉన్నప్పటికీ.. ప్రస్తుతం దాదాపు రూ.250 కోట్ల నష్టాల్లో ఉంది. ప్రతినెలా రూ.13కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు నష్టాలు వస్తున్నట్లు తెలిసింది. రైతులకు నెలనెలా చెల్లించాల్సిన పాల బకాయిలు కూడా ఇవ్వలేని దుస్థితిలోకి సంస్థ వెళ్లినట్లు అధికారవర్గాల సమాచారం. ప్రస్తుతం మూడు నాలుగు బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఆవు పాల సేకరణ ధర అధికంగా ఉండడమే అందుకు కారణమని చెబుతున్నారు.

ప్రైవేటు కంటే రూ.10 అదనం

విజయ డెయిరీ ప్రతీరోజు 4.5 లక్షల లీటర్ల పాలను సేకరిస్తోంది. అందులో 85 శాతం మేరకు ఆవు పాలే ఉంటున్నాయి. ప్రైవేట్ డెయిరీ సంస్థలు ఆవు పాలు లీటర్‌కు రూ.32 నుంచి రూ.33 చెల్లించి సేకరిస్తుండగా.. విజయ డెయిరీ మాత్రం రూ.42 ఇస్తోంది. గేదె పాలు లీటర్‌కు రూ.48 చెల్లిస్తోంది. ఆవుపాల సేకరణతో సంస్థకు ఆదాయం కంటే నష్టమే ఎక్కువగా వస్తోందని ఆ సంస్థ ఉన్నతాధికారి ఒకరు వాపోయారు. మరోవైపు సంస్థలో టన్నుల కొద్దీ పాల పొడి నిల్వలు పేరుకుపోయినట్లు సమాచారం.

మార్కెటింగ్‌లో బలహీనం

రాష్ట్రంలో గేదె పాలకంటే ఆవు పాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతున్నట్లు సమాచారం. ఆవు పాలకు ప్రైవేట్ సంస్థలకంటే విజయ డెయిరీ అధిక ధర ఇస్తుండటంతో రైతులు ఆవు పాలు ఈ సంస్థకు పోస్తూ.. గేదె పాలను స్థానికంగా అధిక ధరకు అమ్ముకుంటున్నారని చెబుతున్నారు. ప్రైవేట్ డెయిరీలు డీలర్లకు లీటర్‌పై దాదాపు రూ.10 వరకు మార్జిన్ ఇస్తుండగా, విజయ డెయిరీ రూ.5–6 మాత్రమే ఇస్తోంది. దీంతో డీలర్లు ఈ సంస్థ పాలు, పాల ఉత్పత్తులు అమ్మేందుకు ముందుకు రావటంలేదని సమాచారం. తన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడంలోనూ సంస్థ విఫలమవుతోందన్న విమర్శలు కూడా ఉంది. దీంతో ప్రైవేట్ సంస్థలతో పోటీని తట్టుకోవడంలో విజయ డెయిరీ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. అంగన్‌వాడీలకు ప్రస్తుతం లక్ష లీటర్ల పాలను విక్రయిస్తున్నట్లు, అలాగే గురుకులాలకు కూడా పాలను సరఫరా చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఒక ఉన్నతాధికారి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని దేవాలయాలకు ఈ సంస్థ నెయ్యిని సరఫరా చేస్తోంది.

రోడ్డు ప్రమాదంలో అదనపు డీసీపీ మృతి

- వాకింగ్‌కు వెళ్లి రోడ్డు దాటుతుండగా ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


బాబ్జీ

హయత్‌నగర్: రోడ్డు ప్రమాదంలో ఓ అదనపు డీసీపీ మృతిచెందారు. శనివారం హయత్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ దుర్ఘటన జరిగింది. సీఐ నాగరాజుగౌడ్ కథనం ప్రకారం.. అదనపు డీసీపీ టి.ఎం.నందీశ్వర బాబ్జీ (56)పెద్దఅంబర్‌పేట్ పరిధిలోని మైత్రీ కుటీర్‌లో నివసిస్తున్నారు. శనివారం తెల్లవారు జామున 4:30 గంటల సమయంలో వాకింగ్ చేసేందుకు బయటికి వచ్చిన బాబ్జీ, జాతీయ రహదారి అవతలి వైపునకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా తొలుత ఓ బస్సు ఆయనను ఢీకొట్టింది. దీంతో ఆయన రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వస్తున్న నూజివీడు డిపోకు చెందిన ఏపీ ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఆయనపైనుంచి వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమోషన్ వచ్చిన మూడు రోజులకే..

డీఎస్పీగా పని చేస్తున్న బాబ్జీకి మూడు రోజుల క్రితం అదనపు డీసీపీగా పదోన్నతి లభించింది. ఆయన రాచకొండ కమిషనరేట్ పరిధిలో కంట్రోల్ రూమ్‌లో అదనపు డీసీపీగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రమోషన్ వచ్చిన మూడు రోజులకే ఆయన మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం హయత్‌నగర్‌లోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబుతో పాటు పలువురు డీసీపీలు, ఏసీపీలు బాబ్జీకి నివాళులు అర్పించారు. ఏపీలోని ఏలూరుకు చెందిన బాబ్జీ 1995లో పోలీసు ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఆయన భార్య భాగ్యలక్ష్మి సీటీఓగా పని చేస్తుండగా, కొడుకు రాకేశ్ ఇటీవలనే బీటెక్ పూర్తి చేశాడు.

టెన్త్ పేపర్ లీకేజీపై ముమ్మర దర్యాప్తు

- రంగంలోకి ముగ్గురు సీఐలు
- పోలీసుల అదుపులో 15 మంది యువకులు

నకిరేకల్: నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో పదో తరగతి తెలుగు ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై పోలీసు దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. శుక్రవారం ఓ యువకుడు పరీక్ష రాస్తున్న ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని ప్రశ్నపత్రం ఫొటో తీసి శాలిగౌరారం మండలంలోని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసిన విషయం విదితమే. ఈ లీకేజీ వ్యవహారాన్ని ఎస్పీ సీరియస్‌గా తీసుకుని ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలకు ఆదేశించారు. లీకేజీపై నకిరేకల్ ఎంఈవో మేకల నాగయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. నకిరేకల్, శాలిగౌరారం సీఐలు రాజశేఖర్, కొండల్‌రెడ్డితో పాటు మరో సీఐ కూడా రంగంలోకి దిగారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో మకాంవేసి పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ పోతుల గోపాల్, డిపార్ట్‌మెంటల్ అధికారి రామ్మోహన్‌రెడ్డిని విచారించి వారి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. సదరు విద్యార్థిని తండ్రిని పిలిపించి విచారించారు. ప్రశ్నపత్రం ఫొటో తీసి, సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన వారి ఫోన్ నంబర్ల ఆధారంగా శాలిగౌరారం, నకిరేకల్ మండలాలకు చెందిన 15 మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని నల్లగొండలోని జిల్లా పోలీస్ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై సీఐ రాజశేఖర్‌ను ప్రశ్నించగా కేసు పురోగతిలో ఉందని, ఇంకా విచారణ పూర్తి కాలేదని తెలిపారు.

పరీక్ష రాయకుండానే ఇంటికి..

నకిరేకల్ ఎస్సీ గురుకుల పాఠశాల సెంటర్‌లో రెండో రోజు హిందీ పరీక్ష రాసేందుకు వచ్చిన ఆ ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని ఝాన్సీ పరీక్ష రాయకుండానే వెనుదిరిగింది. ఝాన్సీని శుక్రవారమే డిబార్ చేస్తున్నట్లు జిల్లా విద్యాధికారులు ప్రకటించారు. శనివారం సెంటర్‌కు వచ్చిన ఆ విద్యార్థిని నుంచి డిబార్, పేపర్ లీకేజీకి సంబంధించి అధికారులు సంతకాలు తీసుకున్నారు. తర్వాత ఆమెను పోలీసుల సహకారంతో శాలిగౌరారం మండలం కేంద్రంలోని ఇంటి వద్ద కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నా ప్రమేయం లేదు..: విద్యార్థిని ఝాన్సీ



'నేను నర్సరీ నుంచి పదో తరగతి వరకు నకిరేకల్ కృష్ణవేణి స్కూల్‌లోనే చదివాను. చిన్నప్పటి నుంచి అన్ని క్లాసుల్లో కూడా 70కి పైగా మార్కులు సాధించి క్లాసు టాపర్‌గా ఉంటున్నాను. నేను పదో తరగతి పరీక్షలు రాస్తున్న క్రమంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి కిటికీ దగ్గర పేపర్ చూపించమని ఒత్తిడి తెచ్చి ఫొటో తీసుకొని వెళ్లాడు. ఈ విషయంలో పోలీసులు ఏం చేస్తున్నారు. ఇన్విజిలేటర్‌కు కూడా చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుంది. ఇందులో నా ప్రమేయం ఏముంది. నన్నెందుకు డిబార్ చేస్తారు. శనివారం పరీక్ష రాసేందుకు వస్తే ప్రశ్నపత్రం ఫొటో తీసేందుకు సహకరించానని, నాతో బలవంతంగా సంతకం పెట్టించుకొని పరీక్ష రాయనివ్వకుండా చేసి.. డిబార్ చేశాం వెళ్లిపొమ్మని చెప్పారు. నాకు కాపీ కొట్టి రాయాల్సిన పరిస్థితి లేదు. నాకు పరీక్షలు రాయడానికి అనుమతి ఇవ్వాలి. సప్లిమెంటరీ అనేది ఉండొద్దు. ఈ పరీక్షల్లోనే నాకు అవకాశం కల్పించి న్యాయం చేయాలి'.

– 'సాక్షి'తో విద్యార్థిని ఝాన్సీ

ఇంకెవ్వరికీ ఇలా జరగొద్దు

- డెంగీతో యువతి మృతి
- పరిసరాల పరిశుభ్రతపై కుటుంబ సభ్యుల ఫ్లెక్సీ



మోపాల్ (నిజామాబాద్ రూరల్): 'మా కుటుంబం తరఫున అందరికీ ఒక విన్నపం.. ప్లీజ్.. మా చెల్లికి జరిగినట్లు ఇంకెవ్వరికీ జరగకుండా చూడాలని ఆ దేవుడిని వేడుకుంటున్నాం. దయచేసి మీ ఇంట్లో వారికి ఏ చిన్న జ్వరం వచ్చినా ఒక్కసారి ఆలోచించండి. మీ ఇంటి చుట్టుపక్కల శుభ్రంగా ఉంచుకోండి దయచేసి..'అంటూ నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం నర్సింగ్‌పల్లి గ్రామంలో ఒక కుటుంబం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఆలోచింపజేస్తున్నాయి. వివరాలివి. నర్సింగ్‌పల్లికి చెందిన ఎల్లుల్ల స్ఫూర్తి (21)తోపాటు ఆమె తల్లి స్వప్న ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. వారిని కుటుంబ సభ్యులు నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. స్వప్న కోలుకుంది. స్ఫూర్తికి మాత్రం డెంగీ కారణంగా రోజురోజుకూ ప్లేట్‌లెట్స్ పడిపోయి పరిస్థితి విషమించింది. దీంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయింది. స్ఫూర్తి శనివారం కన్నుమూసింది. తమ కుటుంబానికి కలిగిన విషాదం ఇంకెవ్వరికీ రావొద్దని కోరుతూ.. స్ఫూర్తి కుటుంబ సభ్యులు గ్రామంలో పలుచోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

ఆర్కిటిక్ నుంచి హిమాలయాల దాకా

గ్లేసియర్లు మటుమాయం



8.2 లక్షల కోట్ల టన్నులు!

- శరవేగంగా కరిగిపోతున్న వైనం
- తక్షణం మేలుకోకుంటే ముప్పే
- వాతావరణంలో తీవ్ర మార్పులు
- వరదలు, కరువులు, నీటి కొరత

ఇదేమిటో తెలుసా? కేవలం గత 50 ఏళ్లలో భూమిపై ఉన్న గ్లేసియర్లన్నింట్లో కలిపి కరిగిపోయిన మంచు పరిమాణం! నమ్మశక్యంగా లేకున్నా నిజమిది. పర్యావరణంతో మనిషి చెలగాటం తాలూకు విపరిణామమిది. పారిశ్రామికీకరణకు గ్లోబల్ వార్మింగ్ తదితరాలు తోడై గ్లేసియర్ల ఉసురు తీస్తున్నాయి. ఏటా రికార్డులు బద్దలు కొట్టే స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతల దెబ్బకు భూమ్మీద మంచు నిల్వలు శరవేగంగా కరిగి నీరైపోతున్నాయి. ఫలితంగా 1976 నుంచి 8,200 గిగా టన్నుల మంచు మాయమైపోయినట్టు కోపర్నికస్ వాతావరణ సేవల విభాగం (సీ3ఎస్) తేల్చింది. ''కేవలం 2000 నుంచి 2023 మధ్యే ఏకంగా 6,000 గిగాటన్నులు ఆవిరైపోయింది. 2010 నుంచి ఈ ధోరణి మరీ వేగం పుంజుకుంది. ఏటా 370 గిగా టన్నుల చొప్పున మంచు కరిగిపోతోంది'' అని వివరించింది. శనివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా సీ3ఎస్ ఈ గణాంకాలను వెల్లడించింది. ఆర్కిటిక్ నుంచి హిమాలయాల దాకా ప్రపంచ వ్యాప్తంగా గ్లేసియర్ల ఉనికి నానాటికీ ప్రశ్నార్థకంగా మారుతోందని హెచ్చరించింది. అందుకే ఈ ఏడాది గ్లేసియర్ల పరిరక్షణపై ప్రధానంగా దృష్టి పెట్టాలని ఐరాస కూడా పిలుపునిచ్చింది.

అన్నిచోట్లా..

గత 50 ఏళ్లలో గ్లేసియర్లు అతి ప్రమాదకర వేగంతో చిక్కిపోతున్న ప్రాంతాల్లో పశ్చిమ కెనడా, అమెరికా, మధ్య యూరప్ టాప్‌లో ఉన్నాయి. నైరుతీ ఆసియాతో పాటు రష్యా, కెనడాల పరిధిలోని ఆర్కిటిక్ ప్రాంతంలో ఈ వేగం కాస్త తక్కువగా, అంటార్కిటికాలో ఇంకా తక్కువగా ఉంది.

భారత్‌లోనూ ఆందోళనే

భారత్ ఏకంగా 9,000 పైచిలుకు గ్లేసియర్లకు నిలయం. భారత్‌కే గాక పాకిస్తాన్ తదితర పరిసర దేశాలకు కూడా ప్రాణాధారమైన గంగ, బ్రహ్మపుత్ర, సింధు వంటి ప్రధాన జీవనదీ వ్యవస్థలకు ఈ గ్లేసియర్లే జన్మస్థానాలు. దక్షిణాసియాలో 60 కోట్ల మంది ప్రజలకు ఇవి జీవనాధారం. గ్లేసియర్ల కరుగుదలతో ఈ కీలక నదీ వ్యవస్థల భవితవ్యం నానాటికీ ప్రమాదంలో పడుతోంది. కోటా షిగ్రీ గ్లేసియర్ గత 50 ఏళ్లలో సగానికి పైగా చిక్కిపోయింది. గ్లోబల్ వార్మింగ్ తదితర విపత్తులు ఇలాగే కొనసాగితే 2100 నాటికి సగానికి పైగా హిమాలయ గ్లేసియర్లు మాయమైపోతాయని పలు అధ్యయనాలు ఇప్పటికే హెచ్చరించాయి. హిమాలయాల్లోని కనీసం 10 హెక్టార్ల కంటే పెద్దవైన 2,431 గ్లేసియర్ సరస్సుల పరిమాణం 1984 నుంచి 2023 దాకా నానాటికీ పెరుగుతూ వస్తున్నట్టు ఇస్రో ఉపగ్రహాలు తేల్చాయి. వీటిలో 676 సరస్సుల సైజు రెట్టింపునకు పైగా పెరిగినట్టు తేలడం గ్లేసియర్ల కరుగుదల వేగానికి అద్దం పడుతోంది. ఈ పరిణామం ఆకస్మిక వరదల ముప్పును కూడా నానాటికీ పెంచుతోంది. అంతేగాక దీనివల్ల దీర్ఘకాలంలో మంచినీటి లభ్యత పూర్తిగా తగ్గిపోతుంది. వీటిలో 130కి పైగా సరస్సులు భారత్‌లోనే గంగ, సింధు, బ్రహ్మపుత్ర బేసిన్ల పరిధిలో ఉన్నాయి.


- హిమాచల్‌ప్రదేశ్‌లో 4,068 మీటర్ల ఎత్తులో ఉన్న గెపాంగ్ ఘాట్ గ్లేసియల్ సరస్సు గత 30 ఏళ్లలో మూడు రెట్లకు పైగా పెరిగి 36 హెక్టార్ల నుంచి 101 హెక్టార్లకు చేరింది. ఇప్పుడు కూడా ఏటా 2 హెక్టార్ల చొప్పున విస్తరిస్తోంది.
- ప్రపంచంలో రెండో అతి పెద్ద ధ్రువేతర గ్లేసియర్ అయిన సియాచిన్ కూడా కుంచించుకుపోతున్నట్టు పలు అధ్యయనాలు తేల్చాయి.

గ్లేసియర్లు కరగడం వల్ల...

- పరిసర ప్రాంతాలకు నిత్యం ముంపు భయం పొంచి ఉంటుంది.
- సముద్రమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతోంది.
- దీనివల్ల తీర ప్రాంత మహానగరాలన్నీ నీట మునుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 250 కోట్ల మందికి పైగా నిర్వాసితులవుతారు.
- సముద్ర జలాల సంతులనం పూర్తిగా కట్టు తప్పుతోంది.
- ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సమతుల్యతను కాపాడే కీలక సముద్ర ప్రవాహాలు నెమ్మదిస్తున్నాయి. ఇది వాతావరణంలో తీవ్ర హెచ్చుతగ్గులకు దారితీస్తుంది. ఫలితంగా ఆకస్మిక వరదలు, కరువు కాటకాలు పరిపాటిగా మారతాయి.
- మంచు నిల్వలు 200 కోట్ల మందికి తాగునీటికి ఆధారంగా నిలుస్తున్నాయి. వాటినుంచి జాలువారే నీటి వనరులు పెద్ద నదులుగా మారి ప్రజల తాగు, సాగుతో పాటు రవాణా తదితర అవసరాలను సుష్టుగా తీరుస్తూ వస్తున్నాయి. అలాంటి కీలక నీటి వనరులు ప్రమాదకర వేగంతో కుంచించుకుపోతుండటంతో కొన్నేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా నీటి కొరత నానాటికీ పెరిగిపోతోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఒక్క రోజే వెయ్యి గోల్డ్ కార్డులు



వాషింగ్టన్: అమెరికాలో నివాసంతో పాటు అంతిమంగా పౌరసత్వానికి కూడా వీలు కల్పిస్తూ ఇటీవల ప్రవేశపెట్టిన గోల్డ్ కార్డులకు డిమాండ్ బాగా పెరుగుతోందని వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ ప్రకటించారు. శుక్రవారం ఆయన ఆల్–ఇన్ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్నారు. ''ఒక్క రోజులోనే ఏకంగా వెయ్యి గోల్డ్ కార్డులు అమ్మాం. ఒక్కోదానికి 50 లక్షల డాలర్ల చొప్పున 500 కోట్ల డాలర్లు సంపాదించాం'' అంటూ సంబరపడిపోయారు. డొనాల్డ్ ట్రంప్ సారథ్యంలో అగ్ర రాజ్యం ఫక్తు వ్యాపార రాజ్యంగా మారిపోతోందన్న వాదనలకు బలం చేకూర్చేలా మాట్లాడారు. ''గోల్డ్ కార్డులు పూర్తిగా ట్రంప్ ఆలోచనే. దాన్ని కొనుగోలు చేయగల సామర్థ్యమున్న వారు ప్రపంచవ్యాప్తంగా 3.7 కోట్ల మంది ఉన్నారు. కనుక 10 లక్షల కార్డులమ్మి 5 లక్షల కోట్ల డాలర్లు సమీకరించడమే ట్రంప్ లక్ష్యం'' అంటూ ప్రకటించారు. మంత్రి వాటిని ట్రంప్ కార్డులుగా సంబోధించడం విశేషం. వాటిని కొనేందుకు 2.5 లక్షల మంది ఇప్పటికే ఆసక్తి చూపారని కూడా ఆయన వెల్లడించారు. గోల్డ్ కార్డు అమ్మకాలను మరింత పెంచేందుకు వాటి పేరును ట్రంప్ కార్డ్‌గా మార్చే ఆలోచన ఉన్నట్టు అధ్యక్షుడు ఇటీవలే ప్రకటించడం తెలిసిందే. ఈబీ–5 ఇన్వెస్టర్ వీసా స్థానంలో గోల్డ్ కార్డును ప్రవేశపెడుతూ ఆయన నెల క్రితం నిర్ణయం తీసుకున్నారు. అమెరికా ప్రస్తుతం ఏకంగా 36.1 ట్రిలియన్ డాలర్ల రుణభారంతో కునారిల్లుతోంది. గోల్డ్‌కార్డుల ద్వారా దాన్ని ఎంతో కొంత తగ్గించుకోవాలన్నది ట్రంప్ యోచన.

అమెరికా గుడ్ల వేట


- భారీగా దిగుమతి చేసుకునే యత్నం
- తుర్కియే, దక్షిణ కొరియాతో చర్చలు



వాషింగ్టన్: గుడ్ల కొరతతో గుడ్లు తేలేస్తున్న అమెరికా సమస్య నుంచి గట్టెక్కేందుకు వాటిని భారీగా దిగుమతి చేసుకునే పనిలో పడింది. ఇందుకోసం తుర్కియే, దక్షిణ కొరియాలను సంప్రదిస్తోంది. తక్షణం కోట్లాది గుడ్లను పంపేలా వాటితో ముమ్మరంగా చర్చలు జరుపుతున్నట్టు వ్యవసాయ మంత్రి బ్రూక్ రోలిన్స్ శుక్రవారం వెల్లడించారు. పలు ఇతర దేశాలతోనూ మాట్లాడుతున్నట్టు చెప్పుకొచ్చారు. అమెరికా తమను కూడా సంప్రదించినట్టు పోలండ్, లిథువేనియా వంటి దేశాలు ధ్రువీకరించాయి. బర్డ్‌ఫ్లూ తదితరాలతో కోళ్ల సంఖ్య బాగా తగ్గడం అమెరికాలో గుడ్ల కొరతకు దారితీసింది. దాంతో వాటి ధరలు కొద్ది నెలలుగా చుక్కలనంటడం తెలిసిందే. డజను గుడ్లకు 5 డాలర్లు, అంతకుమించి వెచ్చించాల్సి వస్తోంది. షికాగో వంటి ప్రధాన నగరాల్లో 9 నుంచి 10 డాలర్ల దాకా ధరలు ఎగబాకాయి. అంతంత పెట్టి కొనలేక చాలామంది ఏకంగా కోళ్లనే పెంచుకుంటున్నారు. దాంతో గుడ్ల ధరలను నేలకు దించే మార్గాలపై ట్రంప్ సర్కారు మల్లగుల్లాలు పడుతోంది. ఇందుకోసం 100 కోట్ల డాలర్లతో నిధి ఏర్పాటు వంటి పలు చర్యలు తీసుకున్నా పెద్దగా ఫలితం కన్పించడం లేదు. రెండు నెలల్లో దేశీయంగా కోళ్ల సంఖ్య పెరిగి సమస్య చక్కబడుతుందని రోలిన్స్ ఆశాభావం వెలిబుచ్చారు. బర్డ్‌ఫ్లూ దెబ్బకు గత రెండున్నరేళ్లలో అమెరికాలో కనీసం 20 కోట్ల కోళ్లను వధించారు. దాంతో చుక్కలనంటిన గుడ్ల ధరలు ఇటీవలి అధ్యక్ష ఎన్నికల్లో కూడా ట్రంప్‌కు అస్త్రంగా కూడా మారాయి. తాను పగ్గాలు చేపట్టగానే వాటికి ముకుతాడు వేస్తానని ప్రకటించారు.

వినోద్‌కుమార్ శుక్లాకు జ్ఞానపీఠం

న్యూఢిల్లీ: ప్రఖ్యాత హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా(88) 59వ జ్ఞానపీఠ అవార్డుకు ఎంపికయ్యారు. దేశంలో అత్యున్నత సాహితీ పురస్కారానికి ఎంపికైన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మొట్టమొదటి రచయితగా నిలిచారు. అదేవిధంగా, ఈ అవార్డు స్వీకరించనున్న 12వ హిందీ రచయితగా నిలిచారు. కథలు, కవితలతోపాటు వ్యాస రచనలో ప్రజ్ఞాశాలి అయిన శుక్లా సమకాలీన గొప్ప హిందీ రచయితల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. అవార్డు కింద రూ.11 లక్షల నగదుతోపాటు సరస్వతీ మాత కాంస్య విగ్రహం, ప్రశంసాపత్రం అందుకోనున్నారు. ప్రముఖ కథా రచయిత జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ప్రతిభా రాయ్ సారథ్యంలో జ్ఞానపీఠ ఎంపిక కమిటీ సమావేశమై వినోద్‌కుమార్ శుక్లాను ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకుంది. హిందీ సాహిత్యంలో సృజనాత్మకత, విలక్షణమైన రచనాశైలికి ఆయన చేసిన అద్భుతమైన కృషిని గుర్తిస్తూ శుక్లాను ఎంపిక చేసినట్లు ప్రకటించింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మాధవ్ కౌశిక్, దామోదర్ మౌజో, ప్రభా వర్మ, అనామిక, ఎ.కృష్ణారావు, ప్రఫుల్ శిలేదార్, జానకీ ప్రసాద్ శర్మతోపాటు కమిటీ డైరెక్టర్ మధుసూదన్ ఆనంద్ పాల్గొన్నారు. 'ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ అవార్డుకు ఎంపికవుతానని ఎన్నడూ అనుకోలేదు. మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది. రచనా వ్యాసంగం ఇకపైనా కొనసాగిస్తా. ముఖ్యంగా చిన్నారుల కోసం రచనలు చేస్తా' అంటూ వినోద్ కుమార్ శుక్లా స్పందించారు. తన విలక్షణమైన భాషా పటిమ, లోతైన భావోద్వేగాలకు పేరుగాంచిన శుక్లా 'దీవార్ మే ఏక్ ఖిడ్కీ రహతీ థీ' పుస్తకానికి 1999లో సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు. శుక్లా రచించిన నౌకరీ కీ కమీజ్(1979) అనే నవల అనంతరం మణి కౌల్ సినిమాగా తీశారు. సబ్ కుచ్ హోనా బచా రహేగా(1992)అనే కవితా సంకలనం ఆయనకు ఎంతో పేరు తెచ్చిపెట్టింది. భారతీయ రచయితల కోసం 1961లో నెలకొల్పిన జ్ఞానపీఠ అవార్డును మొట్టమొదటిసారిగా 1965లో 'ఒడక్కుజల్' అనే కవితా సంకలం వెలువరించిన మలయాళ కవి జి.శంకర కురూప్ అందుకున్నారు.



వినోద్‌కుమార్ శుక్లా

నైగర్‌లో ఐఎస్ దారుణం..

44 మంది పౌరుల ఊచకోత

డాకర్: ఆఫ్రికా దేశం నైగర్ పశ్చిమప్రాంతంలోని ఓ గ్రామంలో ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్రవాదులు దారుణానికి తెగబడ్డారు. మాలి, బుర్కినాఫాసో, నైగర్ దేశాల ఉమ్మడి సరిహద్దులకు సమీప కొకొరా ప్రాంతంలోని ఫంబిటా గ్రామంలోకి శుక్రవారం మధ్యాహ్నం భారీ ఆయుధాలు ధరించి ప్రవేశించిన ఉగ్రవాదులు మసీదులో ప్రార్థనలు చేస్తున్న వారిని దారుణంగా చంపేశారు. అనంతరం మార్కెట్‌కు, నివాసాలకు నిప్పుపెట్టి వెళ్లిపోయారు. ఈ ఘటనలో 44 మంది పౌరులు చనిపోగా 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. గ్రేట్ సహారా ఇస్లామిక్ స్టేట్ గ్రూపే ఇందుకు కారణంగా భావిస్తున్నామని ప్రభుత్వం తెలిపింది. మూడు దేశాల సరిహద్దు ప్రాంతంలో దశాబ్దకాలంగా అల్ ఖైదా, ఐఎస్ అనుకూల జిహాదీ గ్రూపుల మధ్య తీవ్ర పోరు కొనసాగుతోంది. ఇటీవలి కాలంలో ఈ మూడు దేశాల్లోనూ సైనిక తిరుగుబాట్లు సంభవించడం గమనార్హం. నూతన పాలకులు దశాబ్దాలుగా ఇక్కడ కొనసాగుతున్న ఫ్రాన్సు బలగాలను వెనక్కి పంపించివేసి, భద్రత కోసం రష్యాకు చెందిన కిరాయి సైన్యాలపై ఆధారపడుతున్నారు. మాలి, బుర్కినాఫాసో, నైగర్ కలిసి భద్రతలో సహకారం పెంపొందించుకునేందుకు 'అలయెన్స్ ఆఫ్ సహేల్ స్టేట్స్' అనే కూటమిని సైతం ఏర్పాటు చేసుకున్నాయి.

జస్టిస్ యశ్వంత్ వర్మపై విచారణకు త్రిసభ్య కమిటీ

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీగా నగదు దొరికిన ఘటనపై సమగ్ర విచారణకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా శనివారం త్రిసభ్య కమిటీ నియమించారు. ఈ కమిటీలో పంజాబ్, హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ షీల్ నాగ్, హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.ఎస్.సంధావాలియా, కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అనూ శివరామన్‌ను సభ్యులుగా నియమించారు. మరోవైపు ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్ వర్మకు ఎలాంటి న్యాయ సంబంధిత విధులు అప్పగించవద్దని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.కె.ఉపాధ్యాయను సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదేశించారు.

సీజేఐకి నివేదిక సమర్పించిన జస్టిస్ డి.కె.ఉపాధ్యాయ

జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీగా నోట్ల కట్టలు లభ్యమైన ఘటనపై ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.కె.ఉపాధ్యాయ తమ నివేదికను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు సమర్పించారు. యశ్వంత్ వర్మ ఇంట్లో నగదు లభించడంపై జస్టిస్ డి.కె.ఉపాధ్యాయ అంతర్గత విచారణ చేపట్టారు. సాక్ష్యాధారాలు, సమాచారం సేకరించారు. సంబంధిత అధికారులతో చర్చించారు. అన్ని అంశాలతో నివేదిక సిద్ధం చేసి, సీజేఐకి అందజేశారు. దీని ఆధారంగా జస్టిస్ యశ్వంత్ వర్మపై సుప్రీంకోర్టు తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

హీత్రూలో విమాన సేవలు పునరుద్ధరణ

అగ్ని ప్రమాదంతో 18 గంటలు నిలిచిన రాకపోకలు



లండన్: అగ్ని ప్రమాదం కారణంగా దాదాపు 18 గంటలపాటు మూతబడిన లండన్‌లోని హీత్రూ విమానాశ్రయంలో విమానాల రాకపోకలు తిరిగి మొదలయ్యాయి. శనివారం ఉదయం నుంచి పూర్తి స్థాయిలో కార్యకలాపాలను పునరుద్ధరించినట్లు హీత్రూ విమానాశ్రయం ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, విమానాల రాకపోకలకు కలిగిన అంతరాయం ప్రభావం మరికొన్ని రోజులపాటు కొనసాగుతుందని పేర్కొంది. 'టెర్మినల్స్ వద్ద అదనంగా వందల సంఖ్యలో సిబ్బందిని సిద్ధంగా ఉంచాం. శనివారం అదనంగా మరో పది వేల మంది ప్రయాణికులను పంపించేందుకు విమానాల షెడ్యూల్‌ను తయారు చేశాం' అని హీత్రూ చీఫ్ ఎగ్జిక్యూటివ్ థామస్ వోల్డ్‌బై ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ప్రమాద ఘటనకు ఎయిర్‌పోర్టు కారణం కాదనే విషయం గుర్తుంచుకోవాలి. అంతేకాదు, రోజులపాటు మూసివేయలేదు, హీత్రూ కేవలం కొన్ని గంటలు మూతబడిందంతే. బ్యాకప్ వ్యవస్థను కూడా అత్యవసరాల్లో మాత్రమే ఉపయోగపడేలా డిజైన్ చేశారు. అది కూడా మొత్తం విమానాశ్రయాన్ని నడిపేందుకు సరిపోదు. హీత్రూకు ఒక చిన్న నగరానికి సరిపడా విద్యుత్ అవసరమవుతుంది. ఇతర విమానాశ్రయాల్లోనూ గతంలో ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయి' అని ఆయన వివరించారు. అయితే, ఎయిర్‌పోర్టుకు బయలుదేరే ముందు సంబంధిత ఎయిర్‌లైన్స్ నుంచి వివరాలను చెక్ చేసుకోవాలని ప్రయాణికులను కోరారు. శనివారం హీత్రూ నుంచి రాకపోకలు సాగించాల్సిన తమ 600 విమాన సర్వీసులకు గాను 85 శాతం మేర పునరుద్ధరించినట్లు బ్రిటిష్ ఎయిర్‌వేస్ తెలిపింది. అనూహ్యంగా చోటుచేసుకున్న ఘటన తర్వాత తిరిగి పూర్తిస్థాయిలో సేవలను పునరుద్ధరించడం ఎంతో క్లిష్టమైన వ్యవహారమని పేర్కొంది. హీత్రూకు 2 మైళ్ల దూరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకున్న భారీ అగ్ని ప్రమాదంతో విమానాశ్రయంలో కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీని కారణంగా 1,300కు పైగా విమానాలు రద్దు కాగా ఆ ప్రభావం 2 లక్షల మంది ప్రయాణికులపై పడింది. శుక్రవారం రాత్రికి స్వల్ప సంఖ్యలో విమానాల రాకపోకలను పునరుద్ధరించగలిగారు. అయితే, తమకు కలిగిన తీవ్ర అసౌకర్యంపై హీత్రూ విమానాశ్రయం అధికారులపై ప్రయాణికులు మండిపడుతున్నారు. అగ్ని ప్రమాదం వెనుక కుట్ర కోణం లేదంటున్న పోలీసులు..సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ పరికరాలపైనే దృష్టి పెట్టినట్లు తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత రద్దీ కలిగిన విమానాశ్రయాల్లో ఒకటైన హీత్రూ నుంచి గతేడాది 8.39 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు.



శనివారం హీత్రూ విమానాశ్రయం రెండో టెర్మినల్ వద్ద ప్రయాణికులు

ఎయిరిండియా సేవలు ప్రారంభం

న్యూఢిల్లీ: లండన్‌లోని హీత్రూ ఎయిర్‌పోర్టుకు విమానాల రాకపోకలను ప్రారంభించినట్లు ఎయిరిండియా శనివారం తెలిపింది. దేశ రాజధాని ఢిల్లీ నుంచి ఎయిరిండియాతోపాటు వర్జిన్ అట్లాంటిక్, బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానాలు శనివారం షెడ్యూల్ ప్రకారం నడిచాయి. శుక్రవారం హీత్రూ మూతబడటంతో దేశంలోని వివిధ నగరాల నుంచి పెద్ద సంఖ్యలో విమానాలు రద్దు కావడం తెల్సిందే. ఢిల్లీ విమానాశ్రయం నుంచి ఎయిరిండియా నిత్యం ఆరు విమానాలను హీత్రూకు నడుపుతోంది. బ్రిటిష్ ఎయిర్‌వేస్‌కు చెందిన మొత్తం 8 విమానాలు హీత్రూ ఢిల్లీ, ముంబైల మధ్య రాకపోకలు సాగిస్తుంటాయి. వర్జిన్ అట్లాంటిక్ కూడా ఢిల్లీ, ముంబై, బెంగళూరుల నుంచి హీత్రూకు ఐదు సర్వీసులను నడుపుతోంది.

భవిష్యత్ తరాల కోసం నీటిని కాపాడాలి: మోదీ

న్యూఢిల్లీ: నీటి సంరక్షణ, సుస్థిర అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నొక్కి చెప్పారు. 'మానవ నాగరికతకు జీవనాధారం జలం. అందుకే, భవిష్యత్ తరాల కోసం మనం నీటి వనరులను కాపాడుకోవాలి' అని ఆయన శనివారం 'ఎక్స్'లో పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన నీటి ప్రాముఖ్యతను చాటి చెప్పేందుకు ఐక్యరాజ్యసమితి ఏటా మార్చి 22వ తేదీని ప్రపంచ జల దినోత్సవంగా పాటిస్తోంది.

అమెరికాలో కాల్పుల కలకలం

ముగ్గురు మృతి, 14 మందికి గాయాలు

లాస్ క్రుసెస్(న్యూమెక్సికో): అమెరికాలో మరోసారి తుపాకులు పేలాయి. న్యూమెక్సికో రాష్ట్రంలోని ఎడారి పట్టణం లాస్ క్రుసెస్‌లోని యంగ్ పార్క్ వద్ద శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో చోటుచేసుకున్న కాల్పుల ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా 14 మంది గాయపడ్డారు. బాధితులను ఎల్‌పాసో, లాస్ క్రుసెస్‌లోని ఆస్పత్రులకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, అనుమానితుల ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

5.32 లక్షల మందికి

తాత్కాలిక హోదా రద్దు

వీరంతా క్యూబా, హైతీ, నికరాగ్వా, వెనెజులా దేశస్తులు

- వెనక్కి పంపించేస్తామన్న అమెరికా హోం ల్యాండ్ విభాగం

మియామి: అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. క్యూబా, హైతీ, నికరాగ్వా, వెనెజులా దేశాలకు చెందిన 5.32 లక్షల మందికి గల చట్టపరమైన రక్షణలను రద్దు చేయనున్నట్లు తెలిపింది. వీరిని నెల రోజుల్లోగా ఆయా దేశాలకు తిప్పి పంపించేయనున్నట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం స్పష్టం చేసింది. 2022 అక్టోబర్ తర్వాత అమెరికాలోకి అడుగుపెట్టిన పై నాలుగు దేశాల వారికి ఈ నిర్ణయం వర్తిస్తుందని వివరించింది. రెండేళ్లపాటు ఇక్కడే ఉండి పనిచేసేందుకు వీరికి పర్మిట్లున్నాయని హోం ల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టి నోయెమ్ తెలిపారు. తాజా నిర్ణయంతో ఏప్రిల్ 24వ తేదీతో లేదా ఫెడరల్ రిజిస్టర్‌లో నోటీస్ ముద్రించిన 30 రోజుల్లో వీరికున్న చట్టబద్ధ హోదా గడువు ముగియనుందని వివరించారు. తమ దేశాల్లో యుద్ధం లేదా రాజకీయ అస్థిరత కారణంగా అమెరికాలో అడుగుపెట్టిన వారిని ఉండనిచ్చేందుకు హ్యుమానిటేరియన్ పెరోల్ ప్రోగ్రామ్ ద్వారా అధ్యక్షుడికి అధికారాలున్నాయి. అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్..దేశంలో చట్ట విరుద్ధంగా ఉంటున్న వేలాది మందిని వెనక్కి పంపించివేస్తామని హామీ ఇవ్వడం తెల్సిందే. అయితే, ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఫెడరల్ కోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. గత బైడెన్ ప్రభుత్వం హ్యుమానిటేరియన్ పెరోల్ ప్రోగ్రామ్ కింద పైనాలుగు దేశాలకు చెందిన నెలకు గరిష్టంగా 30 వేల మంది చొప్పున అమెరికాకు వచ్చి రెండేళ్లపాటు పనులు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చింది. క్యూబా నెలకొకటి చొప్పున వలసదారుల విమానాలను అంగీకరిస్తామని చెప్పగా వెనెజులా, నికరాగ్వాలు మాత్రం తిరస్కరిస్తున్నాయి. హైతీ ఇప్పటికే వలసదారులతో కూడిన పలు విమానాలను అనుమతించింది.

ఉల్లిపై ఎగుమతి సుంకం ఎత్తివేత

న్యూఢిల్లీ: దేశీయ మార్కెట్లో ఉల్లిగడ్డల ధరలు అదుపులోకి రావడంతో కేంద్ర ప్రభుత్వం ఉల్లిపై 20 శాతం ఎగుమతి సుంకాన్ని ఎత్తివేస్తున్నట్లు శనివారం ప్రకటించింది. దేశీయ వినియోగదారులకు ఉల్లిని అందుబాటులో ఉంచుతూనే.. రైతుల ప్రయోజనం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఉల్లిపై 20 శాతం ఎగుమతి సుంకం గత ఏడాది సెప్టెంబరు నుంచి అమలులో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 18 నాటికి 11.7 లక్షల టన్నులు ఉల్లి ఎగుమతులు జరిగినట్లు కేంద్రం వెల్లడించింది. ఎగుమతి సుంకాలు అమలులో ఉన్నప్పటికీ.. గత ఏడాది సెప్టెంబరులో 72 వేల టన్నుల ఎగుమతులు జరగ్గా.. ఈ ఏడాది జనవరిలో 1,85,000 టన్నుల ఉల్లి ఎగుమతులు జరిగినట్లు వివరించింది. కొత్త పంట రావడంతో ప్రధాన మార్కెట్లయిన లాసల్‌గావ్, పింపల్‌గావ్‌లలో ఉల్లి ధర క్వింటాలుకు మార్చి 21న రూ. 1,325 నుంచి 1,330 పలికినట్లు తెలిపింది. ఈ ఏడాది రబీ సీజన్‌లో 2.27 కోట్ల టన్నుల ఉల్లి దిగుబడి ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. గత ఏడాది దిగుబడి 1.92 కోట్ల టన్నులు కావడం గమనార్హం.

హెచ్చు విద్యార్హతలు

అనర్హత కాబోవు

ఎఫ్‌ఎస్‌ఓ నియామకాలపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: హెచ్చు విద్యార్హతలు ఉద్యోగ నియామకాలకు అనర్హత కాబోవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం ఆ ఒక్క ప్రాతిపదికన అనర్హులుగా పరిగణించడానికి వీల్లేదని పేర్కొంది. జార్ఖండ్‌లో మైక్రోబయాలజీ, ఫుడ్ సైన్స్, టెక్నాలజీలో పీజీ చేసిన పలువురు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ నియామకాలకు దరఖాస్తు చేసుకోగా హెచ్చు విద్యార్హతల ప్రాతిపదికన వారు అనర్హులని ఇంటర్వ్యూ దశలో పేర్కొన్నారు. దీన్ని జార్ఖండ్ హైకోర్టులో సవాలు చేసినా లాభం లేకపోయింది. బ్యాచిలర్స్ డిగ్రీ సరిపోయే పోస్టులకు వారిని అనర్హులుగా పేర్కొనడం సరైందేనని సింగిల్ జడ్జితో పాటు డివిజన్ బెంచ్ కూడా పేర్కొంది. కెమిస్ట్రీలో మినహా మిగతా సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ ఉన్నవారు అనర్హులని నియామక ప్రకటనలోనే స్పష్టంగా పేర్కొనడాన్ని ఉటంకించింది. దాంతో బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నియామక ప్రక్రియ తీరుతెన్నులను న్యాయమూర్తులు జస్టిస్ విక్రం నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. హైకోర్టు తీర్పును రద్దు చేసింది. బాధితులను ఎఫ్‌ఎస్‌ఓ పోస్టులకు అర్హులుగా పరిగణించాల్సిందేనని ఆదేశించింది. ''ఫలానా డిగ్రీలుంటే మొత్తంగానే అనర్హులని పేర్కొంటే అర్థం చేసుకోగలం. కానీ కెమిస్ట్రీలో మాస్టర్స్ డిగ్రీ చేసిన వారు అర్హులైనప్పుడు మిగతా సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ ఉన్నవాళ్లు అనర్హులెలా అవుతారు? ఇది ఎంతమాత్రమూ సరికాదు. ఎఫ్‌ఎస్‌ఓ పోస్టులకు కేంద్రం నిర్ధారించిన అర్హత ప్రమాణాలు, నిబంధనలకు అదనంగా మరికొన్నింటిని జోడించే అధికారం రాష్ట్రాలకు లేదు అందుకు ఎఫ్‌ఎస్‌ఓ చట్టం కూడా అంగీకరించదు'' అని స్పష్టం చేసింది. పోస్టులు అందుబాటులోని లేని పక్షంలో ఫిర్యాదుదారుల కోసం అదనపు పోస్టులను సృష్టించాలని జార్ఖండ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే వారికి నియామకాలు జరిగిన తేదీ నుంచి మాత్రమే జీతభత్యాలు, సీనియారిటీ తదితర ప్రయోజనాలు అందుతాయని స్పష్టం చేసింది.



విద్యావనంలో నిషేధాజ్ఞల మంటలు

ప్రశాంతంగా ఉన్న విద్యావనంలో నిషేధాజ్ఞల పిడుగు మంటలు రేపుతోంది. నిరసనలతో విద్యార్థి సంఘాలు ఓయూ క్యాంపస్‌ను హోరెత్తిస్తున్నాయి. -10లో



భాగ్యనగరంలో.. అందాల ఆతిథ్యం

ప్రపంచవ్యాప్త సౌందర్యానికి ఆతిథ్యం ఇవ్వనుంది మన భాగ్యనగరం. మే నెలలో జరగనున్న మిస్ వరల్డ్ పోటీలతో భాగ్యనగరి మురిసిపోనుంది. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
34.0/19.0

వాతావరణం

నగరంలో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 34, కనిష్ఠంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



ఉప్పల్‌లో ఐపీఎల్ జోష్

నేడు రాజస్తాన్ రాయల్స్‌తో సన్ రైజర్స్ ఢీ

హైదరాబాద్ క్రికెట్ అభిమానులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న వేసవి వినోదం ఐపీఎల్‌–2025కు రంగం సిద్ధమైంది. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియం వేదికగా జరిగే మ్యాచ్‌లు ఫ్యాన్స్‌ను అలరించనున్నాయి. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి జరిగే పోరులో రాజస్తాన్ రాయల్స్‌తో సన్ రైజర్స్ హైదరాబాద్ తలపడుతుంది. గత ఏడాది పరుగుల వరద పారించి రికార్డులు సృష్టించిన హైదరాబాద్ టీమ్ నుంచి ఈసారి కూడా విధ్వంసక ప్రదర్శనను ఆశిస్తున్నారు 'హైదరాబాద్' అభిమానులు.



మ్యాచ్‌కు సిద్ధమైన ఉప్పల్ స్టేడియం



సన్‌రైజర్స్ ఆటగాడు అభిషేక్ శర్మ

హెచ్‌ఎండీఏలో ఏప్రిల్ నుంచి 'బిల్డ్ నౌ'

ట్రిపుల్ ఆర్ వరకు అనుమతులు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ)లో ఏప్రిల్ 4 నుంచి బిల్డ్ నౌ అందుబాటులోకి రానుంది. ఏప్రిల్ 8 నుంచి డీటీసీపీ పరిధిని అమల్లోకి తేనున్నారు. తాజాగా జీహెచ్‌ఎంసీలో ఈ సరికొత్త సాంకేతిక వ్యవస్థను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దశలవారీగా అన్ని మున్సిపల్ విభాగాల్లో బిల్డ్ నౌ అమలుకు సన్నాహాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు వరకు హెచ్‌ఎండీఏ పరిధి పెరిగిన దృష్ట్యా భవన నిర్మాణాలు, లే అవుట్‌లు తదితర అనుమతులు కూడా హెచ్‌ఎండీఏ నుంచి లభించనున్నాయి. రీజినల్ రింగ్‌రోడ్డు వెలుపల మిగిలి ఉన్న ప్రాంతాల్లో డీటీసీపీ నుంచి అనుమతులు లభించనున్నాయి. తాజా విస్తరణకు అనుగుణంగా అన్ని చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు చెప్పారు. ఈ మేరకు ప్లానింగ్ విభాగంలో విధులు నిర్వర్తించే అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

జలమండలి నీటితో కార్లు కడిగితే రూ.10 వేలు జరిమానా వేయండి

అధికారులను ఆదేశించిన మేయర్



కాలనీ వాసులు, అధికారులతో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: ఎండాకాలంలో నీటి ఎద్దడిని నివారించేందుకు జలమండలి అధికారులు ఎన్నో చర్యలు తీసుకుంటున్నారని, నగరవాసులు కూడా వారికి సహకరించాల్సిన అవసరం ఉందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శనివారం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ అసోసియేషన్ కార్యాలయంలో మేయర్ జలమండలి, జీహెచ్‌ఎంసీ, కాలనీ వాసులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. జలమండలి నీటితో కొంతమంది నిత్యం తమ కార్లు, ఇంటి ముందున్న బండలు, రోడ్లు కడుగుతున్నారని, వారికి నీటి విలువ తెలియడం లేదన్నారు. అలా ఇష్టారాజ్యంగా కార్లు కడుగుతున్న వారికి రూ.10 వేల జరిమానా విధించాలంటూ జలమండలి అధికారులను ఆమె ఆదేశించారు. అదే విధంగా ఎమ్మెల్యే కాలనీలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర కో–ఆపరేటివ్ సొసైటీ ఎమ్మెల్యే కాలనీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి, జలమండలి జీఎం హరిశంకర్, జీహెచ్‌ఎంసీ ఈఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అకాల వర్షం.. హైడ్రా అప్రమత్తం

అండర్ పాస్‌ల వద్ద సహాయక చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు అండర్ పాస్‌లు వరదనీటితో నిండిపోయాయి. దీనిపై సమాచారం అందుకున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) తమ అధీనంలోని డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను (డీఆర్‌ఎఫ్) రంగంలోకి దింపింది. కొండాపూర్‌లోని కొత్తగూడ, మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీల్లో అండర్ పాస్‌ల్లోకి చేరిన వరద నీటిని తోడేందుకు బల్దియా ఏర్పాటు చేసిన డీ వాటరింగ్ పంపులు పని చేయలేదు. దీంతో డీఆర్‌ఎఫ్ విభాగం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సతీష్ నేతృత్వంలో రెండు బృందాలు అక్కడకు చేరుకుని తమ వద్ద ఉన్న ఇంజిన్లతో ఆ నీటిని పక్కకు మళ్లించాయి. శనివారం ఉదయం 6 గంటల నుంచి మొదలైన ఈ ఆపరేషన్ కొత్తగూడ జంక్షన్‌లో ఉదయం 9.30 గంటకు, అయ్యప్ప సొసైటీలో మధ్యాహ్నం ఒంటి గంటకు పూర్తయింది. వీటితో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులపై నిలిచిన వరద నీటిని హైడ్రా బృందాలు తొలగించాయి. అయ్యప్ప సొసైటీ వంద ఫీట్ల రహదారి సమీపంలోని సిగ్నల్ వద్ద ఓ మూగజీవిని హైడ్రా రక్షించింది. ప్రమాదవశాత్తు అక్కడి మ్యాన్‌హోల్‌లో పడిపోయిన గేదెను డీఆర్‌ఎఫ్ బృందాలు కాపాడాయి.

డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి సహకరించండి

మంత్రి సీతక్క

సైదాబాద్: డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రజలు సహకరించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క సూచించారు. శనివారం సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ వ్యక్తుల సాధికారత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీతక్క మాట్లాడుతూ.. తెలంగాణలోని అబ్జర్వేషన్ హోం పిల్లల కోసం పైలట్ ప్రాజెక్ట్‌గా సైదాబాద్‌లోని హోంలో సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రంలో మాదక ద్రవ్యాలకు బానిసైన పిల్లలకు ప్రత్యేకంగా రూపొందించిన కౌన్సెలింగ్, వైద్య చికిత్సలు సహా అనేక సేవలను అందిస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, వికలాంగులు వయోవృద్ధుల శాఖ డైరెక్టర్ శైలజ, కాంతి వెస్లీ, సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



డీ అడిక్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

బోరు నీరు.. బేజారు!

కంగారెత్తిస్తున్న కఠిన జలాలు



- ఇదే నీటిని వినియోగిస్తున్న ప్రజలు
- స్నానాలు, ఇతర అవసరాలకు వాడకం
- ఊడిపోతున్న జుట్టు.. మారుతున్న చర్మం రంగు
- 'జర్నల్ ఆఫ్ కాస్మెటిక్ సైన్స్' సర్వేలో వెల్లడి
- గేటెడ్ కమ్యూనిటీల్లో తప్పని నీళ్ల గోస

జుట్టు ఊడుతోంది.

సురక్షిత నీటి సరఫరా లేని కారణంగా బోరు నీటినే వినియోగిస్తున్నాం. జుట్టు ఊడిపోవడం, జాయింట్ నొప్పులు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా జుట్టు రాలడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.
– కె అరుణ, ఏలియన్స్ టవర్స్, తెల్లాపూర్

సాక్షి, సిటీబ్యూరో:

మహా నగరానికి దూరంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రశాంతంగా జీవించేందుకు రూ.కోట్లాది వెచ్చించి గేటెడ్ కమ్యూనిటీల్లో విశాలమైన స్థలం, అద్భుతమైన సౌకర్యాలు, అత్యాధునిక వసతులగల విల్లాలు, ఫ్లాట్లు కొన్నామన్న సంతృప్తి కన్నా.. గుక్కెడు తాగునీరు కాదు కదా... స్నానాలకు వినియోగించే నీరు కూడా సురక్షితం లేకుండా పోతోంది. నీటి బాధలు నివాసితులను నిత్యం వెంటాడుతూ ఉన్నాయంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొందరు సురక్షితం కాని కఠిన బోరు నీటిని, మరికొందరు ఉప్పు హెచ్చుతగ్గులతో సరిగా శుద్ధి చేయని నీటిని స్నానాలకు వినియోగిస్తుండటంతో చర్మం, తల వెంట్రుకలపై దుష్ప్రభావం చూపుతున్నట్లు పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. చర్మం రంగు మారడం, దురదతో పాటు తల వెంట్రుకలు పలుచబడిపోతున్నట్లు తేలింది. ఆ నీటిని తాగితే మాత్రం శరీరంలోని అవయవాలపై తీవ్ర ప్రభావం చూపి అనారోగ్యం బారిన పడటం తథ్యమని రుజువవుతోంది.

సురక్షిత జలాలు కరువు

ఔటర్ రింగ్ రోడ్ లోపల, అవతల ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీలు, భారీ అపార్టుమెంట్లు పుట్టగొడుగులా పుట్టుకొస్తున్నాయి. అందులో 60 శాతం సముదాయాలు సురక్షిత నీరు లేక తల్లడిల్లుతున్నాయి. ఔటర్ రింగ్ రోడ్ మంచినీటి పథకం ఫేజ్–1, ఫేజ్–2 పరిధిలోని రిజర్వాయర్ నీటి సామర్థ్యం బట్టి ప్రధాన పైపులైన్‌కు అందుబాటులో ఉన్న సముదాయాలకు జలమండలి ద్వారా సురక్షిత నీరు సరఫరా అవుతున్నా.. మరికొన్నింటికి ఫిజిబిలిటీ లేక మంచి నీరు అందని ద్రాక్షగా మారింది. అందులో కొన్ని గేటెడ్ కమ్యూనిటీలకు ఫిజిబిలిటీ ఉన్నా.. నల్లా కనెక్షన్ కోసం ప్రధాన పైపులైన్ నుంచి బహుళ సముదాయాల వరకు మరో పైపులైన్ ఏర్పాటుకు డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించేందుకు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

ఇదీ పరిస్థితి..

శివారులో సుమారు 10 వేలకు పైగా గేటెడ్ కమ్యూనిటీలు, భారీ బహుళ అంతస్తుల భవన సముదాయాలున్నాయి. అందులో కేవలం 4,793 సముదాయాలకు మాత్రమే జలమండలి నీటిని సరఫరా చేస్తోంది. అందులో 4,493 ఎంఎస్‌బీ (మల్టీస్టోరేజీ బిల్డింగ్) కేటగిరీ, 300 బల్క్ కనెక్షన్లు ఉన్నట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరికొన్ని కమ్యూనిటీలు నల్లా కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోగా రిజర్వాయర్ నీటి సామర్థ్యం, అవసరమైన సాధ్యాసాధ్యాలను బట్టి జలమండలి కనెక్షన్లు మంజూరు చేస్తోంది.

శిరోజాలకు పోషకాలు అందక..

సాధారణంగా బోరు నీటిలో లవణాలు ఎక్కువ ఉండి కఠినత్వంగా ఉంటాయి. బోరు నీటితో తల స్నానం చేస్తే జుట్టు ఊడిపోవడానికి, జుట్టు పలుచబడడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి. బోరు నీటిలో ఉండే కాల్షియం, మెగ్నీషియం లాంటి ఖనిజాలు తలపై పలుచని గట్టిపొరను ఏర్పరుస్తాయి. దీని వల్ల జుట్టు కుదుళ్లు గట్టిపడి జుట్టుకి తేమ, సహజ తైలం అందక, సరిగా రక్తప్రసరణ జరగక జుట్టు బిరుసెక్కి, గట్టిపడి సహజ మెరుపును కోల్పోతుంది. పోషకాలు అందక జుట్టు చివర చిట్లిపోయి ఊడిపోతుంది. బోరు నీటిలో ఉండే ఖనిజాలు జుట్టుకు హానికరం. తల స్నానం చేసినప్పుడు సబ్బు సరిగా కరగకపోవచ్చు. దీంతో జుట్టులో మలినాలు మిగిలిపోయే ప్రమాదం ఉంది.

బోరు వాటర్‌తోనే నిత్యావసరాలు..

నగరంలో చాలా చోట్ల నిత్యావసరాలకు బోరు వాటర్ వినియోగిస్తుంటారు. దాదాపు బోరు నుంచి ఉప్పు నీరు వస్తుంటుంది. అనివార్యంగా ఆ నీటితోనే స్నానం చేయక తప్పదు. ఉప్పు నీళ్లతో తలస్నానం చేస్తే జుట్టు తెల్లబడిపోతుందా? జుట్టు దెబ్బ తింటుందా? అనే అనుమానం చాలా మందిలో వస్తుంటాయి. వాస్తవంగా వెంట్రుకల కుదుళ్లలో ఉండే మెలనోసైట్లు మన జుట్టుకు రంగును ఇస్తాయి. అయితే.. వయసు పెరిగే కొద్దీ మెలనోసైట్ల సంఖ్య తగ్గడంతో జుట్టు తన సహజ రంగును కోల్పోతుంది. కానీ.. చిన్న వయసులోనే జుట్టు తెల్లబడటానికి చాలా కారణాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు తరచుగా ఎక్కువసేపు ఉప్పు నీటితో తల స్నానం చేయడం వల్ల జుట్టు ఇంకా పొడిగా మారడం, రాలడం, వెంట్రుకలు చిట్లిపోవడం వంటి దుష్పరిణామాలు ఉంటాయన్నారు.

జర్నల్ ఆఫ్ కాస్మెటిక్ సర్వేలో..

ఉప్పు నీటితో తలస్నానం చేయడం వల్ల జుట్టుపై ప్రభావం పడుతుందా? అనే విషయంపై ఇటీవల 'జర్నల్ ఆఫ్ కాస్మెటిక్ సైన్స్' సంస్థ పరిశోధన నిర్వహించింది. 20 మందిని ఎంపిక చేసి రెండు గ్రూప్‌లుగా విడదీశారు. కొంత మంది జుట్టును మంచి నీటితో, మరికొంత మంది జుట్టుని ఉప్పు నీటితో కడిగారు. ఉప్పునీటితో కడిగిన జుట్టు మంచినీటితో కడిగిన దాని కంటే ఎక్కువ ఒత్తిడికి గురైనట్లు పరిశోధకులు గుర్తించారు. ఉప్పు నీటిలో కడిగిన జుట్టు మంచి నీటిలో కడిగిన జుట్టు కంటే ఎక్కువగా విరిగిపోయింది. ఉప్పు నీటితో తలస్నానం చేయడంతో జుట్టు నెరిసిపోతుందని తేల్చారు.

ఉప్పును తగిన మోతాదులో కలపకపోతే..

గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల భవన సముదాయల్లో బోరు నీటిని ఉప్పుతో శుద్ధి చేస్తుంటారు. ఆయా కుటుంబాలకు అవసరమైన నీటిని లెక్కగట్టి తగిన పాళ్లలో ఉప్పు కలిపి శుద్ధి ప్రకియ చేస్తారు. అయితే.. ఉప్పు తగిన మోతాదులో కలపకపోతే దుష్ప్రభావం చూపుతుంది.

చర్మ వ్యాధులు సంక్రమిస్తాయి..



బోరు నీరు తాగడానికే కాదు.. స్నానానికి కూడా పనికి రావు. శుద్ధి అవసరం. ఈ నీటిలో కాల్షియం, మెగ్నీషియం, ఫ్లోరైడ్ సాంద్రత అధికం. ఈ కఠిన జలం చర్మం, తలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. స్నానం చేయడం వల్ల క్రమేణా తలపై పలుచని గట్టి పొర ఏర్పడి రంధ్రాలు మూసుకుపోతాయి. చర్మ వ్యాధులు సంక్రమించే అవకాశముంది.
– డాక్టర్ దేశ్‌ముఖ్ ఉదయ్ రెడ్డి, చర్మ వ్యాధుల నిపుణులు, నిమ్స్

చర్మం పొడిబారుతోంది



బోరు నీటిని వినియోగిస్తున్నాం. ఆ నీటితో స్నానం చేస్తే చర్మం ఎర్రబడి పొడిబారిపోతోంది. దురద వేస్తోంది. 20 రోజులు మందులు వాడితే కాని తగ్గలేదు. వాషింగ్ మిషిన్‌లు పాడవుతున్నాయి. ప్రభుత్వానికి పన్ను చేస్తున్నా.. రక్షిత మంచినీరు అందడంలేదు.
– అమిత్ చౌదరి, ఆకృతి గేటెడ్ కమ్యూనిటీ

బోరు నీటి శుద్ధి తప్పనిసరి



బోరు నీరు కఠినంగా ఉంటుంది కాబట్టి తప్పనిసరిగా శుద్ధి చేయడం అవసరం. ఈ నీటిలో కాల్షియం, మెగ్నీషియం లాంటి ఖనిజాల ప్రభావం అధికంగా ఉంటుంది. ఉప్పుతో బోరు వాటర్‌ను సాఫ్టనర్ ప్రక్రియలో శుద్ధి చేయాల్సి ఉంటుంది. అలా చేయకుండా వినియోగిస్తే దుష్ప్రభావం చూపుతుంది.
– నవీన్, ఇంజినీర్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

పరీక్ష రాసి వస్తూ.. పైలోకాలకు..

గచ్చిబౌలి ఫ్లైఓవర్‌పై రోడ్డు ప్రమాదం

- ఎస్సెస్సీ విద్యార్థిని దుర్మరణం
- మృతురాలి సోదరుడికి గాయాలు



ప్రభాతి చత్రియా (ఫైల్)

రాయదుర్గం: గచ్చిబౌలి ఫ్లైఓవర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పదో తరగతి పరీక్ష రాసి సోదరుడితో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా డబుల్ డెక్కర్ బస్సు ఢీకొట్టడంతో విద్యార్థిని మృతి చెందింది. ఆమె సోదరుడు గాయాల పాలయ్యాడు. పోలీసుల చెప్పిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలిలోని టీఎన్‌జీఓ కాలనీలో ఉంటున్న పెనుదాస్ చత్రియా, సబితా చత్రియా దంపతులకు కుమారుడు సుమన్ చత్రియా, కుమార్తె ప్రభాతి చత్రియా (16) ఉన్నారు. ప్రభాతి చత్రియా రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆమె పదో తరగతి పరీక్షలు రాస్తోంది. శనివారం ఆమె పరీక్ష రాసిన అనంతరం సోదరుడు సుమన్ ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరింది. మార్గంమధ్యలో గచ్చిబౌలి ఫ్లైఓవర్‌పైకి రాగానే వీరి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి మితిమీరిన వేగంతో వచ్చిన డబుల్ డెక్కర్ ఎలక్ట్రికల్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న సుమన్ ఎడమ వైపు పడిపోగా ప్రభాతి కుడివైపు పడిపోయింది. బస్సు వెనుక చక్రం ప్రభాతి పైనుంచి వెళ్ళడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సుమన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రభాతి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. భవిష్యత్‌పై ఎన్నో ఆశలతో పదో తరగతి పరీక్షలు రాస్తున్న తమ కుమార్తె రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో ప్రభాతి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించిన దృశ్యం స్థానికులను కంటతడి పెట్టించింది.

ఆస్తుల పరిరక్షణకు.. డీజీపీ'ఎస్'

ఈ సర్వేతో అంగుళం స్థలం కూడా కబ్జా కాదు

- పార్కులు, లే ఔట్లు, ఇతర స్థలాలకు రక్షణ
- టెక్నాలజీ వినియోగంలో జీహెచ్‌ఎంసీ మరో అడుగు



సాక్షి, సిటీబ్యూరో: సంస్థ ఆస్తుల పరిరక్షణ, అక్రమాల కట్టడికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్న జీహెచ్‌ఎంసీ మరో ముందడుగు వేయనుంది. జీహెచ్‌ఎంసీకి సంబంధించి ఎన్నో ఆస్తులున్నాయి. వాటిపై తగిన శ్రద్ధ, పర్యవేక్షణ లేకపోవడంతో కమ్యూనిటీ హాళ్ల నుంచి పార్కుల దాకా ఇప్పటికే ఎన్నో కబ్జాలు జరిగాయి. పలు ఆస్తులు ఆక్రమణదారుల పరమయ్యాయి. వీటితో పాటు లే ఔట్‌లలోని ప్రభుత్వ స్థలాలు తదితరాలు సైతం బడాబాబులకు కాసులు కురిపించే కల్పతరువులయ్యాయి. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ పరిధిలోని కార్పొరేషన్ ఆస్తులతోపాటు ప్రభుత్వ ఆస్తులు కూడా పరిరక్షించేందుకు, కబ్జాల పాలు కాకుండా ఉండేందుకు మరో ఆధునిక సాంకేతికతను వినియోగించుకునేందుకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. అదే డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (డీజీపీఎస్) సర్వే.

జీపీఎస్ కన్నా ఉత్తమం..

జీపీఎస్ గురించి అందరికీ తెలిసిందే. దానికంటే ఉన్నతమైనది డీజీపీఎస్. ఈ సర్వేతో ఆయా ఆస్తులు, స్థలాల సర్వే, మ్యాపింగ్ తదితర అంశాల్లో అంగుళం వరకు కచ్చితత్వం ఉంటుంది. ఇందులో రెండు జీపీఎస్ రిసీవర్లను వినియోగిస్తారు. నిర్ణీత ప్రదేశానికి సంబంధించి జీపీఎస్ సిగ్నల్స్‌కు, ఉపగ్రహం సూచించిన ప్రదేశానికిమధ్య ఉండే ఎర్రర్స్ ఫీల్డ్‌లోని మొబైల్ (రోవర్) డీజీపీఎస్ రిసీవర్లకు ట్రాన్స్‌మిట్ అవుతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ విధానం వల్ల అంగుళం వరకు కచ్చితత్వం ఉంటుందని తెలిపారు. జీపీఎస్‌లో 10 నుంచి 15 మీటర్ల వరకు వ్యత్యాసముంటుందన్నారు. డీజీపీఎస్‌తో అంగుళం స్థలం కూడా తేడా రాకుండా కచ్చితంగా తెలుస్తుందన్నారు. డీజీపీస్ సర్వేతో పార్కులు సహా జీహెచ్‌ఎంసీ ఆస్తులన్నింటినీ, ఆయా లే ఔట్లలోని ప్రభుత్వ స్థలాల్ని, మ్యాపింగ్ చేయనున్నారు.

ప్రయోగాత్మకంగా ఒక జోన్‌లో..

డీజీపీఎస్ సర్వేను తొలుత ఒక జోన్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టి, అనంతరం అన్ని జోన్లలోనూ నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ భావిస్తోంది. ఇప్పటికే పరుల పాలైన జీహెచ్‌ఎంసీకి చెందిన ఆస్తులు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు తదితరమైన వాటిని కూడా గుర్తించి పరిరక్షించాలనేది కార్పొరేషన్ లక్ష్యం. నగరంలో భూముల విలువ కోట్లలో ఉండటంతో అంగుళం స్థలం కూడా పోనివ్వకుండా ఉండేందుకు ఈ సర్వేకు సిద్ధమవుతున్నారు.

విద్యుత్ స్తంభాలకు సైతం ఐడీలు..

ప్రతి రోడ్డుకూ ఒక ప్రత్యేక ఐడీ ఇవ్వాలని భావించిన జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న విమర్శలతో విద్యుత్ విభాగంలోనూ ఆధునిక సాంకేతికతను వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. అన్ని విద్యుత్ స్తంభాలు, కనెక్షన్లు, వినియోగిస్తున్న విద్యుత్ తదితరమైనవి పక్కాగా లెక్క తెలిసేలా స్తంభాలకు ఐడీలు, క్యూఆర్ కోడ్‌లు, పర్యవేక్షణకు యాప్స్ వంటివి వినియోగించనున్నారు. రోడ్ల చరిత్ర మాదిరే ఐడీతో స్తంభం ఏర్పాటు నుంచి దానికి అమర్చిన బల్బులు.. ఎంత కాలం పనిచేశాయి.. కొత్తవి ఎప్పుడు వేశారు? తదితర వివరాలన్నీ తెలుస్తాయని అధికారులు పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీపై ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న విమర్శల్లో అక్రమాలకు సంబంధించి టౌన్‌ప్లానింగ్ విభాగం అగ్ర స్థానంలో ఉండగా, నిర్వహణ లేమిలో విద్యుత్ విభాగం ఉంది. చీకట్లో మగ్గుతున్నామని ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా నిర్వహణలేమి, అక్రమాలతో పరిష్కారం కావడం లేదు. చేయబోయే పనులతో వాటికి తెర పడుతుందని భావిస్తున్నారు.

మతి స్థిమితంలేని వ్యక్తి బీభత్సం

– బాలికపై కత్తితో దాడి..చికిత్స పొందుతూ మృతి

పోచారం: ఆరేళ్ల బాలికపై మతిస్థిమితంలేని ఓ వ్యక్తి కత్తితో దాడి చేయగా..మృతి చెందిన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజు తెలిపిన ప్రకారం..బిహార్‌కు చెందిన జగేశ్వర్ పోచారంలోని లేబర్ క్యాంపులో ఉంటూ ఇన్ఫోసిస్‌లో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతని కుమార్తె రియా కుమారి (6) శనివారం మధ్యాహ్నం ఇంటివద్ద నడుచుకుంటూ వెళ్తుండగా...పశ్చిమ బెంగాల్‌కు చెందిన హప్నా హెమ్‌బ్రూమ్ (30) అనే వ్యక్తి ఒక్కసారిగా కత్తితో దాడి చేసి పొడిచాడు. అనంతరం జాతీయ రహదారిపైకి వచ్చి ఆటోలు, కార్లు ధ్వంసం చేశాడు. మతి స్థిమితం లేకపోవడంతో ఇలా ప్రవర్తిస్తున్నాడని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడిలో గాయపడిన బాలిక ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగా జగేశ్వర్ శుక్రవారం నుంచే ఇక్కడ కార్మికుడిగా విధుల్లో చేరగా మరుసటి రోజే ఈ ఘటన చోటు చేసుకుందని స్థానికులు వెల్లడించారు.

బంగారం కొనుగోలు పేరిట ఘరానా మోసం

- అరకిలో బంగారం, 18 వేల డాలర్లతో ఉడాయించిన కేటుగాడు
- గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

రాయదుర్గం: బంగారం కొనుగోలు పేరిట ఇద్దరు వ్యాపారులను బురిడీ కొట్టించిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గచ్చిబౌలి డీఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నార్సింగికి చెందిన చంద్రశేఖర్ అనే బంగారం వ్యాపారి హోటళ్లకు వెళ్లి..అక్కడ బసచేసే వారిని కలిసి బంగారు ఆభరణాలను విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల 20వ తేదీన గచ్చిబౌలిలోని డీఎల్ఎఫ్ ఐటీ పార్కు రోడ్డులో ఉన్న సితార హోటల్‌కు వెళ్లగా స్టీవ్ గాడ్విన్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తనకు 50 తులాల బంగారు బిస్కెట్లతోపాటు 18 వేల అమెరికన్ డాలర్లు కావాలని అతన్ని కోరాడు. అతడు చెప్పిన మాటలు చంద్రశేఖర్ పూర్తిగా నమ్మాడు. ఇదే విషయాన్ని తన స్నేహితుడైన రఫీకి చెప్పాడు, దీంతో ఇద్దరు తమ వద్ద ఉన్న బంగారు బిస్కెట్లు, అమెరికన్ డాలర్లు తీసుకొని ఈ నెల 21వ తేదీన స్టీవ్‌కు ఫోన్ చేశారు. గచ్చిబౌలిలో మూతపడిన సెంట్రల్ మాల్‌పై ఉన్న తన కార్యాలయానికి వాటిని తీసుకొని రమ్మని చెప్పడంతో ఇద్దరు అక్కడికి వెళ్లారు. ఆ భవనంలోని నాలుగవ అంతస్తులోకి వెళ్గానే స్టీవ్ తన వద్ద ఉన్న యాక్సెస్ కార్డు స్వైప్ చేసి ఇద్దరినీ ఓ అద్దాల గది లోపలికి తీసుకెళ్లాడు. ఆ తర్వాత వారిద్దరి నుంచి బంగారం బిస్కెట్లు, అమెరికన్ డాలర్లు తీసుకున్న స్టీవ్ ఇప్పుడే డబ్బు తీసుకొస్తానని చెప్పి..వారి దృష్టి మళ్లేలా చేసి అక్కడి నుంచి ఉడాయించాడు. ఇది గమనించిన వ్యాపారులు అతన్ని వెంబడించే ప్రయత్నం చేయగా..యాక్సెస్ కార్డు లేకపోవడంతో డోర్ ఓపెన్‌కాక కాసేపు అక్కడే చిక్కుకొని పోయారు. ఈ లోపు ఆ కేటుగాడు అక్కడి నుంచి కిందకు దిగి కారులో పారిపోయాడు, ఈ మేరకు బాధితులు గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ఆరంభించారు. అయితే నిందితుడు ఉపయోగించిన కారును కొండాపూర్లో అద్దెకు తీసుకున్నట్లు పోలీసులు తమ విచారణలో తేల్చారు. అతను బెంగళూరుకు చెందినవాడుగా గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు.

సుచిర్ ఇండియా సంస్థపై సీసీఎస్‌లో కేసు

సాక్షి, సిటీబ్యూరో: టీజీఎస్‌ఆర్టీసీ ఆస్తుల్ని లీజుకు తీసుకుని, వాటి ద్వారా లాభాలు పొందుతూ చెల్లింపులు చేయని సుచిర్ ఇండియా సంస్థతో పాటు సంస్థ ఎండీ కిరణ్‌కుమార్‌పై నగర నేర పరిశోధన విభాగంలో (సీసీఎస్) కేసు నమోదైంది. బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణమండలం, కళాభవన్‌లను ఐదేళ్ల పాటు నిర్వహణ కోసం టీజీఎస్ ఆర్టీసీ సంస్థ 2017 జూలై 17న సుచిర్ ఇండియా హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం ప్రకారం వీరి సేవలు సంతృప్తికరంగా ఉంటే నెలవారీ లైసెన్స్ ఫీజు చెల్లించే విధంగా మరో ఐదేళ్లు పొడిగించుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఎలాంటి ఫీజులూ చెల్లించని సుచిర్‌ఇండియా సంస్థ ఆ రెండు ఆస్తులను తమ ఆధీనంలో ఉంచుకుని ఆర్టీసీకి నష్టం వచ్చేలా వ్యవహరించింది. చివరకు సుచిర్ ఇండియా రూ.6.55 కోట్లు ఆర్టీసీకి బకాయిపడింది. బకాయిల వసూళ్ల కోసం అనేకసార్లు సంప్రదింపులు జరిపినా ఫలితం లేకపోవడంతో టీజీఎస్‌ఆర్టీసీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎ.శ్రీధర్ ఫిర్యాదు మేరకు శనివారం సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ట్రేడింగ్ ఫ్రాడ్‌లో అకౌంట్ హోల్డర్ అరెస్టు

- సికింద్రాబాద్ వాసి నుంచి రూ.1.22 కోట్లు స్వాహా
- సూత్రధారులకు ఖాతాలు ఇచ్చిన యూపీ నివాసి
- అరెస్టు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: టెలిగ్రామ్ ద్వారా వల వేసి, ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని ఎర వేసి, సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి నుంచి రూ.1.22 కోట్లు కాజేసిన కేసులో ఓ నిందితుడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారులకు అవసరమైన బ్యాంకు ఖాతాలను అందించిన అంకిత్ అరోరాను ఉత్తరప్రదేశ్‌లో పట్టుకున్నట్లు డీసీపీ దార కవిత శనివారం తెలిపారు. సైబర్ నేరగాళ్లు బాధితుడిని గత ఏడాది టెలిగ్రాం యాప్ ద్వారా సంప్రదించారు. ఇతడిని ఓ గ్రూపులో చేర్చిన కేటుగాళ్లు తొలినాళ్లల్లో ట్రేడింగ్‌కు అవసరమైన టిప్స్ ఇచ్చారు. కొన్నాళ్లకు తాము అందించే ట్రేడింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పి ఆ లింకు పంపారు. దాని ద్వారా ట్రేడింగ్ పేరుతో డబ్బు బదిలీ చేయించుకున్నారు. ఇలా మొత్తం రూ.1,22,87,120 బదిలీ చేసిన తర్వాత తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఏసీపీ ఆర్‌జీ శివమారుతి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాద్‌రావు బృందం ఈ కేసు దర్యాప్తు చేసింది. బాధితుడి నగదు బదిలీ అయిన బ్యాంకు ఖాతాల ఆధారంగా ముందుకు వెళ్లిన పోలీసులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంకిత్ అగర్వాల్‌కు చెందినవిగా గుర్తించారు. ఇతగాడు సూత్రధారుల ఆదేశాల మేరకు కమీషన్ తీసుకుంటూ పని చేస్తూ, వారికి అవసరమైన బ్యాంకు ఖాతాలు అందిస్తుంటాడు. ఇలా దాదాపు రూ.6 కోట్ల ఇతడి బ్యాంకు ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లకు చేరాయి. అంకిత్‌ను అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి కోసం లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) జారీ చేస్తున్నారు.

హోరాహోరీగా బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రచారం

సిటీ కోర్టులు: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యింది. వచ్చేనెల 4న బార్ అసోసియేషన్ ఎన్నికలు ఉండ టంతో ఎన్నికల ప్రచారం హోరాహోరీగా జరుగుతోంది. ప్రతియేడాది బార్ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈసారి మార్చి 31లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని తెలంగాణ బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు అన్ని బార్ అసోసియేషన్లకు నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి క్రిమినల్ కోర్టు, సిటీ సివిల్ కోర్టుతోపాటు ఇతర కోర్టుల బార్ అసోసియేషన్ల ఎన్నికల నామినేషన్ల పర్వం శుక్రవారం ముగిసింది. దీంతో ఎన్నికల అధికారులు స్క్రూటినీని శనివా రం పూర్తి చేసి పోటీలో ఉన్నవారి పేర్లను విడుదల చేశారు. నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల పోటీలో ముగ్గు రు అభ్యర్థులు ఏకగ్రీవం అయిన ట్లు అధి కారులు తెలిపారు. సంయుక్త కార్యదర్శి గా గోసి, లేడీ రిప్రజెంటేటివ్‌గా పద్మావతి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీగా సాయిచంద్ ఎన్నికైనట్లు ప్రకటించారు.



సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

- Last Chance 10th. Inter Direct Degree (Dist), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma MA, M.Com, M.Sc, MBA MCA Regular/ Lateral Entry Ph: 9490577501 [H-783371]

Real Estate

- సాగర్ హైవే ఫార్మ్ ల్యాండ్స్ గుంట 3 లక్షలు EMI సౌకర్యం కలదు. యాదాద్రి, షాద్‌నగర్, సదాశివపేట, షాబాద్‌లో ప్లాట్స్ కలవు. సుధారాణి రెడ్డి. 6281387190 [SCA25002353]

COMMERCIAL

- Karmanghat, Bhagyanagar Colony, Road No.4, Plot No.8, Near Nagendra Theatre G+4 floors, 9000 sft, New Building Suitable for Banks. Hospital, College, Schools, Hostels & Corporate Offices. Ph: 9885615909 [HA-15126]

FOR SALE

- తిరుపతి జిల్లా ఓజిలి మండలం ఆర్మేనుపాడు గ్రామంలో 133 ఎకరముల పండ్లతోట అమ్మకమునకు కలదు సంప్రదించండి: 94401 83778 [SCA25002282]
- Readymade Garment (Good Running) Showroom For Sale @ Malkajgiri Main road Price Rs.1.5 Cr. (Negotiable) Ph.9032509998 [SCA25002347]

FLAT FOR SALE

- BN రెడ్డి నగర్‌లో 3BHK Flats అమ్మబడును. & ఫ్యూచర్ సిటీ పరిధిలో ప్లాట్లు & భూములు అమ్మబడును, కొనబడును. 9866115508 [SCA25002331]
- HMDA & RERA అప్రూవ్డ్ లగ్జరీ అపార్ట్‌మెంట్ శంషాబాద్ ఎయిర్‌పోర్టు దగ్గరలో తుక్కుగూడ వద్ద కలవు. క్లబ్ హౌస్, గే.క. 75% లోన్. 7680829195 [HA-1077]
- Secunderabad PadmaRao nagar Skandagiri Temple Line 3BHK, 1525sft, NE Face Rs.1.15Cr(Neg) Gated community 9849437463 [SCA25002161]
- 3BHK Flats for Sale in Doctors Colony, LB Nagar, (M) 7997846999 [HA-09931]
- Peddaamberpeta, Sai Nagar, Vijayawada Highway, W/F 2200 sft, 1 Flat for Floor, Lift + Car Parking. Ph: 7842304717. 8985193039 [HA-15121]
- D.V. Township, Old Safilguda, Block - 6, 2BHK, 920 Sft, W/F, 42L. Block -5, 3BHK, 1820 sft W/F, Woodwork, 75L. Near Dr. A.S.Rao Nagar. Ph: 9000252815 [HA-00149]
- New Flats for Sale at Surya Nagar Alwal, 1125Sft, 2BHK, 1st, 2nd, 3rd, 4th floors, Ready to Occupy, 5000 per sq.ft, UDS 48 sq.yds per flat, Loan Available No Brokers. Ph:9703361333 [HA-6310]

HOUSE FOR SALE

- హయత్‌నగర్ మునగనూరు బ్యాంక్ కాలనీలో 200 చ॥గ॥ S/F 1600 Sft కొత్త ఇల్లు అమ్మకానికి కలదు. త్రాగునీరు. డ్రైనేజీ కూడా కలదు. కేవలం 95L. Ph: 9849688626. HA-2992]

LEASE / RENT



LAND FOR SALE

- 100 అడుగుల మెయిన్ రోడ్‌కి 3వ ప్లాటు 296 గజాల N/W కార్నర్ ప్లాటు అమ్మబడును @ మహేశ్వరం టౌన్, ఇండ్లకు-బస్‌స్టాప్ ఆనుకొని DTCP ఫైనల్ అప్రూవల్ Rs:11 వేలు గజం. Ph: 9966521191 [H-800529]
- Mumbai Highway 200 Feet Road, North Facing 2.25 Acres clear title Land for Sale with NA near To Woxen University Beside Residential Zone, 7396602495 / 8297771369. [HA-1263]

LEASE / RENT

- అబిడ్స్ మంచి రన్నింగ్‌లో ఉన్న Mess అద్దెకు (RENT) ఇవ్వబడును. సంప్ర॥ 8885533534, 9966157735 [SCA25002340]

PLOT FOR SALE

- 121 చ.గ. ఫాంల్యాండ్ ప్లాట్లు కే॥ 2,42,000/- మాత్రమే. చేర్యాల దగ్గర లో & యాదగిరిగుట్ట నెమిలి దగ్గరలో DTCP ప్లాట్లు కలవు. 8978817689 [SCA25002345]
- షాద్‌నగర్ బాలానగర్ గేటెడ్ కమ్యూనిటీ 150 గ.కే. 22లక్షలకే 250 పడకల ఆసుపత్రి కట్టిస్తున్నాం ముడా&రెరా అప్రూవల్ ఫోన్ 7997199712 [SCA25002158]
- సాగర్ హైవే, శ్రీశైలం హైవేలో Future సిటీకి దగ్గర్లో DTCP అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్స్ కలవు. EMI + బ్యాంక్ లోన్. Ph: 9701893302/9398495831 [HA-5051]
- కమర్షియల్ Plots for Sale శ్రీశైలం హైవే ఫేసింగ్ @ కందుకూరు, గేటెడ్ కమ్యూనిటీ, Near Future City, 4th City. Ph: 9849905169 [HA-15168]
- Uppal Dwaraka Nagar 180 Sq Yds, W/F, Well Developed, 40' Road, 1 KM From Highway, Nr. Balaji Hills, No Brokers. Ph: 9246508927 [HA-15170]
- Thimmaipally (Silent wald) 800 Yds west facing open plot or sale @ 8,000/- p.yd. Neg. Clear Title. L.R.S. Paid. Suitable for investment. Cont: 7893992268 [HA-00173]

TO-LET

- 4200sft, For Rent 3rd floor at Narsingi main road in A grade construction building @Rs45 Per/Sft call 9396701666 / 9393887766. [HA-46062]
- Rent for 3 Bedroom Flat First Floor, North East Facing at Religance Elegance, Majid Bunda, Kondapur, Hyderabad. Only families Can Contact Phone: 9949856075. Execuse for Brokers. [SCA25002266]
- 2BHK Flat with 3 A/C, 3rd Floor rent available. No lift and water supply in Karuna Shri Apartment, Behind Rail Nilayam Office, Teacher Colony. East Maredpally. Ph:6302599572 [HA-00174]

PLOT FOR SALE
VIVEKANANDA NAGAR COLONY, KUKATPALLY
Adjacent 1 Acre Vinayak park
150 Sq. YARD'S, 30x45 FEET
EAST & WEST Facing Roads
Ph: 96663 91787
TIMINGS: 10am to 7pm only

Services

BUSINESS SERVICE

- మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800528]

BUSINESS OFFER

- టెక్నికల్ అనాలిసిస్ చాలా సులభంగా ఇంట్రాడే, పోజిషనల్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్. సంప్ర: 9885207852 [W-SCA25002300]
- Hyd లో Own House ఉన్న వారికి Govt Employee surety/ ITRS లేకుండా 5 లక్షల నుండి 50 లక్షల కమిట్‌మెంట్ చిట్స్ ఇవ్వబడును. 9160084120 [HA-15488]
- Mortgage Housing personal & Business loan service 10 Lakhs & above in All National & Private Banks & NBFC's. No Advances. 9394671800 [SCA25002356]

HEALTH CARE

AYURVEDIC

- పిప్పిపళ్ళునొప్పి, నోటిదుర్వాసన, పళ్ళు గట్టిపడుటకు, నోట్లోపుళ్లు, అన్ని రకాల పంటి సమస్యలకు ఈ ఆయుర్వేదపౌడర్ వాడండి. గమనిక: ఈ పౌడర్ 5 రోజులు మాత్రమే వాడాలి 100% గ్యారంటీ. ఫోన్: 8125662795 [SCA25002048]

PERSONAL CARE

LOST

- I, Vijay Jonnavithula S/o Late J.Vidya Sagar R/o: Plot No.2, H.No:8-7-78/B HAL Colony, SRDG School Park, Old Bowenpally, Hyd. Lost Original Sale Deed Doc No. 5051/2004 Dt:17.04.24 Survey No. 223/D, 223/D,2 223/D/3 223/B 500 Sqyds Situated Muthangi Village, Patancheru SRO Sanga reddy While Travelling Bowenpally to Film Nagar If Anyone Find Call:9866372126 [SCA25002320]

OLD AGE HOME

- వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచానున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్ చీర్యాల్ 'x' రోడ్ భోజన వసతితో. 7981467036, 9391039990, 9949520296 [H-783370]

TOURS & TRAVELS

- సాయి టూర్స్ మార్చి 31 కర్ణాటక ఉడిపి గోకర్ణ, శృంగేరి. ఏప్రిల్ 7 రామేశ్వరం, మధురై, ఏప్రిల్ 19 మహారాష్ట్ర షిరిడి, భీమశంకర్, మే 7 గుజరాత్ 9848664831 [SCA25002185]
- 16/04/25. అయోధ్య, కాశీ, నేపాల్, ముక్తినాథ్ యాత్ర & 09/05/25. సరస్వతి పుష్కరాలు, చార్‌ధామ్ యాత్ర. రై+బ+భో+వ. భాగ్యలక్ష్మి టూర్స్. ఫోన్ 9397617094 [HA-00171]

TRANSLATIONS

- All Kinds of Bulk or Part Translations are Under Taken in English, Telugu, Hindi, Kannada, Tamil, Malayalam, Urdu, etc at Affordable Rates Dr.Manthena. Ph: 9951868349 [HA-4011]

Wanted

- త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ: 18k ఫోన్: 9640400073, 9160900024 [SCA25002324]
- 75Km నాగపూర్ హైవే, రామాయంపేట్ మెయిన్ రోడ్డు ఉన్న చిన్న మామిడి తోటలో అక్కడే వుండి పనిచేయుటకు పనిమనిషి కావలెను. Contact: 9848054586, 9000624586 [HA-00175]
- ప్రముఖ MNC కంపెనీ నందు పని చేయుటకు B.Tech/ డిగ్రీ (Fresher's) 2022 to 2025 Batches Only కావలెను. ఫోన్: 9000576621 [SCA25002308]
- బజేద్య అసోసియేషన్ ఆథరైజ్డ్ IFB సర్వీస్ సెంటర్ చందానగర్ నందు టెలి కాలర్స్ & టెక్నీషియన్స్ కావలెను. Q: 10th, ఇంటర్, ITI. ఫోన్ 9963759979, 9966555565 [SCA25002298]
- వంట, ఇంటి పని, పిల్లలను, పేషెంట్స్‌ని చూసుకోవడానికి కేర్ టేకర్స్ పంపబడును. ఫోన్: 6309807798, 9121099519 స్త్రీ/పు వర్కర్స్ కావలెను. [SCA25002183]
- పనివారు కావలెను. Hyd/ బెంగళూరు లో ఉండి ఇంటి, వంట పని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకి స్త్రీలు కావలెను. 9391912949, 0404012337 [SCA25001934]
- AVR ఇన్‌స్టెంట్ గులాబ్ జామున్ మిక్స్ మరియు సేమియా పాయసం మిక్స్ (2+1) డోర్ టు డోర్ మార్కెటింగ్ చేయుటకు స్త్రీ & పు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఫోన్: 9618154354 [SCA25002045]
- HYDలోని 5స్టార్ హోటల్స్‌లో పనిచేయుటకు క్యాటరింగ్ బాయ్స్ & హెల్పర్స్ కావలెను. జీ:12-16K రూమ్+ఫుడ్ ఇది కన్సల్టెన్సీ కాదు. age 18-30. Ph: 9989978685 [SCA25002227]
- Hyd టాప్ కన్సల్టెన్సీలో పనిచేయుటకు డిగ్రీ చదివిన 30 మంది (F) కావలెను. ఫిక్స్‌డ్ జీతం 10–15 వేలు+ Inc. దిల్‌సుఖ్‌నగర్. Ph: 9849756992 [SCA25002270]
- యాదాద్రి భువనగిరి, వలిగొండ మండలం, టేకులసోమారం విలేజ్‌లో గోడౌన్ మెయింటైన్ చేయుటకు సూపర్‌వైజర్ కావలెను. జీతం : 14000/-. సంప్ర: 9177563939 [HA-2060]
- ప్రముఖ రియల్ ఎస్టేట్ కం॥కి Directors, GM's, మేనేజర్స్ (M/F) కావలెను. శాలరీ+ఇన్సెంటివ్స్ నెలకు లక్ష పైన సంపాదించు. 9000805298 [HA-1055]
- హైదరాబాద్‌లో ఇంట్లోనే ఉండి ఇంటి, వంట పనికి, పిల్లలను, పెద్దలను చూసుకొనుటకు ఆడవాళ్లు కావలెను. జీతం 18-30K. ఫోన్ 8019373131 [H-800524]
- Hyd లో పనిచేయడానికి సెక్యూరిటీ ఆఫీసర్లు M-1, సెక్యూరిటీ సూపర్‌వైజర్ M-2, రిసెప్షనిస్ట్ F-1 కావలెను any Degree. Cell: 8019484141 [W-SCA25002247]
- మార్కెటింగ్ చేయుటకు Females కావలెను టు వీలర్ మస్ట్ కూకట్‌పల్లి చుట్టూ ప్రక్కల ప్రాంతాల వారు సంప్రదించండి: 9502268754/9949987561 [HA-33842]
- డ్యూటి డాక్టర్ (BAMS/ BHMS/ Pharma D/ MBBS) సురక్ష పీపుల్స్ హాస్పిటల్, అచ్చంపేట పట్టణం, నాగర్‌కర్నూల్ జిల్లాకు కావలెను. హైదరబాద్ నుండి కేవలం 120 కి.మీ దూరంలో, శ్రీశైలం హైవేకి దగ్గరలో, Free Accommodation, Salary Negotiable. వెంటనే సంప్రదించండి. సెల్:7013008171, 9440450434. [J-1086417]
- Wanted helpers for water plant speaking hindi compulsory Contact Number 9704148270 9000466300 [SCA25002350]
- WANTED Female Telecaller GVR Educational Academy Any Degree Goodsalary +incentive Chaitanyapuri DSNR9666072099. [SCA25002271]
- Wanted Graduates For Site Accountants & Civil Engineers Work place: Karnataka/ Maharashtra/Telangana. Company name: PVC PROJECTS Contact: 040-23338080, 8019538080, Email: adm.vineela@gmail.com (Interview venue: Punjagutta) [HA-804391]

FACULTY TEACHERS

- Wanted Teachers, PRO's & Drivers For St.paul's High School Aushapur, Hyderabad. Contact: 9989602252, 9515405001 [HA-34115]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికం 37, పచ్చి కాకరకాయ 40, పందిరిబీర 38, క్యాబేజీ 8, క్యారెట్ 15, దొండకాయ 40, గుండు బీన్స్ 45, గింజచిక్కుడు 50, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 43, మొరంగడ్డ 23, కందగడ్డ 60, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ 9, పొట్లకాయ 20, అరటికాయ 9, మునగకాయ 4, మామిడికాయ 35, ముల్లంగి 4-5.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఫిలింనగర్: ఫిలింనగర్ దీన్‌దయాళ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆశ్రయ్ ఆకృతి (ఎన్జీఓ) సంస్థ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు బస్తీ అధ్యక్షుడు బస్వరాజ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే వైద్య శిబిరంలో ఈఎన్‌టీకి సంబంధించిన సమస్యలకు వైద్య పరీక్షలు జరపనున్నట్లు పేర్కొన్నారు. చెవిలో ఉండే మలినం, వ్యర్థ పదార్థాలు, ఇతర చెవి సంబంధిత సమస్యలపై పరీక్షలు చేస్తారన్నారు. అలాగే వినికిడికి సంబంధించిన ప్రాథమిక సమస్యలకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. కాలనీవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


మైనార్టీ మహిళపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయండి

ఫిలింనగర్: ముస్లిం మైనార్టీ మహిళపై దాడి చేసిన వారిని గుర్తించి కేసు నమోదు చేయాలని తెలంగాణ మైనార్టీ కమిషన్ బంజారాహిల్స్ పోలీసులను ఆదేశించింది. వివరాలివీ... ఫిలింనగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్‌నగర్ బస్తీలో నివసించే చినాజ్‌బేగంను 2019 నవంబర్ 13న స్థానికంగా నివసించే కొంతమంది కొట్టారు. దీంతో ఆమె తెలంగాణ మైనార్టీ కమిషన్‌ను ఆశ్రయించి తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదు చేసింది. దీంతో కమిషన్ నాలుగు సార్లు బంజారాహిల్స్ పోలీసులకు ఆదేశాలు జారీ చేస్తూ చినాజ్‌బేగంపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాల్సిందిగా సూచించింది. ఈ అభ్యర్థనను పోలీసులు పట్టించుకోకపోవడంతో గత ఫిబ్రవరి 11వ తేదీన బాధిత మహిళ మరోసారి కమిషన్‌ను ఆశ్రయించింది. తాము ఇప్పటికే నాలుగుసార్లు కేసు నమోదు చేయాలంటూ సూచించడం జరిగిందని, ఇది ఐదోసారి అని, ఈ సారి ఎట్టిపరిస్థితుల్లోనూ సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలంటూ ఈ నెల 18వ తేదీన మరోసారి కమిషన్ పోలీసులను కోరింది.

దోమలపై యుద్ధం!

- దోమల బెడదపై ఫిర్యాదు చేయండిలా...
- మై జీహెచ్‌ఎంసీ యాప్‌లో అభ్యర్థన పెట్టండి
- వెంటనే అధికారులు స్పందిస్తారు
- క్షేత్రస్థాయిలో ఫాగింగ్ చేస్తారు
- మంచి అవకాశం అంటున్న అధికారులు


జూబ్లీహిల్స్‌లో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న ఎంటమాలజిస్ట్ సిబ్బంది



బంజారాహిల్స్: దోమల నివారణపై జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఎప్పటికప్పుడు దోమల నివారణ కోసం ఫాగింగ్ చేస్తున్నా ఇంకా కొన్ని ప్రాంతాల్లో దోమల బెడద తీవ్రంగా ఉన్నట్లు జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం అధికారులకు, సిబ్బందికి రోజూ ఫిర్యాదులు అందుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని దోమల తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక యాప్ ద్వారా 'అభ్యర్థన పెట్టండి-ఫాగింగ్ చేస్తాం' అంటూ అధునాతన సాంకేతిక సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. మీ ఏరియాలో దోమల తీవ్రత ఎక్కువగా ఉందా? మా సిబ్బంది అక్కడ ఫాగింగ్ చేయడం లేదా? నివారణ చర్యలపై సిబ్బంది స్పందించడం లేదా? అయితే 'మై జీహెచ్‌ఎంసీ' యాప్‌లో అభ్యర్థన పెడితే వెంటనే ఎంటమాలజీ సిబ్బంది అక్కడికి వచ్చి ఫాగింగ్ చేస్తారంటూ ఈ అధునాతన సేవలను పౌరులకు వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇందుకోసం యాప్‌లో ప్రత్యేకంగా 'రిక్వెస్ట్ ఆప్షన్'ను అందుబాటులోకి తెచ్చారు. ఈ సేవలను ప్రయోగాత్మకంగా జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో వినియోగంలోకి తెచ్చారు. ఈ సర్కిల్‌లో విజయవంతమైతే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మిగతా సర్కిళ్లకు కూడా విస్తరించాలని ప్రణాళికలు రూపొందించారు. సర్కిల్-18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో ఈ యాప్‌ను ప్రస్తుతం అందుబాటులోకి తీసుకువచ్చారు. మీరు అభ్యర్థన పెడితే.. మేము ఫాగింగ్ చేస్తాం అంటూ అధికారులు పేర్కొంటున్నారు. ఈ యాప్‌లో ఫాగింగ్ చేయాలంటూ అభ్యర్థన పెట్టిన తర్వాత సంబంధిత అధికారులు, ఎంటమాలజీ సిబ్బంది స్పందించారా? అభ్యర్థించిన ప్రాంతంలో ఫాగింగ్ జరిగిందా? లేదా? అన్నది సాంకేతికంగా పర్యవేక్షించనున్నారు. జియో ట్యాగింగ్ చేసిన యంత్రాలు నిర్ణీత ప్రాంతాలు ఫాగింగ్ చేశాయా? లేదా, అభ్యర్థనను గాలికి వదిలేశాయా? అన్నది దీని ద్వారా తేలికగా తెలిసిపోతుందని జీహెచ్‌ఎంసీ వైద్య, ఆరోగ్య శాఖ విభాగం అధికారులు పేర్కొంటున్నారు. జూబ్లీహిల్స్ సర్కిల్‌లో అమలుచేస్తున్న ఈ విధానంపై ఫలితాలు వచ్చిన తర్వాత ప్రజలు సంతృప్తి చెందినట్లు తెలిస్తే మిగతా ప్రాంతాలకు విస్తరించాలని తలపెట్టారు.



మై జీహెచ్‌ఎంసీ యాప్‌లో ఇలా రిక్వెస్ట్ చేయండి...

మై జీహెచ్‌ఎంసీ యాప్ తెరిచి అక్కడ ఇచ్చిన ఆప్షన్స్‌లో ఫాగింగ్‌పై క్లిక్ చేయాలి.

- దోమల నివారణ సేవల కోసం రిక్వెస్ట్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి.
- ఫాగింగ్ చేయాల్సిన ప్రాంతం వివరాలను తమ సెల్‌ఫోన్‌లోని లొకేషన్, లొకేట్ ఆన్ మ్యాప్ ఆప్షన్‌లో ఎంచుకోవాలి.
- అభ్యర్థించే వ్యక్తి పేరు. ల్యాండ్‌మార్క్, టెలిఫోన్ నెంబర్ తదితర వివరాలు ఇందులో నమోదు చేయాలి.
- క్షేత్రస్థాయిలో ల్యాండ్‌మార్క్‌లో ఒక ఫొటోను తప్పనిసరిగా సబ్మిట్ చేయాలి.
- అనంతరం అభ్యర్థనను స్వీకరించినట్లు మొబైల్ ఫోన్ నెంబర్‌కు మెసేజ్ వస్తుంది.
- వెంటనే ఈ అభ్యర్థన సంబంధిత అధికారికి వెళ్లగానే సదరు అధికారి ఏ ఏరియాకు సంబంధించిన అధికారి అయితే ఆ సిబ్బందికి అక్కడికి వెళ్లి ఫాగింగ్ చేయాలంటూ సూచిస్తారు.
- ఫాగింగ్ చేసినట్లు సదరు సిబ్బంది ఫొటోలు తీసి సదరు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కూడా ఆదేశించారు.
- ఇప్పటివరకు దోమల బెడద ఉన్న ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టాలంటూ ప్రజలు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియకుండా ఉండేది. ఈ యాప్ ద్వారా నేరుగా సంబంధిత అధికారికే ఫోన్ ద్వారా క్షణాల్లో ఫిర్యాదును చేసే అవకాశం కల్పించారు.
- సర్కిల్-18 పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంటమాలజీ ఏఈ రజిత వెల్లడించారు.

కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నాం


ఎమ్మెల్యే కాలనీలో మురుగు నీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ డివిజన్‌లో కోట్లాది రూపాయల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేస్తున్నామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఒక వైపు జీహెచ్‌ఎంసీ, మరో వైపు జలమండలి అధికారులతో ఎప్పటికప్పుడు ఎక్కడ సమస్యలున్నా ప్రతిపాదనలు రూపొందించి నిధులు మంజూరు చేయిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీలో రూ. 1.71 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీవరేజి పైప్‌లైన్ పనులకు ఆమె జలమండలి జీఎం హరిశంకర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... వెంకటేశ్వర కోఆపరేటివ్ సొసైటీ ఏర్పడిన తొలినాళ్లలో వేసిన సీవరేజి లైన్లు ఇప్పటికీ కొనసాగుతుండటంతో మురుగు సమస్యతో ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు సమస్యను తన దృష్టికి తేవడంతోట ఉన్నతాధికారుతో మాట్లాడి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కాలనీలో 1 కిలోమీటర్ మేర కొన్ని చోట్ల 300 ఎంఎం డయా, మరికొన్ని చోట్ల 200 ఎంఎం డయా పరిమాణంలో పైప్‌లైన్ వేస్తున్నట్లు అధికారులు తెలిపారున. వెంకటేశ్వర కోఆపరేటివ్ సొసైటీ ఎమ్మెల్యే కాలనీ అధ్యక్షుడు టి.నారాయణ రెడ్డి, ఈఈ విజయ్‌కుమార్, జలమండలి డీజీఎం శీలారాణి, తట్టికాన సెక్షన్ మేనేజర్ రాంబాబు, ఎమ్మెల్యే కాలనీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఉదయ్‌కుమార్‌రెడ్డి, సెక్రటరీ విజయ్‌కుమార్, కోశాధికారి సరళ, కమిటీ సభ్యులు ప్రతిమ, ఆజంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర అనిర్వచనీయం

హిమాయత్‌నగర్: విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను అందించే క్రమంలో ఉపాధ్యాయుల కృషి.. వారి త్యాగం అనిర్వచనీయమని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ వైస్ చైర్‌పర్సన్ ప్రార్థన మణికొండ అన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ జూనియర్స్ పాఠశాల ఆడిటోరియంలో కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. కేజీ గ్రాడ్యుయేషన్ డిప్లొమాల పంపిణీ కార్యక్రమాన్ని తల్లిదండ్రుల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా యువ గ్రాడ్యుయేట్లు సాధించిన విజయాలను వారు అభినందించారు. చిన్నారులు సంగీతం, నృత్యం, ప్రసంగాల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించారు. కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, డీన్ రామాంజుల, ప్రిన్సిపాల్ ఫాతిమా కాజిమ్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.


కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు

రెక్టల్ కేన్సర్‌పై ప్రత్యేక శిక్షణ

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి రేడియేషన్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో శనివారం రెక్టల్ కేన్సర్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలోని ఆడిటోరియంలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో రెక్టల్ కేన్సర్‌కు సంబంధించి అంశాలతో పాటు ఈ కేన్సర్ చికిత్సకై ఇటీవల అందుబాటులోకి వచ్చిన టీఎన్‌టీ థెరపీపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సీఈఓ డాక్టర్ కే కృష్ణయ్య మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా హాస్పటల్ ఆర్జించిన విజ్ఞాన సంపదను ఇతరులతో పంచుకోవడమనే కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నామన్నారు. తద్వారా కేన్సర్‌కు సంబంధించిన అంశాలపై వైద్యులకు అవగాహన కల్పించడమే కాకుండా త్వరితగతిన వ్యాధిని మొదట్లోనే గుర్తించే సామర్థ్యాన్ని వైద్యులు కలిగి ఉంటారన్నారు. ఇలా వ్యాధి సోకిన వెంటనే గుర్తించగలిగితే కేన్సర్‌ను పూర్తిగా నయం చేసి రోగి ప్రాణాలను కాపాడడమే కాకుండా దీర్ఘకాలం సాధారణ జీవనాన్ని గడిపేలా చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో రేడియేషన్ అంకాలజీ విభాగం హెచ్‌ఓడీ దిలీప్‌కుమార్, వైద్యులు కౌశర్, అరవింద్, మాధురి, కృష్ణమోహన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ నేతలను బేషరతుగా విడుదల చేయాలి

హిమాయత్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఎటువంటి ప్రభుత్వ ముట్టడి కార్యక్రమాలకు పిలుపునివ్వకున్నా పోలీసులు అన్ని జిల్లాల్లో ఉన్న ఏఐవైఎఫ్ నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర తీవ్రంగా ఖండించారు. ఈ అక్రమ అరెస్టులపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు రాష్ట్ర వ్యాప్తంగా అరెస్ట్ చేసిన ఏఐవైఎఫ్ నేతలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రేమ పేరుతో మోసం: యువకుడి అరెస్ట్

హిమాయత్‌నగర్: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిని నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ సమాచారం మేరకు... ఖమ్మం జిల్లా ఖానాపూరం ప్రాంతానికి చెందిన మల్లెల శ్రీనివాస్ చారి(30) నగరానికి వచ్చి కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ యువతి(30) గాంధీనగర్‌లో నివాసం ఉంటుంది. ఈ క్రమంలో 2018లో శ్రీనివాస్‌చారితో పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. పెండ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పడంతో ఆమె శ్రీనివాసచారికి దగ్గరైంది. హిమాయత్‌నగర్‌లోని ఓ ఇంటిని సైతం అద్దెకు తీసుకుని మూడేండ్ల పాటు కలిసి సహజీవనం చేశారు. శారీరకంగా ఆమెతో సంబంధం పెట్టుకున్నాడు. కాగా అతడి ప్రవర్తనపై అనుమానం వచ్చి పెండ్లి చేసుకుందామని ఆ యువతి శ్రీనివాసచారిపై ఒత్తిడి పెంచింది. పెళ్లి విషయాన్ని దాటవేస్తూ నెమ్మదిగా ఆమెను దూరం పెట్టడం మొదలు పెట్టాడు. మోసపోయానని గ్రహించిన ఆ యువతి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా శ్రీనివాసచారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

దంపతుల చేతిలోని పర్సు లాక్కొని పరార్

వెంగళరావునగర్: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న దంపతుల వద్ద నుంచి రూ. 6 వేలు ఉన్న పర్సు లాక్కెళ్లిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. యూపీకి చెందిన సుమిత్‌కుమార్ పాండే దంపతులు కొంతకాలంగా ఎస్ఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఇరువురూ జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న ఓ హోటల్‌లో పని చేస్తుంటారు. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీ రాత్రి విధులు ముగించుకుని ఆటో ఎక్కి మైత్రీవనం వరకు వచ్చారు. వారి ఆటోలోనే మరో వ్యక్తి కూర్చున్నాడు. మైత్రీవనం వద్ద ఆటో డ్రైవర్‌కు ఆన్‌లైన్ పే చెద్దామంటే నగదు కావాలన్నాడు. అర్ధరాత్రి అతనికి ఇవ్వడానికి పర్స్ తీయగా వెనుక ఉన్న వ్యక్తి ఆ పర్స్‌ను లాక్కుని పారిపోయాడు. ఆటో డ్రైవర్ కూడా అతనితో పాటు పారిపోయాడు. పర్స్‌లో రూ. 6 వేల నగదు ఉంది. ఇతర ఐడెంటిటీ కార్డులు కూడా ఉన్నాయి. బాధితులు ఆటోడ్రైవర్‌తోపాటు దొంగతనం చేసిన వ్యక్తి కోసం ప్రయత్నించగా కనిపించలేదు. దాంతో శనివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలోచనలు, పరిశోధనలకు హద్దులు లేవు


సదస్సు ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న వీరారెడ్డి

బంజారాహిల్స్: ప్రజల దృక్కోణంలో, సామాన్యులకు ఉపయోగపడేలా పరిశోధనలు చేయడంలో గానీ, ప్రజల సంక్షేమం కోసం ఆలోచనలు చేయడానికి ఎలాంటి హద్దులు లేవని శాతవాహన విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య కె.వీరారెడ్డి పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'హద్దులు లేని సైన్స్-భవిష్యత్తు కోసం బహుళ విభాగ దృష్టి' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా సైన్స్ బాగా అభివృద్ధి చెందుతోందని, ఇది సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తోందని పేర్కొన్నారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం గ్రామీణ ప్రాంతానికి, వ్యవసాయ అభివృద్ధికి ఉపయోగపడాలని, అప్పుడే నిజమైన సాంకేతిక అభివృద్ధి అన్నారు. ఒక్క ఐటీ అభివృద్ధి జరిగితే, కొందరికి సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు వస్తే పూర్తి స్థాయి అభివృద్ధి కాదని, యువ పరిశోధకులు చేసే పరిశోధనలు సామాన్యులకు విరివిగా తమ అవసరాలకు ఉపయోగపడ్డప్పుడే నిజమైన అభివృద్ధి అని వెల్లడించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజల జీవన స్థితిగతులు మార్చడంలో, వాళ్ల అభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకమన్నారు. ఆ విభాగంలో జరిగే పరిశోధనలు మానవాళికి ఉపయోగపడేలా మరిన్ని పరిశోధనలు జరగాలని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో సైన్స్ విభాగ కోర్సులకు విశేష ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వరంగల్) డాక్టర్ రామచంద్రయ్య, వర్సిటీ అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, శ్రీదేవి, ప్రమీలా కేతావత్, కోటేశ్వరరావు, ఎం.కిషోర్, కుమార్, విజయ్‌కుమార్, రామకృష్ణ, ఉషశ్రీ, రజిత పాల్గొన్నారు.

గాలి వాన బీభత్సం

బంజారాహిల్స్: గాలి వాన బీభత్సానికి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ రహదారులన్నీ జలమయం అయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వానధాటికి రోడ్లపై భారీగా వరద నీరు నిలిపోవడంతో వరద నీటి కాల్వల వద్ద ఇరుక్కుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి వరద నీరు పోయే జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు చర్యలు తీసుకున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.5లోని దేవరకొండ బస్తీలో వరద దాటికి బస్తీలోని ప్రధాన రోడ్డు మొత్తం బురదమయంగా తయారైంది. రోడ్డుపై నిలిచిన బురద వల్ల స్థానికులు దారిన పోయే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



దేవరకొండ బస్తీలో రోడ్డుపై పేరుకుపోయిన బురద


బంజారాహిల్స్ రోడ్ నెం. 2 హిందూ శ్మశాన వాటిక వద్ద నిలిచిన నీరు

నిమ్స్‌లో రూ. 27.90 కోట్లతో వసతులు

లక్డీకాపూల్: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందిస్తున్న నిమ్స్ రూ. 27.90 కోట్ల వ్యయంతో మౌలిక వసతులను సమకూర్చుకునేందుకు సమాయత్తమైంది. కొనుగోలు అంశానికి సంబంధించి యాజమాన్యం శనివారం టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసింది. సర్జికల్, జనరల్ ఐటిమ్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు, సివిల్ వర్క్స్ మెటీరియల్, ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తమ బడ్జెట్ కేటాయింపుల్లో భాగంగా నిమ్స్‌లో అత్యవసర పరికరాలు, వీటి కొనుగోలు ప్రక్రియకు టెండర్లను రేట్ కాంట్రాక్టు ద్వారా టెండర్లను నిమ్స్ టెండర్లను ఆహ్వానిస్తుంది. ఇందుకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిమ్స్‌కు అత్యవసర పరికరాల కొనుగోలు నిమిత్తం రూ. 16.50 కోట్లు కేటాయించగా మరో రూ. 11.40 కోట్లను సహాయక గ్రాంట్‌గా నిధులను కేటాయించిన విషయం తెలిసిందే. దీంతో నిమ్స్ యాజమాన్యం అత్యవసర పరికరాలతో పాటు అవసరమైన ఇతర పరికరాలనూ కొనుగోలు చేసేందుకు కార్యచరణ ప్రణాళికలను రూపొందించింది. ఈ మేరకు ఆహ్వానించిన టెండర్లలో పాల్గొనదల్చిన సరఫరాదారులు తమ తమ దరఖాస్తులను వచ్చే నెల 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు సమర్పించాల్సి ఉంది. దరఖాస్తులను ఓల్డ్ బిల్డింగ్ మూడో అంతస్తులోని సర్జికల్ స్టోర్స్‌లో అందించాలని నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లక్ష్మీ భాస్కర్ పేర్కొన్నారు.

చోరీ కేసులో లేడీ డాన్ రిమాండ్


లేడీ డాన్ సనా

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని డైమండ్ హిల్స్‌లో గత మంగళవారం ఎన్ఆర్ఐ ఇంట్లో బంగారం, డాలర్లు, నగదు చోరీ చేసిన ఘటనలో ప్రధాన నిందితురాలు లేడీడాన్ సనాబేగంతో పాటు ఆమె కొడుకును ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... షేక్‌పేట సమీపంలోని డైమండ్ హిల్స్ కాలనీలో నివసించే మహ్మద్ ముజాయిద్ కమల్ అనే ఎన్ఆర్ఐ రంజాన్ పండగ కోసం ఇటీవలే ఆస్ట్రేలియా నుంచి వచ్చాడు. ఈ నెల 18వ తేదీన రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి ఇఫ్తార్ విందు కోసం బంధువుల ఇంటికి వెళ్లాడు. రాత్రి ఒంటి గంట సమయంలో ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగులగొట్టి ఉండటమే కాకుండా బెడ్‌రూమ్‌లలో అల్మారాలు తెరిచి ఉన్నాయి. ఆందోళన చెందిన బాధితుడు పరిశీలించగా 34 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ. 4.50 లక్షల నగదు, కెనెడియన్ డాలర్లు కనిపించలేదు. వెంటనే ఆయన ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ఫిలింనగర్ క్రైమ్ పోలీసులు ఘటనా స్థలంలో వేలిముద్రలతో పాటు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో లేడీడాన్‌గా పోలీసు రికార్డుల్లోకెక్కిన సనా డాన్‌తో పాటు ఆమె ఇద్దరు కొడుకులు ఈ చోరీకి పాల్పడ్డట్లుగా దర్యాప్తులో తేలింది. సనా డాన్ ఆభరణాలను రెండు షాపుల్లో విక్రయించినట్లుగా కూడా సీసీ ఫుటేజీలను పోలీసులు సేకరించారు. ఇప్పటివరకు ఆమెతో పాటు ఇద్దరు కొడుకులపై వివిధ పోలీస్ స్టేషన్లలో 48కి పైగా చోరీ కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితురాలిని, ఆమె కొడుకును రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య శిబిరానికి మంచి స్పందన



పంజగుట్ట: ప్రేమ్‌నగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి పరిసర ప్రాంతాల ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. సుమారు 150 మంది వివిధ వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన వారు ఉచితంగా మందులు తీసుకున్నారు. నైటింగేల్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ, రెయిన్ బో హోమ్స్ కమ్యూనిటీ కేర్ ప్రోగ్రాం, జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్, రక్తంలో హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు నిర్వహించారు. నడుము నొప్పి, వివిధ రకాల నొప్పులతో బాధపడుతున్న వారికి ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ చికిత్సలు అందించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపాలని, వేసవిలో మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో బస్తీ ప్రధాన కార్యదర్శి భగవాన్ దాస్, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, చిన్నపిల్లల వైద్య నిపుణులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులతో మత సామరస్యం

రహమత్‌నగర్: ఇఫ్తార్ విందులతో మత సామరస్యం పెంపొందుతుందని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి పేర్కొన్నారు. రహమత్‌నగర్‌లోని మసీద్-ఏ-బిలాల్‌లో యువకులు శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు (రోజాలు) ఉంటూ, నిత్యం దైవారాధనలో గడపడం అభినందనీయమన్నారు. ప్రముఖ సంఘ సేవకుడు చిన్న శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ... ఉపవాస దీక్షలు బూనిన ముస్లింలపై దైవానుగ్రహం ఉంటుందని చెప్పారు. మసీదు కమిటీ అధ్యక్షుడు ఖైసర్ పాషా, మసీదు కమిటీ ప్రతినిధులు అజీజ్, మోసిన్ యువజన సంఘ నాయకులు సర్వర్, ఇమ్రాన్, సోను, సోహెబ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్‌లో పాల్గొన్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి...

వైభవంగా కల్యాణోత్సవం

రహమత్‌నగర్: ఎస్‌పీఆర్‌నగర్‌లోని శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లయ్య, పోచమ్మ అమ్మవార్ల కల్యాణ మహోత్సవం ఆలయ కమిటీ ధర్మకర్త ఎం.ఎల్లయ్య, శేఖర్‌ల నేతృత్వంలో శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. వేడుకల్లో ఒగ్గు పూజారులు అమ్మ వార్ల కల్యాణాన్ని సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డితోపాటు బస్తీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శాలివాహన జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి


శాలివాహన చక్రవర్తికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పంజగుట్ట: బీసీలు రాజ్యాధికారంలో వాటా కోసం ఐక్యంగా పోరాడాలని రిటైర్డ్ డీజీపీ డాక్టర్ జె.పూర్ణచందర్‌రావు పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కాదని, జనాభా దామాషా ప్రకారం 56 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ కుమ్మర శాలివాహన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలివాహన జయంతిని నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రవిశంకర్, సీనియర్ బీసీ నాయకుడు సంగెం సూర్యారావులతో కలిసి శాలివాహన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శాలివాహన చక్రవర్తి, కవి మొల్ల జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, కోశాధికారి దానాపురం శ్రీనివాస్, కె.శ్యామ్‌కుమార్, ప్రొఫెసర్ పార్థసారథి, డాక్టర్ కె.రమేష్, కె.దశరథరావు తదితరులు పాల్గొన్నారు.

మానవ నాగరికత నీటి దగ్గరే మొదలు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మాజీ డైరెక్టర్ పీజీ శాస్త్రి



'ఎస్కీ'లో జరిగిన ప్రపంచ నీటి దినోత్సవ సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

రాయదుర్గం: మానవ నాగరికత నీటి దగ్గరే మొదలైందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మాజీ డైరెక్టర్, రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ హెడ్ పీజీ శాస్త్రి అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు అధ్యక్షతన శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న మంచు పర్వతాలను కాపాడుకుంటేనే రేపటి తరానికి మంచినీరు దొరుకుతుందన్నారు, పెరుగుతున్న జనాభా, గ్లోబల్ వార్మింగ్ వల్లే నీటి వనరులు, హిమ పర్వతాలు కూడా క్రమంగా కరిగిపోతున్నాయని, ఇవి కూడా అంతరిస్తే భూమి మీద జీవజాలం ఉండదని పేర్కొన్నారు. 1780 నుంచి 2015 వరకు గంగోత్రితోపాటు గత 50 ఏళ్లలో కిలిమంజారో, సియాచిన్, గ్రీన్ ల్యాండ్స్, మిలామ్, పిండారీ తదితర హిమానీ పర్వతాలు క్రమంగా ఎలా కరిగిపోతున్నాయో తన ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనుపమ్ మొహంతి మాట్లాడుతూ హిమానీ పర్వతాలు కరిగిపోతే ప్రపంచంలో స్వచ్ఛమైన నీరు దొరకదని, సముద్రాలూ ఉప్పొంగుతాయని అన్నారు. కార్యక్రమంలో కృష్ణానదీ యాజమాన్య బోర్డు పూర్వ చైర్మన్ ఎ.పరమేశం, విశ్రాంత చీఫ్ ఇంజనీర్ జంబుల్‌రెడ్డి, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ పూర్వ చైర్మన్ డాక్టర్ నాగభూషణరావు, ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏకకాల ఎన్నికలతో నిధుల పొదుపు

మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు



సదస్సులో మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, పి.మోహన్‌రావు, నిరంజన్ దేశాయి తదితరులు

చిక్కడపల్లి: పార్లమెంట్‌తోపాటు అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రభుత్వ నిధులు పొదుపు చేయవచ్చని సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది, మాజీ ఎమ్మెల్సీ నారపరాజు రామచంద్రరావు అన్నారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళాదీక్షితులు కళావేదికపై ప్రకాశం ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టూడెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'ఒక దేశం ఒకే ఎన్నికలు'అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రామచందర్‌రావు మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో తరచూ ఎన్నికలకు వెళ్లటం వల్ల ఎన్నికల వ్యయం దేశ, రాష్ట్రాల ఖజానాకు భారంగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఏక కాల ఎన్నికల ద్వారా అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుస్థిర పాలన అందించేందుకు వీలు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. సంస్థ చైర్మన్ పి.మోహన్‌రావు మాట్లాడుతూ ఏకకాల ఎన్నికల ద్వారా గాంధీజీ, టంగుటూరి ప్రకాశం పంతులు ఆకాంక్షించిన గ్రామ స్వరాజ్యం కార్యరూపం దాల్చే అవకాశం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి నిరంజన్ దేశాయ్, సభ్యులు సూర్యప్రకాష్, రామమోహన్‌రెడ్డి, రాజశేఖర్, గుండల్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

24 వరకు ఉపకార వేతనాల దరఖాస్తు గడువు

జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఉపసంచాలకుడు ఆశన్న

లక్డీకాపూల్: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ హైదరాబాద్ జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, యూనివర్సిటీ, ఇంజనీరింగ్, నర్సింగ్, ఇతర కాలేజీల యాజమాన్యాలు ఈ నెల 24వ తేదీ లోగా తమ విద్యార్థుల తాజా, రెన్యువల్ స్కాలర్‌షిప్ దరఖాస్తు ఫారాలను స్థానిక జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆ శాఖ ఉపసంచాలకుడు జి.ఆశన్న తెలిపారు. 2017–18 నుంచి 2024–25 వరకు ఉన్న పెండింగ్ అప్లికేషన్లు (హార్డ్ కాపీస్) కూడా సమర్పించాలని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్యూషన్ ఫీజుకు సంబంధించిన చాలా దరఖాస్తులు NO FEES అని e-Pass వెబ్‌సైట్‌లో చూపిస్తుందని, కాలేజీ యాజమాన్యాలు సంబంధిత సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో గానీ, పీఎంయూ సెంటర్‌లోగానీ సంప్రదించి FEE STRUCTURE ను e-Passలో అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. అప్‌డేట్ కానియెడల కాలేజీలకు స్కాలర్‌షిప్, ట్యూషన్ ఫీజు రాదని పేర్కొన్నారు. స్కాలర్‌షిప్‌లు రాకపోవడానికి కారణమయ్యే ప్రిన్సిపాళ్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సిఫారసు చేస్తామని పేర్కొన్నారు.

అర్ధరాత్రి కుండపోత వర్షం

విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాక్షి,సిటీబ్యూరో: మహానగరంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. కొద్దిరోజులుగా ఎండల వేడిమితో తల్లడిల్లిన ప్రజానీకానికి తాజా వర్షం ఉపశమనం కలిగించింది. శనివారం వాతావరణం చల్లబడింది. రాత్రి వర్షం కురుస్తున్న సమయంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కొన్నిచోట్ల వడగళ్ల వాన కురిసింది. ఒకపక్క ఉక్కపోత, మరోపక్క దోమలతో పట్టణ ప్రజలు ఇబ్బంది పడ్డారు. జూబ్లీహిల్స్, అమీర్‌పేట, ఎస్‌ఆర్ నగర్, మియాపూర్, మదీనాగూడ, ప్రగతినగర్, బాచుపల్లి, బోరబండ, మధురానగర్, ప్యారడైజ్, సైదాబాద్, గండిమైసమ్మ, ముషీరాబాద్ తదితర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.

ముగిసిన ఓయూ సింపోజియాలు

ఉస్మానియా యూనివర్సిటీ: సాంకేతిక సింపోజియాలు విజ్ఞానం, వినోద కార్యక్రమాలతో శనివారం ముగిశాయి. కాలేజీలోని 7 ఇంజనీరింగ్ విభాగాల విద్యార్థులు స్వీయ నాయకత్వంలో చేపట్టిన వివిధ కార్యక్రమాలతో కళాశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. మొదటిరోజు విజ్ఞాన కార్యక్రమాలు, రెండోరోజు ఎగ్జిబిషన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈసీఈలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పి.వేణుప్రసాద్ మాట్లాడారు. అనంతరం ఆయనను ఈసీఈ విభాగం అధిపతి ప్రొ.రామకృష్ణ ఘనంగా సన్మానించారు.

బీసీ రిజర్వేషన్ బిల్లుకు సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న ఓబీసీ లాయర్స్ జేఏసీ చైర్మన్ తలకొక్కుల రాజు

హిమాయత్‌నగర్: స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో ప్రవేశపెట్టిన బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఓబీసీ లాయర్స్ జేఏసీ చైర్మన్ తలకొక్కుల రాజు అన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగంలో బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదానికి సహకరించిన అన్ని రాజకీయ పక్షాలకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్‌తో కలసి ఆయన మాట్లాడారు. లోయర్ కోర్టు నుంచి హైకోర్టు వరకు ఉన్న ఏజీపీ, జీపీ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియమకాల్లో రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి రాష్ట్రపతి ఆమోదం పొందే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. కేంద్రంపై ఒత్తిడిని పెంచేందుకు అన్ని న్యాయవాద సంఘాలతో ఈ నెల 31న ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేసుకొని రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ కన్వీనర్ కోల జనార్దన్, ఐఎల్ పీఏ స్టేట్ ప్రెసిడెంట్ పొన్నం దేవరాజు గౌడ్, జేఏసీ కన్వీనర్లు పూస మల్లేశం, టి.రాహుల్ వంశీకృష్ణ, అసోసియేషన్ సెక్రటరీ కొండూరి వినోద్ కుమార్ పాల్గొన్నారు.

సర్వతోముఖాభివృద్ధికి ఉన్నత విద్య దోహదం

ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



సెమినార్‌లో మాట్లాడుతున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉన్నత విద్య వ్యక్తి సర్వతో ముఖాభివృద్ధికి దోహదపడుతుందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అన్నారు. శనివారం ఇక్కడి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'హయ్యర్ ఎడ్యుకేషన్'అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యా రంగంలో డిజిటలైజేషన్, సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్ర, సాంకేతిక రంగాలు అమూల్యమైనవని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని అన్నారు. కళాశాల సెక్రటరీ గడ్డం వినోద్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ వారి అభివృద్ధికి బాటలు వేయాలని అధ్యాపకులకు సూచించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం మాట్లాడుతూ ఎంత పెద్ద చదువు చదివినా వ్యక్తిత్వం నశిస్తే సర్వం కోల్పోవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజావివేక్, ప్రొఫెసర్ అమర్‌దీప్ కౌర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్, ప్రొఫెసర్ రామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

విద్యా వనంలో నిషేధాజ్ఞల మంటలు

- సర్క్యులర్ రద్దుకై 5,114 మందితో ఏబీవీపీ సంతకాలు
- 29న ఆర్ట్స్ కాలేజీ ఎదుట జేఏసీ నేతల మహాదీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి జేఏసీ నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ:

ప్రశాంతంగా ఉన్న విద్యావనంలో హఠాత్తుగా పడిన నిషేధాజ్ఞల పిడుగు నిరసనల మంటలు రేపుతోంది. నిషేధాజ్ఞలపై ఆందోళనలతో విద్యార్థి సంఘాలు క్యాంపస్‌ను హోరెత్తిస్తున్నాయి. బంద్‌లు, ధర్నాలు, ర్యాలీలు, దిష్టిబొమ్మల దహనాలతో ప్రతిరోజూ ఓయూ అట్టుడుకుతోంది. నిషేధాజ్ఞల రచ్చ అసెంబ్లీలో చర్చకు దారితీసింది. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు ఓయూ పూర్వ విద్యార్థి నేత, మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మేధావులు విద్యార్థులకు మద్దతుగా గళం విప్పారు. అయినా ఓయూ అధికారులు ఎలాంటి దిద్దుబాటు చర్య తీసుకోకపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని విచారణకు ఆదేశాలు జారీ చేశారు.

62 మంది విద్యార్థి నేతల అరెస్టులు

వారం రోజులుగా వివిధ సంఘాలకు చెందిన 62 మంది విద్యార్థి నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఓయూ నిషేధాజ్ఞలపై రౌండ్‌టేబుల్ సమావేశానికి విద్యార్థులు హాజరుకాకుండా తెల్లవారుజాము నుంచి పోలీసులు అరెస్టుల పర్వానికి తెరలేపారు. తార్నాకలో నివాసం ఉంటున్న బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు, క్యాంపస్ హాస్టల్‌లో ఉంటున్న బీఆర్‌ఎస్‌వీ నేతలు జంగయ్య, వెల్పుగొండ రామకృష్ణ, రమేష్‌గౌడ్, సాయిగౌడ్, బొల్లు నాగరాజు యాదవ్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు నెల్లి సత్య, ఉప్పల ఉదయ్ కుమార్, విద్యార్థి నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు.



ఓయూలో ఏఐఎస్ఎఫ్ నేత ఉదయ్ అరెస్ట్

ఎల్లలు దాటిన నిరసనలు

నిషేధాజ్ఞలపై తొలుత వర్సిటీ క్యాంపస్ వరకు పరిమితమైన ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు ఓయూ ఎల్లలు దాటాయి. ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, పీడీఎస్‌యూ(విజృంభణ) ఇతర నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు ప్రారంభించారు. విప్లవ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టులు, న్యాయవాదులు, ఓయూ పూర్వవిద్యార్థి నేతలు విద్యార్థి సంఘాల ఆందోళనలకు మద్దతు ప్రకటించి నిషేధాజ్ఞలను ఉపసంహరించుకోవాలని ఓయూ అధికారులను కోరారు. పౌర హక్కుల నేత ప్రొ.హరగోపాల్ నిషేధాజ్ఞలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

5,114 మందితో ఏబీవీపీ సంతకాల సేకరణ

ఓయూ అధికారుల సర్క్యులర్‌కు వ్యతిరేకంగా ఏబీవీపీ నాయకులు క్యాంపస్‌లో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. క్యాంపస్‌లోని 8 కాలేజీలు, 22 హాస్టల్స్‌లో తిరిగి 4,731 మంది విద్యార్థులు, 96 మంది ప్రొఫెసర్లు, 287 నాన్‌–టీచింగ్ స్టాఫ్‌తో కలిపి మొత్తం 5,114 మంది ఓయూలో అధికారులు విధించిన నిషేధాజ్ఞలకు వ్యతిరేకంగా సంతకాలు చేసినట్లు ఏబీవీపీ నాయకులు వివరించారు.

డీసీపీ వ్యాఖ్యలు విచారకరం

ఓయూ విద్యార్థుల ఆందోళనలో అసాంఘిక శక్తులు ఉన్నాయని డీసీపీ బాలస్వామి వ్యాఖ్యానించడం బాధాకరమని ఓయూ జేఏసీ నాయకులు అన్నారు. బయట ఎన్నో నేరాలు ఘోరాలు జరుగుతున్నా సమర్థవంతంగా వ్యవహరించలేని పోలీసులు శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్న విద్యార్థులను ప్రతిరోజు అరెస్ట్ చేయడం దురదృష్టకరమన్నారు. నిషేధాజ్ఞలపై రద్దుకు ఈ నెల 29న ఆర్ట్స్ కాలేజీ ఎదుట మహా నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆంక్షలు ఎత్తేసే వరకు ఐక్య పోరాటం

ఓయూ పూర్వవిప్లవ విద్యార్థుల సమావేశంలో ప్రొ.హరగోపాల్

పంజగుట్ట: 'ఏం చేస్తే ఉస్మానియా యూనివర్సిటీ బాగుపడుతుందో విద్యార్థులను అడిగి చర్చించాలి. కానీ, మిమ్మల్ని మాట్లాడనివ్వం, పోలీసులతో అడ్డుకుంటాం అనడం సరికాదు'అని పౌర హక్కుల సంఘం నాయకుడు ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విప్లవ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'ఉద్యమ ఉనికిపట్టు ఉస్మానియాపై ఉక్కుపాదమా?'అని ప్రశ్నిస్తూ విద్యార్థుల హక్కులను హరించే అప్రజాస్వామిక సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్మానియా విద్యార్థులకు సంఘీభావంగా కమిటీ ఏర్పాటు చేసి పోరాటం చేయాలని తీర్మానించారు. పూర్వవిద్యార్థులు డేవిడ్, కవ్వా లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హరగోపాల్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు జ్ఞానాన్ని పంచేవని, నూతన సమాజ నిర్మాణానికి నాంది అని, వాటిపై ఆంక్షలు విధించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రముఖ రచయిత నందిని సిధారెడ్డి మాట్లాడుతూ సర్క్యులర్‌లో పెట్టిన ఐదు నిబంధనల్లో ఏ వ్యక్తిగూర్చి బూతులు మాట్లాడరాదని ఉందని, కానీ రాష్ట్రంలో ఎక్కువగా బూతులు మాట్లాడుతుంది ముఖ్యమంత్రే అని ఎద్దేవా చేశారు. ఇది వీసీ నిర్ణయం కాదని, దీనివెనక ప్రభుత్వం హస్తముందని ఆరోపించారు. సీనియర్ సంపాదకులు అల్లం నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఏర్పడే ముందు ప్రజాస్వామ్యాన్ని కాపాడతాం అంటారని కానీ, అధికారంలోకి రాగానే దానికి వ్యతిరేకంగా చేస్తారని ఆరోపించారు. సీనియర్ సంపాదకులు దేవులపల్లి అమర్, శ్రీనివాస్ మాట్లాడుతూ యూనివర్సిటీలో ప్రతీ చెట్టు, ప్రతీ రాయి ఉద్యమాలను నేర్పుతుందన్నారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నేత చలపతిరావు, గాదె ఇన్నయ్య, వేణుగోపాల్, నాగరాజు, జయమ్మ, కన్నెగంటి రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

జీవో 317 బాధితులకు న్యాయం చేయాలి

పంజగుట్ట: జీవో 317వల్ల స్థానికత కోల్పోయిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి 15 నెలలు అవుతున్నా ఆ హామీని పట్టించుకోవడంలేదని జీవో 317 ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఆవేదన వ్యక్తం చేసింది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14లోపు తమ సమస్య పరిష్కరించకపోతే ఏప్రిల్ 24వ తేదీన ఉద్యోగులు, ఉపాధ్యాయులు వేలాదిమంది కుటుంబ సభ్యులతో కలిసి చలో హైదరాబాద్ నిర్వహిస్తామని జేఏసీ చైర్మన్ టి.విజయ్ కుమార్, సెక్రెటరీ సందీప్, సెక్రెటరీ జనరల్ నాగేశ్వరరావు, కోశాధికారి వినోద హెచ్చరించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జీవో 317 వల్ల ఎన్నో కుటుంబాల్లో అశాంతి నెలకొందని, కొందరు మనోవేదనతో చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం స్థానికతను కాదని, సీనియారిటీ ఆధారంగా బదిలీలు చేయడంతో స్థానికులైన జూనియర్లను 300 కిలోమీటర్ల దూరం వెళ్లి ఉద్యోగాలు చేయాల్సి వస్తోందని అన్నారు. కార్యక్రమంలో చాముండేశ్వరి, శ్రీనివాస్ రెడ్డి, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికడదాం

సాక్షి, సిటీబ్యూరో: జీవ కోటికి ఆక్సిజన్ తర్వాత అంతటి విలువైంది నీరు మాత్రమే అని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. ఆక్సిజన్ లేకపోతే ఒక నిమిషం కంటే ఎక్కువ సేపు బతకలేమని, అదే నీరు లేకపోతే ఒక ట్రెండు రోజుల కంటే ఎక్కువ రోజులు బతకడం కష్టమని చెప్పారు. ఇంతటి ప్రాముఖ్యమైన నీటిని వృథా చేయకూడదని సూచించారు. శనివారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా వెంగళరావునగర్ లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. కోటీ 30 లక్షలు కలిగిన హైదరాబాద్ మహానగరానికి కు రోజూ తాగునీరు సరఫరా చేయడం పెద్ద సవాలుతో కూడుకున్న పని అన్నారు. నగరంలో తగినంత స్థాయిలో భూగర్భ జలాలు లేకపోవడం వల్ల 150 కిలోమీటర్ల నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ, డైరెక్టర్ ఆపరేషన్స్–2 వీఎల్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటిభద్రతకు వాటర్‌షెడ్ సక్రమ నిర్వహణే పరిష్కారం



వాటర్‌షెడ్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: రానున్న రోజుల్లో నీటిభద్రతకు వాటర్‌షెడ్ కార్యక్రమం సక్రమ నిర్వహణే పరిష్కారమని ఎన్‌డీఎంఏ మాజీ వైస్ చైర్మన్ మర్రి శశిధర్ రెడ్డి అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, డాక్టర్ ఎం.చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా వాటర్‌షెడ్ ప్రాజెక్టులపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. జలనిపుణుడు టి.హనుమంతరావు ప్రవేశపెట్టిన చతుర్విధ జల ప్రక్రియ అత్యుత్తమమైనదన్నారు. ఈ విధానం ద్వారా ఎకరానికి 5 వేలు ఖర్చుపెట్టి మూడు పంటలకు నీరు అందించవచ్చని, జహీరాబాద్ ప్రాంతంలో ఈ ప్రక్రియ విజయవంతంగా నడుస్తోందని తెలిపారు. వాటర్‌షెడ్ కార్యక్రమం అమలులో క్షేత్ర స్థాయి సవాళ్లను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని పీజేటీఏయూ పరిశోధన విభాగం సంచాలకుడు ఎం.బలరాం సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ ఇంజినీర్ కేవీ రమణారావు, ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, డాక్టర్ కేపీ వాణి, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, గొట్టివారి పల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఇటలీ, జర్మనీలో ఉచిత విద్యావకాశాలు



సాక్షి, సిటీబ్యూరో: విదేశాల్లో నాణ్యమైన ఉన్నత విద్యను అభ్యసించాలని ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం శౌర్య కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో శనివారం గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్– 2025 ఏర్పాటు చేశారు. కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూ బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ ఆదివారం కూడా కొనసాగుతుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కెనడా, ఐర్లాండ్ వంటి దేశాల్లో ఉన్నత విద్యావకాశాల గురించి సమగ్ర సమాచారం అందిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా జర్మనీ, ఇటలీ దేశాల్లో ఉచిత విద్యావకాశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విదేశాల్లో చదువుకోవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలిసికట్టుగా నగరాభివృద్ధి

నూతన స్టాండింగ్ కమిటీ సభ్యులతో మేయర్



సాక్షి,సిటీబ్యూరో: ప్రజోపయోగ నిర్ణయాలు తీసుకుని నగరాభివృద్ధికి కలసికట్టుగా పనిచేద్దామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కొత్తగా ఎన్నికైన స్టాండింగ్ కమిటీ సభ్యులను కోరారు. శనివారం ఇక్కడ జరిగిన కొత్త సభ్యుల తొలి సమావేశంలో మేయర్ మాట్లాడారు. స్టాండింగ్ కమిటీ విధాన నిర్ణయాల కమిటీ అని పేర్కొన్నారు. సమావేశంలో కొత్తగా ఎన్నికైన స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్నాజుద్దీన్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, మహాలక్ష్మి రామన్ గౌడ్, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, సీఎన్ రెడ్డి, వి.జగదీశ్వర్ గౌడ్, బూరుగడ్డ పుష్ప, నగేష్ పాల్గొన్నారు. గతంలో మాదిరి ఇకపై కూడా ప్రతి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు స్టాండింగ్ కమిటీ సమావేశం కావాలని, అల్వాల్ గ్రామ కంఠానికి చెందిన 0.11 గుంటల భూమిని మేడ్చల్ జిల్లా కొత్త అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి కేటాయించేందుకు ఎన్‌ఓసీ జారీ చేయాలని తదితర ఎనిమిది అంశాలను సమావేశం ఆమోదించింది. దుర్గం చెరువుసహా 11 చెరువుల పునరుద్ధరణ పనులకు రూ.55 లక్షలతో టెక్నికల్ కన్సల్టెంట్‌గా 'నీరి'నియామకానికి సంబంధించి ధ్రువీకరణ ఇవ్వడం తదితర మూడు అంశాలకు కమిటీ విముఖత చూపింది.

ప్రొటోకాల్ పాటించడం లేదు: బీజేపీ

జీహెచ్‌ఎంసీ అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదని, ఇంకా బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నట్లు ప్రవర్తిస్తున్నారని, ఆ పార్టీ నేతలకే ప్రాధాన్యం ఇస్తున్నారని బీజేపీ ఫ్లోర్ లీడర్ శంకర్‌యాదవ్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నరసింహారెడ్డి మేయర్, కమిషనర్‌లకు ఫిర్యాదు చేశారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కళాకారుడు రాబిన్ డేవిడ్ తయారు చేసిన స్కల్ప్చర్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో ఉగాది, రంజాన్ ఉత్సవాలు ఉదయం 11.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- హ్యాండ్‌లూమ్ ఇండియా ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు సిల్క్ మార్క్ ధ్రువీకృత సిల్క్‌ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు హైలైఫ్ సమ్మర్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని ప్రసాడ్స్ మల్టీప్లెక్స్‌లో రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్ 2025 భాగంగా ప్రదర్శనలు, స్క్రీనింగ్ ఈవెంట్స్ ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు జరుగుతాయి.
- కిమ్స్, వ్యాస్కులర్ ఫౌండేషన్, ది ఫుట్ డాక్టర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో వాక్ ఏ మైల్ టు స్టాప్ ది క్లాట్ పేరిట ఉదయం 6.30 గంటలకు నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్ వద్ద వాక్ కార్యక్రమం జరుగుతుంది.
- ఆశ్రయ్ ఆకృతి సంస్థ సహకారంతో ఫిలింనగర్ దీన్‌దయాళ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగే ఉచిత వైద్య శిబిరంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చెవిలో ఉండే మలినం, వ్యర్థ పదార్థాలు, ఇతర చెవి సంబంధిత సమస్యలపై పరీక్షలు జరుగుతాయి.
- తిలక్‌నగర్ డాక్టర్స్ కాలనీలోని ఉదయ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కమ్యూనిటీ హాల్‌లో సంత్ శిరోమణి గురు రవిదాస్ 648వ జయంతి వేడుకలలో భాగంగా ఉదయం 10 గంటలకు సంగర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరుగుతుంది.
- మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో సమ్మర్ క్యాంపులో భాగంగా సాయంత్రం 6 గంటలకు అన్నమయ్యకీర్తనలపై శిక్షణ తరగతులు జరుగుతాయి.
- శ్రీనగర్‌కాలనీలోని శ్రీసత్యసాయి నిగమాగమంలో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు దస్తకారీ హాట్ ఆధ్వర్యంలో వేసవి, వివాహ శ్రేణి 2025 పేరిట చేనేత కళల ప్రదర్శన జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

విద్యుత్ పునరుద్ధరణ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌లో శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దాదాపు 340కిపైగా 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బంజారాహిల్స్‌లో 75, సైబర్ సిటీ 74, మేడ్చల్ 64 ఫీడర్ల పరిధిలో విద్యుత్‌కు అంతరాయం కలిగినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాత్రే అన్ని చోట్ల విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యంకు రోటరీ ఇంటర్నేషనల్ అవార్డు



సాక్షి, సిటీబ్యూరో: రోటరీ ఇంటర్నేషనల్ అత్యున్నత అవార్డు 'సర్వీస్ అబోవ్ సెల్ఫ్'కు నగరానికి చెందిన డాక్టర్ సుబ్రహ్మణ్యం ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. పాలియేటివ్ కేర్ రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా రోటరీ ఇంటర్నేషనల్ అవార్డును బంజారాహిల్స్ రోటరీ క్లబ్ ప్రదానం చేసింది. ప్రపంచవ్యాప్తంగా 150 మంది వ్యక్తులకు మాత్రమే అందించే ఈ అవార్డును రోటేరియన్లు అత్యున్నత గౌరవంగా భావిస్తారని, తనను ఎంపిక చేయడం సంతోషంగా ఉందని సుబ్రహ్మణ్యం అన్నారు. రెయిన్‌బో ఆసుపత్రి అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం హైదరాబాద్‌లో ఒక ప్రత్యేక పాలియేటివ్ కేర్ సెంటర్ స్పర్శ్ హాస్పిస్‌ను స్థాపించడంలో కీలక పాత్ర పోషించారు. ప్రాణాంతక అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు వారి కుటుంబాలకు ఈ హాస్పిస్ సమగ్ర సంరక్షణను అందిస్తుంది. ఇక్కడ ఆహారం, మందులు, వసతి, వైద్య సంరక్షణతోసహా అన్ని సేవలు ఉచితంగా అందిస్తున్నామని ఆయన తెలిపారు.




నేడు ఫ్యాషన్ ఫ్యూజన్ నైట్

సాక్షి, సిటీబ్యూరో: ఆధునిక ఫ్యాషన్, సంగీత, విందు వినోదాల కలయికగా 'ఫ్యాషన్ ఫ్యూజన్ నైట్'ను నిర్వహిస్తున్నారు. సాగర్ రోడ్డులో ఉన్న జీఎస్ఆర్ కన్వెన్షన్స్‌లో ఆదివారం రాత్రి 7గంటలకు ఈ వినోద భరిత కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా సినీగాయని గీతామాధురి పాల్గొని తన పాటలతో ప్రేక్షకులను అలరించనున్నారు.

జీఈఐకి గ్రేట్ ప్లేస్ టు వర్క్ గుర్తింపు

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచవ్యాప్తంగా పని చేసేందుకు గొప్ప ప్రదేశాలను గుర్తించి అందించే గ్రేట్ ప్లేస్ టు వర్క్ అధికారిక గుర్తింపును మాదాపూర్‌లోని జీయుఎస్ ఎడ్యుకేషన్ ఇండియా (జీఈఐ) పొందింది. ఈ విషయాన్ని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శశి జలిగమ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి పనిలోనూ కీలక పాత్ర పోషించే తమ సిబ్బంది అంకితభావానికి ఇది నిదర్శనమని, సమ్మిళిత, సాధికారత వృద్ధి-ఆధారిత కార్యాలయ సృష్టి కోసం తాము చేసిన కృషికి ఇది ఓ గొప్ప పురస్కారమని, ఈ గుర్తింపు దక్కడం సంతోషంగా ఉందని వ్యక్తం చెప్పారు.



భాగ్యనగరంలో.. అందాల ఆతిథ్యం..





ప్రపంచవ్యాప్త సౌందర్యానికి ఆతిథ్యం ఇవ్వనుంది మన భాగ్యనగరం. మే నెల్లో జరగనున్న మిస్ వరల్డ్ పోటీలతో ఆహా ఏమి నా భాగ్యమూ అంటూ భాగ్యనగరి మురిసిపోనుంది. ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తుండగా అందులో ప్రధానమైన ఈవెంట్లన్నీ మన నగరంలోనే కావడం విశేషం. దీంతో పీక్ సమ్మర్‌లో కొత్త హీట్ నగరాన్ని కుదిపేయనుంది. మిస్ వరల్డ్ పోటీలు సందర్భంగా నగరంలో జరగనున్న కార్యక్రమాల వివరాలు ఇలా..

- సాక్షి, సిటీబ్యూరో

మిస్ వరల్డ్ పోటీలకు వేగంగా ఏర్పాట్లు

అందాల సుందరి కిరీటం కోసం ప్రపంచవ్యాప్తంగా పోటీపడుతున్న అందాలభామలు మే 6వ తేదీ నుంచే శంషాబాద్ విమానాశ్రయాన్ని చేరుకోవడం మొదలవుతుంది. మొత్తం రెండు రోజుల పాటు 140 దేశాలకు చెందిన సుందరీమణులు నగరంలో అడుగుపెట్టనున్నారు. ఈ క్రమంలోనగరంలో ఫ్యాషన్ ప్రపంచంలో హడావుడి మొదలైంది. ఈ పోటీలను తిలకించేందుకు ఔత్సాహికులు, ఫ్యాషన్, సౌందర్య అభిమానులు ఉవ్విళ్లూరుతున్నారు.

- → ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసిన నిర్వాహకులు
- → మండు వేసవిలో వరుసగా ఈవెంట్లతో సందడి
- → హెరిటేజ్ నగరానికి మరింత గుర్తింపు తేనున్న పోటీలు
- → మే 10 నుంచి 31 వరకూ పలు కార్యక్రమాలు

పోటీలకు శ్రీకారం..10నే

ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం ఈ నెల 10వ తేదీన నగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగనుంది. రాత్రి 6.30 గంటల నుంచి జరుగనున్న ఈ ప్రారంభోత్సవంలో అందాల భామల పరిచయంతో పాటు మన తెలంగాణ జానపద నృత్యాలు, గిరిజన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి.



హెరిటేజ్ వాక్..

ఎన్నో చారిత్రక విశేషాలకు పేరొందిన నగర చరిత్రలో నిలిచిపోయే మరో ప్రతిష్టాత్మక కార్యక్రమం ఇది. ఈ నేపథ్యంలో నగరంలోని చారిత్రక విశేషాలను మిస్ వరల్డ్ కోసం పోటీ పడుతున్న అందాల భామలు సందర్శించనున్నారు. మే 13వ తేదీన రాత్రి 6 నుంచి 7 గంటల మధ్యలో చార్మినార్, లాడ్ బజార్‌లలో వీరు తళుక్కున మెరువనున్నారు. అదే రోజున రాత్రి 7 నుంచి 10 గంటల వరకూ పాతబస్తీలోని చౌహేముల్లా ప్యాలెస్‌లో దేశ విదేశీ ప్రతినిధుల కోసం స్వాగత విందును నిర్వహించనున్నారు.

మెడికల్ టూర్..

నగరం వైద్య పర్యాటకంలో తనదైన సత్తా చాటుతూ దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నగరంలోని వైద్య విశేషాలను తెలుసుకునేందుకు మిస్ వరల్డ్ పోటీదారులు ఆసక్తి చూపిస్తున్నారు. మే 16న నగరంలోని అపోలో ఆసుపత్రి, ఏఐజీ ఆసుపత్రి, యశోదా ఆసుపత్రులను ప్రత్యేకంగా వీరు సందర్శించనున్నారు.

అందం.. క్రీడానందం..

మిస్ వరల్డ్ అంటే కేవలం అందాల పోటీ మాత్రమే కాదు విభిన్న రకాల సామర్థ్యాల ప్రదర్శనకు వేదిక.. దీనిలో భాగంగా జరిగేది మిస్ వరల్డ్ స్పోర్ట్స్ తుది పోటీలను గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఉదయం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకూ విభిన్నరకాల ఆటల్లో సత్తా చాటే అందాల భామలతో గచ్చిబౌలి స్టేడియం కొత్త అందాలు అద్దుకోనుంది.

ఎక్స్‌పీరియంలో.. ఎక్స్‌పీరియన్స్..

ఇటీవలే ప్రారంభమైన ఎక్స్‌పీరియం ఎకో టూరిజం పార్క్‌ను వీరు సందర్శించనున్నారు. మే 17న రాత్రి 6.30 గంటల నుంచి 10.30 గంటల వరకూ జరిగే కార్యక్రమంలో సంగీతం, నృత్యం, విందు, వినోదాలు ప్రధాన భాగంగా ఉంటాయి. ఆ తరువాత (మే19) వీరు తెలంగాణ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కూడా వెళ్లనున్నారు. రాష్ట్ర సురక్షిత పర్యాటక విధానాలను పరిశీలించనున్నారు.. అదే రోజున రాత్రి 7.30 గంటలకు రాష్ట్ర ట్యాంక్‌బండ్ పరిసరాలతో పాటు సచివాలయాన్ని సందర్శిస్తారు.



టీ హబ్‌లో..

మాదాపూర్‌లోని టీహబ్‌లో ప్రాంతాల వారీగా పోటీదారులను ఎంపిక చేసేందుకు మిస్ వరల్డ్ కరేబియన్, మిస్ వరల్డ్ ఆఫ్రికా, మిస్ వరల్డ్ ఓషియానా, మిస్ వరల్డ్ వంటి ఈవెంట్స్ జరుగనున్నాయి. మే 20న వీటిని నిర్వహిస్తున్నారు.



శిల్పారామంలో టాలెంట్ ఫైనల్..

శిల్పారామంలోని ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ వర్క్‌షాప్స్‌లో మే 21న పోటీదారులు పాల్గొనున్నారు. శిల్పకళా వేదికలో మే 22న మిస్ వరల్డ్ టాలెంట్ ఫైనల్ జరుగనుంది. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో హెడ్ టూ హెడ్ చాలెంజ్ ఫైనల్ నిర్వహిస్తున్నారు. అదే విధంగా మే 24న హైటెక్స్‌లో టాప్ మోడల్ ఫ్యాషన్ ఫైనల్ పోటీలు జరుగుతాయి. మరుసటి రోజున హైటెక్స్‌లోనే ఆభరణాల, ముత్యాల ప్రదర్శన ఉంటుంది. తాజ్ ఫలుక్‌నామా ప్యాలెస్‌లో బ్యూటీ విత్‌పర్పస్ గాలా డిన్నర్‌లు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు, తెలంగాణ వంటకాల విందు వంటి కార్యక్రమాలు ఉంటాయి.



ఫైనల్స్..

మే 31న ప్రపంచ సుందరి కిరీటాన్ని అత్యున్నత సౌందర్యం అందుకునే అపురూప ఘట్టానికి నగరం వేదిక కానుంది. ఈ కార్యక్రమం హైటెక్స్‌లో సాయంత్రం 5.30 గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారుజామున 1గంట వరకూ జరుగనుంది. తుది కార్యక్రమంగా మిస్ వరల్డ్ పోటీ విజేతలు రాష్ట్ర గవర్నర్‌ను మే 2న కలవడంతో మిస్ వరల్డ్ పోటీలకు తెరపడుతుంది.



కన్నుల పండువగా కళా ఉత్సవం



సాక్షి, సిటీబ్యూరో: కనుమరుగవుతున్న కళారూపాలపై ఆసక్తిని రేకెత్తించడం, యువ ప్రతిభకు ఉపయుక్తమైన వేదికను సృష్టించారు. నగరానికి చెందిన ప్రముఖ విద్యాసంస్థ కేఎల్‌హెచ్ వర్సిటీ బాచుపల్లి క్యాంపస్ ఈ కళాఉత్సవ్‌కు వేదికైంది. వేలాది మంది విద్యార్థులు, కళాకారులు, ప్రదర్శకులను ఒకచోట చేర్చి నిర్వహిస్తున్న ఈ ఉత్సవం తొలిరోజు ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ భాష, సాంస్కృతిక శాఖ సహకారంతో ఈ జాతీయ స్థాయి ఉత్సవాన్ని కేఎల్‌హెచ్ స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (ఎస్ఏసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని, సంగీతం, నృత్యం, దృశ్య కళలు, సాహిత్యం, ఫొటోగ్రఫీ, చలనచిత్ర నిర్మాణం తదితర విభాగాల్లో విస్తృత స్థాయిలో పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. నృత్య-సంక్రాంతి (నృత్యం), కళా-స్పర్ధ (కళలు), దృశ్యాంతర (చలనచిత్ర నిర్మాణం), ప్రతిబింబ్-యుద్ధం (ఫొటోగ్రఫీ), సంగీత-సమ్రాంగ్ (సంగీతం), వాణి-సంఘర్ష (సాహిత్యం) వాద సంగ్రామ (చర్చ)లో ఔత్సాహికులు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తారన్నారు.

సిల్వర్ జ్యువెలరీకి అభిమానిని

సినీ నటి నిధి అగర్వాల్



సాక్షి, సిటీబ్యూరో : ప్రస్తుతం సిల్వర్ జ్యువెలరీలోనూ వైవిధ్యభరిత కలెక్షన్లు అందుబాటులోకి వచ్చాయని, తాను వాటికి అభిమానిగా మారానని చెప్పారు సినీనటి నిధి అగర్వాల్. దేశవ్యాప్తంగా వెండి ఆభరణాలకు పేరొందిన జ్యువెలరీ బ్రాండ్ ఏకాదీ నగరంలో తమ తొలి స్టోర్‌ను పంజాగుట్టలో నెలకొల్పనుంది. ఈ సందర్భంగా శనివారం పార్క్ హయత్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్రాండ్ అంబాసిడర్ హోదాలో పాల్గొన్న నిధి మాట్లాడుతూ మార్కెట్‌లో కొత్తగా అందుబాటులో ఉండే ఫ్యాషన్‌ని ఫాలో అవుతానని, ముఖ్యంగా లైట్ వెయిట్ సిల్వర్ ఆభరణాలను ఇష్టపడతానని తెలిపారు. ఈ సమావేశంలో ఎకాధి డైరెక్టర్స్ వేణు రాచకొండ శివచరణ్ వుప్పలంచి మాట్లాడుతూ పంజాగుట్టలో తమ స్టోర్‌ను ఆదివారం ప్రారంభిస్తున్నామని త్వరలో తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా విస్తరిస్తామని అన్నారు. బంగారు నగల సొగసును, నైపుణ్యాన్ని సిల్వర్ జ్యువెలరీ ద్వారా అందించే తమ కలెక్షన్లు నగరవాసులను ఆకట్టుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.





ఉద్యోగ నైపుణ్యంలో తడబాటు..

నగరంలో 31% మంది పరిస్థితి ఇదే	లింక్డ్ ఇన్ స్కిల్స్ ఆన్ ది రైజ్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: 2030 నాటికి చాలా ఉద్యోగాల్లో ప్రస్తుతం ఉపయుక్తంగా ఉన్న 64% నైపుణ్యాలు మారతాయని అంచనా వేస్తున్న నేపథ్యంలో ప్రొఫెషనల్ నెట్‌వర్క్ అయిన లింక్ ఇన్, 'స్కిల్స్ ఆన్ ది రైజ్' పేరిట తాము నిర్వహించిన తాజా పరిశోధన ఫలితాలు విడుదల చేసింది. దీని ప్రకారం దేశవ్యాప్తంగా నగరాల్లో 25% మంది నిపుణులు భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలు లేవని ఆందోళన చెందుతున్నారు. మన హైదరాబాద్ నగరంలో దాదాపు 10 మందిలో నలుగురు (46%) నిపుణులు ఉద్యోగానికి తాము సరిపోతామో లేదో నిర్ణయించుకోవడంలో తడబడుతున్నారు. ఇక 31% మందికి తమ నైపుణ్యాల్లో ఏవి ఉద్యోగ అవసరాలకు సరిపోతాయో తెలియని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. మిగిలినవారు ఏ నైపుణ్యాలు డిమాండ్‌లో ఉన్నాయో అర్థం చేసుకోవడంలో మరింత తడబాటులో ఉన్నారని ఫలితాల్లో తేలింది.

పది మందికీ సేవ చేయాలనే లక్ష్యంతో పది వసంతాలుగా అలుపెరుగని యజ్ఞం చేస్తున్నారు. రోడ్ల వెంబడి అభాగ్యుల ఆకలి దప్పికలు తీరుస్తూ.. నిరంతరాయంగా మానవ సేవా సమితి ద్వారా కృషి చేస్తున్నారు. మోడల్ కాలనీకి చెందిన మానవ సేవ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్విఘ్నంగా పది మందికి అండగా నిలుస్తున్నారు. ఎర్రగడ్డ- అమీర్‌పేట ప్రధాన రహదారిపై రైతుబజారు దగ్గర్లో వారి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు ఠంచనుగా ఆహారాన్ని పంపిణీ చేస్తున్నారు. - సనత్‌నగర్

అలుపెరుగని యజ్ఞం.. సేవే లక్ష్యం



- → నిరంతరాయంగా ఆకలి దప్పికలు తీరుస్తూ
- → పది వసంతాలుగా మానవ సేవా సమితి కృషి

ప్రతి రోజూ 500 మందికి మితాహారాన్ని, మజ్జిగ, పెరుగన్నం, అరటిపండు వంటివి దాతల సహకారంతో అందిస్తారు. అప్పుడప్పుడు కొన్ని ప్రత్యేక సందర్భాల్లో, ప్రత్యేక రోజుల్లో వెరైటీ మెనూ అందిస్తారు. 2016లో ప్రారంభమైన ఈ యజ్ఞం ప్రస్తుతం పదో వసంతంలోకి అడుగుపెట్టింది. ఆహారంతో పాటు వేసవిలో చలివేంద్రం కూడా ఏర్పాటు చేస్తుంటారు.

దాతల సహకారంతో..

పుట్టినరోజు, పెళ్లిరోజు పేరు ఏదైనా కావచ్చు..కుటుంబంలో చేసుకునే వేడుక ఏదైనా ఆ సందర్భాన్ని నలుగురితో పంచుకోవాలనే దాతలే ఈ మానవ సేవా సమితికి అండగా నిలుస్తున్నారు. దాతలు అందించిన మొత్తంతో వారి పేరుమీద ఆహారాన్ని పంపిణీ చేస్తుంటారు నిర్వాహకులు. సేవా సమితి నిర్ణయించిన మెనూ మేరకు నిర్ణయించిన మొత్తాన్ని చెల్లించి మధ్యాహ్న భోజన కార్యక్రమంలో భాగస్వాములుగా నిలుస్తున్నారు. సందర్భానుసారం ఒక్కోసారి ఇద్దరు లేదా ముగ్గురు దాతలు ముందుకొస్తుంటారు. ఆయా రోజుల్లో ప్రత్యేక మెనూ వడ్డిస్తారు. వీరితోపాటు వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు, కార్మికులు కూడా దాతలు అందించే ఆహారాన్ని స్వీకరిస్తుంటారు.



పదో వసంతంలోకి..

"ఎండల్లో ఇబ్బంది పడుతూ ఎంతోమంది రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి వారికి ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో 2016లో మానవ సేవా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా మధ్యాహ్న మిత భోజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. అప్పటి నుంచి ఎలాంటి ఆటంకం లేకుండా వేసవిలో మూడు నెలల పాటు ఆహారం పంపిణీ చేస్తున్నాం. అడిగిన వెంటనే లేదనకుండా దాతలు కూడా ముందుకొచ్చి ఈ యజ్ఞంలో భాగస్వాములుగా నిలుస్తున్నారు. సందర్భాన్ని బట్టి ఏడాది పొడవునా సేవలు కొనసాగిస్తున్నాం"

- దండా బుచ్చిబాబు, ట్రస్టీ

1971 జనాభా లెక్కలే.. ప్రాతిపదిక కావాలి

పునర్విభజనపై ప్రధాని మోదీకి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ లేఖ

అలాగైతేనే అన్ని రాష్ట్రాలకు లోక్‌సభలో సమాన ప్రాతినిధ్యం

- ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం
- జనాభా నియంత్రణను నిజాయితీగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు ఈ ప్రక్రియ శిక్ష కాకూడదు
- ప్రధాని నరేంద్ర మోదీకి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పష్టీకరణ
- దామాషా ప్రకారం అన్ని రాష్ట్రాల్లో సీట్ల పెరుగుదల అంశాన్ని దృష్టిలో పెట్టుకుని డీలిమిటేషన్
- ఈ మేరకు కసరత్తు చేస్తామని హోంమంత్రి అమిత్‌షా హామీ ఇచ్చారు
- ఆ హామీ అమలు చేయాలంటే రాజ్యాంగంలోని 81(2)(ఎ) అధికరణను సవరిస్తూ రాజ్యాంగ సవరణ చేయాలి
- దేశ రాజకీయ, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉన్నందున ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- ప్రధానిగా మీ నాయకత్వం, మార్గ నిర్దేశం చాలా ముఖ్యం



సాక్షి, అమరావతి: దేశంలో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)కు 1971 జనాభా లెక్కలే ప్రాతిపదిక కావాలని.. ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ ప్రక్రియ చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ప్రధాని నరేంద్ర మోదీకి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివరించారు. జాతీయ ప్రాధాన్యతగా జనాభా నియంత్రణను నిజాయితీగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ ప్రక్రియ శిక్షగా మారకూడదని స్పష్టం చేశారు. దామాషా ప్రకారం అన్ని రాష్ట్రాల్లో సీట్ల పెరుగుదల అంశాన్ని దృష్టిలో ఉంచుకుని డీలిమిటేషన్ కసరత్తు చేపడతామని హోం మంత్రి అమిత్‌షా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీ అమలుకు అడ్డంకిగా మారిన రాజ్యాంగంలోని 81(2)(ఎ) అధికరణ(ఆర్టికల్)ను సవరిస్తూ రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. దీనివల్ల సీట్లలో ఆయా రాష్ట్రాల వాటాలు అలానే ఉంటాయని, లోక్‌సభలో ఆయా రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుందన్న అంశం ఉత్పన్నం కాదని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోదీకి వైఎస్ జగన్ శుక్రవారం రాసిన లేఖను శనివారం మీడియాకు విడుదల చేశారు. కొన్ని రాష్ట్రాల ప్రాతినిధ్యంతోపాటు ఆయా రాష్ట్రాల ప్రజల మనోభావాలను డీలిమిటేషన్ ప్రక్రియ ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున ఈ లేఖ రాస్తున్నానని తెలిపారు. డీలిమిటేషన్ ప్రక్రియపై వస్తున్న అభ్యంతరాలు దేశ సామాజిక, రాజకీయ సామరస్యాన్ని దెబ్బ తీసే అవకాశం ఉన్నందున, ఈ అంశం తీవ్రతను దృష్టిలో ఉంచుకోవాలని ప్రధాని మోదీని కోరారు. ఈ విషయంలో ప్రధానిగా మీ నాయకత్వం, మార్గ నిర్దేశం చాలా ముఖ్యమని.. మీరిచ్చే హామీ అనేక రాష్ట్రాలకున్న భయాలను, అపోహలను తొలగించడానికి దోహద పడుతుందని ప్రధానికి వైఎస్ జగన్ వివరించారు. లోక్‌సభలో ఇప్పుడున్న సీట్ల పరంగా ఆయా రాష్ట్రాలకు ఉన్న వాటాను కుదించకుండా పునర్విభజన (డీలిమిటేషన్) కసరత్తు చేపట్టాలని కోరారు. ఆ లేఖలో ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి.

దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకూడదు

రాజ్యాంగంలో 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం 2026లో డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. కానీ.. దీనికి ముందుగా 2021లో చేపట్టాల్సిన జనాభా లెక్కింపు ప్రక్రియ కోవిడ్ కారణంగా వాయిదా పడింది. 2026 నాటికి జనాభా లెక్కల ప్రక్రియను పూర్తి చేయడానికి ఇప్పటికే అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. ఇది జరిగిన వెంటనే డీలిమిటేషన్ ప్రక్రియ జరుగుతుందన్న అంశం అనేక రాష్ట్రాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ముఖ్యంగా ఈ ప్రక్రియ ద్వారా తమ ప్రాతినిధ్యం తగ్గిపోతుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

జనాభా నియంత్రణను నిజాయితీగా చేయడం వల్లే..


జనాభా నియంత్రణ కోసం వివిధ రాష్ట్రాలు అనేక విధానాలు అమలు చేశాయి. అయితే వాటి ఫలితాలు ఆయా రాష్ట్రాల్లో వేర్వేరుగా ఉన్నాయి. దీని వల్ల జనాభా పెరుగుదల వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాలుగా ఉంది. దేశ వ్యాప్తంగా జనాభా వృద్ధి ఒకే తరహాలో లేదు. అసమతుల్యత ఉంది. దీని వల్ల డీలిమిటేషన్ అంశం విస్తృత స్థాయిలో ఆందోళనకు దారి తీస్తోంది. 42వ.. 84వ రాజ్యాంగ సవరణల ద్వారా ఆయా రాష్ట్రాలకు సీట్ల కేటాయింపును నిలిపేశారు. కాలక్రమేణా అన్ని రాష్ట్రాలు జనాభా నియంత్రణ కసరత్తులో భాగంగా ఒకే స్థాయిలో ఫలితాలు సాధిస్తాయని భావించి ఈ సీట్ల కేటాయింపును నిలిపేశారు. దేశ జనాభాలో ఆయా రాష్ట్రాల వాటా 1971 నాటికి అనుకున్న స్థాయికి చేరుకుంటుందని భావించారు. కానీ, 2011 జనాభా లెక్కల గణాకాంలను చూస్తే.. దశాబ్దాల తరబడి జనాభా వృద్ధి, దాని అంచనాలు అన్ని రాష్ట్రాల్లో ఒకేలా లేవని తేలింది. 1971, 2011 మధ్య 40 సంవత్సరాల్లో దేశ జనాభాలో దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గింది. గత 15 సంవత్సరాల్లో జనాభా మరింత తగ్గిందని మేం నమ్ముతున్నాం. జనాభా నియంత్రణను జాతీయ ప్రాధాన్యతగా తీసుకున్నందున, దక్షిణాది రాష్ట్రాలు నిజాయితీగా తమ విధానాలను అమలు చేయడం వల్ల ఈ వాటా తగ్గింది. 1971 జనాభా లెక్కల ప్రకారం దక్షిణాది రాష్ట్రాల జనాభా వృద్ధి రేటు 24.8 శాతం అయితే, 2011 జనాభా లెక్కల ప్రకారం 20.88 శాతంగా ఉంది.

అపోహలు, భయాలు తొలగించండి

రాష్ట్రాల్లో ఇప్పుడున్న జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని డీలిమిటేషన్ ప్రక్రియ జరిగితే దేశ విధానాల రూపకల్పన సహా శాసన ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని మీ దృష్టికి తీసుకు వస్తున్నాను. దామాషా ప్రకారం అన్ని రాష్ట్రాలకు సీట్ల పెరుగుదల అంశాన్ని దృష్టిలో ఉంచుకుని డీలిమిటేషన్ కసరత్తు చేపడతామని హోం మంత్రి అమిత్‌షా హామీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు. అయితే ఈ హామీని అమలు చేయాలంటే రాజ్యాంగ పరంగా చేయాల్సిన సడలింపును కూడా మీ దృష్టికి తీసుకు వస్తున్నాను. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 (2) (ఎ) జనాభా ప్రాతిపదికన ఆయా రాష్ట్రాలకు సీట్ల కేటాయింపు జరగాలని పేర్కొంది. దీని ప్రకారం డీమిలిటేషన్ ప్రక్రియలో ముందుకు వెళ్తే ఈ నిబంధన వల్ల హోంమంత్రి అమిత్‌షా ఇచ్చిన హామీని అమలు చేయడంలో అడ్డంకులు ఏర్పడతాయి. అందువల్ల దామాషా ప్రకారం ప్రతి రాష్ట్రానికి సీట్ల కేటాయింపుపై రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉంది. దీని వల్ల సీట్లలో ఆయా రాష్ట్రాల వాటాలు అలానే ఉంటాయి, ఆయా రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుందనే అంశం ఉత్పన్నం కాదు. డీలిమిటేషన్ ప్రక్రియపై వస్తున్న అభ్యంతరాలు దేశ సామాజిక, రాజకీయ సామరస్యాన్ని దెబ్బ తీసే అవకాశం ఉన్నందున ఈ అంశం తీవ్రతను దృష్టిలో ఉంచుకోవాలని కోరుతున్నాను. ఈ విషయంలో ప్రధానిగా మీ నాయకత్వం, మార్గనిర్దేశం చాలా ముఖ్యం. మీరిచ్చే హామీ అనేక రాష్ట్రాలకున్న భయాలను, అపోహలను తొలగించడానికి దోహద పడుతుంది.

సమృద్ధిగా పశు సంపద

- రాష్ట్రంలో పుష్కర కాలంలో 22 శాతం పెరుగుదల
- దేశంలోని మొత్తం గొర్రెల్లో 25 శాతం తెలంగాణలోనే..
- వాణిజ్య పౌల్ట్రీలో తెలంగాణ వాటా 11.68 శాతం
- భూమి లేని రైతుల నుంచే 62 శాతం పాల ఉత్పత్తి
- సామాజిక, ఆర్థిక సర్వే 2024–25లో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పశు సంపద సమృద్ధిగా ఉందని సామాజిక, ఆర్థిక సర్వే 2024–25లో ప్రభుత్వం వెల్లడించింది. 2012 నుంచి రాష్ట్రంలో పశు సంపద 22 శాతం పెరిగిందని తెలిపింది. సర్వే ప్రకారం రాష్ట్రంలో 3.26 కోట్ల పశువులు ఉన్నాయి. మరీ ముఖ్యంగా దేశంలోని మొత్తం గొర్రెల్లో 25 శాతం తెలంగాణలోనే ఉన్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉండడానికి వ్యవసాయంతోపాటు దాని అనుబంధ రంగాలైన పాల ఉత్పత్తి, కోళ్లు, మేకలు, గొర్రెల పెంపకం వల్ల వస్తున్న ఆదాయమే కారణమని సర్వే స్పష్టం చేసింది. వ్యవసాయ అనుబంధ రంగాలపై సర్వేలోని కీలక విషయాలు

- రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న పాలలో 62 శాతం వ్యవసాయ భూమి లేని రైతుల నుంచే వస్తున్నాయి.
- 70 శాతం రైతులు పశు సంపదను కలిగి ఉన్నారు. రాష్ట్రంలో మొత్తం 3.26 కోట్ల పశువులు ఉన్నాయి.
- 2012 నుంచి పశు సంపద 22 శాతం పెరిగింది.
- ఈ రంగంలో 2023–24 ఆర్థిక సంవత్సరం తుది సవరించిన అంచనాల ప్రకారం 'జోడించిన రాష్ట్ర స్థూల విలువ'(జీఎస్‌వీఏ) రూ.96,908 కోట్లు ఉంటే.. 2024–25 ముందస్తు అంచనాల ప్రకారం రూ.1,02,835 కోట్లకు పెరిగింది.
- 2024–25లో చేపల ఉత్పత్తి లక్ష్యం 4,81,421 టన్నులు కాగా.. ఈ ఏడాది జనవరి నాటికి 3,69,489 టన్నులు ఉత్పత్తి అయ్యింది. మంచినీటి రొయ్యల ఉత్పత్తి లక్ష్యం 18,366 టన్నులు కాగా.. జనవరి నాటికి 11,845 టన్నులు వచ్చింది. – చేపల పెంపకంలో కృషికి గాను రాష్ట్రానికి కేంద్రం 'బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇన్‌ల్యాండ్ స్టేట్ ఇన్ ఫిషరీస్ సెక్టార్'అవార్డు ప్రకటించింది.

పశు సంపద వివరాలు..

పశు జాతి	దేశంలో	తెలంగాణలో	రాష్ట్ర శాతం
ఆవులు	19,25,23,000	42,31,000	2.2
గేదెలు	10,98,52,000	42,26,000	3.85
గొర్రెలు	7,42,61,000	1,90,63,000	25.67
మేకలు	14,88,85,000	49,35,000	3.31
పందులు	90,55,000	1,78,000	1.97
గుర్రాలు	3,42,000	4,000	1.13
గాడిదలు	1,24,000	2,000	1.64
మ్యూల్స్	84,000	0	
ఒంటెలు	2,52,000	0	
మొత్తం	53,58,22,000	3,26,39,000	6.09
ఇళ్లల్లో కోళ్లు	31,70,73,000	1,75,44,000	5.53
వాణిజ్య పౌల్ట్రీ	53,47,37,000	6,24,55,000	11.68
మొత్తం పౌల్ట్రీ	85,18,10,000	7,99,99,000	9.39

అప్పుచేసి బోర్లు వేసినా నీళ్లు రాకపోవడంతో..

మనోవేదనతో రైతు ఆత్మహత్య




రైతు పాల్యా జీవుల (ఫైల్)

కొడిపల్లి (నర్సాపూర్): కళ్ల ముందే పంట ఎండిపోతుంటే ఆ రైతు తట్టుకోలేకపోయాడు. కొత్త బోర్లువేసి పంటను కాపాడుకోవాలనుకున్నాడు. అయితే వేసిన బోర్లు సైతం ఫెయిల్ అవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. మెదక్ జిల్లా కొడిపల్లి మండలం కుషన్‌గడ్డ తండాకు చెందిన పాల్యా జీవుల (50) తనకున్న మూడెకరాల పొలంలో వరి పంటను సాగు చేశాడు. భూగర్భజలాలు అడుగంటి బోరుబావి వట్టిపోయింది. పంట ఎండిపోతుండటంతో కొత్త బోరు వేసి పంటను రక్షించుకోవాలనుకున్నాడు. అయితే కొత్తగా వేసిన బోరుబావిలో సైతం నీరు పడకపోవడంతో ఎండిన పంటను చూస్తూ తట్టుకోలేకపోయాడు. మరో మూడు కొత్త బోర్లు వేసినా నీరు పడకపోవడంతో పంట పూర్తిగా ఎండిపోయింది. అప్పు సుమారు రూ. 4 లక్షలు మిగిలింది. చేసిన అప్పు తీర్చే మార్గం లేక మనోవేదనకు గురైన జీవుల శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. శనివారం ఉదయం రాజిపేట శివారు అడవిలో వెతకగా చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. మృతుడికి భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

చెప్పింది చేయాల్సిందే

ఉన్నతాధికారులపై కూటమి ఎమ్మెల్యేల దౌర్జన్యం

- అడ్డు చెప్పారో మీ సంగతి తేలుస్తామని బెదిరింపులు
- అసెంబ్లీ ప్రాంగణంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే రభస
- రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, సీసీఎల్‌ఏ జయలక్ష్మిని తిట్టిపోసిన వైనం.. మంత్రి సర్ది చెప్పినా లెక్కచేయకుండా అరుపులు, కేకలు
- ఇలా నోరు పారేసుకోవడంతో ఐఏఎస్ అధికారుల ఆందోళన
- ఇటీవల ఎక్సైజ్ కమిషనర్ ఛాంబర్లో నరసరావుపేట ఎమ్మెల్యే వీరంగం
- ఆయనకు భయపడి వెంటనే కోరిన ప్రకారం ఆర్డర్ ఇచ్చేసిన డైరెక్టర్
- కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో దళిత ప్రొఫెసర్‌పై ఎమ్మెల్యే దాడి
- తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి తీరుతో బెంబేలెత్తుతున్న అధికారులు
- రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల ఇదే రీతిలో అధికారులపై విరుచుకు పడుతున్న ఎమ్మెల్యేలు
- అయినా పట్టించుకోని సీఎం చంద్రబాబు.. వారిపై సీరియస్ అయినట్లు లీకులతో సరి
- పొలిటికల్ గవర్నెన్స్ అంటే ఇదేనేమోనని ఉన్నతాధికారుల ఆందోళన



వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పోసాని కృష్ణమురళి విడుదల



గుంటూరు జిల్లా కారాగారం నుంచి బయటకు వస్తున్న పోసాని కృష్ణమురళి

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): సినీ నటుడు, రచయిత పోసాని కృష్ణమురళి శనివారం సాయంత్రం బెయిల్‌పై విడుదలయ్యారు. గతంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో రాష్ట్రంలో పలు అక్రమ కేసులు నమోదు చేశారు. అన్నమయ్య జిల్లాలో నమోదైన కేసులో ఆ జిల్లా పోలీసులు గత నెల 26న పోసానిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అరెస్టు చేసిన విషయం విదితమే. అనంతరం ఆయన్ని వివిధ కేసులపై ఆయా పోలీస్ స్టేషన్లకు తీసుకెళ్లడం, కోర్టుల్లో హాజరుపరచడం, జైలుకు తరలించడం, పోలీసుల కస్టడీకి తీసుకోవడం వంటివి జరిగాయి. పలు కేసుల్లో కోర్టులు ఆయనకు బెయిల్ మంజూరు చేశాయి. ఇంతలో సీఐడీ ఆయనపై మరో అక్రమ కేసు నమోదు చేసి, కస్టడీలోకి తీసుకుంది. ఈ కేసులో పోసానిని ఇటీవల గుంటూరు జిల్లా జైలుకి తరలించారు. ఈ కేసులో గుంటూరు ఎక్సైజ్ కోర్టు ఆయనకు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. కోర్టు ఉత్తర్వులు రావడం, పూచీకత్తులు సమర్పించడం వంటివి పూర్తవడంతో ఆయన 24 రోజుల అనంతరం శనివారం సాయంత్రం గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు.

నేడు లేదా రేపు ధర్మసాగర్‌లోకి నీరు

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేటలోని దేవాదుల ప్రాజెక్టు మూడో దశ పంప్‌హౌస్ నుంచి ఆదివారం సాయంత్రం కానీ, సోమవారం ఉదయం లోపు మోటార్ ఆన్ చేసి ధర్మసాగర్ చెరువులోకి నీటిని విడుదల చేస్తామని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. డ్రై రన్ పూర్తయిన నేపథ్యంలో నీటిని వదులుతున్నట్లు శనివారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, ఇటీవల రాష్ట్ర మంత్రులు ప్రారంభోత్సవానికి వెళ్లిన సమయంలో మోటార్ మొరాయించడంతో వారు వెనుదిరగడం తెలిసిందే. ఆస్ట్రియా నుంచి నిపుణులు రావడంతో మరమ్మతులు పూర్తయినట్లు తెలుస్తోంది. దీంతో నీటి విడుదలకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

అడుగంటిన జలం..

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్ష ఎకరాల్లో వరి ఎండిపోయినట్టు వ్యవసాయ శాఖ అధికారులు అనధికారికంగా చెబుతున్నారు. వేసవి మరింత ముదురుతుండటం, భూగర్భ జలాలు మరింతగా తగ్గిపోతుండటంతో మరింతగా పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని పేర్కొంటున్నారు.

వేలకొద్దీ బోర్లు వేస్తున్నా...

వేసవి తీవ్రత పెరుగుతుండటం, భూగర్భ జలాలు తగ్గి బోర్లు వట్టిపోతుండటంతో.. పంటలను

ఫెయిల్ అయిన కొత్త బోరు బావి

కాపాడుకునేందుకు రైతులు పెద్ద సంఖ్యలో బోర్లు వేయిస్తున్నారు. ముఖ్యంగా నల్లగొండ, యాదాద్రి, సిద్దిపేట, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల, వరంగల్, జనగామ, భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో బోర్లు వేయిస్తున్న రైతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఒక్కో ఉమ్మడి జిల్లా పరిధిలో గత రెండు నెలల్లో.. కనీసం వెయ్యి వరకు బోర్లు వేయించినట్టు అంచనా.

పెరుగుతున్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు..

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తీసుకుంటున్న రైతుల సంఖ్య పెరుగుతోంది. ఇందులో కొంత మంది కాలువల కింద సాగు చేస్తుండగా.. ఎక్కువ మంది కొత్తగా బోర్లు వేసి పంటలు కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నవారే. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గత రెండున్నర నెలల్లో 1,969 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తీసుకోగా.. మహబూబ్‌నగర్‌లో 1,334 కనెక్షన్లు, వరంగల్ జిల్లాలో 1,706 కనెక్షన్లు, ఖమ్మం జిల్లాలో 850 కనెక్షన్లు తీసుకున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

అప్పుల ఊబిలోకి రైతులు

పంటను కాపాడుకునేందుకు పెద్ద సంఖ్యలో బోర్లు వేయిస్తున్న రైతులు.. ఇందుకోసం లక్షల రూపాయలు అప్పులు చేస్తున్నారు. అటు బోర్లలో నీరూ పడక, ఇటు అప్పులూ పెరిగిపోయి తలపట్టుకుంటున్నారు.

- యాదాద్రి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం ఉప్పలపహడ్ గ్రామానికి చెందిన సైరెడ్డి చంద్రారెడ్డి బావి ఎండిపోవడంతో రెండు నెలల కిందట బోరు వేశారు. నీళ్ల పడలేదు. వారం కింద మరో బోరు 450 ఫీట్లు వేయించగా.. అదీ ఫెయిల్ అయింది. వాటికోసం చేసిన అప్పు రూ.లక్షన్నర, పంట పెట్టుబడి రూ.లక్ష మొత్తం రూ.2.5 లక్షల అప్పులపాలయ్యారు.
- నారాయణపేట జిల్లా మరికల్ మండలం పల్లెగడ్డకు చెందిన గుర్రం శ్రీనివాస్ 4 ఎకరాల్లో వరి సాగు చేశారు. మూడెకరాల్లో పంట ఎండిపోతుండటంతో పది రోజుల కింద 3 బోర్లు వేశారు. వాటిల్లో చుక్క నీరు కూడా పడలేదు. చేసేదేమీ లేక పొలాన్ని పశువుల మేతకు వదిలేశారు. బోర్లు వేసేందుకు చేసిన రూ. 2 లక్షల అప్పు భారంగా మారింది.
- కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కన్నాపూర్ తండాకు చెందిన కాట్రోత్ రవినాయక్ నాలుగెకరాల్లో వరి సాగు చేశారు. పంట ఎండిపోతుండటంతో మూడు బోర్లు వేయించినా.. ఒక్కదానిలోనూ నీళ్లు పడలేదు. రూ.3.5 లక్షలు అప్పు మీదపడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మెదక్ జిల్లా చేగుంట మండలం కర్నాల్‌పల్లికి చెందిన చింతాకుల రవి రెండెకరాల్లో వరి వేశారు. బోరు ఎండిపోవడంతో.. 20 రోజుల కింద 600 ఫీట్ల వరకు మరో బోరు వేసినా నీరు పడలేదు. రూ.లక్షన్నర అప్పు అయిందని వాపోతున్నారు.

అప్పులు తీర్చేదెలా?



ఐదెకరాల్లో వరి సాగు చేశా. భూగర్భ జలాలు తగ్గి బోరు ఎత్తిపోయింది. పంటను కాపాడుకునేందుకు రూ.1.5 లక్షలు అప్పు చేసి రెండు బోర్లు వేయించినా చుక్క నీరు రాలేదు. పొట్టదశలో ఉన్న వరి ఎండిపోతోంది. ఏం చేయాలో, అప్పు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.
– పెరుగు కొమురయ్య, ఆరేపల్లి, కొండపాక మండలం, సిద్దిపేట జిల్లా

600 ఫీట్లు వేసినా నీళ్లు పడలే..



నాకు ఆరెకరాలు పొలం ఉంది. భూగర్భ జలాలు అడుగంటడంతో రెండు బోర్లు 600 ఫీట్ల వరకు వేయించా. అయినా నీళ్లు పడలేదు. రూ. లక్ష ఖర్చయింది. మళ్లీ బోరు వేయాలంటే భయంగా ఉంది.
– బుర్ర వినయ్‌కుమార్, లక్ష్మీపూర్, తంగళ్లపల్లి, సిరిసిల్ల



ఈయన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం చిన్నరామన్‌చర్లకు చెందిన రైతు మల్ల జీరయ్య. ఒక టిన్నర ఎకరాల్లో మామిడి తోట వేశారు. పదెకరాల్లో వరి సాగు చేశారు. భూగర్భ జలాలు పడిపోవడంతో ఉన్న మూడు బోర్లు వట్టిపోయాయి. పొట్ట దశలో ఉన్న వరిని కాపాడుకునేందుకు వారం రోజుల్లో ఏడు బోర్లు వేశారు. ఒక్కొక్కటి 600 ఫీట్ల లోతు వరకు వేసినా చుక్క నీరు కూడా పడలేదు. సుమారు రూ.4.50 లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకుండాపోయిందని, 8 ఎకరాల వరి పూర్తిగా ఎండిపోయిందని ఆయన వాపోతున్నారు. సాగునీరు లేక పాడి గేదెలకు తాగునీరు అందించలేక మూడు పశువులను అమ్మేసుకున్నానని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండలం కర్నాల్ తండాకు చెందిన ఈ రైతుపేరు మహిపాల్. భూగర్భ జలాలు అడుగంటి పొలంలోని బోరు వట్టిపోయింది. ఎండిపోతున్న పంటను కాపాడుకునేందుకు మరో బోరు వేయించారు. 800 ఫీట్ల లోతు వేసినా నీళ్లు పడలేదు. రూ.1.60 లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేదని ఆయన వాపోయారు.



ఈ చిత్రంలోని రైతు యాదాద్రి జిల్లా మోత్కూరు మండలం రాగిబావికి చెందిన ఏలకంటి సత్తిరెడ్డి. 4 ఎకరాల్లో వరి సాగు చేశారు. పాత బోర్లు వట్టిపోవడంతో.. 20 రోజుల కింద వరుసగా నాలుగు బోర్లు వేయించారు. దేనిలోనూ నీళ్లు పడలేదు. రూ.3 లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకుండాపోయిందని, పొలమంతా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెన్ను విరిచిన వర్షం

▶ మొదటి పేజీ తరువాయి

రాలిపోయాయి. నిజామాబాద్ జిల్లాలో సిరికొండ, ఇందల్వాయి, దర్పల్లి మండలాల్లో వడగళ్లతోపాటు పిడుగులు కూడా పడ్డాయి. దర్పల్లి మండలంలోని వాడి, లింగంపల్లి, పోతాయిపల్లి గ్రామాల్లో పిడుగుపాటుకు రెండు గేదెలు, మూడు గొర్రెలు మృతి చెందాయి. మెదక్ జిల్లా దౌల్తాబాద్ మండలం తిరుమలాపూర్, మహమ్మద్ షాపూర్, సూరంపల్లి, దొమ్మాట, ముబారస్ పూర్ తదితర గ్రామాల్లో దాదాపు 175 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నది. అకాల వర్షం వల్ల చేతికొచ్చిన పంట నేల రాలటంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 'మా కష్టం అంతా వృథా అయ్యింది. ప్రభుత్వం తక్షణం పరిహారం అందించాలి'అని వరంగల్‌కు చెందిన ఓ రైతు వాపోయారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని మోమిన్‌పేట, మర్పల్లి, నవాబుపేటలో కూరగాయ పంటలు, పూల తోటలకు నష్టం వాటిల్లింది. కందుకూరు, చేవెళ్ల, మోమిన్‌పేట, షాద్‌నగర్ మండలాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. హన్వాడ, మహబూబ్‌నగర్ రూరల్, మహబూబ్‌నగర్ అర్బన్, జడ్చర్ల, మూసాపేట, అడ్డాకులు, భూత్పూర్ మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురవటంతో పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రాష్ట్రంలో మరికొన్ని రోజులు వర్షాలు పడే అవకాశం ఉంది. పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీచేశారు. పంట నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు.

సూత్తుండగానే మక్కలు కొట్టుకుపోయాయి



రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. రూ.30 వేల వరకు ఖర్చు చేసిన. కరువు రావడంతో దిగుబడి 36 బస్తాలకు పడిపోయింది. మక్కలను అమ్ముకునేందుకు మూడు రోజుల క్రితం జనగామ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చా. తేమ ఉందని తక్కువ ధరకు అడగడంతో కాటన్ యార్డులో ఆరబోసుకున్నా. ఈరోజు అమ్ము కుందామని ఆశపడ్డ. తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో మక్కల రాసి వద్ద వరద చేరి మొత్తం తడిసిపోయాయి. సూత్తుండగానే గింజలు కొట్టుకుపోయాయి. దిగుబడి తగ్గి ఒక రకంగా నష్టపోతే, అకాల వర్షం మరింత కుంగదీసింది. నన్ను ప్రభుత్వం ఆదుకోవాలి.
– విజయ, కొండాపురం, పాలకుర్తి, జనగామ జిల్లా



'శతమానం భవతి' అన్నారు మన పెద్దలు. నూరేళ్లు జీవించి పిల్ల పాపల ఆనందాలు చూసి వీడ్కోలు తీసుకోవాలని భారతీయులు కోరుకుంటారు. ఒకప్పుడు ఆయుఃప్రమాణం బాగా తక్కువగా ఉండేది. ఇప్పుడు ఆధునిక వైద్య విధానాల వల్ల ఆయుఃప్రమాణం పెరిగింది. అయితే వైద్య విధానం ఎంత ఆధునికంగా ఉన్నా అది పూర్తిగా జబ్బు నయం చేయలేనివే ఎక్కువ. యథాతథ స్థితిని కొనసాగించి ఆయుష్షును పొడిగించగలుగుతున్నాయి. ఇది ఒక రకంగా వరం. మరో రకంగా ఇబ్బందిగా మారుతోంది. పెద్దవాళ్లు జబ్బుపడి ఎక్కువ రోజులు సహాయం పొందే స్థితికి వస్తే ఇంటిలో సమస్యలు మొదలవుతున్నాయి. మరి వీటిని ఎలా నివారించాలి?

వయోవృద్ధులు

పెద్దవాళ్లు జబ్బుపడితే ఎవరు చూడాలి?

మన దేశంలో 70 ఏళ్ల వయసు దాటాక స్త్రీల కంటే పురుషులే ఎక్కువ జబ్బుల గురించి ఆందోళన చెందుతున్నారట. దానికి కారణం మంచాన పడితే ఎవరు చూడాలి అనేది ఒకటైతే పూర్తి కదలికలు నియంత్రణలోకి వెళితే జీవితం చాలా కష్టంగా మారుతుందనే భయం ఒకటి. స్త్రీలకు సేవ చేసే స్త్రీలు దొరికే అవకాశం ఎక్కువగా ఉంటే పురుషులకు సేవ చేసేవారు తక్కువగా ఉన్నారు. ఈ నేపథ్యంలో 70లు 80లకు చేరుకున్న తల్లిదండ్రులు అనారోగ్యాల బారిన పడితే బాధ్యత ఎవరు తీసుకోవాలనే విషయం మీద చాలా ఇళ్లల్లో ఒక అనిశ్చితి నెలకొంటోంది.

స్పష్టత వచ్చే వీలు ఉందా?

తల్లిదండ్రులు జబ్బుపడితే వారి బాగోగులు చూసే స్థితిలో ఇప్పుడు సంతానం ఉండటం లేదు. దానికి కారణం బిజీ బతుకుల్లో భార్యాభర్తలు ఇద్దరూ సంపాదించాల్సి వస్తోంది. దానికితోడు పిల్లల కెరీర్‌లకు వారి అవసరాలకు సమయం చాలదు. మధ్య తరగతి అయినా ఎగువ మధ్యతరగతి అయినా త్రీ బెడ్ నివాసాలు ఉండి జబ్బుపడ్డ తల్లిదండ్రులకు ఒక గది ఇచ్చే వీలు 90 శాతం ఇళ్లల్లో ఉండటం లేదు. దీంతో తల్లిదండ్రులు ఆరోగ్యంగా ఉండగానే భవిష్యత్తులో రాబోయే అనారోగ్యాలను దృష్టిలో ఉంచుకుని అంటీముట్టనట్టు తయారవుతున్న సంతానం ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఇది తల్లిదండ్రులను మరింత బాధపెడుతోంది. ఇప్పుడే ఇలా వీరుంటే రేపెలా అనే చింత పట్టుకుంటోంది.

కూర్చుని మాట్లాడుకోవాలి

అంతా బాగున్నప్పుడే తల్లిదండ్రులు, పిల్లలు కూచుని మాట్లాడుకోవాలి. తల్లిదండ్రుల అనారోగ్యం కోసం వారు సొంతంగా దాచుకున్న నిధిని, పిల్లలు తమ వంతుగా ఇవ్వగలిగిన నిధిని కలిపి ఒకచోట ఉంచి దాని గురించి సమాచారం ఇచ్చుకోవాలి. చూసే వీలు లేకపోతే ఏజెన్సీల సహాయం ఎలా తీసుకోవాలో తెలుసుకుని ఉండాలి. ఆరోగ్యం బాగలేనప్పుడు ఏ హాస్పిటల్‌లో చేర్చాలో ముందే నిర్ణయించుకొని ఆ హాస్పిటల్‌లో తరచూ చెకప్‌లు చేయిస్తూ ఉంటే సమయానికి కొత్త పేషంట్‌గా మారే పరిస్థితి ఉండదు.

బడ్జెట్‌కు సంబంధించిన ఇబ్బందులు ఉంటే ఏయే అనారోగ్యాలకు ప్రభుత్వ/చారిటీ ఆస్పత్రులు అతి తక్కువ చార్జీలకు వైద్యసేవలు ఇవ్వగలవో తెలుసుకుని అందరూ ఆ సమాచారం పంచుకోవడం మంచిది. తల్లిదండ్రులు తమ సంతానం కోసం జీవితాన్నే వెచ్చించి ఉంటారు కాబట్టి వారికి కచ్చితంగా సమయం ఇవ్వగలమని, బాధ్యతను పంచుకోగలమనే నమ్మకం వారిలో కలిగించాలి. సాధారణంగా ఎవరో ఒకరి నెత్తి మీద ఈ బాధ్యతను తోసే ధోరణి కొందరిలో ఉంటుంది. అది సమస్యను తీవ్రంగా పెంచుతుంది.

పంతాలు విడవాలి

తల్లిదండ్రులు పెద్దవయసు వచ్చే వేళకు జీవితంలో వారి వల్ల లేదా సంతానం వల్ల ఎన్నో తప్పొప్పులు జరిగి పంతాలు పట్టింపులు ఏర్పడి ఉండవచ్చు. కాని తల్లిదండ్రులు అనారోగ్య స్థితికి చేరుకునేవేళకు అవి సమసే వాతావరణం కల్పించుకోవాలి. క్షమ చాలా సమస్యలు దూరం చేస్తుంది. మనుషులు దూరమయ్యాక చేయగలిగింది ఏమీ లేదు. అందుకే పెద్దవారు వారి చివరిదశను ప్రశాంతంగా గడిపేలా చూసుకోవాలి. ఇందుకు సామరస్య వాతావరణంలో ఎంత మాట్లాడుకుంటే అంత స్పష్టత వస్తుంది. వాట్సప్‌లు, ఫోన్ కాల్స్ మాని ఎదురుబొదురు కూచుంటే తప్ప ఇలాంటి సందర్భాలలో పరిష్కారాలు దొరకవు. అసలే జబ్బుపడ్డ పెద్దవారికి ఆత్మీయమైన ఇంటి వాతావరణానికి దగ్గర చేయడం అతిఒక్క కుటుంబ సభ్యుని బాధ్యత.



కోవిడ్ టైమ్‌లో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా నిలబడ్డ నర్స్‌లు, డాక్టర్లు, పోలీసులు అందించిన సేవలు, చేసిన సాయం గురించి మనం గుర్తు చేసుకుంటున్నాం... అందులో భాగంగా నేడు కోవిడ్ ఫస్ట్ వేవ్‌లో తెలంగాణలోనే ఏకైన కోవిడ్ వైద్యశాలగా సేవలందించిన గాంధీ ఆస్పత్రి వద్ద విధులు నిర్వర్తించిన మహిళ కానిస్టేబుల్ వేలుపుల ప్రమీల అప్పటి వాతావరణాన్ని తలుచుకుంటూ చెప్పిన విషయాలు..

ప్రతి పేషెంట్ కోసం మొక్కుకునేదాన్ని!



కరోనా టైంలో గాంధీ ఆస్పత్రి వద్ద విధుల్లో ప్రమీల



> ఉదయం మాట్లాడి వెళ్లిన పేషెంట్ చికిత్స పొందుతూ చనిపోయాడని సాయంత్రానికి వినాల్సి వచ్చేది. అప్పటివరకు గేటు దగ్గర పేషెంట్ కోసం ఎదురు చూస్తూ మాతో మాట్లాడిన కుటుంబీకులు, సంబంధీకులు ఆ వార్త విని ఏడుస్తుంటే గుండె తరుక్కుపోయేది.
> – వేలుపుల ప్రమీల

నేను పుట్టి, పెరిగిందంతా సికిందరాబాద్‌లోనే! మొదటి నుంచీ యూనిఫామ్ అంటే రెస్పెక్ట్. అందుకే పోలీస్ జాబ్‌లోకి వచ్చాను. 2008లో సిటీ పోలీసు విభాగంలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా. ప్రస్తుతం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్నా. కరోనా టైమ్‌లో బేగంపేట ఠాణాలో పని చేసేదాన్ని. అప్పుడు గాంధీ హాస్పిటల్‌కి తెలంగాణ వివిధ ప్రాంతాల నుంచి రోగులు వచ్చేవారు. ఇందుకోసం పోలీసు విభాగం అక్కడ పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేసింది. దానికోసం ప్రతి స్టేషన్ నుంచి సిబ్బందిని తీసుకున్నారు. అలా బేగంపేట పోలీసుస్టేషన్ నుంచి నేనూ గాంధీ హాస్పిటల్ మెయిన్ గేట్ దగ్గర ఐదు వారాలకు పైగా డ్యూటీలో ఉన్నా. అక్కడ పని చేయడానికి ఎస్సై నేతృత్వంలో పని చేసిన ఐదుగురు సభ్యుల్లో భాగమయ్యా.

వాళ్లూ మన లాంటి మనుషులే కదా అనుకున్నా..

ఓపక్క విజృంభిస్తున్న కరోనా.. మరోపక్క గాంధీ హాస్పిటల్‌కి రోజూ రోగుల తాకిడి. అలాంటి సమయంలో అక్కడ డ్యూటీ ఓ అరుదైన అవకాశంగానే భావించా. ఎంత కరోనా బారిన పడితే మాత్రం వాళ్లూ మనలాంటి మనుషులే కదా! వీలైనంత వరకు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రతి విషయంలోనూ వారికి సహాయం చేయాలనుకున్నా. నడుస్తూ కొందరు, నడవలేని స్థితిలో మరికొందరు, అసలు స్పృహలోనే లేకుండా ఇంకొందరు.. చూస్తే బాధనిపించేది. కుటుంబ సభ్యుల సాయంతో వచ్చే వాళ్లు. అయితే గేట్ లోపలికి పేషెంట్స్‌కి తప్ప మిగిలిన వారికి ప్రవేశం ఉండేది కాదు. పేషెంట్స్‌ని గేట్ దగ్గరే వదిలేయాల్సి వచ్చేది. దాంతో కొందరు వాదనకు దిగే వాళ్లు. వారిని సముదాయించి, పరిస్థితి వివరించి పంపడం పెద్ద సవాల్‌గా ఉండేది.

రోజూ విషాద వార్త వినాల్సి వచ్చేది..

గాంధీ హాస్పిటల్ మెయిన్‌గేట్ దగ్గర రోజూ ఎనిమిది గంటల డ్యూటీ. చికిత్స కోసం వచ్చే రోగులు అనేక మంది తారసడేవాళ్లు. అప్పుడు లాక్‌డౌన్ అమలులో ఉండటంతో వారితో పాటు సహాయకులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేవాళ్లం. ఇలా చాలామందితో మాట్లాడాల్సి వచ్చేది. ఉదయం మాట్లాడి వెళ్లిన పేషెంట్ చికిత్స పొందుతూ చనిపోయాడని సాయంత్రానికి వినాల్సి వచ్చేది. ఒకోసారి అప్పటివరకు గేటు దగ్గర పేషెంట్ కోసం ఎదురు చూస్తూ మాతో మాట్లాడిన కుటుంబీకులు, సంబంధీకులు ఆ వార్త విని ఏడుస్తుంటే గుండె తరుక్కుపోయేది. ఆ పేషంట్‌తో తమకున్న జ్ఞాపకాలను వాళ్లు మాతో పంచుకుంటుంటే మనసు భారమయ్యేది. ఓదార్చడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి మాది. ప్రతి పేషెంట్ క్షేమంగా తిరిగి రావాలని మొక్కుకునేదాన్ని.

నాకూ కరోనా..

గాంధీ హాస్పిటల్ దగ్గర ఐదు వారాల డ్యూటీ అయిపోయిన తర్వాత తిరిగి బేగంపేట పోలీసు స్టేషన్‌కు వెళ్లిపోయా. అప్పుడు ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల వారిని తరలించే ప్రక్రియ మొదలైంది. ప్రతిరోజూ ఏరియాల వారీగా బయటి వారిని గుర్తించడం, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ ప్రాధాన్య క్రమంలో అక్కడ నుంచి బస్సుల్లో రైల్వే స్టేషన్‌కు తరలించడం మా డ్యూటీగా మారింది. దీనికోసం వారితో సంప్రదింపులు జరపాల్సి వచ్చేది. ఆ సందర్భంలో నాకూ కరోనా సోకింది. నా నుంచి నా హజ్బెండ్‌కీ వచ్చింది. ముగ్గురు పిల్లల్ని బంధువుల ఇంటికి పంపించినప్పటికీ మా అత్తగారిని మాత్రం మేమే చూసుకోవాల్సి వచ్చింది. ఏమాత్రం ధైర్యం కోల్పోకుండా, ఆ మహమ్మారి ఆమెకు సోకకుండా జాగ్రత్తలు తీసుకున్నా. పీపీఈ కిట్, మాస్క్, గ్లోవ్స్ వేసుకుని వంట చేసేదాన్ని. వైద్యుల సలహాలు, సూచనలు పాటించడంతో పదిహేను రోజులకు నాకు, నా హజ్బెండ్‌కి నెగటివ్ వచ్చింది. అప్పటివరకు పిల్లల్ని కంటితో కూడా చూడలేదు. ఆ రోజులు, ఆ అనుభవాలు గుర్తొస్తే ఇప్పటికీ భయమేస్తుంది. కళ్లల్లో నీళ్లు తిరుగుతాయి.


– శ్రీరంగం కామేష్, క్రైమ్ బ్యూరో, సాక్షి, హైదరాబాద్

జ్యూస్ టిప్స్



● ఫ్రూట్ జ్యూస్‌లు వాడగా మిగిలిన వాటిని ఫ్రీజర్‌లో ఉంచుకుని ఫ్రూట్ పైస్ చేసేటప్పుడు నీటికి బదులుగా వాడవచ్చు. ● జ్యూస్‌లో సహజరీతిలో చక్కెర ఉంటుంది కాబట్టి ఆ మేరకు ప్రాసెస్డ్ షుగర్ వాడకాన్ని తగ్గించుకోవచ్చు. ఇది ఆరోగ్యానికి కూడా మంచిది. ●ఫ్రూట్ పై చేసేటప్పుడు తప్పనిసరిగా తాజా వెన్నను మాత్రమే వాడాలి. నిల్వ చేసినది, ప్రాసెస్ చేసినది వాడకూడదు. ● ఫ్రూట్‌పైలో వాడే ఆపిల్‌ను సన్న ముక్కలుగా తరిగితే దాని ఫ్లేవర్ పోతుంది. కాబట్టి పెద్ద ముక్కలు వాడాలి. ●చెర్రీ పై లో రెండు చుక్కల ఆల్మండ్ ఎక్స్‌ట్రాక్ట్, చిటికెడు రెడ్ కలర్ వేస్తే ఆకర్షణీయంగానూ మరింత రుచిగానూ ఉంటుంది.

హెల్త్



పురుషులతో పోలిస్తే కొన్ని రకాల సమస్యలు మహిళల్లో ఎక్కువ. ఉదాహరణకు రక్తహీనత, థైరాయిడ్ సమస్యలూ, ఆస్టియోపోరోసిస్ వంటివి. ఇక రొమ్ము క్యాన్సర్ సమస్య పురుషుల్లోనూ కనిపించినా అది చాలా అరుదు. సర్వైకల్ క్యాన్సర్ సమస్య కేవలం మహిళల్లోనే కనిపిస్తుంది. అందుకే ఈ ప్రధాన సమస్యలకు అవసరమైన స్వీయపరీక్షలూ, వైద్య పరీక్షల గురించి తెలుసుకుందాం.

మహిళలకు కొన్ని ప్రధాన వైద్య పరీక్షలు...

ఎముకల సాంద్రత పరీక్ష...

మహిళల విషయానికి వస్తే రుతుస్రావం ఆగిపోయిన (మెనోపాజ్) తర్వాత ఎముక సాంద్రత కోల్పోయే వేగం బాగా పెరుగుతుంది. (అందుకే మెనోపాజ్ ఆగిన మహిళల్లో ఆస్టియోపోరోసిస్ రిస్క్ ఎక్కువ). కాబట్టి మహిళలు ఎముకలోని సాంద్రతను వీలైనంత ఎక్కువ కాలం నిలుపుకోగలిగితే వాళ్లలో ఎముక ఆరోగ్యం బాగుంటుంది.

ఎముకల సాంద్రత తెలుసుకోడానికి బోన్ డెన్సిటీ పరీక్ష చేయించాలి. నిజానికి ఇది ఆస్టియోపోరోసిస్ నిర్ధారణకు చేసే పరీక్ష. దీన్ని 'డ్యుయల్ ఎనర్జీ ఎక్స్‌-రే అబ్జార్షియోమెట్రీ' అంటారు. దీనితో కేవలం ఐదు నిమిషాల్లోనే ఎముక సాంద్రత ఎంత అన్నది తెలిసిపోతుంది. అయితే ఈ విలువను అందరిలో ఒకేలా కాకుండా వయసును పరిగణనలోకి తీసుకుంటారు. కాబట్టి దీన్ని 'టీ' స్కోర్‌గా చెబుతారు. దీనితో పాటు సీరమ్ లెవల్స్ ఆఫ్ క్యాల్షియమ్, ఫాస్ఫరస్, ఆల్కలైన్ ఫాస్ఫేట్స్, ఇన్‌టాక్ట్ పారాథైరాయిడ్ హార్మోన్ (పీటీహెచ్) వంటి పరీక్షలు కూడా అవసరమవుతాయి.

సర్వైకల్ క్యాన్సర్ పరీక్ష



మహిళల్లో వచ్చే మరో సాధారణ సమస్య సర్వైకల్ క్యాన్సర్. అయితే సెర్విక్స్ క్యాన్సర్ ముందుగా వచ్చే ప్రీ-క్యాన్సర్ దశ చాలా కాలం (దాదాపు ఎనిమిది నుంచి పదేళ్లు) కొనసాగుతుంది. అంటే అది పూర్తి క్యాన్సర్‌గా రూపొందడానికి సాగే ముందస్తు దశ ఇంత సుదీర్ఘకాలం కొనసాగుతుంది కాబట్టి అక్కడ వచ్చే మార్పులను ముందుగానే పసిగడితే అది క్యాన్సర్ కాకముందే చికిత్స చేయడం సాధ్యపడుతుంది.

పాప్ స్మియర్ అనే చిన్న పరీక్షతో ఎంతో సులువుగా సెర్విక్స్ క్యాన్సర్‌ను ప్రీ క్యాన్సర్ దశలోనే గమనించి సమర్థంగా చికిత్స చేయడం సాధ్యమవుతుంది. ఇరవై నుంచి నలభై ఏళ్ల వయసులో ఉన్న మహిళలంతా తప్పనిసరిగా కనీసం ఏడాదికి ఒకసారి మూడేళ్లపాటు చేయించుకోవడం అవసరం. ఈ మూడేళ్ల రిపోర్ట్స్ మామూలుగా ఉన్నట్లయితే తర్వాత ఐదేళ్లకి ఒకసారి మెనోపాజ్ దశకు చేరే వరకు ఈ పరీక్ష చేయించుకుంటూ దీన్ని ఉండాలి.

మహిళల్లో రక్తహీనత...

మహిళల్లో రుతుస్రావం వల్ల ప్రతి నెలా రక్తం పోతుంటుంది కాబట్టి అది రక్తహీనతకు ప్రధాన కారణం. అలాగే మహిళల్లో రుతుస్రావంతో పాటు బిడ్డకు జన్మనిచ్చే సమయంలో అతిగా రక్తంపోవడం, యుటెరైన్ ఫైబ్రాయిడ్స్ ఉండటం కూడా రక్తహీనతకు కారణం కావచ్చు. అనీమియా లక్షణాలు కొందరిలో తక్కువగానూ, మరికొందరిలో తీవ్రంగా ఉంటాయి.

మానవ దేహంలోని 100 గ్రాముల రక్తంలో... హీమోగ్లోబిన్ పరిమాణం మహిళల్లో 12 గ్రాములు ఉండాలి. ఒకవేళ ఈ హీమోగ్లోబిన్ పరిమాణం ఇంతకంటే తక్కువగా ఉంటే వారు రక్తహీనతతో బాధపడుతున్నట్లు పరిగణించవచ్చు. రక్తహీనతతో బాధపడుతున్నవారు పాలిపోయినట్లుగా కనిపిస్తుంటారు. కళ్ల నిస్తేజంగా, తెల్లగా కనిపిస్తుంటాయి. అందుకే డాక్టర్లు కనురెప్పలను కిందికి లాగి చూస్తుంటారు. అలాగే గోళ్లు కూడా తెల్లగా కనిపిస్తుంటే అది రక్తహీనతకు ఓ సూచన అని తెలుసుకోవచ్చు. ఇలా రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు కంప్లీట్ బ్లడ్ పిక్చర్ పరీక్ష చేయించుకుని, ఉండాల్సిన మోతాదు కంటే తక్కువ ఉన్నవారు డాక్టర్ సలహా మేర ఐరన్ మాత్రలు, సిరప్ వంటివి వాడాలి.

స్వీయ రొమ్ము పరీక్ష అండ్ మామోగ్రామ్

మహిళల్లో సాధారణంగా కనిపించే వ్యాధుల్లో ముఖ్యమైనది రొమ్ము క్యాన్సర్ కాబట్టి దానికి సంబంధించిన స్వయం పరీక్ష చేసుకుంటూ ఉండటం చాలా ముఖ్యం. స్వయంగా రొమ్ము పరీక్ష చేసుకోడాన్ని బీఎస్ఈ అంటారు. అంటే ఇది బ్రెస్ట్ సెల్ఫ్ ఎగ్జామినేషన్ అనే మాటకు సంక్షిప్తరూపం. ఇరవై ఏళ్లు నిండిన ప్రతి స్త్రీ నెలకోసారి బీఎస్ఈ చేసుకోవాలి. బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలను ముందుగా పసిగట్టి, వ్యాధి ముదరక ముందే చికిత్స చేయించుకోవడానికి ఈ పరీక్ష ఉపయోగపడుతుంది.

● స్వయంగా చేసుకొని రొమ్ము పరీక్షను రుతుక్రమం పూర్తయిన తొలిరోజు చేసుకుంటే మంచిది. ఎందుకంటే పీరియడ్స్ మొదలయ్యే సమయంలో సాధారణంగానే రొమ్ములలో చిన్నపాటి గడ్డలు ఏర్పడుతుంటాయి. ఇవి రుతుక్రమం మొదలైన మూడు- నాలుగు రోజుల్లో కరిగిపోతాయి. ఆ తర్వాత కూడా ఏదైనా లంప్ తగిలితే అది బ్రెస్ట్ క్యాన్సర్‌కు సూచిక అయి ఉండవచ్చనే సందేహంతో డాక్టర్‌ను సంప్రదించాలి.

● నిపుల్స్ నుంచి పాలలాగ ద్రవం విడుదలవుతున్నా, రొమ్ములలో వాపును గమనించినా, చర్మం మీద దురద పెడుతున్నా, బుడిపెలాంటిది ఏర్పడినా, నిపుల్స్‌లో నొప్పి, ఎరుపుదనం, లోపలికి ముడుచుకుపోవడం వంటి లక్షణాలను గమనించినా అశ్రద్ధ చేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలి.

పైన పేర్కొన్న లక్షణాలుగానీ లేదా రొమ్ములో ఏవైనా మార్పులుగానీ గమనిస్తే డాక్టర్‌ను సంప్రదించి వారి సలహా మేరకు మామోగ్రామ్ అనే పరీక్ష చేయించుకోవాలి.

గర్భవతిగా ఉన్నప్పుడు థైరాయిడ్ హార్మోన్ పరీక్ష...

గర్భవతిగా ఉన్న సమయంలో తల్లి తాలూకు థైరాయిడ్ హార్మోన్ అన్నది బిడ్డ ఎదుగుదలలో ముఖ్యంగా మెదడు, నాడీ వ్యవస్థల అభివృద్ధికి ఉపయోగపడుతుంటుంది. అందుకే ప్రెగ్నెన్సీ సమయంలో తల్లికి తప్పనిసరిగా థైరాయిడ్ పరీక్షలు నిర్వహిస్తారు. తల్లికి థైరాయిడ్ లోపం ఉన్నట్లయితే దానికి తక్షణం చికిత్స చేయించకపోతే బిడ్డ మెదడు ఎదుగుదలలో తేడాలు, మానసిక వికాసంలో లోపాలు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే తల్లికి తగిన మోతాదులో థైరాక్సిన్ మాత్రలు ఇవ్వడం ద్వారా బిడ్డకు కలిగే లోపాలను నివారించవచ్చు.

ప్రెగ్నెన్సీ సమయంలో కాబోయే తల్లి రక్తంలో టీఎస్‌హెచ్ మోతాదును తక్కువస్థాయిలో ఉంచాల్సి ఉంటుంది. తల్లిలో థైరాయిడ్ హార్మోన్ ఎక్కువగా ఉన్నట్లయితే అది బిడ్డ శారీరక ఎదుగుదలను తగ్గించవచ్చు. అంటే పిండం సరిగా ఎదగకపోవడం (ఫీటల్ గ్రోత్ రెస్ట్రిక్షన్) జరగవచ్చు. ఇలాంటి సందర్భంలో యాంటీ థైరాయిడ్ మందులను తగిన మోతాదులో ఇస్తూ, తల్లిలో థైరాయిడ్ హార్మోన్‌ను సరిగా ఉండేలా నియంత్రించడం ద్వారా బిడ్డకు కలిగే దుష్ప్రభావాలను నివారించవచ్చు.

గర్భిణులలో థైరాయిడ్ హార్మోన్ ఆవశ్యకత గురించి అవగాహన పెరుగుతున్నందున ప్రతి గర్భిణికీ డాక్టర్లు ఈ థైరాయిడ్ పరీక్షను విధిగా చేయిస్తుంటారు. థైరాయిడ్ మోతాదుల తేడాతో ఎక్కువగా మహిళల్లో హైపోథైరాయిడిజమ్, హైపర్ థైరాయిడిజమ్ అనే సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువ. కాబట్టి మహిళలు తరచూ చేయించాల్సిన పరీక్షల్లో థైరాయిడ్ హార్మోన్ పరీక్ష కూడా ఒకటి.



డా. ఆరతి బెల్లారి, సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్

అడినాయిడ్స్ వాపు ..?



అడినాయిడ్స్ ముక్కు లోపలి భాగానికి కాస్త వెనకన, నోటి లోపల అంగిటి పైభాగంలో ఉంటాయి. అవి స్పాంజి కణజాలంతో తయారై మెత్తగా, గుంపులుగా ఉంటాయి. రెండు రకాలుగా వీటి ఉనికి తెలుస్తుంది. మొదటిది... ఎండోస్కోప్ అనే పరికరాన్ని ఉపయోగించడం ద్వారా... ఇక రెండోది తల ఎక్స్‌-రే తీసినప్పుడు, ఈ తల ఎక్స్‌-రేలో వాటి పరిమాణం కూడా తెలుస్తుంది. అడినాయిడ్స్ అన్నా, టాన్సిల్స్ అన్నా... ఈ రెండూ ఒకటేనని చాలామంది పొరబడుతుంటారుగానీ... ఈ రెండూ వేర్వేరు. నోరు బాగా తెరచినప్పుడు టాన్సిల్స్ కనిపిస్తాయిగానీ... అడినాయిడ్స్ కనిపించవు. నిజానికి అడినాయిడ్స్ అనేక రకాల ఇన్ఫెక్షన్స్ నుంచి పిల్లలను కాపాడుతుంటాయి. అయితే వాటికే ఇన్ఫెక్షన్స్ సోకడం కారణంగా అడినాయిడ్స్ వాచినప్పుడు వచ్చే సమస్య గురించి తెలుసుకుందాం.

అడినాయిడ్స్‌లో కొన్ని యాంటీబాడీస్ ఉండటం వల్ల బ్యాక్టీరియా, వైరస్‌లు దేహంలోకి ప్రవేశించగానే... వాటిని శత్రుకణాలుగా గుర్తించి, వాటితో పోరాడుతాయి. ఇలా పోరాటంలో వాటిని తుదముట్టించడం ద్వారా ఇన్ఫెక్షన్‌ల నుంచి కాపాడతాయి. చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి సహజంగానే తక్కువగా ఉండటం వల్ల వాళ్ల పసి దేహాలను కాపాడటానికి ప్రకృతి అడినాయిడ్స్ అనే ఏర్పాటు చేసింది. అయితే పిల్లలు పెరుగుతున్న కొద్దీ... వాళ్ల వ్యాధి నిరోధక శక్తి (ఇమ్యూనిటీ) కూడా పెరుగుతుండటం వల్ల కొంతకాలానికి ఇవి క్రమంగా సైజు తగ్గుతూ పోతాయి. ఐదేళ్ల వయసులో దాదాపుగా ఇవి పూర్తిగా కృశించిపోతాయి. వారికి యుక్తవయసు వచ్చేనాటికి అవి పూర్తిగా మటుమాయమవుతాయి.

అడినాయిడ్స్‌లో ఇన్ఫెక్షన్లతో వాపు ఇలా...

కొందరు చిన్నారులపైకి బ్యాక్టీరియా లేదా వైరస్ దాడి చేసినప్పుడు అడినాయిడ్స్ కణజాలంలో వాపు వచ్చే అవకాశాలుంటాయి. అలా జరగడం వల్ల ఇక అవి ఇతర ఇన్ఫెక్షన్లు వచ్చినప్పుడు వాటి నుంచి దేహాన్ని కాపాడలేవు. దేహంపై బ్యాక్టీరియా, వైరస్ దాడి పెరిగిన కొద్దీ వాటిలో వాపు కూడా పెరుగుతూ పోతుంది. అలాంటప్పుడు కొన్నిసార్లు పక్కనుండే టాన్సిల్స్‌కు కూడా ఇన్ఫెక్షన్ వచ్చి, వాటిల్లో కూడా వాపు రావచ్చు. ఇలా వాపు వచ్చిన కొద్దీ పిల్లలు గాలి పీల్చుకోవడం కష్టమవుతుంది. దాంతో చిన్నారుల్లో కొన్ని సమస్యలు రావచ్చు. అవి...

● ముక్కురంధ్రాలు మూసుకుపోయి గాలి పీల్చడం ఇబ్బందిగా మారడంతో నోటితో గాలి పీల్చడం. ● నిద్ర సమయంలో పిల్లలో గురక రావడం. ● గొంతునొప్పిగా ఉండి, మింగడం కష్టం కావడం. ● కొన్నిసార్లు మెడప్రాంతంలోని గ్రంథులకూ వాపు రావడం. ● కొంతమందిలో వినికిడి సమస్యలూ లేదా దంత సమస్యలు కనిపించడం. ● ఊపిరి సరిగా అందక నిద్రాభంగమై లేచి ఏడ్వటం.



డా. ఈసీ వినయ కుమార్, ఈఎన్‌టీ నిపుణులు

చికిత్స...

అడినాయిడ్స్‌లో వాపు వచ్చిన పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గడం కారణంగా వారికి తరచూ జ్వరాలు వస్తుంటాయి. అడినాయిడ్స్‌లో వాపు ఉన్నప్పుడు తొలుత యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేస్తారు. త్వరగా చికిత్స పొందని పిల్లల్లో వ్యాధి తీవ్రత పెరిగి మందులకు నయమయ్యే పరిస్థితి ఉండకపోవచ్చు అలాంటప్పుడు అడినాయిడెక్టమీ అనే శస్త్రచికిత్స ప్రక్రియ ద్వారా డాక్టర్లు వాటిని తొలగించాల్సి వస్తుంది.


కోహ్లి

ఈడెన్‌లో మెరుపులతో మొదలు



డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ కొత్త సీజన్‌ను ఓటమితో మొదలు పెట్టింది. సొంతగడ్డ ఈడెన్ గార్డెన్స్‌లో ఆడిన మ్యాచ్ లోనూ శుభారంభం చేయలేకపోయింది. బ్యాటింగ్‌లో రహానే, నరైన్ మెరుపులతో ఒక దశలో 200 సాధించగలదనిపించిన టీమ్ ఆ తర్వాత ఒక్కసారిగా కుప్పకూలి స్వల్ప స్కోరుకే పరిమితమైంది. ఆర్‌సీబీ బౌలర్లు కేకేఆర్‌ను సరైన సమయంలో నిలువరించడంలో సఫలమయ్యారు. ఆ తర్వాత సాల్ట్, కోహ్లి మెరుపు ఓపెనింగ్‌తో విజయానికి బాటలు వేసుకున్న బెంగళూరు ఆశావహ దృక్పథంతో తమ ప్రయాణాన్ని మొదలు పెట్టింది. మరో 22 బంతులు మిగిలి ఉండగానే గెలిచిన మ్యాచ్‌తో రజత్ పాటీదార్ కెప్టెన్‌గా శుభారంభం చేశాడు.

ఐపీఎల్ తొలి పోరులో బెంగళూరు ఘన విజయం

- 7 వికెట్ల తేడాతో ఓడిన కోల్‌కతా
- కోహ్లి, సాల్ట్ అర్ధ సెంచరీలు
- రాణించిన కృనాల్ పాండ్యా

కోల్‌కతా: ఐపీఎల్ తొలి పోరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు పైచేయి సాధించింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 7 వికెట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. అజింక్య రహానే (31 బంతుల్లో 56; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించగా... సునీల్ నరైన్ (26 బంతుల్లో 44; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), అంగ్‌క్రిష్ రఘువంశీ (22 బంతుల్లో 30; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. రహానే, నరైన్ రెండో వికెట్‌కు 55 బంతుల్లోనే 103 పరుగులు జోడించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కృనాల్ పాండ్యా (3/29) కీలక సమయంలో 3 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. అనంతరం బెంగళూరు 16.2 ఓవర్లలో 3 వికెట్లకు 177 పరుగులు సాధించింది. విరాట్ కోహ్లి (36 బంతుల్లో 59 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఫిల్ సాల్ట్ (31 బంతుల్లో 56; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో చెలరేగగా...తొలి సారి కెప్టెన్‌గా వ్యవహరించి రజత్ పాటీదార్ (16 బంతుల్లో 34; 5 ఫోర్లు, 1 సిక్స్) కూడా దూకుడుగా ఆడాడు.

భారీ భాగస్వామ్యం...

10 ఓవర్లలో 107 పరుగులు...ఇన్నింగ్స్ తొలి భాగంలో కోల్‌కతా బ్యాటింగ్ జోరింది. డి కాక్ (4) మొదటి ఓవర్లోనే వెనుదిరిగిన తర్వాత రహానే, నరైన్ కలిసి చెలరేగిపోయారు. సలామ్ ఓవర్లో ఫోర్, 2 సిక్స్‌లు బాదిన రహానే...కృనాల్ ఓవర్లో


కృనాల్ పాండ్యా

వరుసగా రెండు ఫోర్లు కొట్టాడు. అదే ఓవర్లో సిక్స్‌తో నరైనా కూడా జత కలిశాడు. దయాళ్ ఓవర్లో కూడా ఇదే తరహాలో రహానే 2 ఫోర్లు, సిక్స్‌తో చెలరేగిపోయాడు. సుయాశ్ ఓవర్లో సిక్స్‌తో 25 బంతుల్లోనే రహానే అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా...చివరి రెండు బంతులను రహానే సిక్స్, ఫోర్‌గా మలిచాడు. సలామ్ తర్వాతి ఓవర్లో కూడా 4, 6 కొట్టిన నరైన్ అదే ఊపులో చివరి బంతికి అవుటయ్యాడు. ఇక్కడే కేకేఆర్ ఇన్నింగ్స్ మలుపు తిరిగింది. ఒక్కసారిగా చెలరేగిన బెంగళూరు బౌలర్లు ప్రత్యర్థిపై పట్టు సాధించారు. 16 పరుగుల తేడాతో రహానే, వెంకటేశ్ అయ్యర్ (6) వెనుదిరగ్గా...ఐదు పరుగుల వ్యవధిలో భారీ హిట్టర్లు రింకూ సింగ్ (12), ఆండ్రీ రసెల్ (4) వికెట్లను జట్టు కోల్పోయింది. దాంతో అంచనాలకు అనుగుణంగా భారీ స్కోరును సాధించలేకపోయింది.

ఐపీఎల్-2025:
అప్‌డేట్, వివరాలు, విశ్లేషణ కోసం స్కాన్ చేయండి

దూకుడుగా దూసుకుపోయి...

ఛేదనలో బెంగళూరు చెలరేగిపోయింది. ఇన్నింగ్స్ తొలి బంతినే ఫోర్‌గా మలచిన సాల్ట్ ఘనంగా మొదలు పెట్టగా, అతనికి కోహ్లి తోడవడంతో టీమ్ లక్ష్యం దిశగా సునాయాసంగా దూసుకుపోయింది. అరోరా ఓవర్లో సాల్ట్ 2 ఫోర్లు, ఒక సిక్స్ కొట్టగా, కోహ్లి మరో ఫోర్ బాదడంతో మొత్తం 20 పరుగులు వచ్చాయి. నైట్‌రైడర్స్ ఎంతో ఆశలు పెట్టుకున్న వరుణ్ చక్రవర్తికి తొలి ఓవర్లో బాగా దెబ్బ పడింది. వరుస బంతుల్లో సాల్ట్ 4, 6, 4, 4 బాదడంతో పరిస్థితి అంతా ఆర్‌సీబీకి అనుకూలంగా మారిపోయింది. జాన్సన్ ఓవర్లో వరుసగా రెండు సిక్స్‌లు బాది తానూ తగ్గలేదని కోహ్లి చూపించగా, 25 బంతుల్లో సాల్ట్ హాఫ్ సెంచరీని అందుకున్నాడు. తక్కువ వ్యవధిలో సాల్ట్, పడిక్కల్ (10) వికెట్లు తీసి కోల్‌కతా కాస్త ఊరట చెందినా...తర్వాత వచ్చిన పాటీదార్ కూడా బౌండరీల వర్షం కురిపించాడు. రాణా ఓవర్లోనే అతను ఏకంగా 4 ఫోర్లు కొట్టడం విశేషం. 30 బంతుల్లో విరాట్ హాఫ్ సెంచరీ సాధించాడు. చివర్లో వరుసగా 6, 4 కొట్టి లివింగ్‌స్టోన్ (15 నాటౌట్) మ్యాచ్ ముగించాడు.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: డి కాక్ (సి) జితేశ్ (బి) హాజల్‌వుడ్ 4; నరైన్ (సి) జితేశ్ (బి) సలామ్ 44; రహానే (సి) సలామ్ (బి) పాండ్యా 56; వెంకటేశ్ (బి) పాండ్యా 6; రఘువంశీ (సి) జితేశ్ (బి) దయాళ్ 30; రింకూ (బి) పాండ్యా 12; రసెల్ (బి) సుయాశ్ 4; రమణ్‌దీప్ (నాటౌట్) 6; హర్షిత్ (సి) జితేశ్ (బి) హాజల్‌వుడ్ 5; జాన్సన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు)** 174. **వికెట్ల పతనం:** 1–4, 2–107, 3–109, 4–125, 5–145, 6–150, 7–168, 8–173. **బౌలింగ్:** హాజల్‌వుడ్ 4–0–22–2, యశ్ దయాళ్ 3–0–25–1, రసిఖ్ సలామ్ 3–0–35–1, కృనాల్ పాండ్యా 4–0–29–3, సుయాశ్ శర్మ 4–0–47–1, లివింగ్‌స్టోన్ 2–0–14–0.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (సి) జాన్సన్ (బి) వరుణ్ 56; కోహ్లి (నాటౌట్) 59; పడిక్కల్ (సి) రమణ్‌దీప్ (బి) నరైన్ 10; పటీదార్ (సి) రింకూ (బి) అరోరా 34; లివింగ్‌స్టోన్ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (16.2 ఓవర్లలో 3 వికెట్లకు)** 177. **వికెట్ల పతనం:** 1–95, 2–118, 3–162. **బౌలింగ్:** వైభవ్ అరోరా 3–0–42–2, స్పెన్సర్ జాన్సన్ 2.2–0–31–0, వరుణ్ చక్రవర్తి 4–0–43–1 హర్షిత్ రాణా 3–0–32–0, సునీల్ నరైన్ 4–0–27–1.

సందడిగా ప్రారంభోత్సవం

తొలి మ్యాచ్‌కు ముందు ఈడెన్ గార్డెన్స్‌లో ఐపీఎల్ ప్రారంభ వేడుకలు జరిగాయి. షారుఖ్ ఖాన్ వ్యాఖ్యానంతో ఈ కార్యక్రమం మొదలు కాగా...ఆ తర్వాత ప్రముఖ గాయని శ్రేయా ఘోషాల్ తన పాటతో అలరించింది. అనంతరం దిశా పటాని తన డ్యాన్స్‌తో ఆకట్టుకుంది. సింగర్ కరణ్ ఔజ్లా ఆమెకు జత కలిశాడు. చివర్లో షారుఖ్ చిత్రం 'పఠాన్'లోని సూపర్ హిట్ పాటకు అతనితో కలిసి విరాట్ కోహ్లి వేసిన స్టెప్పులు హైలైట్‌గా నిలిచాయి. తొలి ఐపీఎల్ నుంచి ఇప్పటి వరకు ఆడుతున్న విరాట్ కోహ్లికి బీసీసీఐ ప్రత్యేక '18' జ్ఞాపికను అందించింది.



ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ X రాజస్తాన్
వేదిక: హైదరాబాద్
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

చెన్నై X ముంబై
వేదిక: చెన్నై
రాత్రి 7: 30 గంటల నుంచి

స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

జూన్‌లో థగ్ లైఫ్


● కమల్‌హాసన్

కమల్‌హాసన్ హీరోగా ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కిస్తున్న చిత్రం 'థగ్ లైఫ్'. 'నాయగన్' (1987) వంటి హిట్ మూవీ తర్వాత 38 సంవత్సరాలకు వీరి కాంబినేషన్‌లో వస్తున్న ద్వితీయ చిత్రమిది. శింబు, త్రిష, అశోక్ సెల్వన్, ఐశ్వర్యా లక్ష్మి, జోజు జార్జ్, అభిరామి, నాజర్ ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కమల్‌హాసన్, మణిరత్నం, ఉదయనిధి స్టాలిన్, ఆర్. మహేంద్రన్, శివ అనంత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 5న విడుదల కానుంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతదర్శకుడిగా, రవి కె. చంద్రన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.


● ఎస్.జె. సూర్య, దుషారా విజయన్, విక్రమ్, ఎన్వీ ప్రసాద్

ఫస్ట్ షాట్ నుంచే కథ మొదలైపోతుంది - విక్రమ్

''తెలుగులో ప్రస్తుతం అన్ని రకాల సినిమాలు అద్భుతమైన విజయాన్ని సాధిస్తున్నాయి. నటీనటులకి ఇది చాలా గొప్ప అవకాశం. అన్ని రకాల పాత్రలు చేసే చాన్స్ ఉంటుంది. తెలుగు ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ అద్భుతం... వారి ప్రేమకి నా కృతజ్ఞతలు. ఈ నెల 27న వస్తున్న 'వీర ధీర శూర' మూవీని అందరూ ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నాను'' అని హీరో విక్రమ్ చెప్పారు. ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వంలో విక్రమ్, దుషారా విజయన్ జంటగా నటించిన తాజా చిత్రం 'వీర ధీర శూర: పార్ట్ 2'. ఎస్‌జే సూర్య, సూరజ్ వెంజరాముడు ముఖ్య పాత్రలు పోషించారు. రియా శిబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ చిత్రం తెలుగు విడుదల హక్కులను ఎన్వీఆర్ సినిమాస్ సంస్థ సొంతం చేసుకోగా, నైజాంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ విడుదల చేస్తోంది. శనివారం నిర్వహించిన 'వీర ధీర శూర: పార్ట్ 2' ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో విక్రమ్ మాట్లాడుతూ– ''ఈ సినిమా ఫస్ట్ షాట్ నుంచే కథ మొదలైపోతుంది. అందుకే ఆరంభం నుంచే మిస్ కాకుండా చూడాలని కోరుకుంటున్నాను. యాక్షన్‌తో పాటు మంచి భావోద్వేగాలున్న సినిమా ఇది. అరుణ్ చాలా అద్భుతంగా తీశాడు'' అని చెప్పారు. ఎస్‌జే సూర్య మాట్లాడుతూ– ''మంచి కంటెంట్ ఎక్కడున్నా సరే తెలుగు ప్రేక్షకులు గొప్పగా ఆదరిస్తున్నారు. హాలీవుడ్ డైరెక్టర్ మార్టిన్ స్కోర్సెస్ అంటే డైరెక్టర్ అరుణ్‌గారికి చాలా పిచ్చి. ఒకవేళ మార్టిన్ స్కోర్సెస్ రాజమండ్రిలో సినిమా చేస్తే ఎలా ఉంటుందో 'వీర ధీర శూర' అలా ఉంటుంది. 'రంగస్థలం' లాంటి రా అండ్ రస్టిక్ సినిమా ఇది'' అన్నారు. ఎన్వీ ప్రసాద్ మాట్లాడుతూ– ''మహారాజా' మూవీ తర్వాత మేం తెలుగులో రిలీజ్ చేస్తున్న సినిమా 'వీర ధీర శూర'. కచ్చితంగా సెన్సేషనల్ హిట్ అవుతుంది'' అన్నారు. ఇంకా పాటల రచయిత రాంబాబు గోశాల, నటుడు పృథ్వీ మాట్లాడారు.

ఇండియాలోనే టాలీవుడ్ బెస్ట్ - మోహన్‌లాల్


● పృథ్వీరాజ్ సుకుమారన్, 'దిల్' రాజు, మోహన్‌లాల్

''సినిమా ఇండస్ట్రీలో 47 ఏళ్ల ప్రయాణం నాది. తెలుగు చిత్ర సీమతోనూ ఎంతో అనుబంధం ఉంది. అక్కినేని నాగేశ్వరరావుగారితో నటించే అదృష్టం నాకు దక్కింది. తెలుగు ప్రేక్షకులు చూపించే ప్రేమ ఇంకెక్కడా దొరకదు. ఇండియాలోనే టాలీవుడ్ ది బెస్ట్ ఇండస్ట్రీగా ఉంది'' అని మోహన్‌లాల్ చెప్పారు. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో మోహన్‌లాల్ హీరోగా రూపొందిన చిత్రం 'ఎల్2: ఎంపురాన్'. 'లూసిఫర్' (2019)కి సీక్వెల్‌గా రూపొందిన ఈ చిత్రంలో టొవినో థామస్, మంజు వారియర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఆంటోనీ పెరుంబవూర్, గోకులం గోపాలన్ నిర్మించిన 'ఎల్2: ఎంపురాన్' ఈ నెల 27న మలయాళ, తెలుగు, తమిళ, హిందీ, కన్నడ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌లో మోహన్‌లాల్ మాట్లాడుతూ– ''కేరళలో మేం అన్ని భాషల చిత్రాలను చూస్తాం. ఇప్పుడు మా సినిమాలని కూడా అన్ని భాషల వాళ్లు చూస్తున్నారు. సినిమా ప్రేమికుల కోసం ఇప్పుడు మేం కూడా పాన్ ఇండియా చిత్రాలు చేస్తున్నాం. 'ఎల్2: ఎంపురాన్' బ్లాక్ బస్టర్ అయితే మూడో భాగంతో మళ్లీ ప్రేక్షకుల ముందుకు వస్తాం'' అన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''మలయాళంలో అత్యధిక బడ్జెట్‌తో తీసిన 'ఎల్2: ఎంపురాన్' ఏ రేంజ్‌లో ఉందో టీజర్, ట్రైలర్ చూస్తేనే అర్థం అవుతోంది. ఈ మూవీతో పృథ్వీరాజ్‌గారు పాన్ ఇండియా డైరెక్టర్ కాబోతున్నారు'' అన్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ– ''తెలుగులో మా సినిమాను రిలీజ్ చేస్తున్న 'దిల్' రాజుగారికి థ్యాంక్స్. మా సినిమా డబ్బింగ్‌లా కాకుండా ఒరిజినల్ సినిమాలా ఉండాలని తెలుగు డబ్బింగ్ కోసం చాలా కష్టపడ్డాం. ఈ మూవీ కోసం మోహన్‌లాల్‌గారు, నేను ఒక్క రూపాయి పారితోషికం తీసుకోకుండా పని చేశాం'' అని చెప్పారు. కెమేరామేన్ సుజిత్ వాసుదేవ్, నటుడు మాస్టర్ కార్తికేయ మాట్లాడారు.

తమన్నా కోసమే ఈ పాత్ర పుట్టింది - సంపత్ నంది


● వశిష్ఠ ఎన్. సింహా, డి. మధు, తమన్నా, సంపత్ నంది, అశోక్ తేజ


''ఓ పల్లెటూరి కథని ఎగ్జయిటింగ్‌గా, థ్రిల్లింగ్‌గా చెప్పడం మామూలు విషయం కాదు. డైరెక్టర్ అశోక్ 'ఓదెల 2'ని ఓ రేంజ్‌లో తీశారు. నేను ఏ సినిమా చేసినా ప్రేక్షకులకు కొత్త అనుభూతి దక్కాలని కోరుకుంటాను. అలాంటి సరికొత్త అనుభూతినిచ్చే సినిమా ఇది. భైరవి క్యారెక్టర్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అని తమన్నా తెలిపారు. ఆమె లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఓదెల 2'. 'ఓదెల రైల్వేస్టేషన్' (2021)కి సీక్వెల్‌గా 'ఓదెల 2' రూపొందింది. అశోక్ తేజ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహా ఇతర పాత్రల్లో నటించారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి. మధు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఏప్రిల్ 17న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా తమన్నా మాట్లాడుతూ– ''ఓదెల రైల్వేస్టేషన్' చూసినప్పుడే పార్ట్ 2 ఉండాలని భావించాను. సంపత్ నందిగారు పార్ట్–2 ఐడియా చెప్పినప్పుడు ఎగ్జయిట్ అయ్యాను. నా కెరీర్‌లో అత్యధిక ఐ షాట్ క్లోజప్స్ ఉన్న సినిమా 'ఓదెల 2'' అన్నారు. ఈ మూవీ క్రియేటర్ సంపత్ నంది మాట్లాడుతూ– ''నేను ఓదెల అనే ఊర్లో పుట్టి, పెరిగాను. చాలా గౌరవంగా, ప్రేమతో ఈ కథ రాశాను. ఓదెలకు ఒక కష్టం వస్తే... ఆ ఊరిలో కొలువై ఉన్న ఓదెల మల్లన్న నాగ సాధు పాత్ర ద్వారా ఆ సమస్యని ఎలా పరిష్కరించారు? అనేది ఈ చిత్రకథ. ఈ పాత్ర తమన్నా కోసమే పుట్టింది'' అని చెప్పారు. ''కథని నమ్ముకుని తీసిన 'ఓదెల 2'ని ప్రేక్షకులు థియేటర్స్‌లో చూసి, ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు డి. మధు. ''ఆకలిగా ఉందని అన్నం కోసం సంపత్ నందిగారి దగ్గరికి వెళ్లాను... 'ఓదెల 2' రూపంలో ఆయన బిర్యానీ తినిపించారు'' అని అశోక్ తేజ అన్నారు.

ఇదో రకమైన వివక్ష! - పూజా హెగ్డే



''చిత్ర పరిశ్రమలో హీరోలకు ఇచ్చినంత ప్రాధాన్యం హీరోయిన్లకు ఇవ్వరు. ప్రేమకథల్లో నటించినా ఎలాంటి గుర్తింపు ఇవ్వరు. కొన్ని సార్లు పోస్టర్‌లో మా పేరు కూడా ఉండదు. సినిమా అనేది సమష్టి కృషి అనే విషయాన్ని అందరూ గుర్తించాలి'' అంటూ పూజా హెగ్డే చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న పూజా హెగ్డేకి... తోటి ఆర్టిస్టుల కారణంగా ఎప్పుడైనా ఇబ్బంది పడ్డారా? వివక్షకు గురయ్యారా? అనే ప్రశ్నలు ఎదురయ్యాయి. ఈ ప్రశ్నలకు ఆమె సమాధానం ఇస్తూ– ''హీరోలతో పోలిస్తే హీరోయిన్లు వివక్షకి గురవుతుంటారు. సెట్స్‌లో నేను కూడా వివక్ష ఎదుర్కొన్నాను. షూటింగ్ ప్రదేశంలో హీరో కార్‌వాన్‌ని సెట్‌కు పక్కనే ఉంచుతారు. మిగిలిన వాళ్ల కార్‌వాన్‌లు కొంచెం దూరంగా ఉంటాయి. ఇదొక రకమైన వివక్ష. మేము బరువైన కాస్ట్యూమ్స్, భారీ లెహంగాలు ధరించి సెట్ వరకూ నడుచుకుంటూ రావాలి. కొన్నిసార్లు అది చూడటానికి బాగున్నా, అంత బరువైన దుస్తులను ఈడ్చుకుంటూ, షాట్ అయ్యాక మా వాహనం దగ్గరకు వెళ్లాలంటే ఇబ్బందిగానే ఉంటుంది. ఇది అన్ని ఇండస్ట్రీల్లోనూ ఉంది. ఇన్నేళ్లుగా ఇండస్ట్రీలో ఉంటూ భారీ పారితోషికం అందుకుంటున్నా నన్ను నేను సెకండ్ గ్రేడ్ పౌరురాలిగానే భావిస్తాను'' అన్నారు పూజా హెగ్డే. ప్రస్తుతం తమిళంలో సూర్యతో 'రెట్రో', విజయ్‌తో 'జన నాయగన్', లారెన్స్‌తో 'కాంచన 4', హిందీలో వరుణ్ ధావన్‌తో 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారామె.

తేదీ మారింది


● యశ్

'కేజీఎఫ్' ఫేమ్ కన్నడ నటుడు యశ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'టాక్సిక్'. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ఉప శీర్షిక. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకాలపై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. కాగా ఈ సినిమాను 2025 ఏప్రిల్ 10న రిలీజ్ చేయనున్నట్లుగా తొలుత మేకర్స్ ప్రకటించారు. అయితే తాజాగా ఈ సినిమాను 2026 మార్చి 19న రిలీజ్ చేయనున్నట్లుగా యశ్ అండ్ టీమ్ శనివారం కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది.

ఆరు పద్దులకు సభ ఆమోదం

ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: పొన్నం



సాక్షి, హైదరాబాద్: శాసనసభ శనివారం ఆరు పద్దులకు ఆమోదం తెలిపింది. వ్యవసాయం, సహకారం, ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమం, రవాణా, పశు సంవర్థక-మత్స్య పరిశ్రమ, కార్మిక ఉపాధి కల్పన శాఖలకు సంబంధించిన పద్దులను సంబంధిత మంత్రులు సభ ఆమోదం కోసం ప్రవేశపెట్టగా.. సుదీర్ఘ చర్చ అనంతరం ఆ ఆరు పద్దులను సభ ఆమోదించింది. వ్యవసాయ పద్దులో రుణమాఫీ అంశంలో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమాధానంతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ పార్టీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

ఆర్టీసీని నాశనం చేసింది బీఆర్ఎస్సే: పొన్నం

ఆర్టీసీ పూర్తిగా నాశనం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. కార్మిక సంఘాలు లేకుండా చేయడం, వారి సంక్షేమ నిధిని వాడుకోవడం, కొత్తగా బస్సులు కొనకపోవడం, కార్మికుల హక్కులను కాలరాయడం గత ప్రభుత్వం చేసిందని మండిపడ్డారు. కార్మికుల్లో అసంతృప్తిని, ఆగ్రహాన్ని చల్లార్చడానికి ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని హడావుడి చేశారని, ఆ తరువాత కమిటీ పేరుతో కాలయాపన చేశారని ఆరోపించారు. రవాణా శాఖ పద్దుపై శనివారం రాత్రి అసెంబ్లీలో జరిగిన చర్చ అనంతరం ఆయన బదులిచ్చారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక ఆర్టీసీని నష్టాల నుంచి గటెక్కించి లాభాల బాటలో పయనింప చేస్తున్నామని, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద దాదాపు రూ. 4,000 కోట్లు ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించిందన్నారు. డ్రైవర్ల కొరత కొద్దిగా ఉన్నా.. డబుల్ డ్యూటీ చేసే డ్రైవర్లకు అదనపు వేతనం చెల్లించడంతోపాటు మరుసటి రోజు సెలవు ఇస్తున్నట్లు చెప్పారు. మహిళా సంఘాలకు 600 బస్సులను ఇచ్చి వాటిని ఆర్టీసీలో తిప్పుతున్నామ ని తెలిపారు. హైదరాబాద్ మరో ఢిల్లీ కారాదన్న ఉద్దేశంతో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నామని త్వరలోనే 2,800 బస్సులు వస్తాయని చెప్పారు. ఆటో డ్రైవర్ల కోసం యాప్‌ను తెచ్చే పని లో ఉన్నట్లు పొన్నం చెప్పారు. ఈ అంశంపై బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, కూనంనేని సాంబశివరావు, ఏలేటి మహేశ్వరరెడ్డి తదితరులు మాట్లాడారు.

సామాన్యుడికి భరోసా ఇచ్చేలా వైద్యం

- ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం
- 6,268 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది
- ఆరోగ్యశాఖ పద్దుపై చర్చలో మంత్రి రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: 'ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వ బాధ్యత. ప్రజలు అనారోగ్యంతో అప్పులపాలు కాకూడదు. రోగం వస్తే ఉచితంగా వైద్యం అందుతుందనే భరోసా ప్రజలకు కలగాలి. ఆ భరోసాను కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం'అని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం అసెంబ్లీలో ఆరోగ్యశాఖ బడ్జెట్ పద్దుపై చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడారు. విద్య, వైద్యం కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని తెలిపారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్టు గుర్తుచేశారు. 1,375 వైద్య చికిత్సల ధరలను సుమారు 22 శాతం పెంచామని, కొత్తగా 163 రకాల చికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చామని వెల్లడించారు. ఆరోగ్యశాఖలో 8 వేల పైచిలుకు పోస్టులను భర్తీ చేశామని, మరో 6,268 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

ఉస్మానియాకు పూర్వవైభవం తెస్తాం

గతేడాది రాష్ట్రంలో 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తెచ్చినట్టు రాజనర్సింహ తెలిపారు. ఒక్కో కాలేజీలో 50 సీట్ల చొప్పున, మొత్తం 400 ఎంబీబీఎస్ సీట్లు రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 3,690 నుంచి 4,090కి పెరిగిందన్నారు. కొత్తగా 16 నర్సింగ్ కాలేజీలు ఏర్పాటు చేయటంతో 960 నర్సింగ్ సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయని వివరించారు. 28 కొత్త పారామెడికల్ కాలేజీలు కలిపి ప్రభుత్వ పారామెడికల్ కాలేజీల సంఖ్య 40కి పెరిగిందని వెల్లడించారు. పారామెడికల్ సీట్ల సంఖ్య 1,492 నుంచి 3,172కు పెరిగిందని పేర్కొన్నారు. ఉస్మానియా ఆస్పత్రికి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గోషామహల్‌లో సుమారు 27 ఎకరాల విస్తీర్ణంలో రూ.2,700 కోట్లతో సువిశాలమైన ఆస్పత్రి భవనాలు నిర్మిస్తున్నామని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలు కాపాడేందుకు రాష్ట్ర, జాతీయ రహదారులపై ప్రతి 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు మంత్రి వెల్లడించారు.

'ఫీజు' బకాయిలు రూ.5,520 కోట్లు

- గత సర్కారు మిగిల్చిన బకాయిలే రూ.4,341 కోట్లు
- రూ.1,200 కోట్ల విడుదలకు టోకెన్ నంబర్లు ఇచ్చాం
- శాసనసభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి సీతక్క వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రైతు రుణ మాఫీ అమలుకు ఒకేసారి రూ.21వేల కోట్లను ఖర్చు చేయడంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి నిధుల విడుదలలో ఆలస్యం జరిగిందని, త్వరలో బకాయిలు విడుదల చేస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో సీపీఐ సభ్యుడు కూనంనేని అడిగిన ఓ ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.4,341 కోట్ల బకాయిలు ఉంచగా, తాము వచ్చాక మరో రూ.829.1 కోట్లు కలిపి మొత్తం రూ.5,520 కోట్ల బకాయిలను చెల్లించాల్సి ఉందన్నారు. ఉపముఖ్యమంత్రి విద్యా సంస్థల యాజమాన్యాలతో సమావేశమై దశల వారీగా బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రూ.1,200 కోట్ల బకాయిల విడుదలకి ఇప్పటికే టోకెన్ నంబర్లు జారీ అయ్యాయన్నారు. కాగా, బకాయిల చెల్లింపు ప్రభుత్వాల నిరంతర ప్రక్రియ అని, 2014 జూన్ 2కి ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిపోతే తాము చెల్లించామని బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు అన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు పెద్దపీట: శ్రీధర్‌బాబు

వికారాబాద్ జిల్లా ఎన్కేతలలో 880 ఎకరాల్లో ఎలక్ట్రిక్ వాహనాల హబ్/వ్యాలీని ఏర్పాటు చేయనున్నామని, దీనితో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 4 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. మహిళల కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక మినీ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయనున్నామని, తొలి విడతగా 20 నియోజకవర్గాల్లో ఏర్పాటుకి నిధులు కేటాయించామన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల శిక్షణ సంస్థను ఏర్పాటు చేస్తామన్నారు. ఫాక్స్‌కాన్ పరిశ్రమలో ఉద్యోగాలను 18–20 ఏళ్ల అవివాహిత మహిళలకే ఇస్తున్నారని బీఆర్ఎస్ సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి పేర్కొనగా, అలాంటి ఆంక్షలేమి లేవని శ్రీధర్‌బాబు బదులిచ్చారు. కాగా, కృష్ణా, గోదావరి నదులతో పాటు జలాశయాల వద్ద పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నామని పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. వివిధ పట్టణాల్లో ఔటర్ రింగ్ రోడ్లు నిర్మించాలనే ప్రతిపాదనలేమీ లేవని మంత్రి కోమటిరెడ్డి ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

పద్దులపై చర్చ జరుగుతుంటే మంత్రులేరి?

- పాయింట్ ఆఫ్ ఆర్డర్ ద్వారా ప్రశ్నించిన హరీశ్‌రావు
- కోరం లేకుండా సభ జరగటమేంటన్న బీజేపీ సభాపక్ష నేత ఏలేటి



సాక్షి, హైదరాబాద్: శాసనసభలో శనివారం వ్యవసాయం, రవాణా, వైద్యం –ఆరోగ్యం, కార్మిక–సహకార శాఖల పద్దులపై చర్చ జరిగింది. సాయంత్రం నాలుగున్నర సమయంలో సభలో తక్కువ సంఖ్యలో సభ్యులు కనిపించారు. మంత్రుల్లో ఒక్క పొన్నం ప్రభాకర్ తప్ప మరెవరూ లేరు. ఆ సమయంలో సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతుండగా, బీజేపీ సభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి లేచి, పద్దులపై సభ్యులు మాట్లాడుతుంటే నోట్ చేసుకునేందుకు సభలో మంత్రులు లేకపోవటం ఏంటని, కోరం లేకుండా సభనెలా నడుపుతారని ప్రశ్నించారు. టీ తాగటం లాంటి అవసరాల కోసం బయటకు వెళ్తున్నారు తప్ప అంతా అందుబాటులో ఉన్నారని, సభలో కోరం ఉందని స్పీకర్ స్థానంలో ఉన్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. నోట్ చేసుకునేందుకు మంత్రులు లేకున్నా, కనీసం తాను మాట్లాడేది రికార్డుల్లోకైనా చేరుతుంది కదా అంటూ కూనంనేని ప్రసంగాన్ని కొనసాగించారు. కాసేపటికే మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు సభలోకి వచ్చారు. తర్వాత బీఆర్ఎస్ సభ్యుడు సంజయ్ మాట్లాడుతుండగా, అదే పార్టీకి చెందిన హరీశ్‌రావు పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. కీలక పద్దులపై చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల మంత్రులు సభలో ఉండాలని, ఆయా శాఖల కార్యదర్శులు వారి స్థానాల్లో ఉంటారని, కానీ, ఇప్పుడు సభ్యులు మాట్లాడుతుంటే సభలో మంత్రులు గాని, అధికారుల స్థానాల్లో కార్యదర్శులు గాని లేకపోవటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

- కూనంనేని సాంబశివరావు కాసేపు చేనేతరంగం గురించి మాట్లాడిన తర్వాత, మంత్రి తుమ్మల లేచి చర్చకు తీసుకున్న పద్దుల్లో చేనేత అంశం లేదని పేర్కొన్నారు. దీంతో ఆయన ఇతర శాఖలపై మాట్లాడారు. రైతు పండించే పంటకు బీమా లేకపోవడం విడ్డూరమని, దీనిపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరారు.
- గాంధీ లాంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో తక్కువ ఖర్చుతో ఆధునిక సేవలందిస్తున్న ఐవీఎఫ్ విభాగాలను ప్రజలు ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ సభ్యుడు రాజేశ్వర్‌రెడ్డి సూచించారు.
- నిలిపేసిన కేసీఆర్ కిట్ పథకాన్ని పేరు మార్చి అయినా బడ్జెట్‌లో ప్రస్తావించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని బీఆర్ఎస్ సభ్యుడు సంజయ్ పేర్కొన్నారు. లక్ష్మణ్ కుమార్, కె.శంకరయ్య, మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తదితరులు మాట్లాడారు.

ముందస్తు బెయిల్ మంజూరు చేయండి

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1 ప్రభాకర్‌రావు పిటిషన్ దాఖలు



సాక్షి, హైదరాబాద్: తనను అన్యాయంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇరికించారని, ఆ కేసులో అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ ఉత్తర్వులు జారీ చేయాలంటూ ఆ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, వైద్యం కోసం అమెరికా వెళ్లానని, ఈ విషయాన్ని కింది కోర్టులో మెమో కూడా దాఖలు చేశానని తెలిపారు. తాను అమెరికా వెళ్లాక దర్యాప్తు అధికారులు తన ఇంట్లో సోదాలు చేస్తే ఏ ఆధారాలు లభించలేదని చెప్పారు. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు చార్జిషీట్ వేసినందున కొత్తగా తన నుంచి వివరాలు తెలుసుకోవాల్సినవేమీ లేవని, తాను దర్యాప్తునకు సహకరిస్తానని పేర్కొన్నారు. తాను 65 ఏళ్ల సీనియర్ సిటిజన్‌నని, తన వైద్య, ఆరోగ్య పరిస్థితులు, వైద్యం చేయించుకునే విషయాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు బెయిల్ ఇవ్వాలన్నారు. అరెస్టు అవుతాననే భయంతో తాను అమెరికా పారిపోయినట్లు దర్యాప్తు సంస్థ కింది కోర్టుకు చెప్పి నాన్ బెయిలబుల్ వారెంట్ ఆర్డర్ పొందిందని వివరించారు. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, ఎస్ఐబీ చీఫ్‌గా చట్టాలకు లోబడి పనిచేశానన్నారు.

26, 27 తేదీల్లో బీసీ కమిషన్ క్షేత్ర పర్యటనలు

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల్లోని వివిధ కులాల పేర్ల మార్పునకు సంబంధించి అధ్యయనం కోసం ఈనెల 26, 27 తేదీల్లో క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించనున్నట్లు తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న వేములవాడ, సిరిసిల్లలో పర్యటించి వంశరాజ్, దొమ్మర కులస్తుల నివాస ప్రాంతాలను కమిషన్ సందర్శించి అధ్యయనం చేయనుంది. అలాగే 27న జగిత్యాల, ధర్మపురిలలో పర్యటించి వంశరాజ్, దొమ్మర, వీరభద్రీయ కులాల వారితో ముఖాముఖి నిర్వహించనుంది.

జమిలి ఎన్నికలు వస్తే ఎంపీగా పోటీ చేస్తా

మాజీ మంత్రి మల్లారెడ్డి

సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు, అసెంబ్లీకి జమిలి ఎన్నికలు వస్తే తాను ఎంపీగా పోటీ చేస్తానని మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి చెప్పారు. అసెంబ్లీ లాబీలో శనివారం మల్లారెడ్డి మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. శుక్రవారం అసెంబ్లీ భేటీ జరుగుతున్న సమయంలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలవడంపై మల్లారెడ్డి వివరణ ఇచ్చారు. కేవలం తన నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి పనులపైనే సీఎంను కలిసినట్లు తెలిపారు.

'ఎస్ఎల్‌బీసీ'పై రేపు సీఎం సమీక్ష

- 12 ఏజెన్సీల ఉన్నతాధికారులతో భేటీకానున్న రేవంత్‌రెడ్డి
- హాజరుకానున్న జాతీయ, అంతర్జాతీయ నిపుణులు
- ఇకపై ఏం చేయాలనే విషయమై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్



టన్నెల్‌లో డీ-1 వద్ద ఇనుప కంచె ఏర్పాటు చేస్తున్న సహాయక బృందాల సభ్యులు

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం కూలిన ఘటనలో గల్లంతైన కార్మికులను వెలికితీసేందుకు నెల రోజులుగా జరుగుతున్న సహాయక చర్యలు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడంతో వ్యూహం మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం శాసనసభ కమిటీ హాల్‌లో సహాయక చర్యలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న 12 ఏజెన్సీల ఉన్నతాధికారులను ప్రభుత్వం ఈ సమావేశానికి పిలిచింది. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) మాజీ డీజీ/ఆర్మీ మాజీ ఈఎన్‌సీ జనరల్ హర్పాల్ సింగ్, సొరంగాలకు సంబంధించి ప్రముఖ అంతర్జాతీయ నిపుణుడు క్రిస్ కూపర్, బీఆర్ఓ అదనపు డీజీ కేపీ పురుషోత్తం, మరో సొరంగాల నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రాలను సైతం ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ భేటీకి రప్పిస్తోంది. ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటి? ఎంత పురోగతి సాధించారు? ఇంకా తీసుకోవాల్సిన చర్యలేమిటి? గల్లంతైన కార్మికులను వెలికితీసేందుకు ఇంకేం చేయాలి? అనే అంశాలపై ఆయా శాఖలు/సంస్థల అధికారులు ఈ సమీక్షలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. అవసరమైతే సహాయక చర్యలను సోమవారం ఒక రోజు నిలుపుదల చేసి ఈ కీలక సమావేశానికి హాజరు కావాలని వారిని ప్రభుత్వం కోరింది. గత నెల రోజులుగా 650 మంది సిబ్బంది రాత్రింబవళ్లు పనిచేయగా గల్లంతైన 8 మంది కార్మికుల్లో ఒకరి మృతదేహాన్ని వెలికితీశారు. సొరంగం కుప్పకూలిన ఫాల్ట్ జోన్‌లోని మట్టి, బండ రాళ్ల శిథిలాల కింద మిగిలిన ఏడుగురు నలిగిపోయి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతుండగా ఆ ప్రాంతంలో తవ్వకాలు నిర్వహిస్తే మళ్లీ సొరంగం కూలిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఆచితూచి తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ఈ సమీక్షలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొననున్నారు.

సహాయక చర్యలకు రూ.5 కోట్లు విడుదల

ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిన ఘటనలో గల్లంతైన కార్మికులను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న సహాయక చర్యలకు రూ. 5 కోట్లను మంజూరు చేస్తూ విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జీరో పాయింట్ వద్ద 40 మీటర్ల పరిధిలో సహాయక చర్యలు చేపట్టడం ప్రమాదకరమని అధికారులు తేల్చారు. ఆ ప్రాంతంలో సిమెంట్ సెగ్మెంట్స్ కుంగినట్లు నిర్ధారణకు వచ్చి 'డీ1'వద్ద ఇనుప కంచె ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఇక అక్కడ సహాయక చర్యలు కష్టమేనని తెలుస్తోంది. ఈ క్రమంలో ఆచూకీ లభించని ఏడుగురి గుర్తింపుపై నీలినీడలు కమ్ముకున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రూ. 2 లక్షలపైన రుణమాఫీ లేదు

▶ మొదటి పేజీ తరువాయి

మహేశ్వర్‌రెడ్డి సహా మొత్తం 13 మంది సభ్యులు అడిగిన పలు అంశాలపై మంత్రి తుమ్మల మాట్లాడారు. రైతులపై రుణభారం ఉండొద్దన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం రుణమాఫీని ప్రధానాంశంగా తీసుకుందన్నారు. అలాగే రైతుభరోసా కోసం రూ. 7,625 కోట్లు విడుదల చేశామని.. ఈ పంటకు కూడా రైతుభరోసా నిధులు ఇస్తామన్నారు. ప్రభుత్వంపై భారం పడినా రైతులకు ఉచిత విద్యుత్‌ను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రైతులను ప్రోత్సహించడంతోపాటు కౌలు రైతులకు మేలు చేసేందుకే సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తున్నామన్నారు. సన్నాలకు ఇప్పటివరకు రూ. 1,200 కోట్ల మేర బోనస్ ఇచ్చినట్లు తుమ్మల వివరించారు. ప్రభుత్వ నిర్ణయంతో సన్నాల సాగు 25 శాతం నుంచి 45 శాతానికి పెరిగిందన్నారు. ఎరువుల కొరత లేకుండా చూస్తున్నామని చెప్పారు. పంట నష్టపరిహారం ఎకరానికి రూ. 10 వేలు ఇస్తున్నామని.. రైతులు నష్టపోయిన పూర్తి పంటకు కూడా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు. భవిష్యత్తులో బీమా ప్రీమియం మొత్తం ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, రైతు రుణమాఫీపై ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ సభ్యులంతా సభ నుంచి వాకౌట్ చేశారు.

రుణమాఫీపై కాంగ్రెస్ మోసం బట్టబయలు: హరీశ్‌రావు

రైతు రుణమాఫీపై కాంగ్రెస్ మోసం అసెంబ్లీ సాక్షిగా బట్టబయలైందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 'రూ. 2 లక్షలు పైబడిన రైతు రుణాలను మాఫీ చేయలేమని వ్యవసాయ మంత్రి అసెంబ్లీలో ప్రకటించడం సీఎం చెప్పిన మాటలకు.. చేతలకు పొంతన లేదని రుజువు చేసింది. సీఎం మాటలు నమ్మి రూ. 2 లక్షలు పైబడిన రుణాలకు సంబంధించి వడ్డీ చెల్లించిన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం త్రిశంకు స్వర్గంలోకి నెట్టింది. అలాగే రూ. 2 లక్షలలోపు తీసుకున్న రుణం ఇంకా మాఫీ కాక చాలా మంది రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఖాతాల్లోని లోపాలను సవరించకుండా రైతులపైనే నెపం నెట్టి రుణమాఫీ నుంచి ప్రభుత్వం తప్పించుకుంది. రుణమాఫీ ప్రక్రియ పూర్తయిందని అసెంబ్లీ వేదికగా వ్యవసాయ శాఖ మంత్రి చెబుతున్నారు. బడ్జెట్లో పెట్టిన విధంగా రూ. 31 వేల కోట్ల మేర రుణమాఫీ చేయాలి' అని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఒక పేపరుకు బదులు ఇంకో పరీక్ష పేపరా?

- ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: పరీక్ష పూర్తి కాకముందే ప్రశ్నపత్రం వాట్సాప్‌లో ప్రత్యక్షమవడం, సంస్కృతం ప్రశ్నపత్రానికి బదులు తెలుగు ప్రశ్నపత్రం ఇవ్వడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత 'ఎక్స్'వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. టెన్త్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించలేని స్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని, పరీక్ష పత్రాల లోపాలతో విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటోందని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిమ్స్‌లో సర్జికల్ వస్తువుల కొనుగోలుకు

టెండర్ నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: నిమ్స్‌లో 2025–27 రెండేళ్ల కోసం సర్జికల్, జనరల్, స్టేషనరీ వస్తువుల కొనుగోలుకు సంబంధించి రేట్ కాంట్రాక్టు ద్వారా టెండర్లను ఆహ్వానిస్తూ డైరెక్టర్ బీరప్ప నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో సర్జికల్, ఎలక్ట్రికల్, సివిల్ వంటి జనరల్ ఐటమ్స్‌తో పాటు స్టేషనరీ వస్తువుల కోసం అర్హత గల ఉత్పత్తి దారులు, ఆథరైజ్డ్ డీలర్ల నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను సమర్పించేందుకు గడువు తేదీని ఏప్రిల్ 12వ తేదీన 3 గంటలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం www.nims.edu.in వెబ్‌సైట్‌ను చూడొచ్చు.

రాష్ట్రంలో 'గ్రామ పాలనాధికారులు'

- 10,954 జీపీవో పోస్టులకు ఆర్థికశాఖ అనుమతి
- వీఆర్వో, వీఆర్ఏల ఆప్షన్లకు అనుగుణంగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు గ్రీన్‌సిగ్నల్

సాక్షి, హైదరాబాద్: క్షేత్రస్థాయి రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా గ్రామస్థాయి రెవెన్యూ అధికారుల (జీపీవో) నియామకంలో మరో అడుగు పడింది. గ్రామస్థాయిలో నియమించనున్న రెవెన్యూ సిబ్బందికి 'గ్రామ పాలనాధికారులు'గా నామకరణం చేస్తూ 10,954 గ్రామ పాలనాధికారుల పోస్టులకు అనుమతినిస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీచేసింది. వీఆర్వో, వీఆర్ఏల నుంచి తీసుకున్న ఆప్షన్ల ఆధారంగా ఈ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో భర్తీ చేసుకునేందుకు రెవెన్యూ శాఖకు అనుమతిస్తూ ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శనివారం జీవో నెం–41 జారీ చేశారు. ఈ పోస్టులను భర్తీ చేసే ముందు ఆర్థికశాఖ నుంచి రెవెన్యూ శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రెవెన్యూ జేఏసీ కృషి ఫలితంగానే: జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

గ్రామ స్థాయి రెవెన్యూ అధికారుల నియామకానికి రెవెన్యూ జేఏసీ చేసిన కృషి ఫలితంగానే ప్రభుత్వం ఆమోదం తెలిపిందని జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి వెల్లడించారు. గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కృషి చేస్తున్నారని, గ్రామపాలనాధికారుల పోస్టులకు అనుమతినిచ్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు అనుమతినివ్వడం పట్ల డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కూడా హర్షం వ్యక్తంచేశాయి.

ఈబీసీలకూ 'రాజీవ్ యువ వికాసం'

నేడో, రేపో ప్రారంభం కానున్న దరఖాస్తుల స్వీకరణ



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రి పొన్నం, ఆర్థిక శాఖ ప్రత్యేక సీఎస్ కె. రామకృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: ఆర్థికంగా వెనుకబడిన వర్గాల నిరుద్యోగులకు కూడా రాజీవ్ యువ వికాసం పథకాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇందుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ఆది లేదా సోమవారాల్లో ప్రారంభం కానున్నట్లు సమాచారం. శనివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈబీసీలకు రాయితీ రుణాలపై నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే రాజీవ్ యువ వికాసం పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న సంగతి తెలిసిందే. అయితే రాజీవ్ వికాసం పథకం అమలుకు సంబంధించి మార్గదర్శకాలు ఇప్పటివరకు విడుదల కాలేదు. ఈబీసీ రాయితీ రుణాలకు సంబంధించిన అంశం పెండింగ్‌లో ఉండటంతో మార్గదర్శకాల జారీలో ఆలస్యమైనట్లు సమాచారం. ఈ పథకం మార్గదర్శకాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే సంక్షేమ శాఖలు రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాయి. వీటిని ఆమోదించి, ఉత్తర్వులు జారీ చేసిన మరుక్షణమే ఈబీసీల దరఖాస్తులను ఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఎలక్ట్రానిక్ సిటీలో తైవాన్ కంపెనీ పెట్టుబడులు

రూ.300 కోట్లు పెడుతున్న సెరా నెట్‌వర్క్స్



సెరా నెట్‌వర్క్స్ ప్రతినిధులతో రాష్ట్ర అధికారుల బృందం

సాక్షి, హైదరాబాద్: తైవాన్‌కు చెందిన సెరా నెట్‌వర్క్స్ మరో భాగస్వామి రెసొల్యూట్ అప్లయెన్సెస్‌తో కలసి కొంగరకలాన్ 'ఈ– సిటీ'లో రూ. 300 కోట్లతో భారీ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల యూనిట్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ప్రస్తుతం తైవాన్‌లో పర్యటిస్తున్న అధికారుల బృందం ఈ మేరకు సెరా నెట్‌వర్క్స్‌తో అవగాహన కుదుర్చుకుంది. తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనా సంస్థ టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో తైవాన్ వెళ్లిన అధికారుల బృందం సెరా నెట్వర్క్స్‌తో జరిపిన సంప్రదింపుల ఫలితంగా ఈ ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం ఈ సంస్థలు ఈ –సిటీలో ప్రభుత్వం కేటాయించిన 10 ఎకరాల్లో అత్యాధునిక డేటా సెంటర్ స్విచ్‌లు, 5జీ టెక్నాలజీకి సంబంధించిన పరికరాలతో పాటు, ఇతర ఎలక్ట్రానిక్ విడిభాగాలను ఉత్పత్తి చేస్తాయి. యూనిట్ విస్తరణ పనులు మొదలైతే 2 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించడంతో పాటు నెట్ వర్కింగ్, టెలికం రంగాలలో తెలంగాణ మరింత పురోగమించేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని అధికారులు వెల్లడించారు.



భద్రాద్రి రామయ్య పెళ్లికి రావాలంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానిస్తున్న వేదపండితులు

రాములోరి పెళ్లికి రండి

మంత్రులు, అధికారులకు భద్రాచలం వేద పండితుల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి రావాలంటూ పలువురు మంత్రులు, అధికారులు, ఎమ్మెల్యేలకు దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, భద్రాద్రి సీతారామ దేవాలయ ఈవో రమాదేవి, వేదపండితులు ఆహ్వానపత్రికలు అందజేశారు. శనివారం అసెంబ్లీ ఆవరణలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఇతర మంత్రుల చాంబర్లలో ఈ పత్రికలు అందించారు. అలాగే భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, ఇతర అధికారులకు అందజేశారు. వీరితో పాటు ఎంపీ పోరిక బలరాంనాయక్ తదితరులున్నారు. ఈ సందర్భంగా మంత్రులను స్వామివారి శాలువాతో భద్రాద్రి దేవాలయ అర్చకులు, పండితులు సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని అందజేసి వేదాశీర్వచనం ఇచ్చారు.

రాష్ట్రంలో టోల్‌ప్లాజాల ద్వారా రూ.7,245 కోట్ల ఆదాయం

కేంద్ర మంత్రి గడ్కరీ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని 108 టోల్‌ప్లాజాల ద్వారా 2019–24 మధ్య రూ.20274.04 కోట్ల ఆదాయం వచ్చిందని కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. దేశంలో ఉన్న టోల్‌ప్లాజాల సంఖ్య ఎంత?, వాటి ద్వారా ఐదేళ్లలో వచ్చిన ఆదాయం ఎంత? అనే అంశాలపై ఇటీవల లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కేంద్రాన్ని వివరాలు అడిగారు. దీనిపై కేంద్ర మంత్రి గడ్కరీ ఈ మేరకు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. తెలంగాణలో 36, ఆంధ్రప్రదేశ్‌లో 72 టోల్‌ప్లాజాలు ఉన్నట్లు వివరించారు. వీటి ద్వారా తెలంగాణలో 7,245.21 కోట్లు ఆదాయంరాగా, ఏపీలో రూ.13,028.83 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

తెలంగాణలో టోల్ ప్లాజాల నుంచి వచ్చిన ఆదాయం వివరాలు ఇవీ..

ఏడాది	ఆదాయం
2019-20	రూ. 999.55 కోట్లు
2020-21	రూ. 1,052.47 కోట్లు
2021-22	రూ. 1,378.57 కోట్లు
2022-23	రూ. 1,826.29 కోట్లు
2023-24	రూ. 1,988.33 కోట్లు

ఆర్మీలో నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏప్రిల్ 10 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు గడువు



లక్డీకాపూల్ (హైదరాబాద్): ఇండియన్ ఆర్మీలో వివిధ కేటగిరీల్లో నియామకం కోసం ఔత్సాహిక అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మేజర్ పీ.సీ.రాయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ (క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్), అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్‌కు 10వ తరగతి, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్‌కు 8వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు తమ అర్హత ఆధారంగా ఏవైనా రెండు కేటగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అలాగే ఐటీఐ, డిప్లొమా, ఎన్‌సీసీ అర్హత పొందిన అభ్యర్థులకు బోనస్ మార్కులుంటాయని, 13 భాషలలో కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ఆన్‌లైన్‌లో జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు www.joinindianarmy.nic.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు జూన్‌లో సంబంధిత సైట్ నుంచి అడ్మిట్ కార్డు పొందవచ్చని, అప్‌డేట్స్, ఈ–మెయిల్ ఐడీని వెబ్‌సైట్ ద్వారా పరిశీలించుకోవాలని సూచించారు. సలహాలు, సూచనలకు రిక్రూటింగ్ కార్యాలయం సికింద్రాబాద్ 040–27740205 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చని రాయ్ పేర్కొన్నారు.



యూఎస్‌జీసీఐ భారత చాప్టర్ ప్రారంభం

యునైటెడ్ స్టేట్స్ గ్లోబల్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (యూఎస్‌జీసీఐ) భారత చాప్టర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన గ్లోబల్ బిజినెస్ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాదారు మార్క్ బర్న్స్, యూఎస్ జీసీఐ ఇండియా వ్యవస్థాపకుడు సోలొమన్ గట్టు, యూఎస్‌జీసీఐ ఇండియా–యూఎస్ రిలేషన్స్ డైరెక్టర్ గ్లోరియా సుహాసిని పాల్గొన్నారు.



'శాటిలైట్ ఇంటర్నెట్' గేమ్ ఛేంజరే!

డిజిటల్ అంతరాలు తగ్గుతాయంటున్న భారతీయులు

ఈ సేవలు వెంటనే కావాలంటున్న 91 శాతం మంది

ప్రభుత్వమే చౌకగా అందించాలన్న 39 శాతం మంది

ప్రకృతి విపత్తుల సమయంలో సమస్యలు రావొచ్చని అనుమానం

లోకల్ సర్కిల్స్ సర్వేలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: డిజిటల్ విప్లవం నడుస్తున్న మనదేశంలో ఇప్పుడు ఇంటర్నెట్ సర్వీస్ అనేది నిత్యావసరంగా మారిపోయింది. కానీ, కొన్ని మారుమూల ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవల విస్తరణ ఇప్పటికీ దుర్లభంగానే ఉన్నది. అయితే, దేశంలో ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవలు ప్రారంభమైతే పరిస్థితి పూర్తిగా మారిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ సేవలు వెంటనే అందుబాటులోకి రావాలని ప్రజలు కూడా కోరుకుంటున్నారని లోకల్ సర్కిల్స్ సంస్థ నిర్వహించిన తాజా సర్వేలో తేలింది.

స్టార్‌లింక్‌తో జట్టు

దేశంలోని రెండు పెద్ద టెలికం సంస్థలు భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో.. భారత్‌లో ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవల కోసం అమెరికన్ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన 'స్టార్‌లింక్'తో ఒప్పందం చేసుకున్నట్టు ప్రకటించాయి. 2021లో అమెరికా, కెనడాల్లో ఈ సేవలను ప్రారంభించిన స్టార్‌లింక్.. ప్రస్తుతం వందకు పైగా దేశాలకు విస్తరించింది. 2022లోనే భారత్‌లోనూ 99 యూఎస్ డాలర్లకు ప్రీ ఆర్డర్‌ను (అప్పట్లో ఫారెక్స్ ధరను బట్టి రూ.7,201) ప్రారంభించింది. అయితే, టెలికం నియంత్రణ ఏజెన్సీల నుంచి తగిన అనుమతులు పొందలేకపోవడంతో స్టార్‌లింక్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించలేదు.

లోకల్ సర్కిల్స్ సర్వేలోని ముఖ్యాంశాలు

- → శాటిలైట్ ఇంటర్నెట్ సేవలపై లోకల్ సర్కిల్స్ సంస్థ 323 జిల్లాల్లో 22,000 మంది అభిప్రాయాలు తీసుకుంది. వీరిలో 42 శాతం మంది ప్రథమ శ్రేణి నగరాల నుంచి, 30 శాతం ద్వితీయ శ్రేణి నగరాల నుంచి, మిగిలిన 28 శాతం టైర్–3, టైర్–4 గ్రామీణ ప్రాంతాల వారు ఉన్నారు.
- → సర్వేలో పాల్గొన్నవారిలో 91 శాతం మంది ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవలు విస్తృతంగా అందుబాటులోకి వస్తే.. కనెక్టివిటీ పెరిగి మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లోనూ డిజిటల్ విప్లవం సాధ్యమవుతందని విశ్వాసం వ్యక్తంచేశారు.
- → 50 శాతం మంది ప్రైవేట్ కంపెనీలు నేరుగా వినియోగదారులకు ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలు అందించాలని అభిప్రాయపడ్డారు. 39 శాతం మంది ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచితంగా లేదా తక్కువ ధరకు ఈ సేవలను అందించాలని సూచించారు.
- → స్టార్‌లింక్ రాకతో హైస్పీడ్, తక్కువ జాప్యంతో (లోలాటెన్సీ) ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వస్తాయని నమ్ముతున్నారు.
- → ఉపగ్రహ ఇంటర్నెట్‌ను అవసరమైన మౌలిక సదుపాయంగా గుర్తిస్తే, ఇది డిజిటల్ ఇండియాకు దన్నుగా నిలిచి ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందని నిపుణులు అభిప్రాయపడ్డారు.
- → పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న డిజిటల్ అంతరాలను ఇది తగ్గిస్తుందని తెలిపారు.
- → ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు కలిసి ముందుకు వస్తే కనెక్టివిటీ విస్తరణలో విప్లవాత్మక మార్పులు వస్తాయని పేర్కొన్నారు.
- → అయితే భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో డీటీహెచ్ మాదిరిగానే ఇంటర్నెట్ సేవలకు అంతరాయం ఏర్పడవచ్చని కొందరు అనుమానం వ్యక్తంచేశారు.
- → స్టార్‌లింగ్ శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీస్‌ల విషయంలో వినియోగదారుల వ్యక్తిగత గోప్యతపై స్పష్టత లేదని కొందరు తెలిపారు.

స్టార్‌లింక్ ప్రత్యేకతలు

- అంతరిక్షంలోని ఉపగ్రహాల నెట్‌వర్క్ ద్వారా ఇంటర్నెట్ కనెక్టివిటీ నేరుగా భూమిపై ఉన్న వివిధ డివైజ్‌లకు చేరుతుంది.
- ఈ కనెక్షన్‌కు చందా కేబుల్ సర్వీస్ డైరెక్ట్ టు హోం (డీటీహెచ్)కు కట్టిన మాదిరిగా ఉంటుంది.
- ఇంటర్నెట్ కోసం ఈ కంపెనీ పోర్టబుల్ శాటిలైట్ డిష్ కిట్‌ను అందజేస్తుంది. దీనిని ఇంటిపై శాశ్వత పద్ధతిలో బిగించవచ్చు.
- ముందుగా ఇళ్లలో వైఫై రూటర్ ఆధారిత వైర్ కనెక్షన్ కలిగి ఉండాలి. దీనిని ఆ తర్వాత వైర్‌లెస్ పద్ధతిలో స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లు, కంప్యూటర్లు, ఇతర ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ గాడ్జెస్‌కు జతచేయొచ్చు.
- ప్రపంచంలో ఏ మూలన ఉన్నా సర్వీస్ అందించగలదు. మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా ఇంటర్నెట్ సేవలను పొందవచ్చు.

2030 నాటికి మన వాటి 1.9 బిలియన్ డాలర్లు

ప్రపంచ ఉపగ్రహ ఇంటర్నెట్ మార్కెట్ పరిమాణం 2022లో 3 బిలియన్ డాలర్లు. ఇందులో భారత్ వాటా 3 శాతం మాత్రమేనని గతంలో విడుదలైన డెలాయిట్ ఇండియా నివేదిక తెలిపింది. 2030 నాటికి భారత ఉపగ్రహ బ్రాడ్‌బాండ్ మార్కెట్ 1.9 బిలియన్ డాలర్లకు పెరిగే అవకాశముందని అంచనా వేసింది.



విద్యార్థినికి బోధిస్తున్న ఉపాధ్యాయులు

బడిని బతికించిన బాపు!

ఖమ్మం జిల్లా నారపునేనిపల్లి యూపీఎస్‌లో ఒకరే విద్యార్థిని

పాఠశాలను మూసివేయాలని అధికారుల నిర్ణయం

మూసేస్తే తన బిడ్డ చదువు మాన్పిస్తానని విద్యార్థిని తండ్రి బెదిరింపు

నిర్ణయం మార్చుకొని అడ్మిషన్ల పెంపునకు అధికారుల ప్రయత్నాలు

వైరా రూరల్: కారణాలు ఏమైనా ఇప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపేందుకే మొగ్గు చూపుతుండడంతో ప్రభుత్వ పాఠశాలలు వైభవం కోల్పోతున్నాయి. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని నారపునేనిపల్లి యూపీఎస్‌కు కూడా అదే గతి పట్టింది. ఈ ఏడాది స్కూల్ మొత్తంలో నాలుగో తరగతి చదివే ఒకే విద్యార్థి మిగిలింది. దీంతో అధికారులు స్కూల్‌ను మూసివేసేందుకు యత్నించారు. కానీ ఆ విద్యార్థిని తండ్రి పట్టుదల కారణంగా స్కూల్ ఇంకా మూతపడకుండా నడుస్తోంది.

24 మంది నుంచి ఒకరికి..

నారపునేనిపల్లిలో పాఠశాల స్థాయి విద్యార్థులు 35 మంది ఉంటారు. గ్రామ యూపీఎస్‌లో 2018లో 24 మంది విద్యార్థులతో పాటు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేవారు. 2022–23లో ఎనిమిదికి, 2023–24లో నలుగురికి ఆ సంఖ్య పడిపోయింది. దీంతో ఉమాపార్వతి అనే టీచర్ మినహా ఉపాధ్యాయులందరినీ డిప్యూటేషన్‌పై వేరే స్కూళ్లకు పంపారు. ఈ విద్యాసంవత్సరం నాలుగో తరగతి చదివే కీర్తన మాత్రమే మిగిలింది. ఈ స్కూల్ నుంచి విద్యార్థులు వెళ్లిపోవటానికి కోతుల బెడద కూడా కారణమైంది. విద్యార్థులు లేని కారణంగా స్కూల్ మూసివేతకు అధికారులు సిద్ధపడడంతో ఆమె తండ్రి అనిల్‌శర్మ అడ్డుకున్నాడు. పాఠశాల మూస్తే తన కుమార్తె చదువు మాన్పిస్తానని.. అదే జరిగితే అధికారులే బాధ్యత వహించాలని స్పష్టంచేయటంతో వెనక్కి తగ్గారు. స్కూల్‌లో ప్రవేశాల పెంపునకు అధికారులు గ్రామంలో ఇంటింటా ప్రచారం చేయటంతో ఇంకో టీచర్‌ను కేటాయిస్తే పిల్లల్ని పంపిస్తామని గ్రామస్తులు చెప్పారు. దీంతో డిప్యూటేషన్‌పై ఖానాపురం హిందీ పండిట్ మాచర్ల రాంబాబును కేటాయించారు.

స్కూల్ మూత పడొద్దనే...



ఒకసారి స్కూల్ మూసేస్తే మళ్లీ తెరవడం సాధ్యం కాదు. ప్రైవేట్ పాఠశాలలో చదివించే స్తోమత ఉన్నా పాఠశాల మూసివేయొద్దనే ఉద్దేశంతో మా పాపను ఇక్కడ చదివిస్తున్నా. ప్రభుత్వ బడుల్లో ఉన్న సదుపాయాలపై ప్రచారం చేసి ప్రవేశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలి.

– నందిగామ అనిల్‌శర్మ, కీర్తన తండ్రి

అన్ని వసతులు కల్పిస్తాం..



యూపీఎస్‌లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తాం. కోతుల నివారణకు పాఠశాల ప్రహరీపై సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుచేయడమే కాక డిజిటల్ బోధ న చేయనున్నాం. తల్లిదండ్రులు రూ. లక్షలు వెచ్చించి ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా పిల్లలను సర్కారు బడులకు పంపించి ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతానికి సహకరించాలి.

– కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఎంఈఓ, వైరా.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
ఆదివారం । 23-3-2025



క్లైండ్‌నెస్ వాల్ వద్ద షెల్ఫ్‌ల్లో అమర్చిన సామగ్రి

క్లైండ్‌నెస్ వాల్ !

- అవసరం లేని వస్తువుల వితరణకు షెల్ఫ్‌లు
- ఖమ్మం కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు

ఖమ్మం మయూరి సెంటర్: మనకు అవసరం లేనిది త్యజించడం.. మనకు అవసరమైంది.. ఇతరుల నుంచి తీసుకోవడం సమాజానికి మేలు చేస్తుందనే భావనతో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యాన 'కై ండ్‌నెస్ వాల్'ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లా ప్రభుత్వాస్పత్రి వద్ద ఈ వాల్‌ను కలెక్టర్ ముజమ్మిల్ మూడు రోజుల క్రితం ప్రారంభించారు. ఇక్కడ ఏ వస్తువును ఎలా పడితే అలా పడవేయకుండా.. సామగ్రి వారీగా షెల్ఫ్‌లు ఏర్పాటు చేసి లేబుళ్లు అతికించారు. దుస్తులు, చెప్పులు, పుస్తకాలు, వంట సామగ్రి వంటి వస్తువులను శుభ్రం చేసి ఉంచాలని, ఆహార పదార్థాలు ఉంచరాదని అధికారులు సూచించారు. దీంతో పలువురు దుస్తులు, చెప్పులు, షూలు, ఫ్యాన్లు, ప్రింటర్లు, కీ బోర్డులు, హెల్మెట్లు తదితర సామగ్రిని షెల్ఫ్‌ల్లో భద్రపరుస్తుండగా.. అవసరమైన వారు తీసుకెళ్తున్నారు. దయ చూపడం.. పంచుకోవడం లాంటి సామాజిక బాధ్యతను పెంపొందించే ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలన్న అధికారుల సూచనకు మంచి స్పందన లభిస్తోంది.



ట'మేత'!

ఇచ్చోడ: మార్కెట్‌లో టమాటా ధర రోజు రోజుకూ పడిపోతోంది. రైతులకు పెట్టుబడి రావడం లేదు. కొనేవారు లేక.. తిరిగి తీసుకెళ్తే రవాణా ఖర్చులతోనూ నష్టం ఏర్పడుతోంది. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో శనివారం మార్కెట్‌లో విక్రయించడానికి ఒక రైతు టమాటాలు తీసుకొచ్చాడు. మార్కెట్‌లో ఆశించిన ధర లేకపోయింది. కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో టమాటాను తిరిగి ఇంటికి తీసుకెళ్లలేక.. సాథ్ నంబరు గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కన పడేసి వెళ్లిపోయాడు. పడేసిన టమాటాలను పశువులు మేస్తుండటం కనిపించింది.

చెరగని 'సంత'కం!

దేవరకద్ర సంత @ 78 ఏళ్లు ● 1947 జూన్ 17న ప్రారంభం
బుచ్చారెడ్డి కృషితో సంత ఏర్పాటు ● మొదట పశువులు, కూరగాయల సంత
పదేళ్లుగా గొర్రెలు, మేకలు, కోళ్ల సంత ● భారీగా తరలి వచ్చే ప్రజలు, వ్యాపారులు



దేవరకద్రలో పశువుల సంత

దేవరకద్ర: ఆ సంతకు ఒక ప్రత్యేకత ఉంది. ప్రతి బుధవారం జరిగే ఈ సంత.. చుట్టుపక్కల మండలాల్లోనే కాదు ఉమ్మడి జిల్లాలోనే ప్రసిద్ధి చెందింది. ఒక పక్క పశువుల సంత, మరోపక్క గొర్రెలు, మేకలు, కోళ్ల సంత జరుగుతాయి. 78 ఏళ్లు పూర్తి చేసుకున్న మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సంత విశిష్టత ఇది.

సంతకు మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూల్ నుంచి గొంగళ్ల, చెప్పుల వ్యాపారులు, పశువుల మువ్వలు, తాళ్లు అమ్ముకునే వారు వస్తారు. పసుపు కుంకుమలు అమ్మే బుక్కవారు, అల్లం ఎల్లిపాయ, బట్టల వ్యాపారులతో సంత అంతా కిక్కిరిసిపోతోంది. కూరగాయల సంత అయితే రెండు రోడ్లపై విస్తరిస్తుంది. వివిధ గ్రామాల నుంచి రైతులు పండించిన తాజా కూరగాయలు సంతకు వస్తాయి. ఉదయం నుంచి రాత్రి వరకు కూరగాయల సంత కొనసాగుతోంది. వారాంతపు సంత కావడంతో వేలాది మంది వారానికి సరిపడ సరుకుల కొనుగోలుకు వస్తారు.

నైజాం సర్కార్‌తో అనుమతి..
దేవరకద్ర సంత.. స్వాతంత్య్రం రాక ముందు 1947 జూన్ 17న ప్రారంభమైంది. ఆనాడు బలుసుపల్లి బుచ్చారెడ్డి అనే వ్యక్తి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సంతను ప్రారంభించడానికి కృషి చేశారు. స్వాతంత్ర్యం వచ్చాక హైదరాబాద్‌ను నైజాం పాలిస్తుండేవాడు. ఆ సమయంలో డివిజన్ కేంద్రమైన నారాయణపేటకు రవాణా సౌకర్యం ఉండేది కాదు. దీంతో బుచ్చారెడ్డి నడుచుకుంటూ నారాయణపేట వెళ్లి.. సంత అనుమతి కోసం దరఖాస్తు చేశారు. ఎన్నోసార్లు తిరిగి సంతకు అనుమతి తెచ్చారు. ఇలా సాధించుకున్న సంతను అధికారికంగా 1947 జూన్ 17న బుధవారం ప్రారంభించారు. నాడు దేవరకద్రలో పశువుల సంత ఏర్పాటుపై.. గ్రామాల్లో దండోరాలు వేయించి ప్రచారం చేయించారు. ఒకరోజు ముందుగానే రైతులు సంతకు వచ్చేవారు. ఎంతో కష్టపడి సంతకు ఒక రూపం తెచ్చి.. వాగు సమీపంలోని స్థలంలో కొనసాగించారు.

సంత బుచ్చారెడ్డిగా గుర్తింపు..
బలుసుపల్లి బుచ్చారెడ్డి ప్రారంభించడంతో.. ఆయన పేరుతోనే బలుసుపల్లి బుచ్చారెడ్డి సంతగా గ్రామపంచాయతీలో రశీదులపై ముద్రించేవారు. ఆయన పేరు కాస్త సంత బుచ్చన్నగా మారింది. 1979లో బుచ్చారెడ్డి మృతి చెందగా.. సంతలోనే అంత్యక్రియలు నిర్వహించి ఆయన జ్ఞాపకార్థం అక్కడే బృందావనం నిర్మించారు. ఇప్పటికీ పశువుల సంతలో బృందావనం కనిపిస్తుంది.

అందరికీ అనువుగా వారపు సంత
దేవరకద్ర సంత అందరికీ అనువుగా ఉంటుంది. వారానికి అవసరమయ్యే వస్తువులన్నీ ఇక్కడ దొరుకుతాయి. తాజా కూరగాయలు అమ్మేందుకు 500 మంది వరకు రైతులు వస్తారు. వివిధ రకాల పండ్ల వ్యాపారులు కనీసం 50మంది దాకా సంతకొచ్చి అమ్మకాలు కొనసాగిస్తారు. బట్టలు, చెప్పుల వ్యాపారులు, కిరాణా దుకాణాలు, హోటళ్లు, పండ్ల రసాలు అమ్మేవారు, కూల్‌డ్రింక్స్, పాన్‌షాపులు.. ఒకటా రెండా.. వేలాది మంది వ్యాపారులు ఈ సంతపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

40 ఏళ్లుగా పాన్‌షాపు

దేవరకద్ర కూరగాయల సంతలో 40 ఏళ్లుగా పాన్‌షాపు నడుపుతున్నా. వారానికో సారి జరిగే సంత రోజు జరిగే వ్యాపారం.. వారమంతా కలిపినా కూడా జరగదు. రోజూ జరిగే వ్యా పారంతో చూసుకుంటే.. మూడింతల వ్యాపారం ఒక్క రోజే జరుగుతుంది. అందరికీ సంత జీవనోపాధిగా మారింది.



– ప్రభాకర్, దేవరకద్ర

కూరగాయల వ్యాపారానికి గిరాకీ

సంతలో కూరగాయల వ్యాపారం బాగా జరుగుతుంది. వారానికోసారి వచ్చినా.. వ్యాపారంతో వారం అంతా గడుపుతాం. ఉదయం నుంచి రాత్రి వరకు కూరగాయలు కొనడానికి ప్రజలు వస్తూనే ఉంటారు. తెచ్చిన కూరగాయలన్నీ పూర్తిగా అమ్ముకుంటాం. సంతతో అందరికీ ఉపాధి దొరుకుతుంది.



– పద్మ, కూరగాయల వ్యాపారి, కోటకదిర



మాకెంతో గర్వకారణం..

మా తాత స్థాపించిన సంత అంటే ఎంతో గర్వకారణం, బలుసుపల్లి బుచ్చారెడ్డి అంటేనే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. అలాంటి వ్యక్తికి మనవడిని కావడం అదృష్టం. ఆయన తన చెమట చిందించి స్థాపించిన పశువుల సంతను దాదాపు 49 ఏళ్లపాటు వేలం పాడి కాంటాక్టు తీసుకున్నాం. ఆ తరువాత పోటీ ఎక్కువై రూ.వేల నుంచి రూ.లక్షల్లోకి చేరడంతో వదిలేశాం.

– బలుసుపల్లి ఆది హన్మంతరెడ్డి, దేవరకద్ర



దేవరకద్రలో కూరగాయల సంత



బలుసుపల్లి బుచ్చారెడ్డి



దేవరకద్ర సంతలో గొంగళ్ల విక్రయం

నేర్చుకోవడంపై గ్రామీణులకే ఆసక్తి

- కొత్త విషయాలు నేర్చుకోవడంపై పెరిగిన శ్రద్ధ
- పట్టణాలతో పోల్చితే గ్రామీణులకే అవగాహన మెండు
- ఇందుకు అధిక సమయం వెచ్చిస్తున్న పల్లె ప్రజలు
- 2024లో పట్టణాల్లో సగటున రోజుకు 87 నిమిషాలు, గ్రామాల్లో సగటున రోజుకు 90 నిమిషాల వెచ్చింపు
- కేంద్ర గణాంకాలు, పథకాల అమలు శాఖ 'టైమ్ యూజ్ సర్వే'లో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: కొత్త విషయాలు నేర్చుకునే విషయంలో గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఆసక్తి అధికంగా ఉంటోంది. పట్టణాలతో పోల్చితే.. గ్రామీణ ప్రాంతాల్లోనే ఆయా అంశాలను నేర్చుకోవడంపై శ్రద్ధాసక్తులు కనబరుస్తున్నట్టు తెలుస్తోంది. 2024లో.. నగరాలు, పట్టణ ప్రజలతో పోల్చి చూస్తే.. గ్రామీణ ప్రజలు వివిధ అంశాలను నేర్చుకునే కార్యకలాపాల్లో (లెర్నింగ్ యాక్టివిటీస్) ఎక్కువ సమయం గడిపినట్టు స్పష్టమౌతోంది. కేంద్ర గణాంకాలు, పథకాల అమలు శాఖ తాజాగా విడుదల చేసిన 'టైమ్ యూజ్ సర్వే'లో ఈ ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. ఈ విషయంలో ఐదేళ్లగా.. పురుషులతో సమానంగా మహిళలు కూడా ఇలాంటి విషయాలపై ఎక్కువ శ్రద్ధ కనబరుస్తున్నారు. కేంద్ర గణాంకాలు, పథకాల అమలు శాఖ పేర్కొన్న సర్వే ప్రకారం.. స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీల్లో చదువుకోవడం మొదలు, క్రీడలు, ఇతర అభిరుచుల్లో ప్రవేశం, హోంవర్క్ వంటివి చేయడం, ఏదైనా కోర్సు నేర్చుకోవడానికి ప్రయాణం వంటి 'లెర్నింగ్ యాక్టివిటీస్'కిందకు వస్తాయి. అయితే 2019తో పోల్చితే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 'లెర్నింగ్ యాక్టివిటీస్'పై సమయం గడపడం అనేది తగ్గినట్లు తేలింది. 2024 జనవరి –డిసెంబర్ మధ్యకాలంలో నిర్వహించిన ఈ అధ్యయనంలో.. పట్టణాల్లో సగటున రోజుకు 87 నిమిషాలు, గ్రామాల్లో సగటున రోజుకు 90 నిమిషాలు వెచ్చిస్తున్నట్టు వెల్లడైంది. ఆస్ట్రేలియా, జపాన్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, న్యూజిలాండ్, యూఎస్ఏ, చైనాలతో పాటు భారత్‌లోనూ 'టైమ్ యూజ్ సర్వే'నిర్వహిస్తున్నారు. రోజువారీ కార్యకలాపాల్లో భాగంగా సమయాన్ని ఎలా వెచ్చిస్తారు, ఏయే అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తారనే అంశంపై ఈ అధ్యయనం నిర్వహిస్తుంటారు. ప్రధానంగా పురుషులు, మహిళలు ఎలా సమయాన్ని గడుపుతారు?, 'పెయిడ్', 'అన్ పెయిడ్'కార్యక్రమాల్లో ఎవరి భాగస్వామ్యం ఎంత అనేది పరిశీలిస్తారు.

అమెరికన్లు, ఇతర అభివృద్ధి చెందిన దేశాల పౌరులే కాకుండా.. భారతీయులు కూడా నలుగురిలో కలవడం, అందరూ కలిసి వివిధ రకాల కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి 'సోషలైజింగ్ యాక్టివిటీస్'లోనూ తక్కువ సమయం గడుపుతున్నట్టు వెల్లడైంది. ఈ 'టైమ్ యూజ్ సర్వే'ను విశ్లేషించినపుడు.. ఇలాంటి సోషలైజింగ్ కార్యకలాపాల్లోనూ పురుషుల పాత్ర తగ్గగా.. (2019లో 91.4 శాతం ఉన్నది కాస్తా 2024లో 89.8 శాతానికి తగ్గుదల), మహిళల భాగస్వామ్యం కూడా 91.3 శాతం నుంచి 90.7 శాతానికి తగ్గింది. 15–29 ఏళ్ల మధ్యనున్న వారి సమూహం సోషలైజేషన్ కూడా స్వల్పంగా తగ్గినట్టు ఈ అధ్యయనం తేల్చింది. వివిధ సందర్భాల్లో కలుసుకోవడం, నలుగురితో కలివిడిగా ఉండటం వంటివి తగ్గడానికి కారణం.. ఇన్ఫర్మేషన్, టెక్నాలజీ పరికరాలు (ఐసీటీ డివైజెస్), మాస్ మీడియా, క్రీడలు ఇతర కార్యకలాపాలపై దృష్టి పెరగడమేనని చెబుతున్నారు. ఐసీటీ డివైజెస్ విషయానికి వచ్చేటప్పటికి సోషల్ మీడియా, రేడియో, టీవీ, శాటిలైట్ సిస్టమ్ వంటి వాటిలో.. వీరంతా ఎక్కువగా నిమగ్నం అవుతున్నట్టు ఈ సర్వే స్పష్టం చేసింది.



ఈడుగుల రవి పొలంలోని మూడు అంతస్తుల మంచె

మూడంతస్తుల మంచె..

వీర్నపల్లి(సిరిసిల్ల): చుట్టూ పచ్చని పొలాలు.. మధ్యలో మూడు అంతస్తుల మంచె.. దానిపై కూర్చుని పంటకు కాపలా కాస్తూ ఉంటే.. ఆ ఆనందం వేరేలా ఉంటుంది. సాధారణంగా ఒక అంతస్తులోనే మంచె కట్టుకోవడం చూస్తుంటాం. కానీ రాజన్నసిరిసిల్ల జిల్లా అటవీప్రాంత మండల కేంద్రం వీర్నపల్లిలో ఈడుగుల రవి అనే రైతు.. తన పొలంలో ఇలా మూడు అంతస్తుల మంచె నిర్మించుకున్నాడు. దీని పై అంతస్తులోకి వెళ్లి చూస్తే కనుచూపు మేరంతా పచ్చని అటవీ కనువిందు చేసింది.



శనివారం భువనేశ్వర్‌లో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తండ్రి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో కలిసి ఇండియన్ ఆర్మీకి సంబంధించిన ఓ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఓబీసీ సారంగం ప్రమాద సహాయ కార్యకలాపాలకు సహకరిస్తున్నందుకు తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా ఆర్మీ కమాండర్ జనరల్ మిశ్రా, అధికారులు, జవాన్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భారత సాయుధ దళాలలో సభ్యుడిగా ఉండటం తనకు గర్వకారణమని మంత్రి ఉత్తమ్ అన్నారు.

నృత్యాంజలి



శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖలోని గురజాడ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన శ్రీనివాస కళ్యాణ మహోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో నృత్య ప్రదర్శనకు సిద్ధమవుతున్న కళాకారులు

- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మత్తు పదార్థాలను దరిచేరనివ్వం



మత్తు పదార్థాలను దరిచేరనివ్వమని ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. విశాఖ బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా విశాఖ పోలీసు శాఖ నిర్వహించిన నవ సమాజ నిర్మాణం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ఈ విధంగా ప్రతిన బూనారు.

-సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం

లేత మొక్కలకు రేకులే రక్ష



మండుతున్న ఎండల ధాటికి అప్పుడే నాటిన లేత మొక్కలు వదలిపోతున్నాయి. అనంతపురం జిల్లా వడియంపేట సమీపంలో ఓ రైతు తన పొలంలో నాటిన అరటి మొక్కల్ని రక్షించుకోవడానికి ఇలా ఈత కమ్మల్ని రక్షణగా పెట్టాడు

- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

క్లుప్తంగా...

పాఠశాలల్లో 'కిశోరి వికాసం' బృందాలు

సాక్షి, అమరావతి: కౌమర దశ విద్యార్థుల్లో పలు అంశాలపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలల్లో 'కిశోరి వికాసం' బృందాలను ఏర్పాటు చేయనున్నారు. విద్య, ఆరోగ్యం, ఋతుక్రమ సమయంలో పరిశుభ్రత, పోషకాహారం, మానవ అక్రమ రవాణా, ఆత్మరక్షణ, జీవనోపాధి అవకాశాలు, బాల్య వివాహాల నివారణ వంటి కీలక అంశాలపై పూర్తి అవగాహన కల్పించే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్ రామరాజు శనివారం ఆదేశాలు జారీ చేశారు. కిశోరి వికాసం కార్యక్రమాన్ని అమలు చేయడానికి మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నోడల్ విభాగంగా పనిచేస్తుంది. ప్రతి బృందంలోను 15 నుంచి 20 మంది పాఠశాల, కళాశాల బాలికలు, బాలురు సభ్యులుగా ఉంటారు.

పీఎంఎఫ్‌బీవై సీఈఓగా ముక్తానంద్ అగర్వాల్



సాక్షి, అమరావతి: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా ముక్తానంద్ అగర్వాల్ నియమితులయ్యారు. 2008 రాజస్థాన్ కేడర్‌కు చెందిన అగర్వాల్ ఇప్పటి వరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖలో సంయుక్త కార్యదర్శిగా సేవలందించారు. ఫసల్ బీమాను అన్ని రాష్ట్రాలకు విస్తరించే లక్ష్యంగా కేంద్రం బలోపేతం చేస్తోంది. ఇందులో భాగంగా సీనియర్ ఐఏఎస్ అధికారి అగర్వాల్‌ను సీఈఓగా నియమిస్తున్నట్టు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

న్యూ రెన్యువబుల్ ఎనర్జీ జాయింట్ సెక్రటరీగా జవ్వాది



సాక్షి, అమరావతి: న్యూ రెన్యువబుల్ ఎనర్జీ శాఖ జాయింట్ సెక్రటరీగా జవ్వాది సుబ్రమణ్యాన్ని నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రానికి చెందిన జవ్వాది అసోం కేడర్‌కు చెందిన 2009 బ్యాచ్ ఐఏఎస్. ఈయన పలు కీలక పదవుల్లో పనిచేశారు. గతంలో డిప్యూటేషన్‌పై ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ కమిషనర్‌గా, ఏపీఐఐసీ ఎండీ, ఏపీఈడీబీ సీఈవోగా బాధ్యతలు నిర్వర్తించారు.

ఎస్సీ వర్గీకరణలో పారదర్శకంగా వ్యవహరించాలి

సాక్షి, అమరావతి: ఎస్సీ వర్గీకరణలో రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అసెంబ్లీ చివరి రోజున రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ నివేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడిగా ప్రకటించి, తర్వాత ఆర్డినెన్స్ తెస్తామని చెప్పడం సరికాదన్నారు. ఆర్డినెన్స్ పేరుతో రాష్ట్రంలోని దళితులను మోసం చెయ్యొద్దని ఓ ప్రకటనలో హితవు పలికారు. అసెంబ్లీ, మండలిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కమిషన్ నివేదికపై మాట్లాడే అవకాశం లేకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు.



ఆశా కార్యకర్తల ధర్నా



అంగన్‌వాడీల ఆందోళన

ధర్నాచౌక్ సాక్షిగా ప్రజాగ్రహం

కూటమి ప్రభుత్వంపై పెల్లుబికిన అసంతృప్తి

- పది రోజులు వరుస ధర్నాలు, ఆందోళనలు
- అంగన్‌వాడీ, ఆశా, వ్యవసాయ కార్మిక, ఉపాధి హామీ కూలీల నిరసనలు
- కూటమి హామీల అమలుకు డిమాండ్
- అసెంబ్లీ ఆత్మస్తుతి–పరనిందకు నిలయమైన నేపథ్యం

సాక్షి, అమరావతి: ప్రజాగళం వినిపించే ప్రతిపక్షానికి చోటు లేకుండా చేసి ఆత్మస్తుతి–పరనింద ధ్యేయంగా మారిన అసెంబ్లీ సమావేశాలు ఒకపక్క జరుగుతుండగా, మరోపక్క కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజలు చేసిన ఆందోళనకు విజయవాడ ధర్నాచౌక్ కేంద్రంగా నిలిచింది. ఉద్యోగ, అంగన్‌వాడీ, ఆశా, వ్యవసాయ కార్మిక, ఉపాధి హామీ కూలీలు సహా 20కిపైగా విభాగాలకు చెందిన సామాన్య ప్రజానీకం తమ సమస్యలను అసెంబ్లీ దృష్టికి తెచ్చేలా పది రోజులకుపైగా మండుటెండను సైతం లెక్క చేయకుండా సాగించిన ఉద్యమ హోరు కూటమి ప్రభుత్వంపై తక్కువ సమయంలోనే పెల్లుబికిన అసంతృప్తికి అద్దం పట్టింది. డిమాండ్లు నాలుగు నెలల్లోగా పరిష్కరించకుంటే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని ప్రజానీకం అల్టిమేటం ఇచ్చింది.



వెలుగు యానిమేటర్ల ఆందోళన



వ్యవసాయ కార్మికుల నిరసన

వెల్లువెత్తిన ఆందోళనలు..

- అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు వేతనాల పెంపు, గ్రాట్యుటీ, తదితర డిమాండ్స్ నెరవేర్చాలని మహాధర్నాను నిర్వహించారు.
- పెద్ద ఎత్తున ఫీజు పోరు, బకాయిల విడుదలకు ఆందోళన జరిగింది.
- ఆశా వర్కర్లు కనీస వేతనం నెలకు రూ.26 వేలతోపాటు పలు డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ ధర్నాకు దిగారు.
- వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని, నెలకు రూ.10వేలు వేతనం హామీని నిలబెట్టుకోవాలని మహాధర్నా జరిగింది.
- రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, ఐదు నెలలుగా ఉన్న వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ (వీఓఏ) ధర్నా నిర్వహించారు.
- కనీస వేతనాలు వర్తింపజేయాలని ఏపీ గ్రామ పంచాయతీ కార్మికులు ఉద్యమించారు.
- గ్రామ, వార్డు సచివాలయాల్లోని హెల్త్ సెక్రటరీలను వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేస్తూ ధర్నా జరిగింది.
- కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది పొట్టగొట్టేలా.. ఆప్కాస్ విధానం రద్దును విరమించుకోవాలని ఉద్యమించారు.
- ఆరు నెలల్లో సమస్య పరిష్కరించకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని అగ్రిగోల్డ్ బాధితులు అల్టిమేటం ఇచ్చారు.
- డప్పు కళాకారుల రిజిస్ట్రేషన్ పేరుతో పెన్షన్ తొలగించడంపై ధర్నా నిర్వహించారు.
- ఏపీఎస్ఆర్టీసీలో రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులకు నెలవారి పెన్షన్ రూ.10 వేలకు పెంచాలని కోరుతూ ధర్నా చేశారు.
- నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి ఆదుకోవాలంటూ కాటికాపరులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.
- మిలియపుట్టి సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ను ఏర్పాటు చేయాలని ఆదివాసీలు ధర్నా చేశారు.
- మెప్మా, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వర్కర్లు, ఉపాధి హామీ వర్కర్లు, మున్సిపల్ వర్కర్లు తదితర అనేక విభాగాలకు చెందిన వారు కూటమి ప్రభుత్వం హామీలిచ్చి మోసం చేసిందని ధర్నాచౌక్‌లో నినదించారు.

పత్తి ఉత్పత్తిలో ప్రతికూల మార్పులు

2024-25లో దేశవ్యాప్తంగా 10.46శాతం తగ్గిన సాగు విస్తీర్ణం

ఉత్పత్తిలో 7.98శాతం తగ్గుదల నమోదు

ఏడు నాన్ బీటీ, 54 బీటీ పత్తి రకాలకు ఆమోదం

జాతీయ వార్షిక పత్తి సమావేశాల్లో ఐసీఏఆర్ డీడీజీ డాక్టర్ డీకే యాదవ

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా 2024–25 వ్యవసాయ సీజన్‌లో పత్తి ఉత్పత్తి, ఉత్పాదకతలో ప్రతికూల మార్పులు నమోదయ్యాయని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐసీఏఆర్) క్రాప్ సైన్స్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ జనరల్(డీడీజీ) డాక్టర్ డీకే యాదవ తెలిపారు. గుంటూరు లాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న జాతీయ పత్తి వార్షిక సమావేశాల్లో భాగంగా రెండో రోజు శనివారం పత్తిపై ఆల్ ఇండియా కో–ఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్(ఏఐసీఆర్‌పీ) వార్షిక నివేదికను సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్(సీఐసీఆర్) క్రాప్ ప్రొటెక్షన్ విభాగాధిపతి డాక్టర్ గజానన్ టి.బహిరే సమర్పించారు. ఈ నివేదికపై డాక్టర్ డీకే యాదవ మాట్లాడుతూ 2024–25 వ్యవసాయ సీజన్‌లో జాతీయ స్థాయిలో పత్తి సాగు విస్తీర్ణంలో 10.46శాతం, ఉత్పత్తిలో 7.98శాతం తగ్గినట్లు తెలిపారు. మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ వంటి పలు రాష్ట్రాల్లో పత్తి ఉత్పత్తిలో ముఖ్య భూమిక పోషిస్తున్నాయని చెప్పారు. ఏపీలో మాత్రం పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతోందన్నారు. 2024–25 వ్యవసాయ సీజన్‌లో ఏడు నాన్ బీటీ, 54 బీటీ పత్తి రకాలు, హైబ్రీడ్ రకాలు పబ్లిక్, ప్రైవేట్ రంగాల నుంచి ఆమోదం పొందినట్టు వివరించారు. ఏఐ ఆధారిత డయోగ్నస్టిక్స్, ఫోర్కాస్టింగ్ సిస్టమ్స్, డ్రోన్ అప్లికేషన్స్‌పై దృష్టి పెట్టి కచ్చితమైన పురోగతిని సాధించాలన్నారు. కపాస్ క్రాంతి అనే మినీ మిషన్ ద్వారా రైతుల్లో పత్తి దిగుబడి, ఉత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఐసీఏఆర్ డీడీజీ యాదవ

ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రశాంతకుమార్ దాస్ మాట్లాడుతూ పత్తి ఉత్పత్తి నాణ్యత, స్వల్పకాల పంట రకాలు, వ్యర్థంలేని ఉత్పత్తిపై దృష్టి సారించాలన్నారు. పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, ఆధునిక సాంకేతిక, సెన్సార్స్, డ్రోన్ ఆధారిత సాగు పద్ధతులను అనుసంధానం చేసుకోవడం అవసరమన్నారు. పత్తి ప్రాజెక్ట్ మానిటరింగ్ అండ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ డాక్టర్ సీడీ మయి మాట్లాడుతూ రెండో పత్తి టెక్నాలజీ మిషన్ గురించి వివరించారు. ఈ సమావేశాల్లో బీటీ పత్తి ఎవాల్యూషన్ నివేదిక, ఆర్గానిక్ పత్తి ఉత్పత్తి సాంకేతికత గైడ్ వంటి ప్రచురణలను ఆవిష్కరించారు.

ఏపీలో టోల్‌ప్లాజాల ద్వారా రూ.13వేల కోట్ల ఆదాయం

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో 2019–24 మధ్య 72 టోల్‌ప్లాజాల నుంచి రూ.13,028.83 కోట్ల ఆదాయం వచ్చినట్లు కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ వెల్లడించింది. దేశంలో ఉన్న టోల్‌ప్లాజాల సంఖ్య, వాటి నుంచి ఐదేళ్లలో వచ్చిన ఆదాయం వంటి వివరాలపై ఇటీవల లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కేంద్రాన్ని ప్రశ్నించారు. దీనిపై కేంద్రమంత్రి గడ్కరీ రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. ఈ ఏడాది 20 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 72 టోల్‌ప్లాజాలు, తెలంగాణలో 36 టోల్‌ప్లాజాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఏపీలో 72 ప్లాజాల నుంచి రూ.13,028.83 కోట్లు ఆదాయం రాగా.. తెలంగాణలో రూ.7,245.21 కోట్లు వచ్చిందన్నారు.

ఏపీలో గత ఐదేళ్లలో టోల్‌ప్లాజాల ద్వారా వచ్చిన ఆదాయం.. (రూ.కోట్లలో)

ఏడాది	ఆదాయం
2019-20	1,925.47
2020-21	1,979.08
2021-22	2,435.23
2022-23	3,256.37
2023-24	3,432.68
మొత్తం	13,028.83

'ఉపాధి' నిధులతో పల్లె పుష్కరిణి

చెరువుల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమం

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామీణ ప్రాంతంలో చెరువుల అభివృద్ధికి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ 'పల్లె పుష్కరిణి' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ శనివారం మార్గదర్శకాలను జారీ చేశారు. కనీసం వెయ్యికి పైగా జనాభా ఉండే గ్రామాలు లేదా స్టేట్ హైవే, నేషనల్ హైవేలకు దగ్గరగా ఉన్న చెరువులను ఈ కార్యక్రమం కింద అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. మొదటి విడతలో మండలానికి ఒకటి లేదా రెండు చెరువుల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని పేర్కొన్నారు. చాలా గ్రామాల్లో పూర్వం నిర్మించిన కోనేర్లు, మేట బావుల్లో పూడిక తీసి, ఉపయోగంలోకి తీసుకొచ్చేలా 'కోనేరు అభివృద్ధి' పేరిట మరికొన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ కొత్త పనులకు సంబంధించి నెలాఖరులోగా పనుల గుర్తింపు పూర్తి చేసి, వచ్చే నెల 7వ తేదీన ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ఆమోదం తీసుకోవాలని, జూన్ నాటికి ఆ పనులను పూర్తి చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

రూర్కెలా నిట్‌లో స్పేస్ టెక్నాలజీ ఇంక్యుబేషన్ సెంటర్

సూళ్లూరుపేట: విద్యార్థుల్లో ప్రతిభను పెంపొందించి వినూత్న ఆలోచనల ద్వారా అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి దోహదపడేలా తీర్చిదిద్దేందుకు ఒడిశాలోని రూర్కెలాలో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో ఏర్పాటు చేసిన స్పేస్ టెక్నాలజీ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ శనివారం ప్రారంభించారు. ఇప్పటికే దేశంలో ఆరు స్పేస్ టెక్నాలజీ ఇంక్యుబేషన్ సెంటర్లు పనిచేస్తున్నాయని, రూర్కెలా నిట్‌లో మరో కొత్త సెంటర్‌ను ప్రారంభించినట్లు ఇస్రో తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ భవిష్యత్తు మిషన్లకోసం వినూత్న అంతరిక్ష సాంకేతికత అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని గుర్తించి, విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ తరహా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. రాబోయేది భారీ ప్రయోగాల యుగమేనని, దీనికి నేటి తరం యువకుల మేధస్సు అవసరమని అన్నారు. అందుకే ఇటువంటి కార్యక్రమాల ద్వారా యువతను ఇస్రోలో చేరే విధంగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఇస్రో శాస్త్రీయ కార్యదర్శి ఎం గణేశ్ పిళ్లై, నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు, మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ సారంగి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సమాచారం



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 64,170 మంది స్వామివారిని దర్శించుకోగా 26,821 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.98 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తిచేసింది.

శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ

రాపూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని పెంచలకోనలో శనివారం సాయంత్రం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి విశేషంగా అలంకరించారు. అనంతరం తిరుచ్చిపై కొలువుదీర్చారు. తదుపరి సహస్ర దీపాలంకరణ మండపానికి తరలించి ఊంజల్ సేవ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

నేత్రపర్వంగా పల్లకిసేవ

పొదలకూరు: శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పల్లకిసేవను శనివారం వేడుకగా నిర్వహించారు. విశేష అలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు చేశారు.

వైభవంగా గంధమహోత్సవం

అనుమసముద్రంపేట: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఏఎస్‌పేటలోని హజరత్ సయ్యద్ ఖాజా అబ్దుల్ హఫీజ్ పాషాఖాద్రి దర్గాలో గంధ మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తొలుత గంధంతో ఊరేగింపుగా హఫీజ్ పాషా ఖాద్రి దర్గా నుంచి హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాకు చేరుకున్నారు. అక్కడ అమ్మాజాన్, అబ్బాజాన్ సమాధులకు గంధం లేపనం చేశారు. అనంతరం హఫీజ్ పాషా ఖాద్రి దర్గాకు చేరుకుని భక్తులకు గంధం వంచిపెట్టారు.

ద్వారకాతిరుమలలో తగ్గిన రద్దీ

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని శ్రీవారి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నామమాత్రంగా ఉంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు అయినప్పటికీ పదో తరగతి పరీక్షలు జరుగుతుండటం, అందులోనూ అష్టమి తిథి కావడంతో భక్తుల రద్దీపై ఎఫెక్ట్ పడింది. దీంతో ఆలయ అనివేటి మండపం, తూర్పు రాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాల్లో భక్తుల సంఖ్య స్వల్పంగా కనిపించింది.

మద్దిలో పూజలు



జంగారెడ్డి గూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెం మండలం గురవాయి గూడెం గ్రామంలో కొలువైన శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తికి అర్చక స్వాములు పంచామృత అభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతి శనివారం నిర్వహించే అభిషేక సేవలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యా సమాచారం



తెలుగు సాహిత్యానికి పోతన దిక్సూచి

పలమనేరు : నేను, నీవు అనే భేదాలను విడిస్తే జీవితం ఉన్నతంగా ఉంటుందని భాగవతం ద్వారా మానవాళికి సూచించిన మహోన్నతుడు పోతన అని యోగి వేమన విశ్వ విద్యాలయం తెలుగు విభాగం ఆచార్యులు ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భాగవతం-భక్తి, తాత్వికత, సామాజికత అనే అంశంపై జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యానికి జీవం పోసిన పోతన మన తెలుగు గడ్డపై పుట్టడం మన అదృష్టమన్నారు. మనిషికి సత్యం, దయ గుణాలు చాలా అవసరమని తెలిపారన్నారు.

మహిళా వర్సిటీలో బయోసైన్స్ ఇన్నోవేషన్

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలో డీబీటీ బిల్డర్ బయోసైన్స్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్‌ను శనివారం నిర్వహించారు. స్టార్టప్‌లో సాంకేతికతను ఉపయోగించుకునే విధానం, నూతన ఆవిష్కరణ కోసం వనరుల సేకరణ, ఆవిష్కరణల ప్రచురణ వంటి విషయాలపై అతిథులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజిని, చెన్నై ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ దినకర్‌రావు, ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్ర వేత్త కదిరి మోహన్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పి.ఉమ మహేశ్వరి దేవి, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ శ్రీదేవి, ప్రొఫెసర్ ఆర్.ఉష పాల్గొన్నారు

విద్యార్థినులకు సైబర్ వైలెన్స్‌పై అవగాహన



తిరుపతి సిటీ: పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల మహిళా సాధికారత విభాగం, ఎస్వీయూ మహిళా అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఎస్పీడబ్ల్యూ కళాశాలలో సైబర్ వైలెన్స్ అండ్ డిజిటల్ ఎక్స్‌టెన్షన్ ఆఫ్ అబ్యూస్ అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ మాట్లాడుతూ సాంకేతికతను అవసరమైనంత మేర మాత్రమే ఉపయోగించాలని విద్యార్థులకు సూచించారు. సైబర్ వైలెన్స్ అండ్ డిజిటల్ దుర్వినియోగాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఇమేజెస్ మార్పులు వంటివి జరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

అల్లు అర్జున్ ద్విపాత్రాభినయం?



హీరో అల్లు అర్జున్–దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో ఓ భారీ బడ్జెట్ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఆగస్టులో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాలని టీమ్ ప్లాన్ చేస్తోందనే టాక్ వినిపిస్తోంది. అంతే కాదు... ఈ మూవీలో అల్లు అర్జున్ తొలిసారిగా ద్విపాత్రాభినయం చేయనున్నారని, ఓ రోల్‌లో నెగటివ్ షేడ్స్ ఉంటాయని టాలీవుడ్ భోగట్టా. ఇంకా ఈ సినిమాలో ఐదుగురు హీరోయిన్లు ఉంటారని, లీడ్ హీరోయిన్‌గా జాన్వీ కపూర్ కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. కాగా ఏప్రిల్ 8న అల్లు అర్జున్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

ప్రభాస్‌కి అన్నయ్యగా..?

ప్రభాస్ వరుస పాన్ ఇండియా సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఆయన హీరోగా సందీప్ రెడ్డి వంగా 'స్పిరిట్' అనే సినిమా తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ప్రధాన పాత్రలో నటించనున్నారట. అది కూడా ప్రభాస్‌కి అన్నయ్య పాత్రలో ఆయన కనిపించనున్నారని టాక్. తనదైన యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమాని తీర్చిదిద్దనున్నారట సందీప్. ఈ మూవీలో తొలిసారిగా పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించనున్నారు ప్రభాస్. ఇందులో యాక్షన్ ఓ రేంజ్‌లో ఉంటుందని భోగట్టా. పాన్ ఇండియా స్థాయిలో ఈ మూవీ రూపొందనుంది. బాలీవుడ్‌లో సంజయ్ దత్‌కి ఉన్న క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకుని ప్రభాస్‌కి అన్నయ్యగా ఆయన్ని తీసుకోనున్నారట సందీప్. ప్రభాస్ బాడీ లాంగ్వేజ్‌కి సంజయ్ అయితే పక్కాగా సరితూగుతారన్నది దర్శకుడి ఆలోచనట. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని టాక్. మరి 'స్పిరిట్'లో సంజయ్ దత్ భాగం అవుతారా? లేదా అన్నది తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాలి.



● సంజయ్ దత్

అప్పుడు కేకలు వేశాను

- షాలినీ పాండే



''నా కెరీర్ ప్రారంభంలో దక్షిణాదిలో ఒక మూవీ షూటింగ్‌లో ఉన్నాను. ఒకసారి షాట్ గ్యాప్‌లో కారవాన్‌లో దుస్తులు మార్చుకుంటున్న సమయంలో నా అనుమతి లేకుండా ఓ డైరెక్టర్ తలుపు తెరిచి లోపలికి వచ్చాడు. కోపంతో నేను గట్టిగా కేకలు వేయడంతో వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయాడు'' అని హీరోయిన్ షాలినీ పాండే పేర్కొన్నారు. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'అర్జున్ రెడ్డి' (2017) సినిమా ద్వారా తెలుగు సినీ పరిశ్రమకి పరిచయమయ్యారు షాలినీ పాండే. ఆ మూవీ ద్వారా యువ ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టిన ఆమె ప్రస్తుతం హిందీ సినిమాలతో బిజీగా ఉన్నారు. 'డబ్బా కార్టెల్' అనే వెబ్ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో షాలినీ పాండే మాట్లాడుతూ– ''కారవాన్‌లో నేను అలా కోపంగా డైరెక్టర్‌పై అరవడం కరెక్ట్ కాదని చుట్టూ ఉన్నవాళ్లు నాతో అన్నారు. నేను తప్పు చేశానని చెప్పే ప్రయత్నం చేశారు. కానీ, నాకు మాత్రం నేను చేసింది తప్పుకాదు.. సరైనదే అనిపించింది. ఆ తర్వాత నాకెప్పుడూ అటువంటి ఘటనలు ఎదురుకాలేదు. ఒకవేళ ఇప్పుడు ఎదురైనా కోప్పడకుండా వారికి ఏ విధంగా జవాబు చెప్పాలో నాకు తెలుసు'' అని పేర్కొన్నారు. షాలినీ పాండే వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక తమిళంలో ధనుష్‌తో 'ఇడ్లీ కడై' అనే సినిమా చేస్తున్నారు షాలినీ పాండే.

ఒకటికి రెండు



తెలుగు సినిమాల గురించి అంతర్జాతీయ స్థాయిలో మాట్లాడుకుంటున్నారు. 'బాహుబలి, ఆర్ఆర్ఆర్, సలార్, కల్కి 2898 ఏడీ, దేవర, పుష్ప' వంటి చిత్రాల విజయాలు అందుకు కారణంగా చెప్పుకోవచ్చు. అయితే ఈ సినిమాలన్నింటిలోని కామన్ పాయింట్ ఏంటంటే... ఈ సినిమా కథలన్నీ భారీ స్థాయిలో ఉన్నాయి. అందుకే ఒకటి కాదు... రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకొచ్చాయి. ఈ సినిమాలన్నీ సూపర్‌హిట్ అయ్యాయి. దీంతో ప్రస్తుతం ఒకటికి రెండు ట్రెండ్ టాలీవుడ్‌లో ఊపందుకుంది. భారీ కథలు ఎంపిక చేసుకుని, ఆ కథను పలు భాగాలుగా ఆడియన్స్‌కు చూపిస్తున్నారు మేకర్స్. ఈ కోవలో పెద్ద కథలతో రానున్న కొన్ని చిత్రాల గురించి తెలుసుకుందాం.

ఉగాదికి రిలీజ్

హీరో మహేశ్‌బాబు–దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో ఓ అంతర్జాతీయ స్థాయి సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంకా చోప్రా ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ ఫిల్మ్ చిత్రీకరణ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాకి సంబంధించిన ఓ షెడ్యూల్‌ను ఇటీవలే ఒడిశాలోని కోరాపుట్‌లో పూర్తి చేశారు. నెక్ట్స్ షెడ్యూల్‌ను విదేశాల్లో ప్లాన్ చేశారు. కాగా దక్షిణాఫ్రికా, కెన్యా దేశాల్లో ఈ మూవీ చిత్రీకరణ జరగనుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఇదిలా ఉంటే... ఈ సినిమా రెండు భాగాలుగా రానుందని, తొలి భాగం 2026 చివర్లో లేదా 2027 ఉగాది సమయంలో ప్రేక్షకుల ముందుకు రావొచ్చనే టాక్ వినిపిస్తోంది. గతంలో రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా చేసిన 'బాహుబలి' సినిమా 'బాహుబలి: ది బిగినింగ్, బాహుబలి: ది కన్‌క్లూజన్' అంటూ రెండు భాగాలుగా వచ్చి, బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఇక రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు కెరీర్‌లోని ఈ 29వ సినిమాను దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఒకవేళ ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలైతే, మహేశ్‌బాబు కెరీర్‌లో రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన తొలి చిత్రం ఇదే అవుతుంది.

ఈ ఏడాదిలోనే రాజా సాబ్

'బాహుబలి' తర్వాత ప్రభాస్ హీరోగా చేసే సినిమాలు భారీ స్థాయిలో చిత్రీకరణ జరుపుకుంటున్నాయి. రెండు భాగాలుగా వచ్చిన 'బాహుబలి' సినిమా బ్లాక్‌బస్టర్ సాధించడంతో ప్రభాస్ నెక్ట్స్ సినిమాలు కూడా భారీ స్థాయిలో రూపొందుతున్నాయి. ప్రస్తుతం ప్రభాస్ హీరోగా చేస్తున్న 'కల్కి 2898 ఏడీ, సలార్' చిత్రాలు ఫ్రాంచైజీలుగా రానున్నాయి. ఈ రెండు సినిమాల తొలి భాగం ప్రేక్షకుల ముందుకు వచ్చి, సూపర్‌హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. మలి భాగాల చిత్రీకరణకు ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. అయితే ప్రభాస్ హీరోగా చేస్తున్న మరో సినిమా 'రాజా సాబ్' కథ కూడా పెద్దదే. ఈ హారర్ కామెడీ సినిమాకు మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ మూడేళ్లుగా కొనసాగుతోంది. మూడు తరాలు, ఆ తరాలకు చెందిన ఆత్మలు, హారర్ ఎలిమెంట్స్ వంటి అంశాలతో 'రాజా సాబ్' మూవీ రెండు భాగాలుగా రానుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ చిత్రంలో ప్రభాస్ డ్యూయెల్ రోల్ చేస్తున్నారు. ఇప్పటికే 'రాజా సాబ్' సినిమా నుంచి ప్రభాస్‌కు చెందిన రెండు డిఫరెంట్ లుక్స్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సంజయ్ దత్ మరో ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లుగా తెలిసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏప్రిల్ 10న రిలీజ్ కావాల్సింది. కానీ కొంత టాకీ పార్టు, సాంగ్స్ షూట్, వీఎఫ్ఎక్స్... వంటివి పెండింగ్ ఉండటంతో 'రాజా సాబ్' సినిమా రిలీజ్ వాయిదా పడనుంది. ఈ సినిమా ఈ ఏడాది సెప్టెంబరులో రిలీజ్ కానుందని సమాచారం.

వీరమల్లు

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న హిస్టారికల్ మూవీ 'హరిహర వీరమల్లు'. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగంగా 'హరిహర వీరమల్లు: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' మే 9న విడుదల కానుంది. 17వ శతాబ్దంలో జరిగే ఈ కథలో పవన్ కల్యాణ్ కథ రీత్యా ఓ దొంగ తరహా పాత్రలో కనిపిస్తారని తెలిసింది. ఈ మూవీలో నిధీ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సత్యరాజ్, బాబీ డియోల్ ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయింది. డబ్బింగ్ పనులూ మొదలయ్యాయి. ఏఎమ్ రత్నం, అద్దంకి దయాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కీరవాణి స్వరకర్త.

కింగ్‌డమ్

విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'కింగ్‌డమ్'. ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారట విజయ్ దేవరకొండ. ఈ చిత్రంలో విజయ్ క్యారెక్టర్లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని తెలిసింది. ఈ సినిమాను రెండు భాగాలుగా రిలీజ్ చేయనున్నామని ఈ చిత్రనిర్మాతల్లో ఒకరైన సూర్యదేవర నాగవంశీ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. తొలి భాగం మే 30న రిలీజ్ కానుంది. ఈ పీరియాడికల్ ఇంటెన్స్ యాక్షన్ ఫిల్మ్‌లో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారని సమాచారం. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ స్వరకర్త.

కోహినూర్ వజ్రం కోసం...

'డీజే టిల్లు' ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా రూపొందనున్న హిస్టారికల్ ఫిల్మ్ 'కోహినూర్'. 'ది కింగ్ విల్ బ్రింగ్ ఇట్ బ్యాక్' అనేది క్యాప్షన్. గత ఏడాది దసరా సందర్భంగా ఈ సినిమాను ప్రకటించారు. ఈ సినిమాకు రవికాంత్ పేరెపు దర్శకత్వం వహించనున్నారని, 2026 జనవరిలో ఈ సినిమాను రిలీజ్ చేయనున్నామని కూడా అప్పట్లో మేకర్స్ వెల్లడించారు. కోహినూర్ వజ్రాన్ని తిరిగి తీసుకు రావడం అనే అంశం నేపథ్యంలో ఈ మూవీ ఉంటుంది. 'భద్రకాళి దేవత మహిమగల వజ్రం సామ్రాజ్యవాదుల చేతుల్లోకి వెళ్లింది. కోహినూర్ వజ్రాన్ని తిరిగి మూలాలకు తీసుకు రావడానికి ఓ యువకుడు సాగించే, చారిత్రాత్మక ప్రయాణం నేపథ్యంలో ఈ మూవీ కథ ఉంటుంది'' అని ఈ మూవీ గురించి మేకర్స్ పేర్కొన్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇక హీరో సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు రవికాంత్ కాంబినేషన్‌లో 'క్షణం, కృష్ణ అండ్ హీజ్ లీల' చిత్రాలు వచ్చాయి. ఇప్పుడు వీరి కాంబినేషన్లో మూడో చిత్రంగా 'కోహినూర్' తెరకెక్కనుంది.

ఏటిగట్టు కథలు

హీరో సాయిదుర్గా తేజ్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న పీరియాడికల్ మాస్ ఇంటెన్స్ యాక్షన్ ఫిల్మ్ 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్ కేపీని దర్శకత్వంలో కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమాను దాదాపు రూ. 125 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్నారు. రాయలసీమ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది. ఈ యాక్షన్ ఫిల్మ్ కోసం విదేశాల్లో ప్రత్యేకమైన ట్రైనింగ్ తీసుకున్నారు సాయిదుర్గా తేజ్. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇంకా ఈ మూవీలో సంజయ్ దత్ మరో లీడ్ రోల్ చేస్తున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. కాగా ఈ మూవీ కూడా రెండు భాగాలుగా విడుదల కానుందని తెలిసింది. తొలి భాగం సెప్టెంబరు 25న రిలీజ్ కానుంది. 'కాంతార' ఫేమ్ అజనీష్ లోకనాథ్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

స్వయంభూ

నిఖిల్ నటిస్తున్న హిస్టారికల్ అండ్ సోషియో ఫ్యాంటసీ ఫిల్మ్ 'స్వయంభూ'. భరత్ కృష్ణమాచారి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. సంయుక్త, నభా నటేష్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో, భారీ స్థాయిలో ఈ మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో సునీల్ ఓ సర్‌ప్రైజింగ్ క్యారెక్టర్లో కనిపించనున్నారని తెలిసింది. కాగా ఈ మూవీ చిత్రీకరణ 95 శాతం పూర్తయినట్లుగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు నిఖిల్. 'ఠాగూర్' మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ మూవీ రెండు భాగాలుగా విడుదల కానుందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో ప్రచారం సాగుతోంది. తొలి భాగాన్ని ఈ ఏడాదిలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. విడుదల తేదీపై త్వరలోనే ఓ స్పష్టత రానుంది. ఇక ఈ చిత్రం కోసం మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీ వంటి విద్యల్లో నిఖిల్ ప్రత్యేక శిక్షణ తీసుకున్న సంగతి తెలిసిందే.

మిరాయ్ సాహసాలు

'హను–మాన్'తో భారీ బ్లాక్‌బస్టర్ హిట్‌ను సాధించారు హీరో తేజ సజ్జా. ఆ మూవీ తర్వాత తేజ సజ్జా చేస్తున్న మరో మూవీ 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆధ్యాత్మిక అంశాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ ఫ్యాంటసీ యాక్షన్ థ్రిల్లర్ మూవీలో మంచు మనోజ్ విలన్ రోల్ చేస్తున్నారు. ఈ సినిమాలో తేజ సజ్జా సాహసాలు, యాక్షన్ సీక్వెన్స్ సూపర్‌గా ఉంటాయట. కాగా 'మిరాయ్' చిత్రం రెండు భాగాలుగా రూపొందుతున్నట్లుగా తెలిసింది. ఈ సినిమాను ఈ ఆగస్టు 1న రిలీజ్ చేయనున్నట్లుగా గతంలో మేకర్స్ ప్రకటించారు. సో... ఆ రోజున 'మిరాయ్' సినిమా తొలి భాగం విడుదల కావొచ్చని ఊహించవచ్చు.

ఇలా రెండు భాగాలుగా విడుదల కానున్న సినిమాలు మరికొన్ని ఉన్నాయి.

- ముసిమి శివాంజనేయులు

బిజినెస్ రీల్

సమిష్టిగా కొత్త సొల్యూషన్స్ రూపొందించాలి

కేంద్ర ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్



న్యూఢిల్లీ: ప్రతి పనీ ప్రభుత్వమే పూనుకుని చేయాలనే పాత ఆలోచనా ధోరణులను విడిచి పెట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వ్యాఖ్యానించారు. విద్యావేత్తలు, స్టార్టప్‌లు, విద్యార్థులు, పరిశోధకులు సమిష్టిగా కొత్త సొల్యూషన్స్‌ని రూపొందించాలని ఆయన సూచించారు. అద్భుతంగా రాణిస్తున్న సేవల రంగం ఇకపైనా అభివృద్ధి చెందాలని, అదే సమయంలో తయారీ రంగం కూడా పురోగమించాలని పేర్కొన్నారు. దేశీ వెబ్ బ్రౌజర్, చిప్స్ టు స్టార్టప్ (సీ2ఎస్) ప్రోగ్రాం విజేతలకు పురస్కారాలు అందించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. టీమ్ జోహోకు ప్రథమ బహుమతి కింద రూ. 1 కోటి, టీమ్ పింగ్‌కు ద్వితీయ బహుమతిగా రూ. 75 లక్షలు, టీమ్ ఆజ్ఞకు తృతీయ బహుమతిగా రూ. 50 లక్షలు అందించారు.

విక్కీ కౌశల్‌తో టాటా మోటర్స్ జట్టు



న్యూఢిల్లీ: బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్లు ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ వెల్లడించింది. తమ ప్యాసింజర్, ఎలక్ట్రిక్ వాహనాల శ్రేణి ప్రచారానికి ఆయన తోడ్పడనున్నట్లు తెలిపింది. ఐపీఎల్ సీజన్ సందర్భంగా కొత్త టాటా కర్వ్ ప్రచార కార్యక్రమంతో ఈ భాగస్వామ్యం ప్రారంభమవుతుందని వివరించింది. ఇందు కోసం 20 సెకన్ల నిడివితో 'టేక్ ది కర్వ్' పేరిట ప్రకటనలు రూపొందించినట్లు సంస్థ పేర్కొంది.

చీఫ్ గేమింగ్ ఆఫీసర్ కోసం ఐక్యూ అన్వేషణ



హైదరాబాద్: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ ఐక్యూ తాజాగా 2025 సంవత్సరానికి చీఫ్ గేమింగ్ ఆఫీసర్ (సీజీవో) పోస్టు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దీనికి ఎంపికైనవారికి రూ. 10 లక్షల భారీ పారితోషికం ఉంటుందని సంస్థ తెలిపింది. 18–25 ఏళ్ల మధ్య వయస్సున్న యువ గేమర్లు మార్చి 30లోపు దరఖాస్తు చేసుకోవచ్చని సంస్థ సీఈఓ నిపుణ్ మార్యా తెలిపారు. కొత్త స్మార్ట్‌ఫోన్ల అభివృద్ధిలో భాగం కావడం, బ్రాండ్ ఈ–స్పోర్ట్స్ వ్యూహాన్ని నడిపించడం, దేశీయంగా టాప్ ఈ–స్పోర్ట్స్ గేమర్లతో కలిసి పని చేయడం మొదలైనవి సీజీవో బాధ్యతలుగా ఉంటాయి.

యస్ బ్యాంకుతో డీపీఐఐటీ జట్టు

న్యూఢిల్లీ: ప్రారంభ దశలోని అంకుర సంస్థలకు నిధులు, మౌలిక సదుపాయాల లభ్యతను పెంచే దిశగా ప్రైవేట్ రంగ యస్‌బ్యాంకుతో కేంద్ర పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) ఒప్పందం కుదుర్చుకుంది. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు, దేశవ్యాప్తంగా ప్రోడక్ట్ స్టార్టప్‌లు, ఆవిష్కర్తలు, ఔత్సాహిక వ్యాపారవేత్తలకు కీలక సహాయాన్ని అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపింది. అంకుర సంస్థల అవసరాలకు అనుగుణమైన బ్యాంకింగ్ సేవలను అందించే యస్ బ్యాంక్‌కి చెందిన హెడ్‌స్టార్టప్ ప్రోగ్రాంతో స్టార్టప్‌లు లబ్ధి పొందవచ్చని వివరించింది. అటు తయారీ, ఐటీ రంగాల్లోని స్టార్టప్‌లకు డిజిటల్, జనరేటివ్ ఏఐ సొల్యూషన్స్‌పరమైన సహాయాన్ని అందించేందుకు కిండ్రిల్ సొల్యూషన్స్‌తో కూడా డీపీఐఐటీ ఒప్పందం కుదుర్చుకుంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-3-2025

విశాఖ	420-00
చిత్తూరు	470-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	420-00
విజయవాడ	440-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	420-00
వరంగల్	422-00
రిటైల్ ధర	4.80

2030 నాటికి 500 బిలియన్ డాలర్లు

- భారత్–అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యం
- ట్రంప్ సలహాదారు మార్క్ బర్న్స్ వెల్లడి
- యూఎస్‌జీసీఐ ఇండియా చాప్టర్ ప్రారంభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ద్వైపాక్షిక వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకోవడంపై భారత్–అమెరికా మరింతగా కసరత్తు చేస్తున్నాయి. 2023లో సుమారు 190 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్యాన్ని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని నిర్దేశించుకున్నాయి. ఆ దిశగా ఇరు దేశాలు పరస్పరం కొనుగోళ్లు, పెట్టుబడులను మరింతగా పెంచడంపై దృష్టి పెడుతున్నాయి. యునైటెడ్ స్టేట్స్ గ్లోబల్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (యూఎస్‌జీసీఐ) ఇండియన్ చాప్టర్‌ను అధికారికంగా ప్రారంభించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాదారు మార్క్ బర్న్స్ ఈ విషయాలు తెలిపారు. ఇరు దేశాల భాగస్వామ్యం .. అసాధారణ వృద్ధి, కొత్త ఆవిష్కరణలకు తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు. మిషన్ 500 కింద ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచుకోవడంతో పాటు వ్యూహాత్మక పెట్టుబడులకు ఇరు దేశాలు పెద్ద పీట వేస్తున్నాయన్నారు. భారత్ సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో 54 శాతం అమెరికాకే ఉంటున్నాయని చెప్పారు. అలాగే జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందాల్కో వంటి దేశీ దిగ్గజాలు తమ దగ్గర, మైక్రోసాఫ్ట్.. గూగుల్ వంటి అమెరికన్ దిగ్గజాలు భారత్‌లోను భారీగా ఇన్వెస్ట్ చేస్తున్నాయని మార్క్ వివరించారు.

టారిఫ్‌లపై క్రియాశీలకంగా భారత్..

వివాదాస్పదమైన టారిఫ్‌లపై స్పందిస్తూ.. ఈ విషయంలో భారత్ క్రియాశీలక చర్యలు తీసుకుందని మార్క్ చెప్పారు. ఇప్పటికే కొన్ని రంగాల్లో టారిఫ్‌లను తగ్గించడం ప్రారంభించిందని, మరిన్ని అంశాల్లో మధ్య సంప్రదింపులు జరుగుతున్నాయని ఆయన వివరించారు. అమెరికా నుంచి భారత్ మరింతగా ఆయిల్, గ్యాస్ మొదలైనవి కొనుగోలు చేయనుండగా, కీలకమైన మరిన్ని మిలిటరీ ఉత్పత్తులను అమెరికా అందించనుందని మార్క్ చెప్పారు.

యూఎస్ఏఐడీ స్థానంలో యూఎస్‌జీసీఐ..

ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ఏర్పాటైన యుఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్ఏఐడీ) కొనసాగింపుపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో దాని స్థానాన్ని భర్తీ చేసేందుకు యూఎస్‌జీసీఐ ఉపయోగపడనుంది. యూఎస్ఏఐడీ సహాయం నిలిపివేతతో నిల్చిపోయిన ప్రాజెక్టులను టేకోవర్ చేయడంపై ఇది దృష్టి పెడుతుందని యూఎస్‌జీసీఐ సహ వ్యవస్థాపకుడు ఘజన్‌ఫర్ అలీ తెలిపారు. ఇది గ్రాంట్ల మీద ఆధారపడకుండా కార్పొరేట్లు, ప్రభుత్వాల భాగస్వామ్యం దన్నుతో పనిచేస్తుందని ఆయన వివరించారు. యూఎస్ఏఐడీ కింద ఏటా 20 బిలియన్ డాలర్లు వ్యయం చేస్తుండగా, ప్రస్తుతం 130 పైచిలుకు దేశాల్లో తత్సంబంధిత ప్రాజెక్టులు దాదాపుగా నిల్చిపోయినట్లు పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏర్పాటైన తమ సంస్థ, ఈ ప్రాజెక్టులను పునరుద్ధరించేందుకు కృషి చేయనుందని వివరించారు.

ఇప్పటికే 40 పైగా దేశాలు తమ వద్ద కూడా చాప్టర్లు ఏర్పాటు చేయాలని ఆహ్వానించినట్లు చెప్పారు. యూఎస్ఏఐడీ ప్రభావిత ప్రాజెక్టులు ఎక్కువగా ఉన్న మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, ఆగ్నేయాసియా ప్రాంత దేశాల్లోని ప్రభుత్వాలు, కార్పొరేషన్లు, ఇన్వెస్టర్లతో సంప్రదింపులు జరుపుతున్నట్లు అలీ చెప్పారు. భారత్‌లో యూఎస్‌జీసీఐ ప్రయత్నాలు విజయవంతమైతే మిగతా దేశాల్లోనూ పునరావృతం చేసేందుకు బ్లూప్రింట్‌గా ఉపయోగపడుతుందన్నారు.



యూఎస్‌జీసీఐ ఇండియా చాప్టర్ ప్రారంభ కార్యక్రమంలో అపోలో మెడ్‌స్కిల్స్ సీఈవో శ్రీనివాస్ రావు పులిజల, ట్రంప్ సలహాదారు మార్క్ బర్న్స్, యూఎస్‌జీసీఐ ఇండియా చాప్టర్ ఫౌండర్ సోలొమన్ గట్టు తదితరులు (ఎడమ నుంచి)

5 బిలియన్ డాలర్ల సమీకరణ

వచ్చే అయిదేళ్లలో 5 బిలియన్ డాలర్ల సామాజిక పెట్టుబడులను సమీకరించాలని యూఎస్‌జీసీఐ నిర్దేశించుకున్నట్లు అలీ చెప్పారు. అలాగే నిర్మాణాత్మక పెట్టుబడుల ద్వారా అమెరికా–భారత్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 20–30 శాతం వృద్ధి చెందగలదని, ప్రాజెక్టుల పునరుద్ధరణతో 5,00,000 పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాల కల్పన జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, టెక్నాలజీ, తయారీ, ఇంధనం వంటి కీలక రంగాల్లో విదేశీ పెట్టుబడులు గణనీయంగా పెరుగుతాయని అలీ వివరించారు. యూఎస్‌జీసీఐకి భారత్ కీలక హబ్‌గా నిలవగలదని ఆయన చెప్పారు.

ఏఎంసీ ఉద్యోగులకు ఊరట

- సొంత పథకాల్లో పెట్టుబడుల పరిమితి తగ్గింపు
- నిబంధనల వెసులుబాటు కల్పించిన సెబీ



న్యూఢిల్లీ: అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల్లో (ఏఎంసీలు/మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ సంస్థలు) పనిచేసే ఉద్యోగులకు సెబీ నిబంధనల పరంగా ఊరట కల్పించింది. ముఖ్య నిర్వహణ అధికారి (సీఈవో), ముఖ్య పెట్టుబడుల అధికారి (సీఐవో), ఫండ్ మేనేజర్లు తదితర ఎంపిక చేసిన కీలక ఉద్యోగులు తమ వార్షిక వేతనంలో 20 శాతం మేర తమ సంస్థ నిర్వహిస్తున్న మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లోనే ఇన్వెస్ట్ చేయాలని ప్రస్తుత నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. అంతేకాదు ఇలా చేసిన పెట్టుబడులకు మూడేళ్ల పాటు లాకిన్ ఉంటుంది. దీన్నే 'స్కిన్ ఇన్ ద గమ్'గా చెబుతారు. ఏప్రిల్ 1 నుంచి ఈ నిబంధనల అమలులో కొంత ఉపశమనాన్ని సెబీ కల్పించింది. స్థూల వార్షిక పారితోషికం ఆధారంగా మ్యూచువల్ ఫండ్స్ సంస్థల ఉద్యోగులు సొంత నిర్వహణ పథకాల్లో చేయాల్సిన పెట్టుబడుల శాతంలో మార్పులు చేసింది. మ్యూచువల్ ఫండ్స్ ఉద్యోగుల నైతిక నడవడిక, సొంత పథకాల నిర్వహణలో బాధ్యతను పెంచడం, ఇన్వెస్టర్ల ప్రయోజనాల పరిరక్షణ ఇందులోని ఉద్దేశ్యాలుగా ఉన్నాయి.

కొత్త నిబంధనలు..

- కొత్త నిబంధనల కింద రూ.25 లక్షలకు మించని వేతనం ఉన్న వారు సొంత మ్యూచువల్ ఫండ్స్ సంస్థ పథకాల్లో ఇన్వెస్ట్ చేయాల్సిన అవసరం లేదు.
- రూ.25 లక్షలకు మించి ఆదాయం ఉన్న వారు 10 శాతం ఇన్వెస్ట్ చేయాలి. ఇసాప్‌లు/ఉద్యోగ స్టాక్ ఆప్షన్లు కూడా కలుపుకుంటే 12.5% పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది.
- రూ.50 లక్షల నుంచి రూ.కోటి మధ్య వేతనం ఉన్న వారు కనీసం 14 శాతం మేర (ఒకవేళ స్టాక్ ఆప్షన్లు కూడా ఉంటే 17.5 శాతం) పెట్టుబడులు పెట్టాలి.

స్నోఫ్లేక్‌తో నాస్కామ్ జట్టు

న్యూఢిల్లీ: డేటా, కృత్రిమ మేధ (ఏఐ) నైపుణ్యాల్లో శిక్షణనిచ్చే దిశగా నాస్కామ్, ఎలక్ట్రానిక్స్..ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ఏర్పాటు చేసిన ఫ్యూచర్‌స్కిల్స్ ప్రైమ్‌తో ఏఐ డేటా క్లౌడ్ కంపెనీ స్నోఫ్లేక్ జట్టు కట్టింది. ఈ ఒప్పందంతో వచ్చే రెండేళ్లలో ఒక లక్ష మంది నిపుణులు, విద్యార్థులు స్నోఫ్లేక్‌కి చెందిన ఉచిత, ఆన్–డిమాండ్, ఎంట్రీ స్థాయి డేటా, ఏఐ కోర్సులను అభ్యసించేందుకు వీలవుతుంది. అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులతో పాటు కెరియర్‌లో పురోగతికి వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కి ఈ కోర్సులు అందుబాటులో ఉంటాయి.

రియల్టీ లావాదేవీల్లో పారదర్శకంగా ఉండాలి

- వ్యాపార కార్యకలాపాలపై విశ్వాసం పెరగాలి
- రియల్టీ ఏజెంట్లకు కేంద్ర మంత్రి ఖట్టర్ సూచన



న్యూఢిల్లీ: భారత రియల్ ఎస్టేట్ రంగ వృద్ధికి వీలుగా.. కార్యకలాపాల్లో విశ్వాసం, పారదర్శకత ఉండేలా చూడాలని ఈ రంగానికి చెందిన ఏజెంట్లకు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ సూచించారు. 2030 నాటికి రియల్ ఎస్టేట్ మార్కెట్ రూ.85 లక్షల కోట్లకు చేరుకోనుందన్న అంచనాను ప్రకటించారు.. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్ ఇండియా (నార్–ఇండియా) వార్షిక సమావేశంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి మాట్లాడారు. అంతర్జాతీయంగా అత్యుత్తమ ప్రమాణాలను, కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలని పరిశ్రమను కోరారు. నార్–ఇండియాలో 50వేల మంది ఏజెంట్లు సభ్యులుగా ఉన్నారు. రియల్ ఎస్టేట్ రంగం వృద్ధిలో ఏజెంట్ల పాత్రను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. డెవలపర్లు, వినియోగదారుల మధ్య వీరు కీలక వారధిగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఏజెంట్ల సూచలను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు. 2016లో రెరాను తీసుకురావడాన్ని అద్భుత సంస్కరణగా పేర్కొన్నారు. డెవలపర్లు, కొనుగోలుదారుల మధ్య వివాదాల నివారణకు దీన్ని తీసుకొచ్చారు. అలాగే, రియల్ ఎస్టేట్‌లోకి నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడం, వ్యాపార సులభతర నిర్వహణకు తీసుకున్న చర్యలను ప్రస్తావించారు. 2047 నాటికి దేశ జనాభాలో సగం మంది పట్టణాల్లోనే నివసించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇది 35 శాతంగా ఉంది.



జీసీసీల్లో 10% వేతనాల వృద్ధి ..

- వచ్చే 12 నెలల్లో అంచనా
- 2030 నాటికి 110 బిలియన్ డాలర్లకు దేశీ జీసీసీ మార్కెట్
- ఎన్ఎల్‌బీ సర్వీసెస్ నివేదిక

న్యూఢిల్లీ: ప్రతిభావంతులైన ఉద్యోగులు వెళ్లిపోకుండా అట్టే పెట్టుకోవడం, స్థూల ఆర్థిక సమస్యలను అధిగమించడం తదితర సవాళ్ల నేపథ్యంలో దేశీయంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) మెరుగైన వేతన పెంపుపై దృష్టి పెడుతున్నాయి. దీంతో వచ్చే 12 నెలల్లో వేతన వృద్ధి సుమారు 9.8 శాతం వేతన వృద్ధి ఉంటుందని అంచనాలు నెలకొన్నాయి. డిజిటల్ టాలెంట్ సొల్యూషన్స్ సంస్థ ఎన్ఎల్‌బీ సర్వీసెస్ రూపొందించిన 'ఇండియా టాలెంట్ టేకాఫ్ – ది జీసీసీ 4.0 స్టోరీ' నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 'ప్రపంచ జీసీసీల్లో దాదాపు 55 శాతం సెంటర్లు భారత్‌లో ఉన్నాయి. 2030 నాటికి ఈ మార్కెట్ పరిమాణం 110 బిలియన్ డాలర్లకు చేరనుంది. వ్యయాలు తగ్గించుకోవడం, పరిస్థితులను బట్టి వేగంగా స్పందించే సామర్థ్యాలను పెంచుకోవడం, విస్తృతంగా ప్రతిభావంతులను అందుబాటులో ఉంచుకోవడం వంటి అంశాలపై కంపెనీలు దృష్టి పెడుతుండటం ఇందుకు దోహదపడుంది. ఈ పరిణామంతో వేతనాలు కూడా గణనీయంగా పెరగనుండటమనేది ఉద్యోగులకు కూడా కలిసి రానుంది. ముఖ్యంగా స్పెషలైజ్డ్ నైపుణ్యాలు ఉన్న వారికి గతంలో ఎన్నడూ లేనంత డిమాండ్ నెలకొంది' అని ఎన్ఎల్‌బీ సర్వీసెస్ సీఈవో సచిన్ అలగ్ చెప్పారు.

'ఆర్థిక సేవల విభాగంలో గణనీయంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రిస్క్ అనలిస్టులు, కాంప్లయెన్స్ అసోసియేట్స్, సీనియర్ రిస్క్ మేనేజర్లు, ఎఫ్ఆర్ఎం లీడ్స్, కాంప్లయెన్స్ హెడ్స్, గ్లోబల్ ఫైనాన్స్ డైరెక్టర్స్ మొదలైన హోదాల్లో ఉన్న వారికి వార్షికంగా రూ. 6 లక్షల నుంచి రూ. 90 లక్షల శ్రేణిలో వేతనాలు ఉంటున్నాయి. సాంప్రదాయ హోదాలతో పోలిస్తే రిస్క్, ఎఫ్ఆర్ఎం వంటి స్పెషలైజ్డ్ నైపుణ్యాలున్న వారికి వేతనాలు 25–40 శాతం అధికంగా ఉంటున్నాయి. అలాగే, మౌలిక రంగాల పరిధిని దాటి ఆర్థిక విభాగంలో నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో కొత్త అవకాశాలు వస్తున్నాయి' అని అలగ్ వివరించారు.

అసమానతలపై దృష్టి పెట్టాలి..

వేతన వృద్ధి పటిష్టంగానే ఉన్నప్పటికీ స్త్రీ, పురుష ఉద్యోగుల జీతభత్యాల మధ్య అసమానతలను తగ్గించేందుకు మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అలగ్ చెప్పారు. పురుష ఉద్యోగుల జీతభత్యాలతో పోలిస్తే మహిళా ఉద్యోగుల వేతనాలు సగటున 75–85 శాతం స్థాయిలోనే ఉంటున్నాయని చెప్పారు. ఇక సీనియర్ హోదాల్లో ఈ వ్యత్యాసం మరింత ఎక్కువగా ఉందని, లీడర్‌షిప్ బాధ్యతల్లో మహిళల ప్రాతినిధ్యం పరిమిత స్థాయిలోనే ఉంటోందని పేర్కొన్నారు. ఆరు నగరాలవ్యాప్తంగా 10 వివిధ రంగాలకు చెందిన 207 జీసీసీల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదిక రూపొందింది.

నివేదికలోని మరిన్ని వివరాలు..

- మిగతా సంస్థలతో పోలిస్తే హైదరాబాద్ (19 శాతం), ముంబై (19 శాతం)ల్లోని జీసీసీలు అత్యధికంగా చెల్లిస్తున్నాయి. రంగాలవారీగా చూస్తే ఐటీ సాఫ్ట్‌వేర్ .. కన్సల్టింగ్ (22 శాతం), బ్యాంకింగ్/ఫైనాన్షియల్ సర్వీసుల (18 శాతం) విభాగాలు ఉన్నాయి.
- జూనియర్, మధ్య స్థాయి ఉద్యోగాల్లో వేతన వృద్ధి పటిష్టంగా ఉండనుంది. ఏఐ, ఎంఎల్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్‌సెక్యూరిటీ వంటి విభాగాల్లో నిపుణులకు భారీ డిమాండ్ నెలకొనడం ఇందుకు కారణం. మరోవైపు, హైస్థాయి ఉద్యోగాల్లో వ్యయాలను నియంత్రించుకోవడానికి కంపెనీలు ప్రాధాన్యతనిస్తుండటంతో సీనియర్ హోదాల్లోని వారికి వేతనాల పెంపు ఒక మోస్తరుగానే ఉండనుంది.
- రాబోయే రోజుల్లో, 2030 నాటికి దేశీయంగా జీసీసీ రంగం వార్షికంగా 9–12 శాతం వృద్ధి చెందనుంది. దానికి తగ్గట్లుగా వేతనాలు కూడా భారీగా పెరగనున్నాయి.



నెలాఖరుకల్లా బ్యాక్‌లాగ్‌లను పూర్తి చేస్తాం

ఓలా ఎలక్ట్రిక్ వివరణ

న్యూఢిల్లీ: వెండార్లతో సంప్రదింపుల వల్ల తలెత్తిన వాహన విక్రయాలు, రిజిస్ట్రేషన్లకు మధ్య వ్యత్యాసాల సమస్యను పరిష్కరించుకోవడంపై ఓలా ఎలక్ట్రిక్ మరింతగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే 40 శాతం బ్యాక్‌లాగ్‌లను క్లియర్ చేశామని, మిగతా వాటిని నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని కంపెనీ తెలిపింది. ఓలా ఫిబ్రవరిలో 25,000 ఎలక్ట్రిక్ స్కూటర్లను విక్రయించినట్లు వెల్లడించినప్పటికీ ప్రభుత్వ వాహన్ పోర్టల్‌లో 8,651 స్కూటర్లు మాత్రమే రిజిస్టర్ అయినట్లు గత గణాంకాల్లో వెల్లడయ్యాయి. మార్చి 20 నాటికి కంపెనీ రిజిస్ట్రేషన్లు 11,781 యూనిట్లుగా ఉన్నాయి. వాహనాల గణాంకాల్లో వ్యత్యాసాలను నియంత్రణ నిబంధనలపరమైన సమస్యగా కొన్ని స్వార్థ శక్తులు దుష్ప్రచారం చేశాయని ఓలా వ్యాఖ్యానించింది. కార్యకలాపాలను క్రమబద్ధీకరించుకోవడం, లాభదాయకతను మెరుగుపర్చుకునే క్రమంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహించే రెండు జాతీయ స్థాయి వెండార్లతో కాంట్రాక్టులను నిలిపివేసిన తర్వాత ఇది మరింత తీవ్రమైందని పేర్కొంది. అమ్మకాలు, రిజిస్ట్రేషన్ల మధ్య గణాంకాల్లో వ్యత్యాసాలపై భారీ పరిశ్రమల శాఖ, రహదారి రవాణా.. హైవేస్ శాఖ కంపెనీని స్పష్టత కోరిన నేపథ్యంలో ఓలా వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది.



ఇండస్‌ఇండ్ 'అకౌంటింగ్' విచారణకు సంస్థ నియామకం

న్యూఢిల్లీ: డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో వ్యత్యాసాలపై విచారణ జరిపేందుకు ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఒక ప్రొఫెషనల్ సంస్థను నియమించుకుంది. వ్యత్యాసాలకు మూలకారణాలను గుర్తించడంతో పాటు డెరివేటివ్ కాంట్రాక్టుల అకౌంటింగ్ విధానాల ప్రభావాలను కూడా ఈ సంస్థ మదింపు చేస్తుందని బ్యాంకు వెల్లడించింది. సుమారు రూ. 2,100 కోట్ల మేర అకౌంటింగ్ వ్యత్యాసాల కారణంగా బ్యాంక్ నికర విలువపై దాదాపు 2.35 శాతం మేర ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా.



భారంగా బంగారం లీజింగ్

- 3 శాతం నుంచి 7 శాతానికి చేరిక
- జ్యుయెలర్ల మార్జిన్లపై ప్రతికూల ప్రభావం
- ఆభరణాల రేట్లు పెరిగే అవకాశం



సాక్షి, బిజినెస్ డెస్క్

జ్యుయలర్లకు బంగారం లీజింగ్ రేట్లు చుక్కలు చూపిస్తున్నాయి. జనవరి నుంచి బంగారం ధర 14 శాతం పైగా పెరిగింది.దీంతో సంఘటిత రిటైల్ జ్యుయలరీ సంస్థలైన టైటాన్, సెంకోగోల్డ్, కల్యాణ్ జ్యుయలర్స్, పీఎన్ గాడ్గిల్ తదితర వాటి మార్జిన్లపై ప్రభావం పడనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్ టారిఫ్‌లతో బంగారం లీజింగ్ రేట్లు మరింత పెరుగుతాయని జ్యుయలర్లు అంచనా వేస్తున్నారు. ''వాణిజ్య, టారిఫ్ యుద్ధాలతో బంగారం లీజింగ్ రేట్లు రెట్టింపయ్యాయి. ఇది మార్జిన్లపై ఒత్తిళ్లను పెంచుతోంది. ఈ పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం''అని పీఎన్‌జీ జ్యుయలర్స్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ కిరణ్ ఫిరోదియా తెలిపారు. జ్యుయలరీ సంస్థలు అరువుగా తీసుకునే బంగారంపై వసూలు చేసే రేట్లను గోల్డ్ లీజింగ్ రేట్లుగా చెబుతారు. జ్యుయలర్లు తమకు కావాల్సిన బంగారాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయడానికి బదులు బ్యాంకులు, బులియన్ ట్రేడర్ల నుంచి పరిమిత కాలానికి అరువు కింద తెచ్చుకుంటాయి. స్థానిక బ్యాంక్‌లు విదేశీ బ్యాంకుల నుంచి బంగారాన్ని సమకూర్చుకుని.. జ్యుయలరీ వర్తకులకు అరువుగా ఇస్తుంటాయి.

కొంత వేచి చూశాకే నిర్ణయం

తాము మార్చి త్రైమాసికం ముగిసే వరకు వేచి చూసే ధోరణి అనుసరించనున్నట్టు, ఆ తర్వాత దీనిపై ఒక నిర్ణయానికి వస్తామని దేశంలోనే అతిపెద్ద ఆభరణాల రిటైల్ చైన్ టైటాన్ వెల్లడించింది. ''బంగారం లీజింగ్ రేట్లు ఇంకా పెరుగుతాయని సంకేతాలు తెలియజేస్తున్నాయి. సరఫరా ఎలా ఉందన్న దాన్ని అర్థం చేసుకునేందుకు ఒకటి రెండు నెలలు పడుతుంది. అప్పుడే ధరల తీరు తెలుస్తుంది''అని టైటాన్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ (ఫైనాన్స్) విజయ్ గోవిందరాజన్ తెలిపారు.

రేట్ల పెంపు తప్పదా..?

బాడుగ బంగారంపై రేట్లు పెరిగిన నేపథ్యంలో తమ మార్జిన్లను కాపాడుకోవాలంటే జ్యుయలర్లు ఆభరణాల రేట్లను పెంచొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఒకవైపు డిమాండ్ లేని సీజన్ కావడంతో రేట్ల పెంపు విషయంలో జ్యుయలర్లు సౌకర్యంగా లేని పరిస్థితి నెలకొన్నట్టు చెబుతున్నారు. డిసెంబర్ త్రైమాసికంలో పండుగలు, వివాహాల కారణంగా కొనుగోళ్లు జోరుగా సాగాయి. మార్చి త్రైమాసికంలో వినియోగం పెరగడానికి ఎలాంటి అనుకూలతలు లేని విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. గోల్డ్ లీజింగ్ రేట్లు పెరగడం తమకు ఆందోళన కలిగిస్తున్నట్టు సెంకో గోల్డ్ అండ్ డైమండ్స్ ఎండీ సువాంకర్ సేన్ ఇన్వెస్టర్ కాల్ సందర్భంగా ప్రకటించడం గమనార్హం. లీజింగ్ రేట్లు పెరగడం వల్ల తమకు రుణ వ్యయాలు 0.5 శాతం మేర పెరగనున్నట్టు చెప్పారు. తద్వారా ఫిబ్రవరి, మార్చి నెలల్లో 7–8 కోట్ల మేర తమపై ప్రభావం ఉంటుందని చెప్పారు. ఎంసీఎక్స్‌లో బంగారం రేట్లు జనవరి నుంచి 14 శాతానికి పైగా పెరగడం గమనార్హం. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకుతోడు ఆర్థిక అనిశ్చితులు బంగారం రేట్ల పెరుగుదలకు కారణమవుతున్నట్టు పరిశ్రమ వర్గాలు అంటున్నాయి.

ప్రణతి నాయక్‌కు కాంస్యం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ జిమ్నాస్టిక్స్ సమాఖ్య (ఎఫ్ఐజీ) ఆపరేటస్ వరల్డ్‌కప్‌లో భారత జిమ్నాస్ట్ ప్రణతి నాయక్ కాంస్య పతకంతో మెరిసింది. టర్కీ వేదికగా జరిగిన టోర్నమెంట్‌లో బెంగాల్‌కు చెందిన 29 ఏళ్ల ప్రణతి వాల్ట్ ఈవెంట్‌లో 13.417 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ప్రణతి నాయక్ క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో 13.317 పాయింట్లు సాధించి ఫైనల్‌కు అర్హత సాధించింది. శనివారం జరిగిన ఫైనల్లో అమెరికాకు చెందిన జైలా హాంగ్ (13.667 పాయింట్లు), క్లైర్ పీస్ (13.567 పాయింట్లు) వరుసగా స్వర్ణ, రజతాలు దక్కించుకున్నారు. 'ఏడాది ఆరంభంలోనే పతకం సాధించడం చాలా ఆనందంగా ఉంది. దీంతో సీజన్ మొత్తం సానుకూల దృక్పథంతో ఉండొచ్చు. గతేడాది కూడా ఇక్కడ పతకం సాధించా. ఇప్పుడు దాన్ని నిలబెట్టుకోవడం గొప్పగా అనిపిస్తోంది. ఆసియా చాంపియన్‌షిప్స్, ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో పతకాలు సాధించడమే నా తదుపరి లక్ష్యం' అని ప్రణతి వెల్లడించింది. గత ఏడాది ఈజిప్ట్‌లో జరిగిన ప్రపంచకప్ వాల్ట్ ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచిన ప్రణతి... 2019 ఆసియా చాంపియన్‌షిప్ (ఉలాన్‌బాటర్), 2022 ఆసియా చాంపియన్‌షిప్ (దోహా)లలోనూ కాంస్యం పతకాలు సాధించింది.

గాయత్రి-ట్రెసా జోడీ ఓటమి



బాసెల్: స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత మహిళల డబుల్స్ జోడీ పుల్లెల గాయత్రి గోపీచంద్-ట్రెసా జాలీ జోడీ పోరాటం ముగిసింది. శనివారం జరిగిన మహిళల డబుల్స్ సెమీఫైనల్లో గాయత్రి-ట్రెసా జాలీ జంట 21-15, 15-21, 12-21తో ప్రపంచ నంబర్‌వన్ లి షెంగ్ షూ-టాన్ నింగ్ (చైనా) ద్వయం చేతిలో పరాజయం పాలైంది. గంటన్నరకు పైగా సాగిన పోరులో తొలి గేమ్‌ను సునాయాసంగా గెలుచుకున్న ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ భారత జంట... ఆ తర్వాత అదే జోరు కొనసాగించలేకపోయింది. సుదీర్ఘ ర్యాలీలతో ఆకట్టుకున్న గాయత్రి-ట్రెసా జోడీ... వాటిని ముగించడంలో కాస్త తడబడింది. తొలి గేమ్ ఆరంభంలో 4-1తో ముందంజ వేసిన భారత షట్లర్లు... బ్రేక్ సమయానికి 11-6తో సంపూర్ణ ఆధిక్యం సాధించారు. ఇదే తీవ్రత కొనసాగిస్తూ తొలి గేమ్ గెలుచుకున్నారు. 70 షాట్లకు పైగా సాగిన ర్యాలీల్లో చైనా ప్లేయర్లు దూకుడు కనబర్చగా... మనవాళ్లు చివరి రెండు గేమ్‌ల్లో కీలక సమయాల్లో పాయింట్లు కోల్పోయారు. ఈ మ్యాచ్‌లో ఓడినా... ప్రపంచ నంబర్‌వన్ జంటతో భారత షట్లర్ల పోరాటం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది.

క్వార్టర్స్‌లో ఓడిన శంకర్ ముత్తుస్వామి

పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్‌పై సంచలన విజయం సాధించి క్వార్టర్స్‌కు దూసుకెళ్లిన భారత యువ షట్లర్ శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ కూడా పరాజయం పాలయ్యాడు. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ప్రపంచ 68వ ర్యాంకర్ శంకర్ 10-21, 14-21తో ప్రపంచ 31వ ర్యాంకర్ క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో ఓడాడు. దీంతో ఈ టోర్నీలో భారత షట్లర్లంతా వెనుదిరిగినట్లయింది.

గొంగడి త్రిషకు చోటు

- టీమ్ 'డి'లో చోటు దక్కించుకున్న తెలంగాణ ఆల్‌రౌండర్
- సీనియర్ మహిళల చాలెంజర్ ట్రోఫీ



న్యూఢిల్లీ: జాతీయ సీనియర్ మహిళల చాలెంజర్ ట్రోఫీ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శనివారం జట్లను ప్రకటించింది. డెహ్రాడూన్ వేదికగా ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 8 వరకు ఈ టోర్నీ నిర్వహించనున్నారు. మూడు రోజుల ఫార్మాట్‌లో ఈ మ్యాచ్‌లు నిర్వహిస్తుండగా, ఇందులో 4 జట్లు పాల్గొంటున్నాయి. స్టార్ ప్లేయర్లు హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన ఈ టోర్నీకి దూరం కాగా... యంగ్ ప్లేయర్లకు అవకాశం దక్కింది. 'సీనియర్ మహిళల మల్టీ డే చాలెంజర్ ట్రోఫీ కోసం మహిళల సెలెక్షన్ కమిటీ 4 జట్లను ఎంపిక చేసింది. ఎర్రబంతితో జరగనున్న ఈ టోర్నీని డెహ్రాడూన్‌లోని రెండు వేదికల్లో నిర్వహిస్తాం' అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించాడు. మిన్ను మణి, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, స్నేహ్ రాణా నాలుగు జట్లకు సారథ్యం వహించనుండగా... భారత మహిళల అండర్-19 జట్టుకు రెండోసారి ప్రపంచకప్ అందించడంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ ఆల్‌రౌండర్ గొంగడి త్రిషకు టీమ్ 'డి'లో చోటు దక్కింది.

జట్ల వివరాలు

టీమ్ 'ఎ': మిన్ను మణి (కెప్టెన్), రిచాఘోష్, శిప్రా గిరి, సుభ సతీశ్, శ్వేతా షెహ్రావత్, వృందా దినేశ్, ముక్తా మగ్రే, హెన్‌రిట్టా పెరీరా, తనూజ కన్వర్, వాసవి పావని, ప్రియా మిశ్రా, అరుంధతి రెడ్డి, సయాలీ సత్‌ఘరే, అనాడీ తగ్డే, ప్రగతి సింగ్.

టీమ్ 'బి': హర్లీన్ డియోల్ (కెప్టెన్), యస్తిక భాటియా, మమత, ప్రతీక రావల్, ఆయుశ్ సోని, ఆరుశీ గోయల్, కనిక అహూజ, మితా పాల్, శ్రీ చరణి, మమత పాస్వాన్, ప్రేమ రావత్, నందిని శర్మ, క్రాంతి గౌడ్, అక్షర, టిటాస్ సాధు.

టీమ్ 'సి': జెమీమా రోడ్రిగ్స్ (కెప్టెన్), ఉమా ఛెత్రి, రియా చౌదరి, షఫాలీ వర్మ, త్రిష్టి సింగ్, తనుశ్రీ సర్కార్, తేజల్ హసబ్నిస్, సుశ్రీ దివ్యదర్శిని, సుచి ఉపాధ్యాయ, రాజేశ్వరి గైక్వాడ్, శరణ్య గద్వాల్, జోషిత, శబ్నమ్, సైమా ఠాకూర్, గరిమా యాదవ్.

టీమ్ 'డి': స్నేహ్ రాణా (కెప్టెన్), నందిని కశ్యప్, శివంగి యాదవ్, గొంగడి త్రిష, జిన్సీ జార్జ్, రాఘవి, ధార గుజ్జర్, సంస్కృతి గుప్తా, యమున రాణా, వైష్ణవి శర్మ, కీర్తన, అమన్‌జ్యోత్ కౌర్, కాశ్వీ గౌతమ్, మనాలీ దక్షిణి, మోనిక పటేల్.

రైజర్స్ బోణీ కొట్టేనా!

నేడు రాజస్తాన్ రాయల్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఢీ

ఉప్పల్ మైదానంలో తొలి పోరు ● మధ్యాహ్నం గం. 3:30 నుంచి


హెడ్

బాదుడే పరమావధిగా చెలరేగి గత సీజన్‌లో రన్నరప్‌గా నిలిచిన సన్‌రజర్స్ హైదరాబాద్... ఈ ఏడాది అదే జోరు కొనసాగించేందుకు సిద్ధమైంది. సొంతగడ్డపై మాజీ చాంపియన్ రాజస్తాన్ రాయల్స్‌తో... నేడు కమిన్స్ సేన కప్ వేట ప్రారంభించనుంది. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, నితీశ్‌కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్‌తో సన్‌రైజర్స్ బ్యాటింగ్ లైనప్ శత్రు దుర్భేద్యంగా ఉండగా... యశస్వి జైస్వాల్, సంజూ సామ్సన్, రియాన్ పరాగ్, హెట్‌మైర్, ధ్రువ్ జురెల్‌తో సవాలు విసిరేందుకు రాజస్తాన్ రాయల్స్ రెడీ అయింది. మరి రైజర్స్ దూకుడుకు రాయల్స్ అడ్డుకట్ట వేస్తుందా చూడాలి!

సాక్షి, హైదరాబాద్: గత ఏడాది అందినట్లే అంది దూరమైన ఐపీఎల్ ట్రోఫీని ఈసారైనా ఒడిసి పట్టాలనే లక్ష్యంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తొలి మ్యాచ్‌కు రెడీ అయింది. ఐపీఎల్ 18వ సీజన్‌లో భాగంగా జరగనున్న తొలి 'డబుల్ హెడర్'లో ఆదివారం జరగనున్న తొలి మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్‌తో హైదరాబాద్ అమీతుమీ తేల్చుకోనుంది. ఒకప్పుడు కట్టుదిట్టమైన బౌలింగ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన సన్‌రైజర్స్... గత సీజన్‌లో విధ్వంసక బ్యాటింగ్‌తో రికార్డులు తిరగరాసింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ నుంచి మొదలు పెట్టుకొని కెప్టెన్ కమిన్స్ వరకు ప్రతి ఒక్కరూ దూకుడుగా ఆడేవాళ్లు ఉండటం రైజర్స్‌కు కలిసి రానుండగా... సీజన్ ఆరంభ మ్యాచ్‌లో ఆరెంజ్ ఆర్మీ ఎలాంటి ప్రదర్శన కనబరుస్తుందో చూడాలి. గత ఏడాది మ్యాచ్ మ్యాచ్‌కు మరింత రాటుదేలుతూ అరాచకం సృష్టించిన రైజర్స్ బ్యాటర్లు... ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ నుంచే జోరు కనబర్చాలని తహతహలాడుతున్నారు. ప్రాక్టీస్ సెషన్‌లలో హెడ్, క్లాసెన్, అభిషేక్, నితీశ్ వంతులు వేసుకొని మరి భారీ షాట్లు సాధన చేశారు. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనున్న ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. వేలంలో కొత్తగా తీసుకున్న ఇషాన్ కిషన్ రాకతో రైజర్స్ బ్యాటింగ్ మరింత పదునెక్కింది. గతేడాది ఒకటికి మూడుసార్లు 250 పైచిలుకు పరుగులు చేసిన రైజర్స్... ఈ సారి 300 మార్క్ అందుకోవాలనే లక్ష్యంతో కనిపిస్తోంది. గాయం నుంచి కోలుకున్న ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి మిడిలార్డర్‌లో కీలకం కానున్నాడు. మరోవైపు వేలి గాయంతో ఇబ్బంది పడుతున్న రాజస్తాన్ రాయల్స్ రెగ్యులర్ కెప్టెన్ సంజూ సామ్సన్ ఈ మ్యాచ్‌లో కేవలం ప్లేయర్‌గా బరిలోకి దిగనున్నాడు. సీజన్ తొలి మూడు మ్యాచ్‌లకు సామ్సన్ స్థానంలో రియాన్ పరాగ్ రాయల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

సామ్సన్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా...

స్వదేశీ ఆటగాళ్ల నైపుణ్యంపైనే ప్రధానంగా ఆధారపడుతున్న రాజస్తాన్ రాయల్స్‌కు... రెగ్యులర్ కెప్టెన్ సంజూ సామ్సన్ గాయం ఇబ్బంది పెడుతోంది. అతడు కేవలం బ్యాటర్‌గా మాత్రమే బరిలోకి


సామ్సన్

దిగనున్నాడు. అంటే ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటింగ్ చేసే అవకాశాలు ఉన్నాయి. అతడి స్థానంలో రియాన్ పరాగ్ జట్టును నడిపించనుండగా... ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ బాధ్యతలు అందుకోనున్నాడు. యశస్వి జైస్వాల్, సామ్సన్, నితీశ్ రాణా, పరాగ్, ధ్రువ్ జురెల్ ఇలా టాప్-5లో స్వదేశీ ఆటగాళ్లే బ్యాటింగ్ చేయనున్నారు. మిడిలార్డర్‌లో విండీస్ హిట్టర్ హెట్‌మైర్ కీలకం కానుండగా... ఆర్చర్, తీక్షణ, వనిందు హసరంగ బౌలింగ్ భారం మోయనున్నారు. విధ్వంసానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్న రైజర్స్ బ్యాటింగ్ లైనప్‌ను రాయల్స్ బౌలింగ్ దళం ఎలా అడ్డుకుంటుందనే దానిపైనే ఈమ్యాచ్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

బ్యాటింగ్ బలంగా...

ఇంటా బయటా అనే తేడా లేకుండా గతేడాది బరిలోకి దిగిన ప్రతి మ్యాచ్‌లో పరుగుల వరద పారించిన సన్‌రైజర్స్... ముఖ్యంగా ఉప్పల్‌లో ఊచకోత సాగించింది. లక్నో సూపర్ జెయింట్స్‌తో పోరులో ఆ జట్టు నిర్దేశించిన 166 పరుగుల లక్ష్యాన్ని ఆరెంజ్ ఆర్మీ 9.4 ఓవర్లలో వికెట్ కోల్పోకుండానే ఛేదించి సంచలనం సృష్టించింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, హెడ్ బంతిపై పగబట్టినట్లు విజృంభిస్తుండటం రైజర్స్‌కు ప్రధాన బలం కాగా... ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్‌తో కూడిన మిడిలార్డర్ జట్టుకు మరింత బలాన్నిస్తోంది. అయితే ఫ్రాంచైజీ తరఫున తొలిసారి బరిలోకి దిగనున్న అభినవ్ మనోహర్, అనికేత్ వర్మ ఎలాంటి ప్రదర్శన కనబరుస్తారనేది ఆసక్తికరం. గాయం కారణంగా శ్రీలంకతో పర్యటనతో పాటు ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి దూరమైన ఆస్ట్రేలియా స్టార్ పేసర్ ప్యాట్ కమిన్స్... గాయం నుంచి కోలుకొని జట్టును నడిపించేందుకు సిద్ధమయ్యాడు. పేస్ బౌలింగ్‌లో మొహమ్మద్ షమీ, హర్షల్ పటేల్ కీలకం కానుండగా, ఆడమ్ జంపా స్పిన్ బాధ్యతలు మోయనున్నాడు.


నితీశ్ రెడ్డి

తుది జట్లు (అంచనా)

సన్‌రైజర్స్ హైదరాబాద్: కమిన్స్ (కెప్టెన్), హెడ్, అభిషేక్, ఇషాన్ కిషన్, నితీశ్ రెడ్డి, క్లాసెన్, అనికేత్ వర్మ, అభినవ్ మనోహర్, హర్షల్ పటేల్, రాహుల్ చాహర్, షమీ, జాంపా.

రాజస్తాన్ రాయల్స్: రియాన్ పరాగ్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, సంజూ సామ్సన్, నితీశ్ రాణా, ధ్రువ్ జురెల్, హెట్‌మైర్, హసరంగ, శుభమ్ దూబే, ఆర్చర్, తీక్షణ, సందీప్ శర్మ, తుషార్ దేశ్ పాండే.

పిచ్, వాతావరణం

గతేడాది ఉప్పల్‌లో జరిగిన మ్యాచ్‌ల్లో పరుగుల వరద పారింది. మొత్తం 13 మైదానాల్లో ఐపీఎల్ మ్యాచ్‌లు జరగగా... అందులో రెండో అత్యధికం (ఓవర్‌కు 10.54 పరుగులు) హైదరాబాద్‌లో నమోదైంది. ఈసారి కూడా అందుకు భిన్నంగా ఉండకపోవచ్చు. మ్యాచ్‌కు వర్ష సూచన లేదు.

చెన్నై X ముంబై

సాయంత్రం గం. 7:30 నుంచి


రుతురాజ్


సూర్యకుమార్

చెన్నై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో మరో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. లీగ్‌లో అత్యంత విజయవంతమైన జట్లుగా చెరో ఐదు సార్లు ట్రోఫీలు గెలిచిన ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య చెపాక్ వేదికగా ఆదివారం రెండో మ్యాచ్ జరగనుంది. గాయం కారణంగా ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, నిషేధం కారణంగా హార్దిక్ పాండ్యా ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేకపోగా... సూర్యకుమార్ యాదవ్ ముంబై ఇండియన్స్ జట్టును నడిపించనున్నాడు. రోహిత్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, రికెల్టన్, నమన్ ధిర్‌తో ముంబై బ్యాటింగ్ బలంగానే ఉంది. బౌలింగ్‌లో ట్రెంట్ బౌల్ట్ అనుభవం ముంబైకి ప్రధానాయుధం కాగా... దీపక్ చాహర్, కరణ్ శర్మ, సాంట్నర్, ముజీబ్ ఉర్ రహమాన్ మిగిలిన బాధ్యతలు చూసుకోనున్నారు. మరోవైపు ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రవిచంద్రన్ అశ్విన్ సుదీర్ఘ విరామం తర్వాత చెన్నై జట్టులో తిరిగి చేరాడు. చెపాక్ లాంటి స్లో పిచ్‌పై అశ్విన్, జడేజా, నూర్ అహ్మద్‌ను ఎదుర్కోవడం కష్టమైన పనే. ఎప్పట్లాగే మహేంద్ర సింగ్ ధోని వికెట్ల వెనుక నుంచి చెన్నై జట్టుకు దిశానిర్దేశం చేయనుండగా... బ్యాటింగ్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, కాన్వే, రాహుల్ త్రిపాఠి, శివమ్ దూబే, స్యామ్ కరన్, జడేజా కీలకం కానున్నారు. గత సీజన్‌లో ఎక్కువ శాతం బ్యాటింగ్‌కు రాని ధోని ఈ సారి బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు వస్తాడా చూడాలి. ఇరు జట్ల మధ్య చివరగా జరిగిన ఐదు మ్యాచ్‌ల్లో నాలుగింట చెన్నై విజయం సాధించింది. గత సీజన్‌లో పేలవ ప్రదర్శనతో పట్టిక అట్టడుగు స్థానంలో నిలిచిన ముంబై ఇండియన్స్ ఈ సీజన్‌ను తాజాగా ప్రారంభించాలని చూస్తోంది.

బాక్సింగ్ దిగ్గజం ఫోర్‌మన్ కన్నుమూత

రెండు సార్లు వరల్డ్ హెవీవెయిట్ చాంపియన్



అస్టిన్ (అమెరికా): ప్రొఫెషనల్ బాక్సింగ్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జార్జ్ ఫోర్‌మన్ (76) శుక్రవారం కన్నుమూశాడు. 1967-77 మధ్య కాలంలో ఫోర్‌మన్ కెరీర్ అత్యుత్తమ దశ సాగింది. ప్రతిష్టాత్మక వరల్డ్ హెవీ వెయిట్ చాంపియన్‌షిప్‌ను రెండు సార్లు గెలుచుకోవడంతో పాటు 1968 మెక్సికో ఒలింపిక్స్‌లో కూడా బరిలోకి దిగిన ఫోర్‌మన్ స్వర్ణపతకాన్ని సాధించాడు. 1973లో ఫోర్‌మన్ తొలిసారి చాంపియన్‌గా నిలిచాడు. అప్పటి వరకు ఓటమి ఎరుగని దిగ్గజం జో ఫ్రేజర్‌ను ఓడించి ఈ టైటిల్‌ను గెలుచుకోవడం అతి పెద్ద సంచలనంగా నిలిచింది. అయితే 1977లో ఫోర్‌మన్, మరో దిగ్గజం మొహమ్మద్ అలీ మధ్య జరిగిన బౌట్ ఆల్‌టైమ్ గ్రేట్‌లలో ఒకటిగా నిలిచింది. 'రంబుల్ ఇన్ ద జంగిల్' పేరుతో సాగిన ఈ పోరులో చివరకు ఫోర్‌మన్ ఓడినా...బాక్సింగ్ అభిమానులు దీనిని ఎప్పటికీ గుర్తుంచుకుంటారు. కెరీర్‌లో 81 బౌట్‌లలో తలపడిన ఫోర్‌మన్ 76 మ్యాచ్‌లు గెలిచి 5 మాత్రమే ఓడాడు. ఈ 76లో 68 నాకౌట్‌లు కావడం విశేషం. వరల్డ్ బాక్సింగ్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్న అతని జీవిత గాథతో 'బిగ్ జార్జ్ ఫోర్‌మన్' పేరుతో 2023లో సినిమా కూడా వచ్చింది.

పియాస్ట్రికి పోల్ పొజిషన్

చైనీస్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ సెషన్





షాంఘై: ఫార్ములావన్ సీజన్ రెండో రేసు చైనీస్ గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి (ఆస్ట్రేలియా) పోల్ పొజిషన్ సాధించాడు. ఫార్ములావన్ కెరీర్‌లో అతడికి ఇదే తొలి పోల్ పొజిషన్ కావడం విశేషం. 23 ఏళ్ల ఆసీస్ రేసర్ శనివారం జరిగిన క్వాలిఫయింగ్ సెషన్‌లో అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా... 1 నిమిషం 30.641 సెకన్లలో ల్యాప్ పూర్తిచేశాడు. ఆదివారం జరగనున్న ప్రధాన రేసును పియాస్ట్రి తొలి స్థానం నుంచి ప్రారంభించనున్నాడు. మెర్సిడెస్ డ్రైవర్ రసెల్ (1 నిమిషం 30.723 సెకన్లు) రెండో స్థానంలో నిలిచాడు. గత వారం ఆస్ట్రేలియా గ్రాండ్ ప్రిలో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన ప్రపంచ మాజీ చాంపియన్ లూయిస్ హామిల్టన్ (బ్రిటన్) చైనీస్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో ఐదో స్థానంలో నిలిచాడు. 56 ల్యాప్‌లతో కూడిన రేసులో మెక్‌లారెన్ జట్టుకే చెందిన మరో డ్రైవర్ లాండో నోరిస్ (1 నిమిషం 30. 793 సెకన్లు) మూడో స్థానంలో నిలిచాడు. గత వారం సీజన్ ఆరంభ ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రిలో విజేతగా నిలిచిన నోరిస్ ఈ రోజు జరగనున్న రేసును మూడో స్థానంతో ప్రారంభించనున్నాడు. మాజీ చాంపియన్, రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (1 నిమిషం 30.817 సెకన్లు) నాలుగో 'ప్లేస్'లో నిలిచాడు. ఆదివారం జరగనున్న ప్రధాన రేసులో 10 జట్లకు చెందిన 20 మంది డ్రైవర్లు పాల్గొంటున్నారు.

చైనీస్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ సెషన్

డ్రైవర్	జట్టు	టైమింగ్
పియాస్ట్రి	మెక్‌లారెన్	1:30.641 సెకన్లు
రసెల్	మెర్సిడెస్	1:30.723 సెకన్లు
నోరిస్	మెక్‌లారెన్	1:30.793 సెకన్లు
వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	1:30.817 సెకన్లు
హామిల్టన్	ఫెరారీ	1:30.927 సెకన్లు
లెక్‌లెర్క్	ఫెరారీ	1:31.021 సెకన్లు
హాడ్జర్	రేసింగ్‌బుల్స్	1:31.079 సెకన్లు
ఆంటోనెలి	మెర్సిడెస్	1:31.103 సెకన్లు
సునోడా	రేసింగ్ బుల్స్	1:31.103 సెకన్లు
అల్బన్	విలియమ్స్	1:31.706 సెకన్లు

12 ఏళ్ల తర్వాత...

భారత్‌లో టెస్టు సిరీస్ ఆడనున్న వెస్టిండీస్

కోల్‌కతా: పుష్కర కాలం తర్వాత వెస్టిండీస్ క్రికెట్ జట్టు భారత్‌లో టెస్టు సిరీస్ ఆడనుంది. ఈ ఏడాది అక్టోబర్‌లో భారత్, వెస్టిండీస్ మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జరగనుంది. ఈ మేరకు బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా సిరీస్ షెడ్యూల్ వెల్లడించాడు. కరీబియన్ల పర్యటన అనంతరం దక్షిణాఫ్రికా జట్టు భారత్‌లో పర్యటించనుందని రాజీవ్ శుక్లా పేర్కొన్నాడు. వెస్టిండీస్ జట్టు చివరిసారిగా 2013-14లో భారత్‌లో టెస్టు సిరీస్ ఆడింది. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కెరీర్ రిటైర్మెంట్ సిరీస్ అనంతరం కరీబియన్ జట్టు భారత్‌లో టెస్టు మ్యాచ్ ఆడలేదు. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా అక్టోబర్ 2న మొహాలీలో తొలి టెస్టు జరగనుంది. అక్టోబర్ 10 నుంచి కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో రెండో టెస్టు జరగనుంది. 2022లో భారత్‌తో 3 వన్డేలు, 3 టి20లు ఆడిన విండీస్ జట్టు సుదీర్ఘ ఫార్మాట్‌లో మాత్రం మ్యాచ్ ఆడలేదు. అనంతరం దక్షిణాఫ్రికా జట్టు భారత్‌తో 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టి20లు ఆడనుంది. 'సఫారీలతో ఢిల్లీలో తొలి టెస్టు మ్యాచ్ జరుగుతుంది. రెండో మ్యాచ్ గువాహటిలో నిర్వహిస్తాం' అని శుక్లా వెల్లడించాడు. ఇప్పటి వరకు పరిమిత ఓవర్ల మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన గువాహటి మైదానంలో ఇదే తొలి టెస్టు మ్యాచ్ కానుంది. నవంబర్ 30న భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య రాంచీ వేదికగా తొలి వన్డే జరగనుంది. డిసెంబర్ 3న రాయ్‌పూర్‌లో రెండో వన్డే, డిసెంబర్ 6న విశాఖపట్నంలో మూడో వన్డే జరగనున్నాయి. డిసెంబర్ 9 నుంచి 19 మధ్య ఇరు జట్లు ఐదు టి20లు ఆడనున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లో భారత్ వేదికగా జరగనున్న మహిళల వన్డే ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్‌ను విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు శుక్లా వెల్లడించాడు.

భారత ట్రాప్ షూటింగ్ కోచ్‌గా పీటర్ విల్సన్



న్యూఢిల్లీ: బ్రిటన్‌కు చెందిన ప్రముఖ షూటర్ పీటర్ విల్సన్‌ను భారత జాతీయ రైఫిల్ సమాఖ్య (ఎన్ఆర్ఏఐ) కోచ్‌గా నియమించింది. 2012 లండన్ ఒలింపిక్స్ డబుల్ ట్రాప్‌లో పిన్న వయసులో స్వర్ణం నెగ్గిన విల్సన్... భారత ట్రాప్ షూటర్లతో కలిసి పని చేయనున్నాడు. ఏడాదికి 180 రోజుల పాటు అతడు భారత్‌లో ఉండి మన షూటర్లకు శిక్షణ ఇవ్వనున్నాడు. 2024 పారిస్ ఒలింపిక్స్ అనంతరం భారత కోచ్ పదవికి 38 ఏళ్ల విల్సన్ దరఖాస్తు చేసుకున్నాడు. 'ఏడాదిలో సగం రోజులు విల్సన్ భారత్‌లో ఉంటాడు. అతడి ఒప్పందం ఏటా పునరుద్ధరిస్తాం' అని ఎన్ఆర్ఏఐ వర్గాలు వెల్లడించాయి. క్రికెటర్‌గా ఎదగాలనుకున్న విల్సన్ స్నో బోర్డింగ్ ప్రమాద ఘటన తర్వాత... షూటింగ్‌ను కెరీర్‌గా ఎంచుకున్నాడు. ఒలింపిక్స్‌లో డబుల్ ట్రాప్ ఈవెంట్‌ను తొలగించిన అనంతరం కోచ్ అవతారమెత్తిన విల్సన్... 2024 పారిస్ ఒలింపిక్స్‌కు ముందు బ్రిటన్‌కు చెందిన నాథన్ హేల్స్‌కు ట్రాప్‌లో శిక్షణ ఇచ్చాడు.

మణిపూర్‌లో త్వరలోనే శాంతియుత పరిస్థితులు

సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఆశాభావం

రాష్ట్రంలో పర్యటించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల బృందం



శనివారం ఇంఫాల్‌లో సుప్రీం కోర్టు జడ్జీలు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్ నాథ్ తదితరులు

ఇంఫాల్: కల్లోలిత మణిపూర్‌లో త్వరలోనే జాతుల మధ్య ఘర్షణలకు తెరపడుతుందని, శాంతియుత పరిస్థితులు నెలకొంటాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రస్తుత సంక్షోభం సాధ్యమైనంత త్వరగా ముగిసిపోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు చొరవ తీసుకోవాలని సూచించారు. దేశంలో ఇతర రాష్ట్రాల తరహాలోనే మణిపూర్ సైతం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని చెప్పారు. రాష్ట్రం సౌభాగ్యవంతంగా మారాలన్నదే తమ ఉద్దేశమని వివరించారు. జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల బృందం శనివారం మణిపూర్‌లో పర్యటించింది. చురాచాంద్‌పూర్ జిల్లాలో సహాయక శిబిరాన్ని సందర్శించింది. హింసాకాండ వల్ల నిరాశ్రయులుగా మారిపోయి ఇక్కడ తలదాచుకుంటున్న బాధితులను పరామర్శించింది. వారి ఇబ్బందులను అడిగి తెలుసుకుంది. అనంతరం న్యాయమూర్తులు లామ్‌కా జిల్లాలోని మినీ సెక్రటేరియట్ నుంచి లీగల్ సర్వీసు క్యాంప్, మెడికల్ క్యాంప్, లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్రంలో శాంతి, సామరస్యాన్ని పునరుద్ధరించడానికి మనమంతా కలిసికట్టుగా కృషి చేద్దామని మణిపూర్ ప్రజలకు జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఎంతో గొప్పదైన మన రాజ్యాంగం పట్ల ప్రజలంతా విశ్వాసం కనబర్చాలని చెప్పారు. రాజ్యాంగం మనందరినీ బలంగా, ఐక్యంగా ఉంచుతోందని పేర్కొన్నారు. మణిపూర్‌లోని ప్రకృతి సౌందర్యం తనను ఎంతగానో ఆకట్టుకుందని వెల్లడించారు. రాష్ట్రంలో నిరాశ్రయులకు, హింసాకాండ బాధితులకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని ప్రకటించారు. సద్భావన మండప్ రిలీఫ్ సెంటర్‌ను సైతం సుప్రీంకోర్టు న్యాయవాదుల బృందం సందర్శించింది. నిరాశ్రయులతో సమావేశమై చర్చించింది. బాధితులకు వైద్య సేవలు అందించిన ఆరోగ్య కార్యకర్తలను సన్మానించింది.

సామాజిక సూచీల్లో మనం అంతంతే!

పౌరుల సామాజిక ప్రవర్తన, వారి భద్రత, లైంగిక ధోరణి వంటివి ఒక సమాజం పురోగమన స్థాయికి సూచికలు. ఈ విషయంలో భారత్‌లో స్థితిగతులు ఎలా ఉన్నాయి? ఈ ఆసక్తికరమైన ప్రశ్నలకు సమాధానాలు రాబట్టేందుకు ఇండియాటుడే గ్రూప్ ప్రయత్నించింది. స్థూల దేశీయ ప్రవర్తన (జీడీబీ) పేరిట 21 రాష్ట్రాల పరిధిలో విస్తృత సర్వే నిర్వహించింది. దేశం మొత్తంలో అత్యంత ప్రగతిశీల రాష్ట్రం కేరళ అని తేల్చింది. సామాజిక ప్రవర్తనలో అన్ని రాష్ట్రాల కంటే ముందున్నట్టు పేర్కొంది. తమిళనాడు, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఒడిశా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. టాప్ 10లో ఉత్తరాది నుంచి ఒక్క రాష్ట్రం కూడా లేకపోగా ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లకు అట్టడుగు స్థానాలు దక్కాయి. దేశవ్యాప్తంగా 98 జిల్లాల పరిధిలో 9,188 మందిపై సర్వే నిర్వహించారు. వీరిలో 54.4 శాతం మంది నగర–పట్టణ, 45.6 శాతం మంది గ్రామీణ ప్రాంతాలవారు.

లంచాలిచ్చేందుకు రెడీ

సామాజిక ప్రవర్తన, ముఖ్యంగా నియమ నిబంధనలను పాటించడం వంటివాటిపై ప్రజల మనోగతం, అవగాహన, ధోరణులు తదితరాలను పరిశీలించగా విస్తుగొలిపే విషయాలు తెరపైకొచ్చాయి. పనులు చేయించుకునేందుకు లంచాలిచ్చేందుకు సిద్ధమని సర్వేలో పాల్గొన్న వారిలో 61 శాతం మంది కుండబద్దలు కొట్టారు. ఈ విషయంలో యూపీ అగ్రస్థానంలో ఉంది. ఆస్తి లావాదేవీల్లో పన్నులు ఎగ్గొట్టేందుకు నగదు చెల్లింపులే చేస్తామని 52 శాతం మంది అంగీకరించారు. టికెట్లు లేకుండా ప్రయాణాలు చేసినట్టు ఏకంగా 85 శాతం మంది చెప్పారు! అయితే 76 శాతం మంది నగదు కంటే ఆన్‌లైన్, డిజిటల్ చెల్లింపులకే మొగ్గుచూపడం విశేషం. ఢిల్లీలోనైతే అత్యధికంగా 96 శాతం మంది డిజిటల్ చెల్లింపులకే ఓటేశారు.

లైంగికంగా ఊగిసలాట ధోరణే

భారత సమాజంలో ప్రస్తుతం ప్రగతి, పితృస్వామ్యం మధ్య ఊగిసలాడుతున్నట్టు సర్వే తేటతెల్లం చేసింది. ఇంటికి సంబంధించిన అన్ని విషయాల్లోనూ అంతిమ నిర్ణయం మగవారిదే కావాలని ఏకంగా 69 శాతం మంది భావిస్తున్నారు! దేశ కార్మిక శక్తిలో మహిళలు ఇప్పటికీ 41 శాతమే ఉన్నారు. చైనా (60 శాతం), అమెరికా (58 శాతం) కంటే ఇది చాలా తక్కువ. లింగ సమానత్వం విషయంలో కేరళ టాప్‌లో ఉంటే యూపీ అట్టడుగున తేలింది. అయితే మొత్తమ్మీద ఏకంగా 93 శాతం మంది తమ కూతుళ్లకు కొడుకులతో సమానంగా విద్యావకాశాలు అందాలని స్పష్టం చేశారు. మహిళలు కెరీర్ అవకాశాల కోసం బయటి రాష్ట్రాలకు వెళ్లడాన్ని 84 శాతం మంది సమర్థించారు.

ఆ పెళ్లిళ్లకు ఇప్పటికీ నో!

మతాంతర, కులాంతర వివాహాల పట్ల వ్యతిరేకత మాత్రం భారత్‌లో ఇప్పటికీ ప్రబలంగానే ఉన్నట్టు సర్వేలో స్పష్టంగా తేలడం వేళ్లూనుకుపోయిన సామాజిక విభజనలకు అద్దం పట్టింది. సర్వేలో పాల్గొన్న వారిలో ఏకంగా 61% మంది మతాంతర వివాహాలను తీవ్రంగా వ్యతిరేకించారు. 56% మంది కులాంతర వివాహాలను నిరసించారు.

ప్రజా భద్రతలో అంతంతే

ప్రగతిశీల సమాజానికి ప్రధాన సూచిక అయిన ఈ విషయంలో కూడా కేరళ టాప్‌లో ఉంది. తర్వాత హిమాచల్, ఒడిశా ఉన్నాయి. హుందా ప్రవర్తన విషయంలో తమిళనాడుకు అగ్రస్థానం దక్కితే కర్నాటక అట్టడుగున నిలిచింది. ఆ రాష్ట్రంలో ఏకంగా 79 శాతం మంది తాము తరచూ వేధింపులు ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. ప్రజా రవాణా వ్యవస్థల్లోనూ తమకు భద్రత లేదని కన్నడనాట 44 శాతం మంది మహిళలు పేర్కొన్నారు. పైగా వేధింపులు, సమస్యలపై గళమెత్తడంలో భారతీయులు చాలా వెనకబడి ఉన్నారు.

వివక్షకూ లోటు లేదు

మత, ప్రాంతీయ వైవిధ్యానికి దీటుగా భారత్‌లో పలు విషయాల్లో వివక్ష వంటి అవాంఛనీయ ధోరణులు కూడా పుష్కలంగానే ఉన్నాయి. ఇలాంటి వివక్షపై గళమెత్తే విషయంలో కూడా కేరళదే అగ్రతాంబూలం. కాగా మధ్యప్రదేశ్‌ది అట్టడుగు స్థానం. కేరళలో 70 శాతం మంది తమ పరిసర వాతావరణంలో మతవైవిధ్యాన్ని స్వాగతిస్తున్నారు. పని ప్రదేశాల్లో, ఉపాధి కల్పనలో మతపరమైన వివక్షను 60 శాతం మంది నిరసిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఇవాంక ట్రంప్.. జుజుత్సూ వారియర్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముద్దుల కూతురు ఇవాంక ట్రంప్(43) ప్రాచీన సంప్రదాయ మార్షల్ ఆర్ట్స్ జియూ–జిత్సూ(జుజుత్సూ)లో చక్కటి ప్రావీణ్యం సంపాదించారు. ఆమె జుజుత్సూలో శిక్షణ పొందుతున్న వీడియోను చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మియామీలోని ఓ వ్యాయామశాలలో ఇవాంక ట్రంప్ జుజుత్సూ నైపుణ్యాలను ప్రదర్శించారు. తన ప్రత్యర్థిని క్షణాల్లో మట్టికరిపించారు. నీలం రంగు బెల్ట్ ధరించిన ఇవాంక తన హస్త లాఘవంతో అందరినీ ఇంప్రెస్ చేశారు. జుజుత్సూలో ఆమె బలం, క్రమశిక్షణ చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. ఇందులో బ్లూబెల్ట్ సంపాదించడం సామాన్యమైన విషయం కాదు. ఇవాంక ట్రంప్ జుజుత్సూను నిత్యం సాధన చేస్తుంటారు. డొనాల్డ్ ట్రంప్ తొలిసారిగా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించినప్పుడు ఇవాంక ట్రంప్ ఆయనకు సీనియర్ సలహాదారుగా సేవలందించారు. ప్రస్తుతం ఆమె తన కుటుంబ బాధ్యతలకే పరిమితం అవుతున్నారు. రాజకీయాలకు దూరంగా ఉంటూ కుటంబ, వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. తనకు దొరికిన సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు.

జపొరిజియాపై రష్యా దాడులు

కీవ్: పరిమిత కాల్పుల విరమణకు సిద్ధమని ప్రకటించిన రష్యా శుక్రవారం రాత్రి ఉక్రెయిన్‌లోని జపొరిజియా నగరంపై డ్రోన్ల దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో ఒకే కుటుంబంలోని ముగ్గురు చనిపోగా 12 మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. జపొరిజియా పైకి ప్రయోగించిన 12 డ్రోన్లతో నివాస భవనాలు, కార్లకు మంటలు అంటుకున్నాయన్నారు. దెబ్బతిన్న ఒక భవనం శిథిలాల్లో చిక్కుకుని దంపతులతో పాటు వారి కుమార్తె చనిపోయిందన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి రష్యా ప్రయోగించిన మొత్తం 179 డ్రోన్లలో 100 వరకు డ్రోన్లను కూల్చివేశామని, మిగతావి దారి తప్పాయని ఉక్రెయిన్ ఎయిర్ ఫోర్స్ ప్రకటించింది. రష్యా దాడులతో రాజధాని కీవ్‌తోపాటు ద్నిప్రోపెట్రోవిస్క్ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినట్లు వివరించింది. అదే సమయంలో, ఉక్రెయిన్ ప్రయోగించిన 47 డ్రోన్లను తమ గగనతల రక్షణ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని రష్యా రక్షణ శాఖ ప్రకటించింది.

కాల్పుల విరమణపై పొంతనలేని వివరణలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన తర్వాత..పరిమిత కాల్పుల విరమణకు సిద్ధమని రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. అయితే, ముగ్గురూ నేతలు కాల్పుల విరమణపై పొంతన లేని వివరణలు ఇవ్వడం గమనార్హం. ఇంధనం, మౌలిక వనరులపై దాడులు చేయరాదని ఒప్పందం కుదిరినట్లు వైట్‌హౌస్ ప్రకటించగా, ఇరుపక్షాలు ఇంధన వనరులపై పరస్పరం దాడులు చేసుకోరాదని అంగీకారానికి వచ్చినట్లు రష్యా తెలిపింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాత్రం రైల్వేలు, నౌకాశ్రయాలకు కూడా దాడుల నుంచి రక్షణ కల్పించాలని కోరినట్లు చెప్పారు.

రేపు సౌదీలో చర్చలు

సోమవారం సౌదీ అరేబియాలో అమెరికా ప్రతినిధి బృందంతో జరిగే చర్చల్లో తాత్కాలిక కాల్పుల విరమణకు సంబంధించిన సాంకేతిక అంశాలను ఖరారు చేస్తామని జెలెన్‌స్కీ తెలిపారు. ట్రంప్ చెబుతున్న 30 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదన తమకు అంగీకారమేనని ఆయన అన్నారు. ఈ విషయంలో ఎలాంటి చర్యలు, షరతులకైనా కట్టుబడి ఉంటామని తెలిపారు. అయితే, ఉక్రెయిన్ యుద్ధ సన్నద్ధతను నిలిపివేయడంతోపాటు, ఆ దేశానికి పశ్చిమదేశాలు ఆయుధ సరఫరాను ఆపేసిన పక్షంలోనే పూర్తి స్థాయి కాల్పుల విరమణ సాధ్యమని రష్యా అధ్యక్షుడు పుతిన్ తెగేసి చెబుతున్నారు. ఈ డిమాండ్లను ఉక్రెయిన్‌తోపాటు పశ్చిమ దేశాలు తిరస్కరిస్తున్నాయి.

అంతేనా! నా జేబులోంచి ఇస్తా!

నాసా సునీతకిచ్చే ఎక్స్‌ట్రా పేమెంట్‌పై ట్రంప్ విస్మయం



సునీతా విలియమ్స్



డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: అంతరిక్ష కేంద్రంలో అదనంగా గడిపిన నాసా వ్యోమగాములు భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లకు సొంతంగా తగు ప్రతిఫలం అందజేస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. శుక్రవారం వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీసులో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ విలేకరి.. ఐఎస్ఎస్‌లో అదనంగా 278 రోజులు గడిపినందుకుగాను విల్మోర్, సునీతలకు రోజుకు 5 డాలర్లు(రూ.430) చొప్పున, 1,430 డాలర్లు(రూ.1.22 లక్షలు) మాత్రమే చెల్లిస్తారని చెప్పగా ట్రంప్ అంతేనా.. అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'వారి శ్రమకు ఇది చాలా తక్కువ ప్రతిఫలం. ఇప్పటి వరకు ఈ విషయం నాకెవరూ చెప్పలేదు. అవసరమైతే నా సొంత డబ్బును బచ్ విల్మోర్, సునీతా విలియమ్స్‌కు అందజేస్తా'అని అన్నారు. అదే సమయంలో, స్పేస్ 'ఎక్స్'అధిపతి ఎలాన్ మస్క్‌పై ప్రశంసలు కురిపించారు. 'మస్క్ లేకుంటే ఐఎస్ఎస్ నుంచి విల్మోర్, సునీతలను ఇంత త్వరగా ఎవరు తీసుకొస్తారు? ఇంకా చాలా కాలం వాళ్లు అక్కడే ఉండాల్సి వచ్చేది. అప్పటికి వాళ్ల ఆరోగ్యం కూడా పాడయ్యేది'అని ట్రంప్ అన్నారు.

278 రోజులున్నా వేతనం అదే

గతేడాది జూన్‌లో బోయింగ్ స్పేస్‌క్రాఫ్ట్‌లో 8 రోజుల మిషన్ కోసం సునీత, విల్మోర్ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. స్పేస్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక లోపం కారణంగా వీరిద్దరూ అక్కడే అదనంగా 278 రోజులు ఉండిపోయారు. ఈ నెల 19న ఎలాన్ మస్క్‌కు చెందిన డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో భూమికి తిరిగి వచ్చారు. నాసా వ్యోమగాములైన సునీత, విల్మోర్‌లను ఫెడరల్ ఉద్యోగులుగా పరిగణిస్తారు. అంతరిక్ష యానంలో ఎంతో అనుభవమున్న సునీతకు నాసా ఏడాదికి 1, 52, 258 డాలర్లు అంటే సుమారు రూ.1.31 కోట్లు. వార్షిక వేతనంతోపాటు హెల్త్ ఇన్సూరెన్స్, హౌస్ అలవెన్సులుంటాయి. ఫెడరల్ ఉద్యోగులైన విల్మోర్, సునీత వారానికి 40 గంటల పాటు పనిచేయాల్సి ఉంటుంది. అదనపు పనిదినాలకు అదనపు వేతనం నామమాత్రంగానే ఉంటుంది. అంటే వీరిద్దరూ అంతరిక్షంలో 8 రోజులకు బదులుగా 278 రోజులు గడిపినప్పటికీ ఎక్స్‌ట్రా, ఓవర్ టైం, హాలిడే పే వంటివేమీ ఉండవు. అంతరిక్ష కేంద్రంలో సుదీర్ఘకాలం ఎంతో శారీరక, మానసిక శ్రమను అనుభవించిన వీరిద్దరికీ అదనంగా దక్కేది కేవలం 1,430 డాలర్లు (రూ.1.23 లక్షలు) మాత్రమేనని, అంతకు మించి ఇచ్చేందుకు నిబంధనలు అంగీకరించవని నాసా అంటోంది.

పీఎం-కిసాన్ అనర్హుల నుంచి రూ.416 కోట్ల రికవరీ

కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడి

- ఆదాయ పన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, రాజ్యాంగ పదవుల వారి నుంచి రికవరీ

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ పథకం 'పీఎం కిసాన్'కింద వ్యవసాయ రైతులకు అందిస్తున్న ఆర్థిక సహాయం విషయంలో కేంద్ర ప్రమాణాలకు అనుగుణంగా లేని రైతులను అనర్హులుగా గుర్తించి, వారి నుంచి రూ.416 కోట్ల మేర రికవరీ చేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఇటీవల లోక్‌సభలో ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 'పీఎం–కిసాన్ పోర్టల్‌లో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి అందిన ధృవీకరణ డేటా ఆధారంగా, ఈ పథకం ప్రయోజనాలను ప్రత్యక్ష బదిలీ (డీబీటీ) పద్ధతిలో ఏటా రూ.6 వేల సాయాన్ని మూడు వాయిదాల్లో లబ్ధిదారులకు బదిలీ చేస్తున్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు మాత్రమే ప్రయోజనాలు దక్కేలా నిర్ధారించుకునేందుకు సాగు చేసిన భూమి, ఆధార్ ఆధారిత చెల్లింపు, ఈ–కేవైసీ తప్పనిసరి చేశారు. ఈ నిర్ధారిత ప్రమాణాలను పూర్తి చేయని రైతులకు ప్రయోజనాలను నిలిపివేశారు. నిర్ధారిత ప్రమాణాలను పూర్తి చేశాకే రైతులకు వారికి చెల్లించాల్సిన వాయిదాలతో పాటు పథకం యొక్క ప్రయోజనాలను పొందుతారు. దీంతో పాటే ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రాజ్యాంగ పదవుల్లో ఉన్నటువంటి అధిక ఆదాయ వర్గాలుగా గుర్తించబడ్డ అనర్హత కలిగిన రైతులకు బదిలీ చేయబడిన ఏదైనా మొత్తాన్ని తిరిగి పొందాలని (రికవరీ) రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలిచ్చాం. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు అనర్హత కలిగిన లబ్ధిదారుల నుండి రూ. 416 కోట్లు రికవరీ చే శాం'అని రామ్‌నాథ్ ఠాకూర్ సమాధానంలో వెల్లడించారు. ఇదే సమయంలో ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్క రైతుకు లబ్ధి చేకూర్చేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో తరుచూ సమన్వయ కార్యక్రమాలను నిర్వహిస్తోందని, దీని ఫలితంగా 2023 నవంబర్ 15 తర్వాత దేశ వ్యాప్తంగా 1.5 కోట్లకు పైగా కొత్త అర్హత కలిగిన రైతులు పథకంలో చేరారని తెలిపారు. పథకం ప్రారంభం నుంచి ఇప్పటివరకు 19 వాయిదాలలో రూ.3.68 లక్షల కోట్లకు పైగా సాయాన్ని రైతులకు అందించినట్లు వివరించారు. పీఎం–కిసాన్ ద్వారా పంపిణీ చేసిన నిధులు గ్రామీణ ఆర్థిక వృద్ధిలో ఉత్ప్రేరకంగా పనిచేశాయని, రైతుల రుణ పరిమితులను తగ్గించడంలో సాయపడ్డాయని తెలిపారు.

బైడెన్‌పై ట్రంప్ ప్రతీకారం

- సెక్యూరిటీ క్లియరెన్స్ తొలగింపు
- హారిస్, హిల్లరీ తదితరులకు కూడా

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌పై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకారం తీర్చుకున్నారు. ఆయనకు సెక్యూరిటీ క్లియరెన్స్ హోదాను రద్దు చేస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో తన ప్రత్యర్థి, మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, హిల్లరీ క్లింటన్‌తో పాటు బైడెన్ కుటుంబీకులకు, ఆయన యంత్రాంగంలో మంత్రులుగా, ఉన్నతాధికారులుగా పని చేసిన పలువురికి కూడా ఈ క్లియరెన్స్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. మాజీ అధ్యక్షులు, మంత్రులు, అత్యున్నత స్థాయి అధికారులకు సెక్యూరిటీ క్లియరెన్స్‌ను కొనసాగించడం ఆనవాయితీ. ఈ హోదా ఉండేవారికి వారికి ప్రభుత్వ నిఘా సమాచారం అందుతుంది. రహస్య పత్రాలు తదితరాలను చూసేందుకు కూడా వారికి అనుమతి ఉంటుంది. 2021లో బైడెన్ గద్దెనెక్కగానే ట్రంప్‌కు సెక్యూరిటీ క్లియరెన్స్ తొలగించారు. 2016–20 మధ్య అధ్యక్షుడైన ట్రంప్ ఆ ఎన్నికల్లో బైడెన్ చేతిలో ఓడటం, దాన్ని జీర్ణించుకోలేక క్యాపిటల్ హిల్ భవనంపై దాడికి తనవారిని ఉసిగొల్పడం తెలిసిందే. ''తప్పుడు ప్రవర్తతో కూడిన ట్రంప్ వంటి వ్యక్తికి రహస్య, నిఘా సమాచారం అందుబాటులో ఉండటం సరి కాదు. అందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నా''అని అప్పట్లో బైడెన్ చెప్పారు. తాజాగా ట్రంప్ కూడా తన నిర్ణయానికి సరిగ్గా అవే కారణాలను చూపడం విశేషం. ''రహస్య పత్రాలు, సమాచారం బైడెన్ తదితరులకు అందుబాటులో ఉండటం దేశ ప్రయోజనాల రీత్యా క్షేమకరం కాదన్న నిర్ణయానికి వచ్చాను. అందుకే ఈ మేరకు ఆదేశాలిస్తున్నా''అంటూ ప్రకటించారు!

'గ్రోక్' హిందీపై ఇమోజీతో మస్క్ స్పందన

న్యూయార్క్: సామాజిక, రాజకీయ అంశాలపై 'ఎక్స్'ఇన్‌బిల్ట్ చాట్‌బాట్ గ్రోక్ హిందీలో ఇచ్చే తలతిక్క సమాధానాలపై భారతీయుల్లో ఆసక్తి తెగ పెరిగిపోయింది. ఇదే సమయంలో, గ్రోక్ వాడే మొరటు భాష ప్రభుత్వం దృష్టికి సైతం వెళ్లింది. ఈ పరిణామాలపై 'ఎక్స్'యజమాని ఎలాన్ మస్క్ నవ్వుతున్నట్లుగా ఉన్న ఇమోజీతో సమాధానమిచ్చారు. 'ఎలాన్ మస్క్ గ్రోక్ భారత్‌లో ఎందుకంత సంచలనం సృష్టిస్తోంది?'అంటూ బీబీసీలో వచ్చిన కథనంపై ఈ మేరకు ఆయన స్పందించారు. ఇమోజీతో మస్క్ ఇచ్చిన స్పందనకు కొన్ని గంటల్లోనే లక్షలాదిగా వ్యూస్ రావడం గమనార్హం. గత వారం ఎక్స్ యూజర్ ఒకరు 'ఎక్స్‌లో టాప్ 10 బెస్ట్ మ్యూచువల్ ఫ్రెండ్స్ ఎవరో చెప్పు'అని గ్రోక్‌ను అడిగాడు. గ్రోక్ కొద్దిసేపు తటపటాయించింది. దీంతో, ఆ యూజర్ తిట్ల దండకం అందుకున్నాడు. చివరికి గ్రోక్ టాప్ 10 బెస్ట్ మ్యూచువల్ పేర్లను చెప్పడమే కాదు అతడి మాదిరిగానే హిందీలో తిట్టింది. ఊరికే తిట్టాను. ఏమనుకోకు అంటూ సముదాయించింది. ఈ విషయానికి బాగా ప్రచారం లభించింది. అప్పటి నుంచి పలువురు యూజర్లు గ్రోక్‌తో సరదా కబుర్లు మొదలుపెట్టారు. గ్రోక్ ఎవరినీ నిరాశపర్చలేదు. అదే సమయంలో, రాజకీయ నేతలపైనా గ్రోక్ విశ్లేషణలు చేసేసింది. ప్రధాని మోదీ కంటే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీయే నిజాయతీ పరుడని చెప్పుకొచ్చింది. అంతేకాదు, ప్రధాని మోదీ ఇంటర్వ్యూల్లో చాలావరకు ముందుగా రాసి సిద్ధం చేసుకుని వచ్చినవేనంటూ వ్యాఖ్యానించింది. గ్రోక్‌కు పెరుగుతున్న ఆదరణ, అది వాడుతున్న హిందీ భాష విషయం కేంద్రం దృష్టికి వెళ్లాయి. గ్రోక్ ఇచ్చే సమాధానాలపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ఎక్స్‌ను కోరింది. ఈ విషయంలో ఎక్స్‌కు గానీ గ్రోక్‌కు గానీ నోటీసులు మాత్రం పంపలేదని తెలిపింది.

ఏడాదిన్నరకు సజీవంగా వచ్చిన మహిళ

ఆమెను హత్య చేసిన నేరంపై నలుగురికి జైలు

భోపాల్: చనిపోయిందని భావించి అంత్యక్రియలు పూర్తి చేశాక ఓ మహిళ సజీవంగా తిరిగిరావడంతో కుటుంబసభ్యులు షాక్‌కు గురయ్యారు. రాజస్తాన్ వాసికి తనను అమ్మేశారని, ఏడాదిన్నరపాటు అక్కడే ఉండి, చివరికి తప్పించుకుని వచ్చానని చెబుతోంది. అయితే, ఆమెను హత్య చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు వ్యక్తులు ప్రస్తుతం జైలులో ఉన్నారు. పలు ట్విస్టులున్న ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని మందసౌర్ జిల్లాలో చోటుచేసుకుంది. లలితా బాయి అనే మహిళకు పెళ్లయి ఇద్దరు పిల్లలున్నారు. అయితే, షారుఖ్ అనే వ్యక్తితో జిల్లాలోని భాన్‌పుర పట్టణానికి వెళ్లిపోయింది. అక్కడ ఇద్దరూ రెండు రోజులున్నారు. లలితా బాయిని తీసుకెళ్లిన షారుఖ్.. రాజస్తాన్‌కు చెందిన షారుఖ్ అనే మరో వ్యక్తికి ఆమెను రూ.5 లక్షలకు అమ్మేశాడు. షారుఖ్ వెంట రాజస్తాన్‌లోని కోటా వెళ్లిన లలితా బాయి అక్కడ దాదాపు ఏడాదిన్నరపాటు గడిపింది. చివరికి తప్పించుకుని ఇటీవల సొంతూరులోని తండ్రి రమేశ్ నానురాం దగ్గరికి చేరుకుంది. ఆమె సజీవంగా రావడంతో ఆశ్చర్యపోయిన తండ్రి వెంటనే పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. పోలీసులు ఆమె వద్ద ఉన్న ఆధార్ కార్డును, ఓటర్ఐడీని పరిశీలించి ఆమె చెప్పింది నిజమేనని తేల్చారు. కుటుంబసభ్యులతోపాటు గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. లలితా బాయి సజీవంగానే ఉన్నట్లు ధ్రువీకరించుకున్నారు. అయితే, లలితా బాయి కనిపించకపోవడంతో వెదుకుతున్న కుటుంబ సభ్యులకు గ్రామ పరిసరాల్లో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఛిద్రమైన స్థితిలో కనిపించింది. చేతిపై పచ్చబొట్టు, కాలికి ఉన్న నల్లదారం వంటి ఆధారాలను బట్టి లలితా బాయిగా భావించి, అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆమెను హత్య చేసిన ఆరోపణలపై గ్రామానికి చెందిన ఇమ్రాన్, షారుఖ్, సోను, ఎజాజ్ అనే వారిపై పోలీసులు కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు

చిన్నారి సహా ఇద్దరు మృతి

బీరుట్: లెబనాన్ దక్షిణ ప్రాంతంపై జరిపిన వైమానిక దాడుల్లో హెజ్బొల్లాకు చెందిన డజన్ల కొద్దీ రాకెట్ లాంచర్లను, ఒక కమాండ్ సెంటర్‌ను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ శనివారం ప్రకటించింది. గతేడాది నవంబర్ తర్వాత తమపైకి ఇదే ప్రాంతం నుంచి హెజ్బొల్లా రాకెట్లను ప్రయోగించినందుకు బదులు తీర్చుకున్నామంది. ఉగ్ర లక్ష్యాలను నాశనం చేయాలని బలగాలను ఆదేశించినట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రకటించారు. ఇజ్రాయెల్ తాజాగా జరిపిన దాడుల్లో చిన్నారి సహా ఇద్దరు చనిపోగా ఎనిమిది మంది గాయపడినట్లు తెలిపింది. తమ దేశాన్ని మరోసారి యుద్ధంలోకి లాగవద్దని లెబనాన్ ప్రధానమంత్రి జోసెఫ్ ఇజ్రాయెల్‌ను కోరారు.

అందుబాటులో 79 వేల రైల్వే కోచ్‌లు

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రయాణికుల డిమాండ్ మేరకు కోచ్‌ల సంఖ్యను ఎప్పటికప్పుడు పెంచుతున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. దసరా, దీపావళి, వేసవి సెలవులు తదితర రద్దీ సమయాల్లో సాధారణానికి మించి ఎక్కువ ట్రిప్పులు రైళ్లు నడుస్తున్నాయని మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. రాజ్యసభలో ఇటీవల ఓ ప్రశ్నకు ఈ మేరకు మంత్రి రాతపూర్వక సమాధానమిచ్చారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 79 వేల కోచ్‌లలో 70శాతం మేర అంటే 56 వేల కోచ్‌లు జనరల్, స్లీపర్ క్లాస్ కోచ్‌లు కాగా థర్డ్ ఏసీ, సెకెండ్ఏసీ, ఫస్ట్ ఏసీ, చైర్‌కార్‌లు కలిపి 23వేల కోచ్‌లు ఉన్నట్లు చెప్పారు. 2023–24లో అదనంగా 872 కోచ్‌లు, 2024–25(ఫిబ్రవరి నాటికి) 983 కోచ్‌లను జత చేసినట్లు తెలిపారు.

షీనా బొరా హత్య కేసులో సాక్షిగా దివంగత పదమ్‌సీ పేరు!

ముంబై: సంచలనం సృష్టించిన షీనా బోరా హత్య కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ తాజాగా కోర్టుకు సమర్పించిన సాక్షుల జాబితాలో 2018లో చనిపోయిన యాడ్ గురు అలిక్ పదమ్‌సీ పేరు కూడా ఉంది. సీబీఐ పేర్కొన్న జాబితాలోని 125 మందిలో పదమ్‌సీ పేరు, ఆయన చిరునామా 112వ నంబర్‌గా ఉండటం గమనార్హం. ఈ కేసులో మీడియా ప్రముఖుడు పీటర్ ముఖర్జీ, అతడి మాజీ భార్య ఇంద్రాణీ ముఖర్జీ, ఆమె మాజీ భర్త సంజీవ్ ఖన్నాల పాత్రను ధ్రువీకరించేందుకు ఈ సాక్ష్యాలను ప్రవేశపెట్టనున్నట్లు గురువారం సీబీఐ కోర్టుకు తెలిపింది.

పంచారామాల్లో శివాలయాలు నిర్మించినవారు?

దక్షిణ భారతదేశ చరిత్ర (క్రీ.పూ. 250 – క్రీ.శ. 250)

శాతవాహనులు

శాతవాహన వంశస్థాపకుడు శ్రీముఖుడు. నానాఘాట్, హాతిగుంఫా శాసనాల్లో శ్రీ శాతకర్ణి గురించి వర్ణించారు. శాతవాహన రాజుల్లో ప్రసిద్ధుడు గౌతమీ పుత్రశాతకర్ణి. ఇతడి గురించి నాసిక్ శాసనంలో ఉంది. హాలుడు ప్రాకృతంలో 'గాథా సప్తశతి' గ్రంథం రచించాడు. ఒకటో పులోమావి చివరి కణ్వ పాలకుడైన సుశర్మను సంహరించాడు. యజ్ఞశ్రీ శాతకర్ణి రుద్రదాముని కుమార్తెను వివాహం చేసుకున్నాడు. యజ్ఞశ్రీ శాతకర్ణి శాతవాహన చివరి రాజుల్లో గొప్పవాడు. శాతవాహనుల్లో చివరి పాలకుడు మూడో పులోమావి.

కంచి పల్లవులు (క్రీ.శ. 300-888)

పల్లవ వంశ స్థాపకుడు 'వీరకూర్చవర్మ'. ఇతడి కుమారుడు శివస్కందవర్మ. మహాపల్లవ వంశానికి మూల పురుషుడు సింహ విష్ణువు. ఇతడు చోళ, పాండ్య, సింహళ రాజులను ఓడించి, 'అవనీసింహ' అనే బిరుదు పొందాడు. ఇతడి కుమారుడైన మహేంద్రవర్మను చాళుక్యరాజు రెండో పులకేశి 'పుల్లలూర్' యుద్ధంలో ఓడించాడు. మహేంద్రవర్మ 'మత్తవిలాస ప్రహసనం' అనే వ్యంగ్య నాటకాన్ని రచించాడు. ఇతడు గొప్ప శిల్పకళాపోషకుడు. మామండనూర్, దళవనూర్ గృహాలయాలు, చిత్తన్న వాసల్‌లోని కుడ్య చిత్రాలు ఇతడి కళాపోషణకు నిదర్శనాలు. మహేంద్రవర్మ కుమారుడు నరసింహవర్మ పల్లవ రాజులందరిలో అగ్రగణ్యుడు. ఇతడు రెండో పులకేశిని చంపి తండ్రి ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నాడు.

మొదటి నరసింహవర్మ (క్రీ.శ. 630 – 668): ఇతడు శివ భక్తుడు. ఇతడు కైలాసనాథ, తీర (షోర్ టెంపుల్) దేవాలయాలను నిర్మించి కళా ప్రపంచంలో చిరస్మరణీయ స్థానం సంపాదించాడు. ఇతడు 641లో పులకేశిని ఓడించాడు. చోళ, పాండ్య పాలకులు ఇతడికి సామంతులుగా ఉన్నారు. ఇతడు సాధించిన విజయాల వల్ల 'వాతాపికొండ', 'మహామల్ల' బిరుదులతో కీర్తి పొందాడు. సంస్కృత కిరాతార్జునీయ కావ్యాన్ని రచించిన భారవి ఇతడి ఆస్థానకవి. ఇతడి కాలంలో యువాన్‌చాంగ్ కంచిని దర్శించాడు.

నందివర్మ: 'పల్లవ మల్ల' బిరుదాంకితుడు. ఇతడు వైకుంఠ పెరుమాళ్ దేవాలయాన్ని నిర్మించాడు. పల్లవుల దేవాలయ శిల్పకళలో ఆలయాలు, మండపాలు, రథాలు అనే మూడు రకాల నిర్మాణాలు ఉన్నాయి. వరాహ, త్రిమూర్తి, మహిషాసురమర్ధని, పంచపాండవుల మండపం (రథాలు)

చాళుక్య రాజులు శివ భక్తులు. వీరు పంచారామాల్లో శివాలయాలు నిర్మించారు. చాళుక్య రాజులు వేయించిన శాసనాల్లో తెలుగు భాషా పదాలు, పద్యాలు ఉన్నాయి. తెలుగు భాషలో ఆది కవి అయిన నన్నయ్య రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవి. ఈయన మహాభారతాన్ని తెలుగులోకి అనువదించారు. మల్లన 'గణితసార సంగ్రహం' గ్రంథాన్ని తెలుగు పద్యాల్లో రచించారు.

నందివర్మ శిల్ప కళాపోషణకు తార్కాణాలు. పల్లవుల పాలనా వ్యవస్థ మౌర్యులు, ఆంధ్ర శాతవాహనుల పరిపాలనా వ్యవస్థను పోలి ఉంది.

పశ్చిమ చాళుక్యులు (క్రీ.శ. 500-757)

పశ్చిమ చాళుక్యుల రాజధాని 'వాతాపి' లేదా 'బాదామి'. వీరిని వాతాపి లేదా బాదామి చాళుక్యులు అని కూడా అంటారు. చాళుక్య వంశ మూలపురుషుడు జయసింహ వల్లభుడు. సత్యాశ్రయ పులకేశి 'వాతాపి' (బీజాపూర్ జిల్లా, కర్ణాటక) నగరాన్ని నిర్మించి దాన్ని రాజధానిగా చేసుకున్నాడు. రెండో పులకేశి దక్షిణాపథ సార్వభౌముడిగా కీర్తి పొందాడు. ఇతడు 'ఐహోల్' వద్ద రాయించిన శాసనం అతడి విజయాల గురించి వర్ణిస్తుంది. ఇతడు ఎలిఫెంటా, పట్టాడక్కల్ దేవాలయాన్ని నిర్మించాడు. రెండో హర్షుడిని ఓడించాడు.

తూర్పు చాళుక్యులు (క్రీ.శ. 630-970)

ఆంధ్ర సంస్కృతి,తెలుగు భాషకు తూర్పు చాళుక్యులు ఎనలేని సేవ చేశారు. ఈ వంశంలో రాజరాజ నరేంద్రుడు ఆంధ్ర భాషా సాహిత్య పరిపోషకుడిగా పేరుపొందాడు. ఈ వంశ స్థాపకుడైన కుబ్జ విష్ణువర్ధనుడికి 'విషమసిద్ధి' అనే బిరుదు ఉంది.

కళ్యాణి చాళుక్యులు (క్రీ.శ. 973-1189)

తైలపుడు రాష్ట్రకూట రాజును ఓడించి చాళుక్య రాజ్యాన్ని పునఃస్థాపించాడు. ఇతడు 'కళ్యాణి'ని రాజధానిగా చేసుకొని పాలించాడు. కళ్యాణి చాళుక్యుల కాలంలో కన్నడ, సంస్కృత భాషలు అభివృద్ధి చెందాయి. బసవేశ్వరుడు వీరశైవ (ఆరాధ్య) మతాన్ని స్థాపించాడు.

మాన్యఖేట రాష్ట్రకూటులు (క్రీ.శ. 757-973)

జైనమతానికి, కన్నడ భాషకు మాన్యఖేట రాష్ట్రకూటులు ఎనలేని సేవ చేశారు. ఈ వంశానికి మూల పురుషుడు దంతి దుర్గుడు (752–56).



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

ఇతడికి 'ఖడ్గావలోక', 'వైరమేఘ' అనే బిరుదులు ఉన్నాయి.

ధ్రువుడు (780–92): ఇతడి కాలంలో రాష్ట్రకూట సామ్రాజ్యం అఖిల భారత ప్రతిష్ఠను పొందింది. గంగా కావేరీ నదుల మధ్య వీరికి ఎదురే లేకుండా పోయింది. ధ్రువుడికి నిరుపమ, కలివల్లభ, శ్రీ వల్లభ, ధారావర్ష అనే బిరుదులున్నాయి.

మూడో గోవిందుడు (792–814): ఇతడి కాలంలో రాష్ట్రకూట ప్రతిష్ఠ మహోన్నత స్థితికి చేరింది. ఇతడు జగత్తుంగ, ప్రభూత వర్ష అనే బిరుదులు ధరించాడు. ఇతడి కాలంలో ఉత్తరాపథంపై రాష్ట్రకూటుల అధికారం చెక్కు చెదరలేదు.

అమోఘవర్షుడు: 'మాన్యఖేత' అనే దుర్గాన్ని నిర్మించి రాజధానిగా చేశాడు. సోదరి శీల మహాదేవిని రెండో విజయాధిత్యుడి కుమారుడైన కలి విష్ణువర్ధనుడికి ఇచ్చి వివాహం జరిపించాడు. ఈవిధంగా వేంగి చాళుక్యుల మైత్రిని సాధించాడు. గంగ, అంబిరాజులను సామంతులుగా చేసుకున్నాడు. ఇతడు కన్నడ భాషలో గొప్ప పండితుడు.

రెండో కృష్ణ: ఇతడు చోళరాజు పరాంతకుడి చేతిలో 'వల్లా యుద్ధం'లో ఓడిపోయాడు. ఇతడిని 'అకాలవర్షుడు'గా పేర్కొంటారు.

రాష్ట్రకూటుల్లో మూడో కృష్ణ చివరి గొప్ప రాజు. పరాంతకుడు 'తక్కోల యుద్ధం'లో ఓటమి పాలయ్యాడు. అమోఘవర్షుడు 'కవిరాజ మార్గం' అనే అలంకార గ్రంథాన్ని రచించాడు. ఎలిఫెంటా, ఎల్లోరాల్లో రాష్ట్రకూటుల శిల్పకళను చూడొచ్చు. రాష్ట్రకూట రాజు ఒకటో కృష్ణుడు ఎల్లోరా (మహారాష్ట్ర)లో కైలాస దేవాలయాన్ని నిర్మించాడు. ఇది ఏకశిలా నిర్మితం. దీన్ని నిర్మించడానికి 150 ఏళ్లు పట్టింది. పశ్చిమ కనుమల్లో ఒక కొండరాయిని ఎన్నుకొని దాన్ని కొండల నుంచి వేరు చేసి దేవాలయంగా మలిచారు. ప్రపంచంలో ఈ తరహా దేవాలయం ఎక్కడా లేదు.

తంజావూరు చోళులు

ఈ చోళ వంశస్థాపకుడు విజయాలయుడు. ఇతడు ఉరైయూర్‌లో క్రీ.శ. 850 ప్రాంతంలో పల్లవ సామంతుడుగా ఉంటూ పాండ్య సామంతుడైన ముత్తరయార్‌ను ఓడించి తంజావూర్‌ను స్వాధీనం చేసుకున్నాడు. ఇతడి కాలం నుంచి చోళుల విజృంభణ ప్రారంభమైంది.

రాజరాజు (క్రీ.శ. 985–1014): చోళ రాజ్య ప్రతిష్ఠను పునరుద్ధరించి నూతనాధ్యాయాన్ని ప్రారంభించాడు. చోళుల ఇష్టదైవమైన శివుడికి బృహదీశ్వరాలయం (రాజరాజేశ్వరి దేవాలయం) నిర్మించాడు. ఇదే చోళకళకు ప్రసిద్ధి. భూమిశిస్తు విధానాన్ని సక్రమంగా అమలుపరచడానికి వ్యవసాయ భూములను 'సర్వే' చేయించాడు. ఇతడికి రాజరాజ (ది గ్రేట్) అనే బిరుదు ఉంది.

రాజేంద్ర చోళుడు (క్రీ.శ. 1014–1044): ఇతడు రాజరాజు కుమారుడు. శ్రీవిజయ సామ్రాజ్యంపై దండెత్తి శైలేంద్ర రాజును ఓడించాడు. క్రీ.శ. 1012లో అతడి రాజధాని నగరం 'కందరం'ను ముట్టడించాడు. బంగాళాఖాతం, హిందూ మహాసముద్రాలపై ఆధిపత్యం సాధించాడు. ఇతడు 'కదరగొండన్', 'త్రి సముద్రాదీశ్వర' అనే బిరుదులు పొందాడు. బెంగాల్‌పై విజయం సాధించాడు. తల్లి కోరిక్పై 'గంగైకొండ చోళపురం' అనే నగరాన్ని నిర్మించాడు. దీన్ని తన రాజధానిగా చేసుకొని పాలించాడు.

ఒకటో రాజాధిరాజు (క్రీ.శ. 1044–52): ఇతడు రాజేంద్రుడి కుమారుడు. కళ్యాణి చాళుక్య రాజైన సోమేశ్వరుడిని 'కొప్పం' యుద్ధంలో ఓడించాడు. కానీ అదే యుద్ధంలో ప్రాణాలు కోల్పోయాడు. మధుర, సింహళంలో చెలరేగిన తిరుగుబాట్లను అణచివేశాడు.

రెండో రాజేంద్రుడు (క్రీ.శ. 1052–64): ఇతడు రాజాధిరాజు సోదరుడు. చాళుక్యరాజును 'కూడల్ సంగమ యుద్ధంలో' ఓడించి కొల్హాపూర్ వద్ద విజయ స్తంభాన్ని వేయించాడు.

వీర రాజేంద్రుడు (క్రీ.శ. 1064–70): వేంగి, కళింగ, చక్రకూట పాలకులపై దాడులు చేశాడు. చాళుక్య రాజులను, విక్రమాదిత్యుడిని ఓడించాడు. ఇతడు తన కుమార్తెలను విక్రమాదిత్యుడు, కళింగ గంగ యువరాజైన రాజరాజుకు ఇచ్చి వివాహం చేశాడు.

మొదటి కులోత్తుంగ చోళుడు (క్రీ.శ. 1070 – 1120): వీర రాజేంద్రుడి తర్వాత వారసులు లేకపోవడం వల్ల రాజరాజ నరేంద్రుడు, అమ్మంగదేవికి జన్మించిన రాజేంద్రుడు అధికారంలోకి వచ్చాడు. ఇతడు కులోత్తుంగ చోళుడు అనే పేరుతో సింహాసనాన్ని అధిష్టించాడు.ఇతడిది చాళుక్య చోళ వంశం.

చోళుల కాలం తమిళ సాహిత్యానికి స్వర్ణయుగం. కంబకవి తమిళంలో రామాయణాన్ని రచించాడు. జయకొండార్ 'పెరియపురాణం' గ్రంథాన్ని రాశాడు.

జనరల్ నాలెడ్జ్ ఫర్ గ్రూప్స్

చారిత్రక కట్టడాలు - నిర్మాతలు

సూర్య దేవాలయం (కోణార్క్, ఒడిశా)	- నరసింహదేవ వర్మ
వైకుంఠపెరుమాళ్ దేవాలయం (కంచి, తమిళనాడు)	- మూడో నందివర్మ
బరాబర్‌గుహలు (గయ జిల్లాలో, బిహార్)	- అశోకుడు
ఏకశిల రథాలు (మహాబలిపురం, తమిళనాడు)	- మొదటి నరసింహ వర్మ
కైలాసనాథ దేవాలయం (కంచి)	- రెండో నరసింహ వర్మ
మౌంట్‌అబు జైన దేవాలయం (రాజస్థాన్)	- తేజ్‌పాల, వస్తుపాల

ద్రావిడ దేవాలయాలు

భారతీయ వాస్తుశైలిలో ద్రావిడశైలి ప్రసిద్ధమైంది. ద్రావిడ శైలి దేవాలయాల్లో ప్రముఖమైనవి బృహదీశ్వరాలయం, శ్రీ రంగనాథ స్వామి ఆలయం, మీనాక్షి దేవాలయం.

బృహదీశ్వరాలయం

దీన్ని చోళ చక్రవర్తి తంజావూరులో నిర్మించాడు. ఇది ద్రావిడ శైలికి ప్రతీక. ఈ దేవాలయం గోపురంపై ఉన్న ఏకైక కలశం బరువు 90 టన్నులు.

శ్రీరంగనాథ స్వామి ఆలయం

ద్రావిడ దేవాలయాల్లో ఇది అతి పెద్దది. ఇది కావేరి ఒడ్డున ఉన్న శ్రీరంగంలో ఉంది. ఇక్కడ స్వామి విగ్రహం శయనాకార రూపంలో ఉంటుంది. ఈ రూపంలో ఉన్న మరో విగ్రహం నెల్లూరులోని శ్రీ రంగనాయకుల దేవాలయంలో మాత్రమే ఉంది.



మీనాక్షి దేవాలయం

నాయకరాజు కాలంలో మదురైలో నిర్మించారు. ఈ ఆలయంలో పలు ప్రాకారాలు, గోపురాలు ఉన్నాయి.

మద్యపానం.. అనేక రకాలుగా హానికరం

నిత్య జీవితంలో పంచదార, బెల్లంను ఏదో రూపంలో వినియోగిస్తూనే ఉంటాం. చక్కెర పరిశ్రమకు అనుబంధంగా 'ఆల్కహాల్' పరిశ్రమ ఉంది. ఆల్కహాల్‌ను ప్రధానంగా పరిశ్రమల్లో, వాహనాల్లో ఉపయోగిస్తారు. మత్తు పానీయాలైన సారాయి, గుడుంబా, బీర్, విస్కీ, బ్రాందీ, వైన్ తదితరాల తయారీ లోనూ ఆల్కహాల్‌ను విరివిగా వినియోగిస్తున్నారు. కల్తీ కల్లు తయారీలో వివిధ రసాయనాలు వాడుతున్నారు. ధనార్జనే లక్ష్యంగా ఇందులో మోతాదుకు మించి హానికర రసాయనాలనువాడటం వల్ల అనేక కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి.

పంచదార

మనం రోజూ ఉపయోగించే చక్కెర, బెల్లంను 'చెరకు రసం' నుంచి తయారు చేస్తారు. గడ్డి జాతికి చెందిన చెరకు (గెడల)లో భారాత్మకంగా 11–15 శాతం చక్కెర ఉంటుంది. ఇది రసాయనికంగా 'కార్బోహైడ్రేట్' కుటుంబానికి చెందిన డైశాకరైడ్ 'సుక్రోజ్'. ఈ సుక్రోజ్ అనేది 'గ్లూకోజ్', 'ఫ్రక్టోజ్'ల మిశ్రమం. దీన్నే 'టేబుల్ షుగర్'గా వ్యవహరిస్తారు. డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు తీపి కోసం రసాయనికంగా 'సుక్రోజ్' అనే చక్కెరకు బదులు కృత్రిమ తీపికారిణి 'శాకరిన్' లాంటి పదార్థాలను ఉపయోగిస్తారు. వీటికి సంబంధించిన అంశాల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

- పంటచేను నుంచి చెరకు గెడలను కోసిన తర్వాత 24 గంటల లోపు చక్కెర ఫ్యాక్టరీలకు తరలిస్తారు. ఆలస్యం అయ్యేకొద్దీ చక్కెర శాతం తగ్గుతుంది. అందుకే సాధారణంగా చక్కెర పరిశ్రమలను చెరకు అధికంగా పండించే ప్రాంతాలకు సమీపంలో నెలకొల్పుతారు.
- చెరకు గెడలను చిన్న చిన్న ముక్కలుగా చేసి, క్రషర్‌లో వేసి చెరకు రసాన్ని తీస్తారు. రసం తీసిన తర్వాత మిగిలిన పిప్పిని 'బగాసే' అంటారు.
- బగాసేను గట్టి కాగితం తయారీకి, 'కాప్టివ్ పవర్' ఉత్పత్తిలో ఇంధనంగా వాడతారు. బెల్లం తయారీలో చెరకు రసాన్ని గాఢత చెందించడానికి కూడా 'బగాసే'ను ఉపయోగిస్తారు.
- ఆమ్లత్వం ఉన్న చెరకు రసానికి 'కాల్షియం హైడ్రాక్సైడ్' (తడి సున్నం)ను కలిపి తటస్థీకరిస్తారు. ఈ ప్రక్రియనే 'డెఫకేషన్' అంటారు.
- ఎక్కువైన సున్నాన్ని తొలగించడానికి 'కార్బన్ డై ఆక్సైడ్' (CO_2)ను కలిపి 'కార్బొనేషన్' చేస్తారు. దీంతో సున్నం 'కాల్షియం కార్బొనేట్ ($CaCO_3$)'గా అవక్షేపం చెందుతుంది.
- తర్వాత 'సల్ఫర్ డై ఆక్సైడ్' వాయువును పంపి మిగిలి ఉన్న సున్నాన్ని తొలగిస్తారు. ఈ ప్రక్రియను 'సల్ఫిటేషన్' అంటారు.
- పై మూడు ప్రక్రియల వల్ల ఏర్పడ్డ అవక్షేపాలను ప్రెస్‌మడ్ రూపంలో ఎరువుగా ఉపయోగిస్తారు.
- సల్ఫర్ డై ఆక్సైడ్ విరంజనకారిగా కూడా పని చేస్తుంది. ఇది చెరకు రసం రంగును తొలగిస్తుంది.
- రసాన్ని గాఢత పరిచి చక్కెర స్ఫటికాలను ద్రవం నుంచి వేరు చేస్తారు.
- చక్కెర తయారు చేసిన తర్వాత మిగిలే చిక్కని ద్రవాన్ని 'మొలాసిస్' అంటారు. ఇది చక్కెర పరిశ్రమలో ముఖ్యమైన ఉప ఉత్పన్నం (బై ప్రొడక్ట్).
- మొలాసిస్ నుంచి కిణ్వ ప్రక్రియ ద్వారా ఆల్కహాల్‌ను రూపొందిస్తారు. మొలాసిస్‌ను వేరు చేయకుండా చెరకు రసాన్ని కిణ్వ ప్రక్రియలో గాఢత పరిచి 'బెల్లం' తయారు చేస్తారు.

కిణ్వ ప్రక్రియ: ఈస్ట్, బ్యాక్టీరియా మొదలైన సూక్ష్మజీవులతో ఉత్పత్తైన ఎంజైమ్‌లు పెద్ద అణువులను చిన్న అణువులుగా విడగొడతాయి. దీన్నే 'కిణ్వ ప్రక్రియ' అంటారు. స్టార్చ్ లేదా మొలాసిస్ లేదా ద్రాక్ష రసం నుంచి ఆల్కహాల్ తయారు చేయడంలో; బ్రెడ్, ఇడ్లీ, సోయా సాస్, కాడ్ లివర్ ఆయిల్, వెనిగర్ లాంటి అనేక రకాల పదార్థాల తయారీలో కిణ్వ ప్రక్రియ ఇమిడి ఉంటుంది. ఇందులో 'కార్బన్ డై ఆక్సైడ్' విడుదలవుతుంది. బ్రెడ్, ఇడ్లీ పిండి ఈ ప్రక్రియ వల్లే పొంగుతాయి.

ఇథైల్ ఆల్కహాల్ తయారీ

సాధారణంగా ఆల్కహాల్‌గా వ్యవహరించే సమ్మేళనమే 'ఇథైల్ ఆల్కహాల్ (ఇథనోల్)'. చక్కెర పరిశ్రమలో ఉప ఉత్పన్నమైన మొలాసిస్‌పై ఈస్ట్ కిణ్వ ప్రక్రియ ద్వారా ఇథనోల్‌ను తయారు చేస్తారు.

- ఈస్ట్‌లోని 'జైమేజ్' అనే ఎంజైమ్ మొదట చక్కెర (సుక్రోజ్)ను గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌లుగా విడగొడుతుంది.
- గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌లను ఈస్ట్‌లో ఉండే మరో ఎంజైమ్ అయిన 'జైమేజ్' కిణ్వ ప్రక్రియ ద్వారా 'ఇథనోల్'గా మారుస్తుంది. ఇందులో ఉప ఉత్పన్నం 'కార్బన్ డై ఆక్సైడ్'.
- ఈస్ట్ కణాలకు అమ్మోనియం సల్ఫేట్, అమ్మోనియం ఫాస్ఫేట్ లవణాలను ఆహారంగా అందిస్తారు.
- ఈ ప్రక్రియలో ఆల్కహాల్ 15–20 శాతానికి చేరగానే ఈస్ట్ కణాలు చనిపోయి కిణ్వ ప్రక్రియ ఆగిపోతుంది. ఈ ద్రావణాన్ని 'వాష్' అంటారు.
- కిణ్వ ప్రక్రియలోకి గాలి చేరితే అందులోని ఆక్సిజన్ ఇథనోల్‌ను 'ఇథనోయిక్ ఆమ్లం'గా ఆక్సీకరణం చెందించి ఆల్కహాలిక్ ద్రావణాల రుచిని పాడు చేస్తుంది.
- వాష్‌ను 'అంశిక స్వేదనం' చేయడం ద్వారా 96 శాతం ఆల్కహాల్‌ను పొందవచ్చు. దీన్ని 'రెక్టిఫైడ్ స్పిరిట్' అంటారు. ఇందులో 'ఎజియోట్రోపిక్ మిశ్రమం' ఏర్పడటం వల్ల వంద శాతం ఆల్కహాల్‌ను పొందలేం.
- మిగిలిన 4 శాతం నీటిని తొలగించడానికి సున్నం ఉపయోగిస్తారు.
- వంద శాతం ఆల్కహాల్‌ను అబ్సల్యూట్ ఆల్కహాల్ అంటారు.
- పారిశ్రామిక ఆల్కహాల్‌ను దుర్వినియోగం (మద్యంగా సేవించడం) చేయకుండా ఇథైల్ ఆల్కహాల్‌కు 'పిరిడీన్', 'మిథనోల్'ను కలిపి సరఫరా చేస్తారు. దీన్ని 'అసహజ స్పిరిట్' (డీనేచర్డ్ స్పిరిట్) అంటారు. దీన్ని తాగితే అంధత్వంతోపాటు మరణం కూడా సంభవించవచ్చు.
- ఇథైల్ ఆల్కహాల్‌ను ఔషధాల తయారీలోనూ ఉపయోగిస్తారు.
- బీర్, వైన్, బ్రాందీ, విస్కీ, రమ్, జిన్ మొదలైన మత్తు పానీయాల్లో ఆల్కహాల్ విభిన్న శాతాల్లో ఉంటుంది.
- సంక్లిష్ట కార్బోహైడ్రేట్లున్న బార్లీ, రైస్, గోధుమ లాంటి ధాన్యం గింజలు లేదా ద్రాక్ష లాంటి ఫలాల నుంచి ఈ మత్తు పానీయాలను తయారు చేస్తారు.



వివిధ మత్తు పానీయాల్లో ఇథైల్ ఆల్కహాల్ శాతం

పానీయం	ఆల్కహాల్ శాతం
బీర్	4 – 5
వైన్	10 –16
రమ్	15 – 40
బ్రాందీ, విస్కీ	40 – 50
బ్రీజర్	4 – 7
కల్లు	5 – 8
వోడ్కా	40

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
రసాయన శాస్త్రం

- మొలాసిస్‌లో 50 శాతం చక్కెర ఉంటుంది.
- ఇథైల్ ఆల్కహాల్‌ను 'స్పిరిట్ ఆఫ్ వైన్' అని కూడా అంటారు.
- మిథైల్ ఆల్కహాల్ విషపూరితమైంది. దీన్ని 'ఉడ్ స్పిరిట్' అంటారు. దీన్ని 'కలప' నుంచి విధ్వంసక స్వేదనం ద్వారా తయారు చేస్తారు.
- సాధారణంగా నల్ల బెల్లం నుంచి గుడుంబా; బార్లీ నుంచి బీర్; ద్రాక్ష నుంచి వైన్, బ్రాందీ; మొలాసిస్ నుంచి రమ్; మొక్కజొన్న నుంచి జిన్; పొటాటో నుంచి వోడ్కా; మాల్ట్ నుంచి విస్కీ రూపొందిస్తారు.
- ఎక్కువ మొతాదులో ఆల్కహాల్ తీసుకోవడం వల్ల రక్త ప్రసరణ, నాడీ వ్యవస్థలతో పాటు కాలేయం దెబ్బతింటుంది. చిన్న పేగుల్లో ఆమ్లత్వం పెరిగి చిన్న కురుపులు ఏర్పడి జీర్ణ వ్యవస్థ దెబ్బతింటుంది. గుండె సంబంధ వ్యాధులు కూడా వస్తాయి.

కల్తీ కల్లు

తాటి, ఈత చెట్ల నుంచి సహజసిద్ధమైన కల్లు లభిస్తుంది. ఇందులో సుమారు 4 నుంచి 8 శాతం వరకు ఆల్కహాల్ ఉంటుంది. ఇది పులుస్తున్న కొద్దీ ఆల్కహాల్ పరిమాణం పెరుగుతుంది. సాధారణంగా ఈ కల్లు గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక వినియోగదారులకే సరిపోతుంది. అందువల్ల పట్టణ ప్రాంతాల్లో కల్తీ కల్లు తయారు చేస్తున్నారు. కేవలం లీటరు సహజ కల్లును ఉపయోగించి నీళ్లు, ఇతర రసాయనాలను కలిపి 100 నుంచి 150 లీటర్ల కల్తీ కల్లు ఉత్పత్తి చేస్తున్నారు. ఒక పెద్ద ట్యాంకును నీటితో నింపి అందులో కొంత సహజ కల్లు కలుపుతారు. దానికి చక్కెర కంటే 600 రెట్లు తీపిదనం ఉండే కృత్రిమ తీపికారిణి శాకరిన్, మత్తు కోసం యూరియా, క్లోరాల్ హైడ్రేట్, డైజీఫాం, ఆల్ప్రజోలాం లాంటి మత్తు పదార్థాలను కలుపుతారు. సిట్రికామ్లం, సోడియం బైకార్బొనేట్, మెగ్నీషియం సల్ఫేట్ లాంటి స్థిరీకరణులను కూడా ఉపయోగిస్తారు.

- మత్తు పదార్థాలు నేరుగా కేంద్ర నాడీ మండలంపై పనిచేస్తాయి. వీటికి బానిసైన వారికి ఇవి అందకపోతే.. కాళ్లు, చేతులు వణకడం; రక్తపోటు, హృదయ స్పందన రేటు పెరగడం; నిద్ర రాకపోవడం; పిచ్చిగా ప్రవర్తించడం లాంటి రుగ్మతలకు లోనవుతారు.
- కల్తీ కల్లు బాధితులకు మానసిక రుగ్మతలు నయం చేయడానికి 'లారజిపామ్' ఔషధాన్ని ఉపయోగిస్తున్నారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. రసాయనికంగా టేబుల్ షుగర్ అనేది?
   1) గ్లూకోజ్ 2) ఫ్రక్టోజ్
   3) సుక్రోజ్ 4) లాక్టోజ్
2. కిణ్వ ప్రక్రియ ద్వారా ఇథైల్ ఆల్కహాల్ నుంచి లభించేది?
   1) ఫార్మలిన్ 2) వెనిగర్
   3) పెర్ హైడ్రాల్ 4) ఉడ్ స్పిరిట్
3. వెనిగర్ రసాయన నామం?
   1) ఇథైల్ ఆల్కహాల్
   2) ఎసిటికామ్లం (ఇథనోయికామ్లం)
   3) సిట్రికామ్లం 4) మిథనోల్
4. కిందివాటిలో అతి తక్కువ ఆల్కహాల్ ఉండే పానీయం ఏది?
   1) విస్కీ 2) రమ్
   3) సారాయి 4) బీర్

సమాధానాలు

1) 3; 2) 2; 3) 2; 4) 4.

మాదిరి ప్రశ్నలు

1. మొలాసిస్ కిణ్వ ప్రక్రియలో గ్లూకోజ్‌ను ఇథైల్ ఆల్కహాల్‌గా మార్చే ఎంజైమ్?
   1) డయాస్టేజ్ 2) ఇన్వర్టేజ్
   3) జైమేజ్ 4) మాల్టేజ్
2. ఏ రకమైన ఆల్కహాల్ సేవించడం వల్ల అంధత్వం వస్తుంది?
   1) ఇథైల్ ఆల్కహాల్
   2) మిథైల్ ఆల్కహాల్
   3) బెంజైల్ ఆల్కహాల్
   4) ఎమైల్ ఆల్కహాల్

సమాధానాలు: 1) 3; 2) 2.

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ ఇండియా ముంబైలో 180 పోస్టులు

ముంబైలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ).. వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 180.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీటెక్/బీఈ, ఎంఎస్సీ, ఎంఈ/ఎంటెక్, ఎంసీఏలో ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 01.01.2025 నాటికి 23 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు ఎంఎంజీఎస్–2కు రూ.64,820 నుంచి రూ.93,960, ఎంఎంజీఎస్–3కు రూ.85,920 నుంచి రూ.1,05,280, ఎంఎంజీఎస్–4కు రూ.1,02,300 నుంచి రూ.1,20,940.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.03.2025.
- **వెబ్‌సైట్:** https://bankofindia.co.in

ఐసీఏఆర్-ఐఏఆర్ఐ న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని ఐసీఏఆర్-ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐఏఆర్ఐ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
- **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ అసోసియేట్–02, ఐటీ ప్రొఫెషన్4–01, సీనియర్ రీసెర్చ్ ఫెలో–03, యంగ్ ప్రొఫెషనల్1–01, ఆఫీస్ కమ్ ల్యాబ్ అసిస్టెంట్–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు, నెట్/గేట్ స్కోరు, ఉద్యోగానుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు రీసెర్చ్ అసోసియేట్‌కు రూ.61,000, ఐటీ ప్రొఫెషన్‌కు రూ.60,000, సీనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ.37,000, యంగ్ ప్రొఫెషనల్‌కు రూ.30,000, ఆఫీస్ కమ్ ల్యాబ్ అసిస్టెంట్‌కు రూ.25,000.
- **వయసు:** పోస్టును అనుసరించి 21 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 25.03.2025.
- **వెబ్‌సైట్:** https://www.iari.res.in

సాక్షి ప్లస్
ఆదివారం । 23-3-2025

రెండో ప్రతాపరుద్రుడి పాలనకాలం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర



కాకతీయుల చరిత్ర

రుద్రమదేవి (1259–1295):
దేశ చరిత్రలోనే రాజ్యాన్ని పాలించిన మొదటి మహిళ రుద్రమదేవి. ఈమె పాలనాకాలంలో వెనిస్ యాత్రికుడు మార్కోపోలో ఆంధ్రదేశాన్ని సందర్శించాడు. సామంతరాజైన రేచర్ల ప్రసాదిత్యుడు (పద్మనాయకుడు) రుద్రమకు అండగా ఉండేవాడు. ఇతడికి 'కాకతీయ రాజ్యస్థాపనాచార్య' బిరుదు ఉన్నట్లు పద్మనాయక వెలమల చరిత్ర గురించి తెలిపే 'వెలుగోటి వారి వంశావళి' గ్రంథంలో ఉంది. రుద్రమదేవి చేతిలో యాదవ రాజైన మహాదేవుడు ఓడిపోయాడు. ఈమె కళింగరాజైన వీరభాను దేవుడిని ఓడించింది. రుద్రమదేవికి కాయస్థ అంబదేవుడు ప్రధాన శత్రువు. ఇతడితో పోరాడి వీరమరణం పొందింది. ఈమెకు 'ఘటోద్భృతి' అనే బిరుదు ఉంది. ముమ్మిడమ్మ, రుయ్యమ్మ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె ముమ్మిడమ్మ కుమారుడైన ప్రతాపరుద్రుడిని దత్తత తీసుకొని కాకతీయ రాజ్యానికి వారసుడిగా ప్రకటించింది. రెండో కుమార్తె రుయ్యమ్మకు బ్రాహ్మణ వర్గానికి చెందిన ఇందలూరి అన్నయ్య అనే మంత్రికి ఇచ్చి వివాహం చేసింది.

ప్రతాపరుద్రుడు (1295–1323):
కాకతీయ రాజుల్లో రెండో ప్రతాపరుద్రుడు గొప్పవాడు. 1303లో మహమ్మదీయ దండయాత్రలు మొదలుకొని 1323 వరకు వివిధ యుద్ధాల్లో ఏకధాటిగా పోరాడాడు. ఓరుగల్లుపై 1303లో తొలిసారిగా ముస్లిం పాలకులు దాడి చేశారు. అల్లాఉద్దీన్‌గా పేరు మార్చుకున్న గర్భాసుమాలిక్ దీనికి నాయకత్వం వహించాడు. ఈ దాడిలో ముస్లింలు ఓడిపోయారు. 1310లో అల్లా ఉద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ కఫూర్ రెండోసారి ఓరుగల్లుపై దాడి చేశాడు. అనమకొండ, ఓరుగల్లు కోటను ముట్టడించాడు. 25 రోజుల పాటు భీకర యుద్ధం జరిగింది. అంతర్గత కారణాలతో ప్రతాపరుద్రుడు మాలిక్ కఫూర్‌కు లొంగిపోయి సంధికి అంగీకరించాడు. తర్వాత 1323లో ఢిల్లీ సుల్తాన్లు ఓరుగల్లుపై దాడి చేశారు. తుగ్లక్ వంశ స్థాపకుడైన ఘియాసుద్దీన్ ప్రతాపరుద్రుడి నుంచి కప్పం వసూలు చేయడానికి కుమారుడైన ఉలుగ్ ఖాన్‌ను భారీ సైన్యంతో ఓరుగల్లుకు పంపాడు. ప్రతాపరుద్రుడు సుమారు 5 నెలలు వీరోచితంగా పోరాడినా పరాజయం తప్పలేదు. ఉలుగ్ ఖాన్ (మహ్మద్ బిన్ తుగ్లక్) ప్రతాపరుద్రుడిని బందీగా పట్టుకొని ఢిల్లీకి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో నర్మదానదీ తీరంలో అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు ముసునూరి ప్రోలయనాయకుడి విలస తామ్ర శాసనం, అనితల్లి కలువచేరు శాసనాల ద్వారా తెలుస్తోంది. ప్రతాపరుద్రుడి మరణంతో కాకతీయ సామ్రాజ్యం సుల్తాన్ల వశమైంది. మహమ్మద్ బిన్ తుగ్లక్ వరంగల్ పేరును సుల్తాన్‌పూర్‌గా మార్చాడు.

కాకతీయుల కాలంనాటి పరిస్థితులు

పాలనావిధానం: వీరు సంప్రదాయబద్ధమైన రాచరికాన్ని అనుసరించారు. రాచరికం వంశపారంపర్యంగా సంక్రమించేది. రాజు నిరంకుశుడైనప్పటికీ ధర్మశాస్త్రాలను అనుసరించి పాలించేవాడు. స్త్రీలకు కూడా రాజ్యాధికార హక్కు కల్పించారు. దత్తత ద్వారా వారసత్వ హక్కు ఉండేది. రుద్రమదేవి మనుమడు ప్రతాపరుద్రుడు ఈ విధంగానే రాజ్యానికి వచ్చాడు. రాజు సర్వాధికారి. చాతుర్వర్ణ సముద్ధరణ ముఖ్యమ ని కాయస్థ అంబదేవుడి 'త్రిపురాంతక శాసనం' విశదీకరిస్తోంది. రాజుకు వేదాలు, శాస్త్రాలు, సాహిత్యం, కళలపై అవగాహన ఉండాలి. రుద్రదేవుడు, గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుడు అనేక విద్యల్లో శిక్షణ పొంది, రాజనీతి సూత్రాలకు అనుగుణంగా పాలించారు. రాజు నిర్ణీత సమయాల్లో ప్రజలకు దర్శనమిచ్చి, వారి కష్టసుఖాలను తెలుసుకోవాలని ప్రతాపరుద్రుడి 'నీతిసారం' బోధిస్తోంది. రాజుకు ఎంత సన్నిహితుడైనప్పటికీ యోగ్యత లేనివాడిని మంత్రిగా నియమించరాదని బద్దెన 'నీతిశాస్త్ర ముక్తావళి'లో ఉంది. వేదశాస్త్ర, రాజనీతికోవిదులైన బ్రాహ్మణులనే మంత్రులుగా నియమించాలని నాటి రాజనీతి గ్రంథాలు పేర్కొన్నాయి. కానీ కాకతీయులు దీనికి విరుద్ధంగా అన్ని వర్గాల ప్రజలకూ మంత్రిమండలిలో అవకాశమిచ్చారు. పాలనలో మహాప్రధానులు, ప్రధానులు, ప్రెగ్గడలు, అమాత్యులు, మంత్రులు ఉన్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. సమస్యల పరిష్కారంలో రాజుదే తుది నిర్ణయం. హేమాద్రి రెడ్డి, ముప్పిడి నాయక లాంటి బ్రాహ్మణేతరులను మహా ప్రధానులుగా కాకతీయులు నియమించారు. మడికిసింగన 'సకలనీతి సమ్మతం' గ్రంథంలో రాజుకు సహాయకులుగా 21 మంత్రులు ఉన్నట్లు పేర్కొన్నాడు. రాజుకు పాలనలో సహాయపడటానికి 72 మంది నియోగాలు (అధికార్లు) ఉండేవారు. వీరినే 'బహత్తర నియోగం' అనేవారు. ఈ 72 శాఖలపై ఉన్నతాధికారి బహత్తర నియోగాధిపతి. గణపతిదేవుడి కాలంలో కాయస్థ గంగయ సాహిణిని బహత్తర నియోధిపతిగా నియమించారు. రాజ్య విస్తరణ, పాలనలో సామంతరాజులు అధిక ప్రాధాన్యం పోషించారు. అనేక యుద్ధాల్లో విజయాలు చేకూర్చడమే కాకుండా, ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొనేవారు. కాకతీయులతో వివాహ సంబంధాలు కొనసాగించారు. పాలనా సౌలభ్యం కోసం రాజ్యాన్ని నాడులు (రాష్ట్రాలు)గా, తిరిగి వాటిని స్థలాలు, స్థలాలను గ్రామాలుగా విభజించారు. చివరి పాలనా విభాగం గ్రామం. 1313 నాటి ప్రతాపరుద్రుడి శ్రీశైల శాసనంలో నాడుల ప్రస్తావన ఉంది. ఒక్కో స్థలంలో రెండు నుంచి అరవై గ్రామాలు ఉండేవి.

గ్రామ పాలన: పాలన అంతటికీ గ్రామమే కేంద్ర బిందువు. స్వయంపాలన ఉండేది. ఆయం అంటే పొలం. విస్తీర్ణం ఆధారంగా భూమిని ఆయం అనేవారు. ఈ భూములపై పన్నులు లేవు. గ్రామ సేవలకు పన్నులు లేకుండా భూమిని పొందేవారిని ఆయగార్లు అనేవారు. కరణం, పెదకాపు (రెడ్డి), పురోహితుడు, కమ్మరి, కంసాలి, వడ్రంగి, శెట్టి మొదలైన 12 మంది ఆయగార్లు పాలన నిర్వహించేవారు. తలారి అంటే గ్రామరక్షక భటుడు. కుల సంఘాలను 'సమయాసారాలు' అని పిలిచేవారు. వీరు సాంఘిక, న్యాయ, మత, ధర్మ, రాజనీతితో స్వయంగా నియమ నిబంధనలు ఏర్పరచుకొని తగవులు పరిష్కరించేవారు.

పన్నులు: రాజ్య ఆదాయానికి భూమి శిస్తు ప్రధాన ఆధారం. పరిశ్రమలు, వర్తకం, వృత్తులపై పన్నులు ఉండేవి. భూమిని పంట భూములు, పాడి భూములు, తోట, పచ్చిక బయళ్లు అని నాలుగు రకాలుగా విభజించారు. భూమిని కొలవడానికి పెనుంబాక మానదండం ప్రసిద్ధమైందని మార్కాపురం శాసనంలో ఉంది. ధాన్యాన్ని కొలిచే సాధనాలు కపిల, ఖండుగ. పన్నులను ధాన్యం, ధనం రూపంలో చెల్లించేవారు. పన్నులు వసూలు చేసే అధికారులను సుంకరులు అనేవారు. రాజుకు చెందిన సొంత భూమిని 'రాచదొడ్డి'గా పేర్కొనేవారు. పచ్చికబీడులపై వేసే పన్నును 'పుల్లరి సుంకం' అనేవారు. పంట పొలాలకు చెరువుల ద్వారా నీటిని అందించేవారు. నీటికట్టు, ఆయకట్టు, గుడికట్టు అనే పదాలు శాసనాల్లో ఉన్నాయి. మాగాణి భూములపై పన్ను ను 'ఘర' అని, మెట్టభూములపై పన్నును 'పంగం' అనేవారు. వీటి వసూళ్లను వర్తక శ్రేణులకు వేలంపాటకు ఇచ్చేవారు. కాకతీయుల కాలంనాటి శాసనాల ద్వారా పెరిక ఎడ్ల సుంకం (సంచులను మోసే ఎడ్లబండపై సుంకం), అమ్ముబడి సుంకం (అమ్మకం పన్ను), ఉప్పు పెరికె సుంకం (ఉప్పు బస్తాలపై పన్ను) లాంటి సుంకా లు వసూలు చేసినట్లు తెలుస్తోంది. వీటితోపాటు సంప్రదాయికంగా ధర్మనం, అప్పనం, ఉపకృతి పన్నులుండేవి. భూమిని 'గడ' లేదా 'దండక' లేదా 'కోల'తో కొలిచేవారు. రాజుకు పన్నులు రెండు విడతల్లో చెల్లించేవారు. అవి.. కార్తీక మాసం (అక్టోబరు- నవంబరు), వైశాఖ మాసం (ఏప్రిల్-మే). రాజుకు చెల్లించాల్సిన పన్నులను కోలకాండ్రు గ్రామాలకు వెళ్లి వసూలు చేసేవారు.

సైనిక వ్యవస్థ: సైన్యంలో గజ, తురగ, పదాతి దళాలు ప్రధానమైనవి. గుర్రాలు, ఏనుగులకు అశ్వ సాహిణులు, గజ సాహిణులనే శిక్షణాధికారులు ఉండేవారు. మారయ సాహిణి, పోతయ సాహిణి గుర్రాలకు శిక్షణాధికారులు. గజ సాహిణులుగా దాడి వీరయనాయక్, మాదయ నాయక్, మాచయ నాయకులు శిక్షణా వ్యవస్థను నిర్వహించేవారు. కాకతీయులకు 9 లక్షల సైనిక బలముండేది. దీన్ని సకల సేనాధిపతులు, మహారాయ సకల సేనాధిపతులు పర్యవేక్షించేవారు. రాజ్య రక్షణలో దుర్గాల (కోటలు) కు అగ్రస్థానం ఉండేది. ప్రతాపరుద్రుడి నీతిశాస్త్రం ప్రకారం స్థల, జల, వన, గిరి అనే దుర్గాలు ఉండేవి. దివిసీమ, కొలను (కొల్లేరు) అనేవి జల దుర్గాలు. కందుకూరు, నారాయణవనం అనేవి వన దుర్గాలు. అనమకొండ, రాయచూరు, గండికోటలు గిరి దుర్గాలు. యుద్ధ సమయాల్లో ధైర్య సాహసాలు ప్రదర్శించే సేనాధిపతులకు బిరుదులిచ్చి సత్కరించేవారు.

నాయంకర వ్యవస్థ: కాకతీయ సైన్యంలో రెండు విభాగాలుండేవి. వీటిలో మూలబలం నాయంకర సైన్యం. సైనిక అవసరాల దృష్ట్యా నాయంకర విధానాన్ని ప్రవేశపెట్టారు. రాజ్యంలోని భూములు సైనికాధికారులకు ఇచ్చేవారు. ఈ భూమిని నాయక స్థలం లేదా నాయకస్థల వృత్తి అనేవారు. వీరిని సామంతులుగా పేర్కొనవచ్చు. వీరు రక్షణ అవసరాల కోసం రాజుకు అత్యవసర పరిస్థితుల్లో సైన్యాన్ని పంపేవారు. ప్రతాపరుద్రుడు ఓరుగల్లు కోటను రక్షించడానికి 77 మంది నాయకులను (పద్మనాయకులు) నియమించాడు. రాజుకు అంగరక్షకులుగా 'లెంకలు' ఉండేవారు.

మాదిరి ప్రశ్నలు

1. జాయపసేనాని 'నృత్త రత్నావళి' ఎవరి పాలనా కాలంలో రచించాడు? (గ్రూప్-I, 2010)
   1) రుద్రదేవ 2) గణపతిదేవ
   3) రుద్రమదేవి 4) ప్రతాపరుద్ర
2. వరంగల్ నగర వర్ణన ఉన్న గ్రంథం ఏది?
   1) రాజశేఖర చరిత్ర 2) కళాపూర్ణోదయం
   3) నీలాంబరి 4) క్రీడాభిరామం
3. కేతన సంస్కృతంలోని ఏ గ్రంథాన్ని తెలుగులోకి అనువదించి 'అభినవదండి' అనే బిరుదు పొందాడు? (గ్రూప్-I, 2004)
   1) ప్రతాపరుద్ర యశోభూషణం
   2) దశకుమార చరిత్ర
   3) నీతిశాస్త్ర ముక్తావళి
   4) పండితారాధ్య చరిత్ర
4. కాకతీయుల కాలంలో 'మోటుపల్లి' రేవును సందర్శించిన విదేశీ యాత్రికుడు?
   1) హ్యూయాన్‌త్సాంగ్ 2) మార్కోపోలో
   3) అబ్దుల్ రజాక్ 4) నికోలా- డీ-కోంటి
5. కాకతీయుల 'రాజలాంఛనం' ఏది?
   1) సింహం 2) వరాహం
   3) చేప 4) ఎద్దు
6. పచ్చల సోమేశ్వరాలయం ఎక్కడ ఉంది?
   1) నాగులపాడు 2) ఘనపూర్
   3) పానగల్లు 4) ఘటకేశ్వర్
7. కాకతీయుల రాజభాష ఏది?
   1) సంస్కృతం 2) తెలుగు
   3) కన్నడం 4) ప్రాకృతం
8. 'విధాహసాల భంజిక' నాటక రచయిత?
   1) రాజశేఖరుడు 2) పోతన
   3) మంచన
   4) పాల్కురికి సోమనాథుడు
9. 'తలారి' అంటే ఎవరు?
   1) కరణం 2) గ్రామాధిపతి
   3) వ్యాపారి 4) గ్రామ రక్షక భటుడు

సమాధానాలు

1) 2 2) 4 3) 2 4) 2 5) 2
6) 3 7) 1 8) 1 9) 4

విద్య, ఉద్యోగ సమాచారం

హాల్, హైదరాబాద్‌లో విజిటింగ్ డాక్టర్ పోస్టులు

హైదరాబాద్‌లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) ఏవియోనిక్ డివిజన్‌లో పార్ట్‌టైం ప్రాతిపదికన విజిటింగ్ డాక్టర్, విజిటింగ్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **పోస్టుల వివరాలు:** విజిటింగ్ డాక్టర్-04, విజిటింగ్ కన్సల్టెంట్(పాథాలజిస్ట్)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, డిప్లొమా పాథాలజీ, పీజీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 65 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:**
ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును మేనేజర్, హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్, ఏవియోనిక్స్ డివిజన్, పోస్ట్-హాల్, హైదరాబాద్-500042 చిరునామకు స్పీడ్ పోస్ట్/రిజిస్టర్/ కొరియర్ ద్వారా పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 29.03.2025.
» **వెబ్‌సైట్:** http://halindia.co.in

పవర్‌గ్రిడ్‌లో 28 ఫీల్డ్ సూపర్‌వైజర్ పోస్టులు

మహారాష్ట్రలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన ఫీల్డ్ సూపర్‌వైజర్(సేఫ్టీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 28
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, పవర్ సిస్టమ్ ఇంజనీరింగ్, పవర్ ఇంజనీరింగ్, సివిల్, మెకానికల్, ఫైర్ టెక్నాలజీ అండ్ సేఫ్టీ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 25.03.2025 నాటికి 29 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.23,000 నుంచి రూ.1,05,000.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:**
ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.03.2025.
» **వెబ్‌సైట్:**
https://www.powergrid.in

Chip is a common nickname for..?

BANK EXAMS
COMPUTER AWARENESS



MEMORY MANAGEMENT

Memory is part of the computer where programs and data are stored electronically. The data and programs are stored at two different levels:
1. Main (Internal) Memory
2. Auxiliary (External) Memory

MAIN MEMORY:
The different kinds of main memory are:
1. RAM (Random Access Memory)
2. ROM (Read Only Memory)


RANDOM ACCESS MEMORY:
The RAM of the computer is divided into many locations, which are uniquely numbered or addressed. Information and data are stored in these memory locations and are retrieved randomly from these locations. RAM contains data that needs to be processed and the instructions, which are used for processing. It is a read and write memory. It is a volatile and temporary memory. There are two types of RAM.
- **Static RAM:** It is called static because it will continue to hold information without refreshment i.e. it does not required refreshment.
- **Dynamic RAM:** It is called dynamic because it require refreshment. It loose information with time.

READ ONLY MEMORY:
ROM is also called as volatile memory, as the contents of ROM are erased when the computer is switched off. The size of a computer is measured in terms of the number of storage locations in memory. It contains the information necessary to startup your computer and the basic instructions that operate it. The storage elements in the ROM contain certain pre-coded instructions, which are not available to the users. These storage locations are only read and cannot be erased or changed. So, it is also known as non-volatile memory. Certain ROM chips are available that can be erased.

PROM: It stands for Programmable Read Only Memory. These ROMs become permanent if they are programmed. Once the chip is programmed, the information recorded cannot be changed.

EPROM: It stands for Erasable Programmable Read Only Memory. By using a special process of exposing to ultraviolet light, the original information can be erased. Using a special programmer facility, the chip can be programmed to record new different information.

EEPROM: It stands for Electrically Erasable Programmable Read Only Memory. This memory can be programmed and erased by electrical signals.



MODEL QUESTIONS

1. ____ refers to the unauthorized copying and distribution of software.
   a) Hacking
   b) Software Piracy
   c) Software literacy
   d) Cracking
   e) Copyright
2. Which of the following is an operating system?
   a) Open SUSE
   b) Debugger
   c) Mozilla
   d) Google Chrome
   e) Intel 8085
3. A collection of programs that controls how your computer system runs and processes information is called ____
   a) Operating System
   b) Computer
   c) Office
   d) Compiler e) Interpreter
4. Which of the following statements is a false conceiving file names?
   a) Every file in the same folder must have a unique name
   b) The file name comes before the dot
   c) File extension is another name for the type
   d) The file extension comes before the dot (.) followed by the file name
   e) Files may share the same name or the same extension but not both at the same time.
5. Which is not a storage device?
   a) Printer b) CD
   c) Hard Disk
   d) DVD e) Floppy Disk
6. ____ tags, placed on animal's body can be used to record and track in a database all of the animal's movements.
   a) POS b) RFID
   c) PPS d) GPS
   e) None of these
7. Which of the following cables can transmit data at high speeds?
   a) Flat Cable
   b) Coaxial Cable
   c) Optical fiber cable
   d) Twisted Pair Cable
   e) UTP Cable
8. The hardware device or software program that sends messages between networks is known as a ____
   a) Bridge
   b) Backbone
   c) Router d) Gateway
   e) None of these
9. If you are performing windows 98 operating system to Windows XP you are performing a(n) ____
   a) Push Up b) Push off
   c) Patch d) Update
   e) Upgrade
10. ____ technology enables you to carry a powerful navigational aid in websites.
    a) Convergence
    b) Locator
    c) Sampling Rate
    d) Synchronization
    e) Global Positioning System (GPS)
11. Which of the following is not true about RAM?
    a) RAM is the same as hard disk storage
    b) RAM is a temporary storage area
    c) RAM is volatile
    d) RAM stands for Random Access Memory
    e) Information stored in RAM is gone when you turn the computer off
12. Which of the following commands in Office 2007 can be used to go to the first cell in the current row?
    a) TAB
    b) SHIFT + TAB
    c) ESC + HOME
    d) SHIFT + HOME
    e) HOME
13. Software such as viruses, worms and Trojan horses that has a malicious content is known as
    a) Malicious Software (Malware)
    b) Adware c) Scare ware
    d) Spyware e) Firewall
14. Chip is a common nickname for a(n)
    a) Transistor b) Resistor
    c) Integrated Circuit
    d) Semiconductor
    e) None of these
15. Which of the following enables to determine how often a user visited a website?
    a) Hackers b) Spammers
    c) Phish
    d) Identity thefts
    e) Cookies
16. To move to the bottom of a document while working on MS word, which command is used?
    a) Home Key
    b) End Key
    c) Ctrl + Page Down
    d) Insert Key
    e) Ctrl Key + End Key
17. A person, who used a computer to cause harm to people or destroy critical systems is called ____
    a) Cyber terrorist
    b) Black-hat hacker
    c) Cyber cracker
    d) Hacktivist
    e) None of these
18. ____ can interpret voice data into words that can be understood by the computer.
    a) Speech Input Hardware
    b) Speech Recognition Software
    c) Word Recognition Software
    d) Talking Software
    e) None of these
19. Which of the following company developed the microprocessor?
    a) Intel b) IBM
    c) Microsoft d) Apple
    e) Google
20. What does ALU in computing denote?
    a) Application and Logic Unit
    b) Algorithm Logic Unit
    c) Arithmetic Layered Unit
    d) Arithmetic Legal Unit
    e) Arithmetic Logic Unit

KEY

1) b	2) a	3) a	4) d
5) a	6) b	7) c	8) c
9) e	10) e	11) a	12) e
13) a	14) c	15) e	16) e
17) a	18) b	19) a	20) e